సాహిత్య మాసపత్రిక

సెప్టెంబరు

1984

భారతి



వ్యవస్థాపకులు

దేశోద్ధారక

నాగేశ్వరరావుపంతులు

భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938-1972)

సెప్టెంబరు 1984

సంపుటము : 61 సంచిక : 9

విడిప్రతిక వెల నాలుగు రూపాయలు

విషయానుక్రమణిక

సెప్టెంబరు 1984

ముఖచిత్రం : భారతి

భిక్షాపాత్ర

శ్రీ శనగన నరసింహస్వామి

వెర్రాటు దేరిన ఘనజటాజూటవాటి
మణిగణోజ్జ్వల సౌవర్ణమకుటమౌనె
మసనమౌనె రత్నోత్కీర్ణమందిరములు
పాప చితిభూతి శ్రీఖండ లేపమౌనె ?

పచ్చి చర్మము పచ్చని పటములగునె
లేలిహానములల వనమాల యగునె
ముసలి పసరము ఖగరాజమూర్తి యవునె
భూతబేతాళములు సురవ్రాత మవునె ?

హరివిరించులు నీ పుట్టువరయ లేరు
దేవతాకోటి నీ శక్తి తెలియలేదు
దారి తప్పిన వెఱ్ఱి బికారివోని
వికృత వేషమునేల సేవింతువయ్య ?

పదియు నాలుగు భువనాలు పణము చరచి
నిలుచుకొనజాలు ధనభర్త చెలిమికాడు
యాచనాదైన్య జీవితమకట ! నీకు
సరిసమానులలో కీర్తికరమె చెపుమ ?

విసము గళమున నెలకొల్పి వేల్పుగమికి
రసము పంచిన కరుణాంబురాశి వీవు
కలిమి చెలువను హరికర్థి కాన్క సేసి
లేమి గయికొన్న గొప్ప నిష్కామి వీవు.

అవధి యెరుగని నిధులు భక్తాళి కొసగి
తిరుగుచుండెద విల్లిల్లు తిరిపమెత్త
నర్మ గర్భితమైన యీ నటనమింక
నెంతకాలము సామి ! త్రయ్యంతగామి !

బహుయుగంబులనాటి నీ భైక్షపాత్ర
ప్రీతిమోసులువార నా చేతనుంచి
వీథి వీథుల నరుదెమ్ము వెంటవత్తు
శర్వ ! శివరాత్రి జాగర పర్వవేళ.

కాయమంటివో గుమ్మము కరుణ దొరగి
నడపుమంటివో కుంటెన నానమాలి
కుడుపుమంటివో కరకుట్లు కొంకుదక్క
భక్తవత్సల ! నా కోర్కె ప్రాతె నీకు !

కొండ

శ్రీ కొడవంటి లీలా మోహనరావు

నీ నీడలో నే కనువిప్పిననాడు
మెరుపులై మెరిసావుట
పన్నీటి జల్లులు పంపావుట
కొండదేవత నాకు రక్షన్నారట
బంగారు కొండని ముద్దాడారట.

నీ పర్యవేక్షణలో
ఏ ఆటలు ఏ చదువులు ఏ బానలు ఏ కలలు
క్షణాలు రోజులు యేళ్ళు
పరుగులు పరుగులు పరుగులు.

పైరులు పోయిననాడు
పెద్దలు మరుగైన నాడు
ఆటు పోటుల్లో
సతమత మైననాడు
గంభీరంగా చూసావు
ధ్యానముద్ర పట్టావు.

పొట్టచేత పట్టుకు వెళ్లిననాడు
నీకు దూరమై బతకదలచిన నాడు
మబ్బు చాటుకు వెళ్లావు
గుండె గుబులును తెచ్చావు.

నీ పరోక్షంలో
ఏ బాధలు ఏ బరువులు ఏ రంపపు కోతలు.
క్షణ క్షణాన పలువిధాల
సెగలు సెగలు సెగలు.

నీ కోసం యీనాడు వస్తుంటే
నీ కళ్ళల్లో ఆహ్వానం
నన్ను ఆత్రం చేస్తోంది
రెక్కలు విప్పిన పక్షినై
నీ వడిలో వాలాలని
రంగుల హరివిల్లునై
నీ ముంగిట చేరాలని.

శ్రీ శివలెంక ప్రకాశరావు

ఆధునిక కవితలో రాయప్రోలు

క్షీణ ప్రబంధ బంధాల నుంచి ఆంధ్రకావ్య లక్ష్మిని విడిపించి భావ కవితా పుష్పవాటికలో నడిపించిన మహనీయులూ, సంప్రదాయంలోనే క్రొంగొత్తరుచుల్ని వెలార్చిన ప్రతిభాశాలీ, భోగ్యవస్తువుగా నున్న స్త్రీమూర్తికి ఒక పూజ్యస్థానం కల్పించిన సంస్కర్తా, తెలుగునాట వెల్లి విరిసిన ప్రకృతి సౌందర్యాన్ని సహజ సుందరంగా కావ్యరంగాన అలంకరించిన కవి తల్లజులూ శ్రీ రాయప్రోలు సుబ్బారావు.

మొట్టమొదట మేనమామ అవ్వారి సుబ్రహ్మణ్యంగారితో కలిసి చేస్తున్న 'ఆశు కవితా' విన్యాసానికి 'సన్యాసం' పుచ్చుకుని, రసభరితమూ, భావగంభీరమూ, వ్యంగ్యవైభవమూ, సరసహృదయంగమమూ అయిన 'రమ్యాక్షర కళాక్షేత్రం' లో అడుగు పెట్టారు వీరు. దానికి తోడు వీరి పినతల్లి రామమడుగు నరసమ్మగారి ఉపదేశ ప్రభావంవల్ల క్రొత్త ఆలోచననాలోచనాలు తెరవబడ్డాయి. దాంతో 'క్షీరసాగర శయనా' అనే గీతంలో 'ప్రేమ రూపిణియైన తల్లీ' ఆమె వక్షఃస్థలం మీద స్తన్యపానం చేసే శిశువూ దర్శన మిచ్చారు.[2] ఇది రాయప్రోలు వారికి ఏర్పడిన అంతరంగిక భూమిక.

అలాగే కందుకూరి వారి సంఘసంస్కరణోద్యమం, గిడుగు వారి భాషావిప్లవం, గురజాడవారి దేశీయఛందస్సు, పాశ్చాత్య నాగరికతా ప్రభావంతో సర్వత్రా సమాజంలో విశృంఖల విహారం చేస్తున్న ప్రణయతత్వం ఇత్యాదులువారికి కలిగిన బాహ్య ప్రేరకాలు.

ఇదే సందర్భంలో కొమర్రాజు వారు ప్రసాదించిన 'విజ్ఞాన చక్షువూ', రవీంద్ర కవీంద్రులు అందించిన నవ్యభావవైఖరీ రాయప్రోలు వారికి ఒక మౌలికమైన ఆలోచనా రీతిని అలవరచాయి. దాంతో సంప్రదాయం పునాది మీదనే ఎన్నో భావహర్మ్యాలు నిర్మించారు వారు.

రాయప్రోలు వారి రచనలను 1) లక్షణకావ్యాలు 2) అనువాదకావ్యాలు, 3) స్వతంత్ర కావ్యాలు అనే మూడు భాగాలుగా చెప్పవచ్చు.

వీరి రమ్యాలోకం, మాధురీదర్శనం అనేవి లక్షణ కావ్యాలు, లలిత, అనుమతి, భజగోవిందం, సౌందర్యలహరి, సుందరకాండ, దూతమత్తేభం, మధుకలశం అనేవి అనువాదాలు. తృణకంకణం, కష్టకమల, స్నేహలత, స్వప్నకుమారం, తెలుగుతోట, ఆంధ్రావళి జడకుచ్చులు, వనమాల, మిశ్రమంజరి, కన్నెపాటలు, అనేవి వీరి స్వతంత్ర కావ్యాలు.

వీటిలో ఉన్న విషయప్రాధాన్యాన్ని బట్టి రాయప్రోలువారి కవిత్వాన్ని స్థూలంగా 1) ప్రణయం 2) ప్రకృతి 3) ఆధ్యాత్మికం 4) దేశభక్తి 5) సంఘసంస్కరణ, 6) మానవతావాదం 7) సూఫీ తత్వం 8) స్తుతి, 9) స్మృతి అనే విభాగాలు చేసి పరిశీలించవచ్చు.

ప్రణయం

రసాలన్నింటికీ 'తల్లి' శృంగారమే అని రాయప్రోలువారి అభిప్రాయం. అయితే తంజావూరు కవుల కావ్యాలలో శృంగారం వెగటు పుట్టించడమూ, స్త్రీని భోగ్యవస్తువుగా చేసి అంగాంగ వర్ణనలు చేయడమూ, భోగమే అవధిగా పూర్వ లాక్షణికులు ప్రకటించడం రాయప్రోలు వారికి నచ్చలేదు. కడుపున బుట్టిన కొడుకు ఎదుటకూడా 'పైట జారనీయని తల్లి వరుస' ను[3] లోకసహజంగా భావించారు. అందుకే స్త్రీ పురుషుల ప్రేమ ఔచితీ రమ్యంగా తీర్చిదిద్దాలి అనుకున్నారు.

దీనికి 'వియోగ మాధుర్యలీలా విపాకం' అనుభవించాలి అని చెప్పిన పండితరాయలను ఆదర్శంగా పెట్టుకున్నారు. ఇందేతత్త్వం వాల్మీకి, వ్యాస, హర్ష, కాళిదాస, భవభూత్యాది సంస్కృత కవులలోనూ, రవీంద్రుడి 'గీతాంజలి' లో స్త్రీపుంస యోగం' లోనూ వ్యంగ్యమాధుర్యంగా కాంతాసమ్మితంగా ఉన్న విషయం పసిగట్టారు. భవభూతి చెప్పిన 'సుమానుష ధర్మం' సుఖదుఃఖాలకు అద్వైతంగా నిలుస్తుంది. కాబట్టి దానిలో పెంపొందే స్నేహమే దాంపత్య సుఖజీవనానికి స్థాయి అనీ, దానినే పూర్వులు 'రతి' గా పేర్కొన్నారని ఆయన అభిప్రాయపడ్డారు. కాబట్టి ప్రేమాభి వర్ణన కోసం కేవలం 'మిధున ప్రబంధా' న్నే ఆశ్రయించనక్కరలేదనీ, ఏ ఉపాధినీ ఆశ్రయించని వియోగ శృంగారమే అనుసరించ తగిందనీ భావించారు

'వ్యభిచారాదులలో శృంగారం మలినమవుతుంది కాబట్టి అలా మలిన మసుటకు అవకాశం లేని శృంగారం అమలిన శృంగారం' అని నిర్వచించారు శ్రీరాయప్రోలు.

అంతేకాదు. శృంగారానికి ఉన్న 'శుచి' అనే నామాంతరాన్ని దాని స్థాయీభావమైన 'రతి' కి ఆనందం అనే వైదికార్థాన్ని స్వీకరించారు. మమత అనురాగం, ప్రేమ, ప్రణయం, స్నేహం అనే విశేషార్థాలలో శృంగారాన్ని ప్రయోగించారు.

బాహ్యలోకంలో తల్లిగా, సోదరిగా, అర్థాంగిగా, కుమార్తెగా, స్త్రీమూర్తి పొందే వివిధ పరిణామదశలను గమనించి, తమ అమలిన శృంగార సిద్ధాంతాన్ని కొన్ని విభాగాలుగా పొర్కొన్నారు వారు. స్నానమాడి పెన్నెరులు జాఱముడిచి, నొసల కుంకుమ, పాదాలపసుపు మెఱయగా తెల్లటి వస్త్రం కట్టుకొని తులసిని పూజించే ధీరరూపానిది 'మాతృ శృంగారం'.[4] పుత్రగాత్ర పరిష్వంగ సుఖంలో గండచుంబనాదులతో శుభకళా కాంతి లక్షణ స్ఫోరకమైన మాతృమూర్తిపొందే ఆనందం 'పుత్ర శృంగారం'[5] స్థాయిరతిలేక అనేక అవస్థలలో రుచించేది 'ఆప్తశృంగారం'[6] అనురాగతపః ప్రభగ్నుడయిన సుఖుడి ఆశాదీపం ఆఱకుండా రక్షించేది 'స్నేహ శృంగారం'[7] సోదరుల మధ్యనెలకొనే ప్రేమభావం 'సోదర శృంగారం'[8]

వీటన్నింటినీ పరిశీలిస్తే విప్రలంభంలోని 'అభిలాష' 'మంజిష్ఠా రాగం' అనేవి రాయప్రోలువారి 'అమలినశృంగార సిద్ధాంతా'నికి దగ్గరి చుట్టాలు అనిపిస్తుంది, చిత్పదార్థమైన రతి స్త్రీ పుంసయోగంగా పుష్టినిపొంది సుమానుష ధర్మంగా రూపొందడమే దీని పరమార్థం.

రాయప్రోలువారి రమ్యాలోకం, మాధురీ దర్శనం అనే లక్షణ కావ్యాలు ఈ విషయాలే ప్రతిపాదిస్తున్నాయి.

ఈ అమలిన శృంగార సిద్ధాంతమే రాయప్రోలువారి ప్రణయ కవిత్వం అంతటా పరచుకొని ఉంది.

'లలిత' (1909) అనే అనువాదకావ్యం (గోల్డ్‌స్మిత్ రచించిన 'హెర్మిట్' మూలం)లో నాయికా నాయకుల విరహంలో ఇతివృత్తం ఆరంభమౌవుతుంది. వియోగ శృంగారమే దీనిలో అంతస్సూత్రం. అయితే జవ్వనులు సంసారంలోని అనురాగ మాధుర్యాన్ని చూరగొనాలి కాని వైరాగ్యంతో సన్యాసం పుచ్చుకొని అడవులపడి పోరాదని నాయిక అనడంలో దంపతీ నిష్ఠమైన ధర్మమే శ్రేష్ఠమని స్ఫురిస్తుంది. 'ప్రజాతంతుంమా వ్యవచ్చేత్సీః' అనే ఆర్యోక్తి కూడా ఇదే! దంపతీ నిష్ఠమైన ప్రణయం ద్వారా ఒక పరమార్థాన్ని ఆశించినప్పుడు అది పవిత్రమే అని రాయప్రోలు వారి కావ్యసందేశం

'అనుమతి' (1910) అనే మరో అనువాద కావ్యం (టెన్నిసన్ రచించిన 'డోరా' మూలం)లో నాయికా నాయకుల ప్రేమ విఫలమవుతుంది. అయితే ఆ అలభ్యానురాగాన్నే త్యాగంగా మార్చుకొని, మరణించిన ప్రియుడి పిల్లలపట్ల మాతృప్రేమను ప్రకటిస్తుంది నాయిక. ఇందులోనూ 'అమలిన శృంగార' తత్త్వమే రేఖా మాత్రంగానుంది.

ఈ రెండు అనువాదాలమాట ఎలాఉన్నా 'సంభోగస్పర్శలేని శృంగారం లిరిక్కులో[9] తీర్చిదిద్దాలనే తీవ్రకాంక్షతో రాయప్రోలువారు రచించిన తొలి స్వతంత్రకావ్యం 'తృణకంకణం (1913)

ఇందులో నాయిక విధివశాత్తు అన్యకాంత కావడంతో చిన్ననాటి స్నేహం మరువలేక నాయకుడు అవివాహితుడుగా ఉండి విప్రయోగం అనుభవిస్తాడు. మళ్లీనాయికను గాంచినప్పుడు

'సరస సాంగత్య సుఖ విలాసములకన్న
దుస్సహవియోగభరమె మధురము సఖియ
బాధలేక వ్యసనరుచి బోధపడదు
చీకటులురాని దీపిక వెలగనట్లు.'[10]

అంటాడు నాయకుడు.

విప్రయోగమే ఉత్తమమనే రాయప్రోలువారి ఉద్దేశమే ఇక్కడ ధ్వనిస్తుంది.

నాయికకు మృదుస్నేహ సౌరభం కావాలికాని వలపుగంధం కాదు. మనోవాక్కాయ కర్మలచే కలుషితమయేది 'వలపు' అనీ తపసు-తాల్మి. ధ్యానధారలచే లీనమై ఐక్యమందజాలేది 'ప్రేమ' అనీ ఆమె భావం.

అందుకే— కనుల నొండొరుల జూచుకొనుట కన్న
మనసు లన్యోన్యరంజన గొనుట కన్న
గొసరి "యేమోయి" యని పిల్చుకొనుటకన్న
జెలుల కిలమీద నేమి కావలయు సఖుడ![11]

ఇత్యాదిగా అంటుంది ఆమె.

దీనిని బట్టి శృంగారావస్థలలో 'చక్షుప్రీతి మనస్సంగమం' వరకూ సాగిన పరిణయమే స్త్రీ పురుషులలో స్నేహపాత్రమూ, యోగ్యమూ అవుతుందని రాయప్రోలువారి అభిప్రాయం అని స్పష్టమవుతుంది.

అందుకే 'భావబంధం'గా నాయిక మణిబంధాన ఉన్నపట్టుతో రాన్ని విప్పించి 'ప్రేమ మధుర లాంఛన' మైన 'తృణకంకణా'న్ని నాయకుడిచే కట్టించి 'సోదరీ' అని పిలిపించారు. 'కలనైన కలుషము

గాని స్నేహమృదుమధుర సానుభూతికి చిహ్నంగా నాయికచే 'వలపు టుంగరాన్ని' అతడి కిప్పించారు వారు.

'రసచర్వణ స్థితికి' తృణం సజీవోదాహరణం. నిరంతర ప్రేమభావ సేచనంతో స్థాయిత్వాన్ని భజించే స్నేహరుచియే రస నామకమైన ప్రీతి. దానికి ప్రతీక 'తృణకంకణం'[12] అని రాయప్రోలు వారి నిర్వచనం.

ఈ కావ్యారంభంలో నాయకుడు మోహావేశుడు. చివరిలో అతడు నాయికనుంచి నిరంతర స్నేహాన్ని వాంఛించే ఒక మూగులు చెలికాడు మాత్రమే. అంటే అంటక పచ్చని తృణ పత్రమును అంద గించిన అచ్ఛజల కణము'లా[13] ఉన్న ఈ పవిత్రస్నేహ పరమార్థాన్నే కావ్యనామంలోని 'కంకణం' (జలకంకణం) అనేపదం నిరూపిస్తున్నది.

అలాగే మోహావేశపరుడైన మిత్రుణ్ణి స్నేహభావంవైపు మరల్చి మరో కన్యను వివాహం చేసుకొని దంపతీనిష్ఠమైన పవిత్ర శృంగారం చేపట్టుమని ప్రబోధించడం కావ్యనాయిక పరమార్థం. అదే 'వలపుటుంగరం' ఇవ్వడం లోని అంతరార్థం.

ఈ కావ్యం ద్వారా మోహం నశించినా! కడిగిన మృగమద పాత్రికవిడువని పరిమళం'లా ప్రేమ శాశ్వతంగా వుంటుందని ధ్వనింప చేశారు రాయప్రోలువారు.

అలాగే మరోకావ్యం 'కష్టకమల' బాల్యస్నేహితులైన కుమార మాధవుల ఇద్దరి ప్రేమనూ ఆశించింది ఆమె. 'అనాసక్త యోగం'లో సోదరీ భావంతో 'కుమారుడి' క్షేమసమాచారాలను కోరుకున్న కమల అతడి ప్రేమలేఖ వల్ల మానసిక సంఘర్షణకు గురిఅయింది. జీవితాన్ని విషాదాంతంచేసుకున్నది.

ఈ సందర్భంలో

'చినుకులకు వేచు చాతకశ్రీ కుమారి
మెఱయు మెఱుపుల తెలుగులే మేలుగ గలదు?
వానకారును మరగిన వనమయూరి
కార్తికజ్యోత్స్నలకు నెట్లు కాంక్ష సేయు?'[14]

అనడంలో కమల చాతకం, కుమారుడు వనమయూరి. చాతకానికి నాల్గు చినుకులు కావాలికాని మెఱుపులు కాదు అయితే వనమయూరికి వానకారు జోరుకావాలి కాని వెన్నెల చల్లదనంకాదు ఇది ఆ ప్రేమికుల మనస్తత్వాలకు పట్టిన అద్దం.

ఇదే ఉపదేశం 'స్వప్నకుమారం' లో కూడ ఆవిష్కరించ బడింది. భోగ్యవస్తువుగా స్వప్నంలో గోచరించిన స్త్రీ క్రమంగా ఒక మాతృమూర్తిగా ప్రత్యక్ష మవడమే ఇక్కడ కవి ఆశించిన పరమార్థం. దానినే 'దప్పిగొని చేరిన మిళింద తనయులకును

పూల పాలిచ్చి చీకట్ల పోవకుండ
కడుపులో దాచుకొనద పంకజము ప్రియుడ
చేరదీసిన మమకార మేరికెరుక'[15]

అంటూ నాయిక మాటల్లో అనిపించాడు కవి. సుమభ్రమరాలకు పూర్వకవులు పేర్కొన్న నాయికా నాయక సంబంధానికిది. పూర్తిగా వ్యతిరేకం. స్త్రీలోని మాతృత్వమే జాలు వారుతుంది ఇక్కడ.

నిజమైన ప్రేమ ఎప్పుడూ అమలినమే. ఆ ప్రేమ సంపూర్ణ వికాశం అందినపుడే హృదయక్షేత్రంలో ఆనందం పండుతుంది.

ఈ కావ్యంలో నాయిక 'ప్రేమోచ్ఛిష్టమును అనుభవించు' మని తనను ఆశించినవాడికి తనకు తానుగా అర్పించుకుందుకు సిద్ధమయింది. ఒకరిని ప్రేమించి మరొకరిని ఆశించడంవల్ల విశ్వజనీనమైన ప్రేమోదయం అవుతుందని రాయప్రోలువారి సిద్ధాంతం. అహల్య సంక్రందనుడికి శీలదానం చేసిన 'పూర్ణదాక్షిణ్యమూర్తి' వారి భావనలో.

సౌందర్యార్చన తప్పుకాదనీ, కామవాంఛతో ప్రవర్తింపవచ్చనీ భావించే నవయువకులకు కనువిప్పు కల్గించడమే ఈ కావ్యంలో కవి ఆశించిన పరమార్థం. అదేఋతువిహిత ధర్మములు స్ఖలద్గతుల బడిన కడుపుకోతలపాపముల్' కట్టి కుడుపు'[16] అంటూ హెచ్చరించారు. ఒక చోట.

కథాకావ్యాలలోనేకాక రాయప్రోలువారి ప్రణయ తత్త్వం మరి కొన్ని ఖండికల్లో కూడ గోచరిస్తుంది.

ఉదా— 'హేమ పాత్రల చందన మెండిపోయె
ద్వారములు మోయుచున్న విహారములను
సానలందింకె స్నాన కషాయ గంధ
మబల! యెవని కోసము సగమయి తపింతు'[17]

అనడంలో ఒక విరహోత్కంఠ దర్శనమిస్తుంది. హేమ పాత్రలు వక్షోజాలనూ, ద్వారాలుకళ్లనూ స్ఫురిస్తాయి. విరహతాపోప శాంతికి చనుగవపైరాసుకున్న గంధం ఎండిపోయింది. మెడలోవేసుకున్న ముత్యాల హారాలూ, పూలదండలూ, ద్వార బంధాలకు తగిలించబడ్డాయి. అంటే నేత్రాలనుంచికన్నీటి ధారలు ఎడతెగని జాలువారుతున్నాయి. విరహాగ్ని తాపోష్ణం వల్ల స్నాన కషాయగంధం ఇంకిపోయింది.

దట్టంగావున్న సంపంగి పొదనుంచి సువాసన వెలువడినా ఎంతో జాగ్రత్తగా వెదికితేనే పువ్వు కనపడినట్లుగా పద్యగతార్థం ధ్వనిస్తుంది

ఇక్కడ. రాయప్రోలువారి భావ కవిత్వతత్త్వానికి లక్ష్యప్రాయమైన పద్యం ఇది.

అలాగే 'తలుపు తీయవే భామా! నీ
తలపు తియ్యనిదె భామా!'[18]

ఇత్యాది జానపద గీతంలోకూడా ఒక విరహార్తుణ్ణి ప్రత్యక్షం చేశారు రాయప్రోలువారు.

ప్రకృతి

నిర్గుణ బ్రహ్మను ఉపాసించడం కన్నా ప్రత్యక్ష ప్రమాణం అయిన ప్రకృతిని ఆరాధించడం మిన్న అని రాయప్రోలువారి సిద్ధాంతం. అందుకే తన లేఖినిని 'నిత్య వర్చస్విని'గా సంభావించారువారు.

ముఖ్యంగా తెలుగు గడ్డపై ఉన్న గ్రామ సౌందర్యం ఆకర్షించింది వారిని. ప్రకృతిని శక్తిస్వరూపిణిగా భావించి ప్రణయసామ్రాజ్య వైభవాన్ని ప్రకృతి విలాసంలో ప్రత్యక్షంగా దర్శించారు వారు. ఆ అనుభూతికి ఉద్దీపకమైన విషయాలు కోకొల్లలు. కొత్తగా పెండ్లయిన 'లేగుబ్బెతలు', ఈ మధ్యనే 'ఈడేరిన కన్నియలు', గడుసు పోకడల 'నెఱజాణలు', తల్లిపాలు త్రాగకుండా బందాలు పడ్డ 'వత్సాలు' బెల్లాటలాడే 'లేగలు' బువ్వనెత్తిన బెట్టుకుని 'రవిక దొడుగని గొల్లకుర్రది 'పిరుదులసియాడ జీరరాపిల్ల పెరయ' ఒడిసెలతో పొలాన్ని కాసే కాపుకూతురు, అలల్లో ఒయ్యారాల రాయంచలూ, నదిలో నడిచే నావ ఇత్యాదులు వాటిలో కొన్ని.

ప్రాతఃకాల వర్ణనంలో 'నిదుర నెలతలు' వచ్చి నిద్రలేపడం[19] ఉషఃకన్య సిగ్గుతో జారిపోయే ఎఱ్ఱ చీరను విలాసంగా కప్పుకోవడం[20] వెన్నెలలు నిద్రపోవడం మొదలైనవి హృదయ చక్షువులతో దర్శించవలసిందే.

అలాగే 'చిన్ని గొఱ్ఱెలమేపు చిన్నారిగొల్లాడు' గా,[21] 'రజనివెలిగించిన వెండిలాంతరు' గా[22] చంద్రుణ్ణి ఊహించడం కవి భావనాశక్తికి ఒక నిదర్శనం.

అదేవిధంగా 'కొత్తయిగుళ్లమేపరి' అయిన కోయిల లలితగీతిలో కన్నతల్లి వాత్సల్యమూ, ప్రణయగాథా, దారుణరణకథా, గాంధర్వ గాయక కళా విలాసమూ ధ్వనించాయి[23] కవికి అలాగే 'నవ్వుచుపుటి, నవ్వుచు నవకమొలయ నవ్వుచునుపోదు. ఇదియె నా నగ్నలీల' అనే తుమ్మెద సందేశంలో[24] ఒక ఆదర్శమూర్తి మత్త్వం గోచరించింది. 'చచ్చినా బ్రదికినా స్వర్గమే పూవ-పోదాము ఆ తల్లి పూజకే పూవ[25] అనడంలో పువ్వు మిషతో మానవ జీవిత పరమావధిని ప్రబోధించాడు కవి.

అంతేకాదు 'కలంకారి చీర చెఱంగులు' గా సూర్యాస్తమయంలోనూ,[26] నిప్పుపిండి ఆరవేసిన చీరల్లా శరత్తులోనూ,[27] పాలు తీసిన పొదుగుల్లా' సంక్రాంతికి[28] మబ్బులు ఉన్నాయనడం రాయప్రోలువారి ప్రతిభమపట్టి చూపుతుంది.

అలాగే కన్నె చెక్కిళ్ల జిగినవకమ్ము చిమ్మ.

పైట మడతల నందము లాటలాడ'...[29] ఇత్యాదిగా చెప్పడంలో గ్రామీణ స్త్రీలింగ సౌందర్యాన్ని వర్ణించే పట్టున కవి తీసుకున్న జాగ్రత్త గమనించతగింది.

అధ్యాత్మికం

రాయప్రోలువారు లలితాదేవి భక్తులు. ఆయనది 'లలితాకుటీరం' ఆయన రెండోకూతురు పేరు 'లలిత

'దివ్యసంతతి కెలన భక్తిన్ భజింప
ప్రేమ సామ్రాజ్యపాలనా ప్రీణయగుచు
నిందుకొలువు తీర్చెడి రమణీయమూర్తి
రాజరాజేశ్వరి కుమారరక్తి మధుర

స్తన్యమోహాంధయగుచు సాక్షాత్కరించు'[30] అంటూ తమ ప్రగాఢ విశ్వాసాన్ని చాటుకున్నారు.

అలాగే 'నిన్నెందు చూతురా చిన్నారికృష్ణ - ఏ మూల వెదికేనురా మోహనాంగ'[31] అనడంలో మధురభక్తిద్యోతం.

దేశభక్తి

రాయప్రోలు వారు సహజంగా స్వేచ్ఛాప్రవృత్తి కలవారు. ఆయన 'ముద్దుకలం' దాస్యశృంఖలాలను సహించదు. 'స్వచ్ఛంద గగన తోరణం క్రింద'నే ఆయన 'గీతాసఖి' 'భావపదం' పాడుతుంది. ఆయనకు 'బాలరసాలశాఖ'పై ఉయ్యాల లూగుతూ కనిపించిన 'కోయిలపాటకత్తె' కూడా పావనంబైన మాతృసేవా పదమే పాడింది. ఆయన దృష్టిలో పృథివియే 'తల్లి' 'దేవతామతల్లి.'[32] అందుకే భరతఖండమే ఒక తోటగా భావించి 'పరులు సొరకుండ కంచె కాపాడవలయు '[33]నని ఉద్బోధించారు. 'భూసతి ప్రసూతివేదనమును గ్రహించి తల్లితోటలు కాపాడు'దని[34] అర్థించారు.

'తెనుగుతోట' కావ్యంలో అస్పష్టంగా వ్యంజింపబడిన జాతీయ భావమే 'ఆంధ్రావళి'లో

'ఏ దేశమేగినా ఎందు కాలిడిన
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనిన
పొగడరా నీతల్లి భూమి భారతిని
నిలుపరా నీజాతి నిండుగౌరవము.'[35]

ఇత్యాదిగా సుస్పష్టమయింది.

'శ్రీలు పొంగిన జీవగడ్డయి పాలుపారిన భాగ్యసీమ'[36]గా భరతఖండాన్ని భావించారు శ్రీ రాయప్రోలు. అలాగే 'అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వవిద్యాలయములు స్థాపించునాడు'[37] ఇత్యాదిగాగల వారి ఆంధ్రోద్యమ పద్యాలు నాటి తెలుగు జాతిని ఉర్రూత లూగించినాయి. 'ఆంధ్రజన మహోజ్వల చరిత్ర' చావలేదని సుబ్బారావుగారి భావం. అందుకే 'కలదయేని పునర్జన్మ కలుగుగాక మధుర మధురంబయిన తెన్గు మాతృభాష'[38] అంటూ ఆకాంక్షించారు.

'నాదుజాతి – నా దేశము – నాదుభాష' అనే 'అహంకార దర్శన మందు' మనీ, 'తల్లి చన్నెచిన్నెలను' మాయనీవద్దని[39] సోదరులను ప్రబోధించారు.

సంఘసంస్కరణ

రాయప్రోలువారి 'స్నేహలత' దీనికి ముఖ్యోదాహరణం. వరశుల్కార్థం ఆత్మార్పణం చేసుకున్న స్నేహలతాదేవి రగిల్చిన 'పరిత్రాణవహ్ని' దేశాన్ని పునరుద్ధరించాలని వారు ఆశించారు.

మానవత

'ప్రేమవృత్తికి చండాల భేదమేల?' అని ప్రశ్నించడంలోనూ,[40] స్నేహభాండము పగిలి నీలిదీపముల్లా మానవులు పశువులు'గా మారవద్దని[41] ప్రబోధించడంలోనూ, 'పుష్పలావికలు' తమ జీవనోపాధికోసం 'అఖిలకుల చక్రవర్తి విందునకు' ఉంపుడుకత్తెలుగా మారారని వాపోవడంలోనూ,[41] భోజనమయిన తరవాత హీనంగా 'పులివిస్తరాకు' చూడబడుతున్నదని భావించడంలోనూ[42] రాయప్రోలువారి మానవత ధ్వనిస్తుంది.

'కాలేకడుపుకు గరిటెడు గంజీ
జారే సిగ్గుకు మూరెడు పాతా
ఎల్లరకందే చల్లని రోజులు
వెలసే విధమును వెదకండీ'![43]

అనేదే వారి మానవతా సందేశం.

సూఫీతత్త్వం

ఉమరుఖయ్యాం రచించిన పారసీక రుబాయీలకు ఫిట్జిరాల్డు చేసిన ఆంగ్లానువాదం ఆధారంగా రాయప్రోలువారు 'మధుకలశం' అనే కావ్యం వెలయించారు. ఇది కూడా వారి అనాసక్తియోగాన్నే ప్రతిపాదిస్తున్నది.

స్తుతి

రవీంద్రుడు, శివశంకరశాస్త్రి, బాపిరాజు, సరోజినీదేవి, సర్వేపల్లి, కృష్ణరాయ నాగేశ్వరులు, రామలింగారెడ్డి ప్రభృతులు రాయప్రోలువారి స్తుతికి పాత్రులయారు.

'పోతాలపాల తటాకంబు కెరటాలమీద మీగడతేట మేళవించి'[44] పోతన కవిత్వం రచించాడంటారు వీరు.

స్మృతి

తమ సాహిత్య గురువైన రవీంద్రులు మరణించినప్పుడు 'ఆరిపోయినది దివ్యస్నేహ శృంగారదీపంపు నివ్వాళి తీసినట్లు'[45] అంటూ వాపోవడంలోనూ, 'తరుణ సుకుమార సుందర పరిధానం' వీడిన తన చిన్న కుమారుణ్ణి తలచుకొనడంలోనూ[46] రాయప్రోలు వారి స్మృతిగీతాలు హృదయాన్ని కదిలిస్తాయి.

ఈ విధంగా పరిశీలిస్తే భారతీయ సంస్కృతీ పాశ్చాత్యభావనా మిళితమైన సుబ్బారావుగారి కావ్యాత్మ ఒక అభినవ దృక్పథంతో, అభివ్యక్తితో విప్పారుతుంది. ప్రియమైన రూపకల్పనా, మధురమైన శబ్దానువృత్తిమన్నోహరమైన భావ బంధమూ కావ్యానికి కళాకాంతులని వారి అభిప్రాయం[47] కావ్యానికి రసమే ఆత్మ అనేది వీరి మతం. రసమగ్నమైన హృదయం 'మకరందపాన పరవశంబగు మధురావస్థ'ను పొందడమే కావ్యానందమని వారి భావం 'వస్తు సంవరణం' లో కవికి 'స్వానుభవమే అధికరణం' అని వీరి సిద్ధాంతం 'కవియొక్క స్వీయభావమే ప్రధానముగా గలది భావకవిత' అని వారి నిర్వచనం[48] నుడువులు మాయని విధంగా 'తెలుగు చెఱకు' తునకల పీయూషాన్ని చేకొని కవిత్వంలో నింపడమే రాయప్రోలువారి కవితాలక్ష్యం ప్రకృతికీ ప్రాణిప్రకృతికి ఉన్న పరస్పర సంబంధాన్ని నిరూపించే పాత్రల భావానుగుణంగా చేష్టారూపాదికాలు తీర్చిదిద్దడంలో వీరు సిద్ధహస్తులు 'ఆనందాభిసారిక'లా చెవికి చక్కెరపాటగా, చవికి చెలిమి మురిపెముల మూటగా, చిత్తమునకు ముదిత ముద్దులాటగా లాలించి పొత్తుగా నేదే ప్రసన్నమైన కావ్యం అని వారు చెప్పుకున్న లక్షణాలు అక్షరాల వారి కావ్యాలకు వర్తిస్తాయి. భావనలో, పదప్రయోగ వైశిష్ట్యంలో, పాత్ర చిత్రణలో, ప్రకృతి ప్రదర్శనంలో, కల్పనాచాతుర్యంలో రాయప్రోలు వారి ప్రతిభ ప్రకటితమవుతుంది.

ఆంగ్లంలోని 'లిరిక్కు'ను తెలుగులోకి తెచ్చిన మొట్టమొదటి ఆధునిక కవి శ్రీ రాయప్రోలు. ఆంగ్లంలో విషాదంతో కావ్యారంభం చేసిన ప్రథములు వారే! పూర్వ ఛందోరీతులలో కొత్త రుచుల్ని

అంత్యప్రాసంతో పాటుగా యతిప్రాసలను విడిచిపెట్టారు. (దూత మత్తేభం), మాత్రాఛందోబద్ధ గీతాలను వెలయించాడు. అంతేకాదు. 'విరికన్నెలు సమర్తలాడుకాలం', 'దుఃఖరజస్సు', 'విశ్వాసాశ్రువులు' 'వలపు మొగ్గలు దొడిగిన వయసు' 'కసుగందిన కపటాశ' లాంటి ఎన్నో కొత్త పదబంధాలు సృజించారు. ఉగాదిలాంటి పండగలమీదా, కోయిల - పులిస్తరాకు లాంటి అల్పవిషయాలమైనా పద్యాలు రాయడం ప్రాచుర్యంలోకి తెచ్చారు. దేశభక్తి కవిత్వానికి ఒరవడి పెట్టారు. అమలిన శృంగార మనే ప్రణయ సిద్ధాంతాన్ని లేవనెత్తింది సుబ్బారావుగారే !

అందుకే శృంగార కరుణరసాలను పరిపోషిస్తూ, 'సౌందర్య లహరి'లో ఈదుతూ, 'సత్యం'లో నివసించడానికి 'శివ'మనే తీరాన్ని చేరడమే లలితకళ పరమావధిగా పెట్టుకున్న శ్రీ రాయప్రోలు వారు "భావకవిత్వపు యుగకర్త !

అధోజ్ఞాపికలు

1. వనమాల, పుట 39.
2. అంతరాత్మలో అమృత బీజం (వ్యా) —రాయప్రోలువారి సౌందర్య దర్శనం (1980) పుట 17.
3. రమ్యాలోకము, పుట 27.
4-8. రమ్యాలోకము, పుట 38-41.
9. తెలుగులో నా తొలి దిక్కులు (వ్యా) —రాయప్రోలు - సాహితీవాల్లభ్యం - ద్వి.భా. పుట 180.
10. తృణకంకణము (1922), పుట 24
11. ,, పుట 31
12. చూ-రమ్యాలోకానికి లసదాలోకం —మాధురీదర్శనానికి కళికదీపం (వ్యా) —తృ. కం. (1981), పుట 36
13. చూ - నివేదన - తృ. కం. (1981)
14. కష్టకమల - (1952), పుట 273.
15. స్వప్నకుమారము (1956) - పుట 26
16. తెనుగుతోట, పుట 33.
17. విరహవీధి - జడకుచ్చులు, పుట 98.
18. సరాగం - మిశ్రమంజరి, పుట 187.
19. తెనుగుతోట, పుట 14.
20. అదే - పుట 36.
21. ఆంధ్రావళి - పుట 75.
22. పెండ్లి లగ్నం - మి. మం. పుట 57.
23. కోయిల - జ. కు. పుట 48.
24. మధుమాలి - అదే పుట 99.
25. పూవు - అదే - పుట 128.
26. ఎవరు - అదే పుట 131.
27. మంగళమాహమ్ - మి. మం. పుట 47.
28. సంక్రాంతి - అదే పుట 81.
29. కాపుకన్నె - అదే-పుట 148.
30. తె. తో. - పుట 33.
31. రాధపిలుపు - జ. కు. పుట 182-3.
32. రమ్యా - 4-14.
33. అదే - పుట 20-21.
34. అదే - పు 22
35. జన్మభూమి - ఆంధ్రా. పు 21.
36. తమ్ముడా - అదే - పుట 27.
37. ప్రబోధము - పుట 19.
38. రమ్యా - పుట 2.
39. ఆంధ్రా - పుట 19.
40. తె. తో. - పుట 30.
41. వ మా. - పు 39
42. ,, పుట 40.
43. ,, పుట 13.
44. మి. మం. పుట 43.
45. వ. మా. - పుట 53.
46. నందా - మి. మం. - పుట 119.
47. అం. అ. బీజం (వ్యా)
48. అభినవాంధ్ర కవి పండిత సమ్మేళనము - భారతి-ఫిబ్రవరి 1934 - పుట 228.

['భావకవులు - ప్రతిభావిస్ఫూర్తి' అనే నా పరిశోధన గ్రంథం (అము) నుంచి కొద్దిమార్పులు చేసి వ్రాసిన ఈ వ్యాసం రాయప్రోలు వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ వారికే అంకితం చేస్తున్నాను. —శి. ప్ర.]

మారు పలికిన పచ్చని తోపు

శ్రీ సోమసుందర్

బర్మింగ్ హేమ్ సూర్యోదయాన్ని
తొలిసారిగా సందర్శించిన అగస్టు నాలుగోతేదీ
అజానుబాహువై మా కనులముందు
డాక్టర్ హరిగోపాల్‌గారిని నిలిపింది....
ఎంత విచిత్రమైన స్వప్నమో ఇది !
వజ్రంలా మెరిసే ఎంత గొప్పసత్యమో ఇది

1

రాక్షస రాజ్యంలో
చీకటి కీకారణ్యంలా పడివున్న
మాతృభూమిపైకి
వెలుగు రవ్వల ఇనోదయాన్ని
దింపుకు వద్దామని ఎందరో మనీషులు
మేలుకొని కలలుగనే సమయంలో
ఒకానొక అజానుబాహుడు
బారెడేసి అంగలేస్తూ ముందుకురికాడు
హిరణ్యకశిపుని వంటి తండ్రి
చండామార్కుని వంటి మూర్ఖశాసనాలతో
దండించినా అదురూ బెదురూ లేని ప్రహ్లాదుడై
చరచరా పురోగమించాడు
ఇదంతా అప్పుడే కాలదోషం పడుతున్న
గతాల చరిత్ర ! తెలంగాణా విముక్తికి ప్రాదిపదిక !
సర్దార్ జమలాపురం కేశవరావు
స్వాతంత్ర్య యోధులుగా సాధించిన పావనచరిత్ర !

2

జీవపత్రాల గొడుగులెత్తి
ఇంకావేరు తన్నని వంశాంకురంలా నిలచి
కన్నులు విప్పని విసుగును చూస్తూనే
కన్నుమూశారు సర్దార్ జమలాపురం !
సరోవరాలలో హంసలు
సాయంసంధ్యాసమయంలో
ముకుళిత నయనాలతో తూగినట్లు
అరమోడ్పు కనుల పసివాని హృదయంలో
పితృమరణం తెలిసీతెలియని పీడకలగా
వడదెబ్బకు వాడిన మొవ్వుటాకులా నిలిచింది....
ఐతే తాను అర్థం చూసుకోవడం
నేర్చుకోనారంభించిన తొలినాటినుంచీ
తన మొగంలోంచి హెచ్చవేసిన తండ్రిగారి ముఖాన్ని
సందర్శించడం నేర్చుకున్నాడు పసివాడు
అవునుకదూ డాక్టర్ గోపాల్‌గారూ ?

3

ఒక పక్క కూలిన చెట్టుక్రింద కాపురం
వేరొక పక్క ఎదుగుతున్న లేతమొలకను
తుఫానుల గాలిదెబ్బలనుంచి చేతులడ్డంపెట్టి కాపాడుతు
క్షమయాధరిత్రీ అన్నట్లు....
అన్నిందాలా తనపాత్రని పోషించేఉంటారు నిరాకారంబడెంద
ఆమెకి ప్రేమించడం సహజలక్షణం
కడగళ్ళని వడగళ్ళుగా మ్రింగిన వీరపత్ని
ఆమె మీ అమ్మగారు
మహా తపస్వి కాకపోతే
తాపసులంటే ఎవరో నేనెరుగను....

4

పందిరిరాటు చివురించిపూలు పూస్తుందంటే
ఎవరు నమ్ముతారు ? ఖమ్మారింత డాక్టర్లై
బర్మింగ్‌హేమ్‌లో మెరుస్తున్నారంటే నమ్మనివాళ్ళు
ఇప్పటికీ ఎర్రుపాలెం మారుమూలల్లో లేకుండాపోరు
తుఫానుల కేం తెలును ?
కూల్చడమో, పేల్చడమో, ముంచడమో తప్ప
మలయానిలాల వడగండి -

చెట్ల చిటారు రెమ్మల లలితకిసలయాలన్నూ
ఎలా ఆప్యాయంగా ముద్దు గొంటూయో ?
చల్లని నిప్పులా భయంకరంగా మెరిసే
మృత్యువు కేంతెలుసు జీవనహరితాన్ని కరించి
మోదుగా మార్చి - నాశనోన్ముఖంగా తిప్పడంతప్ప -
జీవితానికి తెలుసు - నడచినంతమేరా
చిరునవ్వుల బంగరు కాంతుల సురభిళాలు వెదజల్లడం !
అంచులలో గరికిపోచల కొమ్మంచులు వెలిగించడం !
గలగలాడే బోసినోటితో
పాటకతల పాతసంగతులు పాడుతూ
సాగే పిల్ల కాలవ చెబుతుంది
ముందు ముందెంత విశాల లోకాలందగలవో ?
చెవిలో గుసగుసలాడుతూ
రహస్యాలేవో చెబుతున్నట్లు మూలిగే
దిగ్గంత కాంచన రేఖల్ని చేర బిలుస్తుంది
విశాంత సమయంలో ప్రకృతి
అర్ధకంగా ఒళ్ళు విరుచుకుంటున్నపుడు
సూర్యుడు తాటితోపుల్లోకి
దీర్ఘచ్ఛాయల్ని విసరి భయపెడుతున్నపుడు
త్రుళ్ళిపడిలేచి గుక్కపట్టి అరుస్తూ
నింగి అంచుల కెగిరిపోతుంది కోయిల
వనాంతరాల మధుర స్వప్నాలను
దుర్మార్గుల బారి పడకుండా కాపాడ్డం
తనవంతే అయినట్లు నిద్రబరువులన్నీ
దింపడం తన పూచీయే అయినట్లు

5

డాక్టర్ గోపాల్‌గారూ
ఇంతకీ నేనిక్కడ వర్ణిస్తున్నది
అమాయకపు బాల్యం గడచి, యౌవనారంభాల
తెరపు మరుపుల కలల తుఫానుల్ని విడిచి
ప్రౌఢతర సామాజిక జీవిగా
పెంపొందిన దశను గురించి
సరిహద్దు లెరుగని పరిణత హృదయంతో
గగనాల గడచి, ఎగిరి వచ్చిన తరుణం గురించి
అదేకదా ఫలోన్ముఖ శాలీన కేదారం ?
మీరలా అలా ఎగిరి పడమర వచ్చేముందు
మాతృదేశం చెవిలో నుడివిన చివరి పలుకులు
రెండే అక్షరాలు కావొచ్చు బీజాక్షరాల్లా
అనమాపక భావాల అవంతాభివ్యక్తి కదేకదా మార్గం ?
ఆ భావాల అర్ధం ఇప్పటికైనా
జీర్ణమైందంటూరా విన్నవాళ్ళకు ?
చిన్నవాళ్ళకు, పెద్దలుగా నటించేవాళ్ళకు ?

6

అదంతా మీ వ్యక్తిగతమే కావొచ్చు
తొందరగా రూపులిడిన వస్తుతత్వాలను
మరపుల మంచుకోశాలలో దాచుకొనేదేకావచ్చు
కాని మీ హృదయంలోని మాట
నాతో చెప్పండి గోపాల్‌గారూ !
ఇక్కడికి వచ్చింది కేవలం ధనార్జనకే
కాదని నాకు తెలుసు ఎక్కడో దాచిన
మీ సహజత్వాల రాజసత్యాగశీలతల
ఆవిష్కరణ యిక్కడకు వస్తే తప్ప
మరోచోట సాధ్యం కాదనీ కాకపోవచ్చు
నిజానికి మనిషి ఎంత ఏకవచనమో
అంతే నిరంతర బహువచనం
కనుకనే మీతోపాటు మీరు పుట్టి పెరిగిన
సమాజం కలల సత్ఫలజాలాన్ని
మీ కూడా మూటకట్టి తెచ్చుకున్నారు
చిరకాల వారసత్వాల సఫల కామనలను
మీ హృదయంలో దాచుక తెచ్చుకున్నారు !
ఎరిగీ ఎరగని అతిపేద వయస్సులో
మీనుంచి దూరమై అంతర్ధానమైన మీ నాన్నగారు -
మీలో సజీవంగా ఎదుగుతున్నారన్న సంగతి
మీరెన్నడూ విస్మరించలేరు;
అందుకే ఆయనపట్ల మీకెంత ప్రేమో
మీ శ్రేయస్సు చూడకుండా దేశం కోసం

అహూతి అయిపోయినందుకింత కినుకానూ
క్షణ క్షణ మానసిక సంఘర్షణలో బహుశా
మీరింత శాంతస్వభావులుగా, నిగర్వచూడామణిగా
సదాస్మిత వదన భాసురమూర్తిగా
రూపొంది ఉంటారు! అవునా డాక్టరుగోపాల్‌గారూ !

7

ఏదో ఒక అజ్ఞాతశక్తి
మీ కనుసన్నల పడక, మీవెనుకే నడుస్తున్నట్లు
మీ గుప్తా గుప్త జ్ఞాపకాల పేటికలో
మానస్మణిగా మెరుస్తున్నట్లు గ్రహించకపోలేరు మీరు
మీ ఏకాంత నివాసాల మానసికారామాలలో
కొత్తకోర్కెల పూలు తొడగనారభించింది
సంసార వృక్షం !
దేశభక్తినీ వైద్య వృత్తినీ మేళవించి
జీవిత సారాన్ని త్యాగపరిమళంగా మార్చుకుని
పదవులాసించని సేవాధర్మాన్ని బ్రతుకు దారిగా
మలచుకున్న డాక్టరు తిరుమలరావుగారు
తమ మహితను సౌశీల్య విదుషీమణిని
డాక్టర్ సామ్రాజ్యలక్ష్మిని తోడ్తెచ్చి
ఆశీర్వాద పురస్సరంగా ఆమె వైదుష్య సామ్రాజ్యాన్ని
మీకందించారు !
నిత్యమామె మీ ముని వాకిలిని
పచ్చని తోపుగా సురభిళ భరిత నికుంజంగా
నిండు పున్నమికి కాణాచిగా మార్చింది.
పిలచినా పిలవక పోయినా
మీయింట సౌజన్యం మారుపలికింది....

8

కొత్తచిగుళ్ల నత్తిమాటలు
మీ పాదరంట మోసులు వారుతుంటే
ప్రశాంత ఋతూదయం
మీ యెదలో కొత్త రేకులు విప్పుకుంటుంది
అందుకే కదూ, డాక్టరు గోపాల్‌గారూ
పరిణత చేత స్కతలో అనిశం
తెరుస్తూంటారు మధుమాస వాతాయనాలు !
అనంతకాల ప్రవాహంలో
చిన్న వ్యవధిని మనం జీవితం అంటున్నాం
కనుకనే ఆ మూరెడు జీవితాన్ని
వేణువుగా మార్చి సప్తస్వరాలూ పలికిస్తే
నవరసభరితమై సమస్తలోకం పరవశిస్తుంది
ఏ కఠిన శిలా తీరానికైనా
గుద్దుకుని చిట్లిపోని పూలపడవగా
పురోగమిస్తుంది ధ్వాంతాల చీల్చుకుంటూ
నిరవధిగ గమ్యాల నవలీలగా అందుకుంటుంది.

—0—

(బర్మింగ్ హామ్ పద్యాలనుండి)

ఎంత పచ్చని తోటకైనా
మాపుల బీభత్సం నల్లని చీకటిగా మారుస్తుంది
అందుకే మనిషి తన చేతిలో
ఆరిపోని కాగడాతో తప్ప ముందుకు సాగరాదు...
దానికి పోసే చమురు వేరైనా
కాగడాలకన్న గొప్పది జ్ఞానం
ఎలా తెలుసుకొన్నారు గోపాల్‌గారూ : ఈధర్మసూక్ష్మం?

9

మీ పుష్పభరిత నికుంజం సాగోరినవార
ప్రతి పత్రాంచలాన్ని పలుకరిస్తూ
కాలపు సెలయేటి కెరటాలు సాగిపోతుంటాయి
పరిపూర్ణ మానవత్వాన్ని అందుకోవలసిన అవసరాలను
అవేనేర్పుతూంటాయి అవిరళంగా
జీవన సౌఖ్య మనేది నిజంగా
ఆర్థిక లాభనష్టాలపైనే ఆధారపడితే
కోటీశ్వరుల కన్నా సుఖులు వేరులేరు కదా ?
మరెందుకు వారు నిరంతర చింతాకుల మగ్నులు ?
తన చేతులు పట్టుకోకలిగినంతే....
తన భుజాలు మోయకల్గినంతే
అదేకదా సౌఖ్యానికి చివరిహద్దు !
తృప్తి తప్ప ఏదిమాత్రం చివరికి మిగులుతుంది ?

ప్రతి కెరటమూ కన్నులున్నట్లు మెరిసినా
మానవ నేత్రానికే మెరుపు సాటిరాదు,
విజ్ఞాన భావుకత్వాలు నయన ద్వయగా విప్పారిన మనిషి
పుడమిపై నడయాడే అధిష్ఠాన దేవర్షి !
ఎంత బలాఢ్యుడైనా మనిషి వ్యక్తిగా
పర్వతాలను లోయల్లోకి దొర్లించలేడు.
సముద్రాలను యెడారులకి అందించలేడు
విధ్యుక్త ధర్మాల నేమరకుండా
కర్తవ్యపాలనం విస్మరించకుండా
సంతృప్తిగా జీవించే పురుషాకారుడు
సర్వోత్తమ కళాస్వరూపుడు
ఈ పరమ రహస్యం మీరెలా అవగతం చేసుకున్నారు ?
గోపాల్‌గారూ ! అందుకే
ఎక్కడున్నా సర్వాంతర్యామిగా మెలగుతున్నారు.



డా॥ ఘంటా జవహర్‌లాల్

పొత్తంగి జిన ప్రతిమలు

అన్వేషణాత్మక పర్యటనలో శ్రీకాకుళంజిల్లా, సోంపేట తాలూకా, పొత్తంగి గ్రామం సందర్శించితిని పొత్తంగి గ్రామం మహేంద్ర తనయ నదిఒడ్డున సోంపేటకు 16 కిలో మీటర్ల దూరంలో వున్నది. పొత్తంగి చేరుటకు సోంపేట పట్టణం నుండి బస్సుసౌకర్యం గలదు. పొత్తంగి గ్రామం చివరన, మహేంద్రతనయ నదిఒడ్డున దేవాలయ సముదాయము గలదు. అందు శ్రీ పొత్తేశ్వరస్వామి ఆలయము పెద్దది మరియు ముఖ్యమైనది. దానిచుట్టూ ఎత్తుగా ప్రహరీగోడ గలదు. దానిలోపల దుర్గ, భీమలింగేశ్వర మరియు జగన్నాధేశ్వర స్వామి ఆలయములు గలవు. ప్రహరీ గోడకు వెలుపల చిన్న నీలకంఠేశ్వర ఆలయమున్నది. శ్రీ పొత్తేశ్వరాలయముచుట్టూ శైవప్రతిమలు పేర్చబడివున్నవి. ఆ శైవప్రతిమల్లో మూడు జినప్రతిమలు గల రాళ్ళుగూడా వున్నవి. రెండుమాత్రం జిన తీర్థంకరుల ప్రతిమలు గలవు. మూడవ రాతిపై చిన్నసైజుల్లో జినులు నాల్గు వరుసల్లో వరుసకు ఐదుగురు చొప్పున ధ్యానముద్రల్లో చక్కగా చిత్రింపబడిరి.

సర్వసామాన్యంగా జినప్రతిమ ఎనిమిది ప్రతిహార్యాలు[1] గల్గి వుండును. ఈ ఎనిమిది ప్రతి హార్యాలు తదుపరి యక్షుడు, యక్షిణి గూడా శిల్పించి బడును. ఇన్ని కల్గియున్న ప్రతిమలే సంపూర్ణ జిన ప్రతిమలుగా గుర్తించబడును. పై నిబంధనలన్నిటిని పొత్తంగిలో లభించిన జిన ప్రతిమలు కల్గి శోభాయమానంగా శిల్పించి బడివున్నవి.

జైన మతము 24 తీర్థంకరులచే బోధింపబడి వ్యాప్తి చెందబడింది. కావున జైనమతములో యీ తీర్థంకరులకు అత్యుత్తమస్థానమీయబడింది. ప్రతి జినతీర్థంకరులకు ప్రత్యేకమైన గుర్తులు, ప్రత్యేకమైన శాసన దేవతలు శాసన దేవుళ్లు నొసగబడినవి. వివిధ జైన తీర్థంకరులను గుర్తించుటకు పై గుర్తులే ప్రామాణికములు. ఒక్కొక్క సమయముల్లో ఏ గుర్తులు లేకుండా జిన తీర్థంకరుల ప్రతిమలు లభ్యమగుటకద్దు. ఆ ప్రతిమలను జిన ప్రతిమలుగా పరిగణించవలెనుగాని ఫలానా తీర్థంకరుడుగా గుర్తించలేము. మన రాష్ట్రములో ఏగుర్తులు లేకుండా జిన ప్రతిమలు చాలా లభ్యమైనవి. ఇరువది నాల్గు తీర్థంకరుల ప్రతిమల్లో పార్శ్వనాధుని, మహావీరుని ప్రతిమలు మనరాష్ట్రంలో విరివిగా కన్పడుచున్నవి.

జిన ప్రతిమలు, సామాన్యంగా నిలబడినట్లు, కూర్చున్నట్లు మాత్రమే శిల్పించి వుండును. ఏవిధంగా వున్నా 'ధ్యానముద్ర'లో దిగంబరంగానున్నట్లు చెక్కబడి వుండును. పొత్తంగిలో లభ్యమైన ప్రతిమలు కూర్చున్నట్లు, ధ్యానముద్రల్లోనున్నట్లు శిల్పించ బడివుండె ఒక జిన ప్రతిమ పీఠముపైచక్రము, మరియొకటి పుష్పము గుర్తుల కల్గివున్నవి జిన శిల్పశాస్త్రాధారముగా 'చక్రము' లాంచనముగాక జిన ప్రతిమను సుమతినాధునిగాను. గుర్తించనగును, కానిరు మన్దము[2] లో సుమతినాధుని లాంచనము క్రౌంచముగా పేర్కొన నది జైనమతముపై ప్రాధికారి (అథారటీ)గా గుర్తించబడిన శ్రీబి భట్టాచార్యగారు సుమతినాధుని శిలాప్రతిమలు క్రౌంచముతోబా చక్రము లాంఛనముగా గలవి భారతదేశంలో కనుగొన బడిన పేర్కొనిరి.[3] వారి యభిప్రాయములో నేకీభవించుతూ చక్ర లాంఛనముగాగల జినప్రతిమను సుమతినాధునిగా గుర్తించుట త గానేరదు. పైగా చక్రము లాంఛనముగల జినతీర్థంకరులు మరియొక



చిత్రము - 1

రేకపోవుట నా అభిప్రాయమునకు గట్టి శక్తినిచ్చుచున్నది. ఇక సుమతి నాథుడు జినతీర్థంకరుల జాబితాలో ఐదవవాడు. యావత్తు భారత దేశంలో సుమతినాథ తీర్థంకరుని శిలాప్రతిమలు చాలా స్వల్పముగా లభ్యమైనవి. ఇక మన రాష్ట్రంలో సుమతినాథుని (చిత్రం-1) శిలా ప్రతిమ లభ్యమగుట యిదే ప్రథమం కావచ్చును.

(చిత్రము-2)ఇక పద్మము లాంఛనముగాగల జినప్రతిమను పద్మప్రభ తీర్థంకరునిగా గుర్తించితిని. ఇతను జిన తీర్థంకరుల వరుసలో ఆరవవాడు. సుమతినాథుని శిలాప్రతిమ వలె పద్మప్రభుని శిలాప్రతిమ లభ్యమగుట మనరాష్ట్రంలో యిదే ప్రథమం. సుమతినాథుని మరియు పద్మప్రభుని శిలా ప్రతిమలు నొకేచోట లభ్యమగుట నిజంగా విచిత్రమే. అరుదైన జిన శిలా ప్రతిమలు మన రాష్ట్రంలో లభ్యమగుట నిజంగా ఆనందించ వలసిన విషయం. జిన తీర్థంకరుల ప్రతిమలను సులభంగా గుర్తించుటకు వీలుగా యీ క్రిందపట్టికలో 24 జిన తీర్థంకరులపేర్లు వారి లాంఛనాలు, శాసన దేవుళ్లు, శాసనదేవతల పేర్లతో పొందు పరుసున్నాను. గమనించండి. (తీర్థంకరుల శాసనదేవుళ్లో మార్పు వేరువేరు గ్రంథాల్లో వేరుగా వున్నా లాంఛనాలు మాత్ర అన్నిటిలో నొకేవిధంగా పేర్కొనబడినవి.




చిత్రం - 2

జైన తీర్థంకరుల జాబితా

క్రమ సంఖ్య	తీర్థంకరునిపేరు	లాంఛనాలు	శాసనదేవుళ్లు	శాసనదేవతలు
1.	ఆదినాథ (ఋషభనాథ)	వృషభం	చక్రేశ్వరి	వృషవక్త్ర
2.	అజితనాథ	గజము	రోహిణి	మహాయక్ష
3.	సంభవనాథ	అశ్వం	ప్రజ్ఞావతి	త్రిముఖ
4.	అభినందననాథ	వానరం	వజ్రశృంఖల	చతురానన
5.	సుమతినాథ	క్రౌంచం (చక్రము)	నరదత్తా	తుంబురు
6.	పద్మప్రభ	పద్మం	మనోవేగ	కుసుమ
7.	సుపార్శ్వనాథ	స్వస్తిక	కాళికా	మాతంగ
8.	చంద్రప్రభ	చంద్ర	జ్వాలమాలిని	విజయ
9.	సువిధినాథ	మకరం	మహాకాళి	జయ
10.	సీతలనాథ	శ్రీవత్స	మానవి	బ్రహ్మ
11.	శ్రేయంసనాథ	గంధకం	గౌరి	యక్షేశ
12.	వాసుపూజ్య	మహిషం	గాంధారి	కుమార
13.	విమలనాథ	వరాహం	విరాత	షణ్ముఖ
14.	అనంతనాథ	శ్యేన	అనంతమతి	పాతాళ
15.	ధర్మనాథ	వజ్రం	మానసీ	కిన్నర
16.	శాంతినాథ	మృగం	మహామానసీ	గరుడ
17.	కుంతనాథ	ఛాగ	జయా	గంధర్వ
18.	అరనాథ	నంద్యావర్త	విజయా	యక్షేశ
19.	మల్లినాథ	కలశం	అపరాజితా	కుబేర
20.	మునిసువ్రత	కూర్మం	బహురూప	వరుణ
21.	నామినాథ (సువ్రతనాథ)	నీలోత్పలం	చాముండ	భృకుటి
22.	నేమినాథ	శంఖం	అంబికా	గోమేధ
23.	పార్శ్వనాథ	సర్పం (ఏడుతలలు)	పద్మావతి	పార్శ్వ
24.	మహావీర (వర్ధమాన)	సింహం	సిద్ధాయిక	మాతంగ

పైన చెప్పినట్లు జినప్రతిమలు శైవప్రతిమలతోబాటు పొత్తేశ్వరస్వామి దేవాలయము(చిత్రము-3) చుట్టూ ప్రతిష్టించ బడివున్నవి. శ్రీ పొత్తేశ్వరస్వామి శివునిగా నేడు పొత్తంగిలో కొలువబడుచుండెను. ఈ ప్రాంతములో జైనక్షేత్రాలు రామతీర్థం, కొల్లివలస, భోగాపురం, కోనాడ మొదలగునవి. రామతీర్థం మరియు భోగాపురంల్లోగల జిన



చిత్రం - 3

శాసనములు పరికించిన జైనమతం యీ ప్రాంతములో క్రీ.శ. 11,12 శతాబ్దం వరకు వృచ్ఛస్థితిలో నున్నట్లు తెలియుచున్నది. ఇక జైనమత చరిత్ర చూచిన, జైనమతం, శైవమతస్తులచే ముఖ్యంగా వీరశైవులచే నాశనమైనట్లు తదుపరి జిన క్షేత్రాలను శైవక్షేత్రాలుగా శైవులు మార్చినట్లు బోధపడగలదు. జైనమతస్తులకు శైవ మతస్తులకు మత కలహం జరిగినట్లు నీ ప్రాంతములో దాఖలాలులేవు. అయినా జిన క్షేత్రాలకు క్రీ. శ. 12వ శతాబ్దము తదుపరి రాజాదరణ ప్రజాదరణ రూఢిగా లభించినట్లు తెలిపే యాధారాలు నిచ్చట లేవు. లేకపోవుటను జైనమతం క్రీ. శ. 12వ శతాబ్దము నుండి యీ ప్రాంతములో క్షీణించినట్లు పరిగణించుట నేరము గాబోదు. ఇక పౌత్తేశ్వరాలయ ముఖద్వారం పైగల ఒరియా శిలాశాసనాధారంగా[4] క్రీ. శ. 1309లో సుదాసపండ యనే భక్తుడు దామోదరునకు తూర్పుగాంగ రాజైన వీరభాను దేవునికాలంలో భూ విరాళం ఇచ్చినట్లు బోధపడుచున్నది. అనగా క్రీ. శ. 1309 నాటికి ప్రస్తుత పౌత్తేశ్వరాలయమున్నట్లు తెలియుచున్నది. లభించినాధారాలను క్రోడీకరించి చూడగా పౌత్తంగి ముందుగా జినక్షేత్రమని. క్రీ. శ. 1309 నాటికి శైవక్షేత్రంగా మారినట్లు తెలియుచున్నది. కావున ప్రస్తుత పౌత్తేశ్వరాలయము అసలు జినాలయముగా వచ్చును. దీనికి సరియైనాధారాలు లేకపోయినా, గర్భాలయమును పరికించిన సూఛాయగా బోధపడగలదు. గర్భాలయం సభాసదనం (ఫ్లోర్) జగమోహన కంటె 4,5 అడుగులలోతు. జగమోహనుగోడల కంటే గర్భాలయం గోడలు సహజంగా వుండి భిన్నంగా వున్నవి. దీనిపై యింకనూ విస్తృత పరిశోధన జరుగ వలసి వుంది.

పౌత్తంగిలో లభ్యమైన జిన ప్రతిమలు క్రీ. శ. 12వ శతాబ్దమునకు చెంది వుండవచ్చును. పౌత్తంగి శైవక్షేత్రంగా క్రీ. శ. 12 వ శతాబ్దం తదుపరి మార్పుచెంది వుండవచ్చును. భావి పరిశోధనల మూలంగా మరికొన్ని విషయాలు వెలుగులోనికి రావచ్చును.

గమనిక : 1984 జనవరి 7,8 తేదీలల్లో కాకినాడలో జరిగిన ఆంధ్ర ప్రదేశ్ 8వ చారిత్రక సమావేశంలో చదివిన నా ఆంగ్ల వ్యాసమునకు ఆంధ్రానువాదం.

పరిశీలించిన పుస్తక రాజములు

1. శ్రీ డి. యన్. శుక్లా, వాస్తుశాస్త్రం, సంపుట 2, అధ్యాయం 8' పుట 8.

1) దేవతావృక్షము, 2) సింహాసనము 3) త్రిచ్ఛత్రము (ఇది చాలా ముఖ్యం. ఈగుర్తు ప్రతి జిన ప్రతిమకు శిరముపై ముద్రించబడి వుండును. ఈ గుర్తే బౌద్ధ ప్రతిమల నుండి జిన ప్రతిమలను గుర్తించుటకు వీలుపడేది). 4) తేజోమండలము, 5) దివ్యధ్వని, 6) దివ్యపుష్పము 7) చామరములు, 8) దివ్యసంగీతం.

2. రూపమన్డనము, పుటలు 98-99.

3. జైన ఐకనోగ్రఫీ, 1974, పుట 41.

4. 1983 వార్షిక శిలాశాసన నివేదిక, శాసనం నంబరు, 398.

ఎలా నిన్ను అర్చించాలి !

శ్రీ కె. కిశోరుబాబు
శ్రీ కె. అశోకుబాబు

మాధుర్య పదార్థాలన్నింటిని సంగ్రహించి పూజిద్దామంటే
అది శబరి కానిక పెట్టిన పళ్ళలోనే చవిచూశావు !
స్తిమిత పదార్థాలన్నింటిని సంపాదించి సేవిద్దామంటే
అది కుబ్జ అలదిన చందన చర్చల్లోనే అనుభవించావు !
మృదుల పదార్థాలన్నింటిని అప్పగించి కొలుద్దామంటే
అది ద్రౌపది వడ్డించిన అంటుగిన్నె మెతుకుల్లోనే బోనేసావు !
నిర్మల పదార్థాలన్నింటిని ఒప్పగించి మయి మరపిద్దామంటే
అది గోపెమ్మ త్రాపిన పోసనాల్లోనే త్రాగావు !
సురభిళ పదార్థాలన్నింటిని సమకూర్చి సమ్మదింప జేద్దామంటే
అది మాలికుడు కైసేసిన తోమాలియలోనే మూరుకొన్నావు !
రుచ్యపదార్థాలన్నింటిని సమీకరించి అలరింప జేద్దామంటే
అది కుచేలుడు పెట్టిన పిడికెడు అటుకుల్లో నమిలావు
నీ పాదపద్మాలొత్తి
సేవిద్దామంటే
అది అటవికుని సేవలోనే తనిసావు !
ఓపిక కొద్ది దాస్యమైనా చేసి
మెప్పిద్దామంటే
అది ఉడుత భక్తిలోనే గైకొన్నావు
ఏం చేయాలి ప్రభూ !
ఎలానిన్ను అర్చించాలి !
ఎలా నీ మెయికోలుని పొందాలి !
నీ పదరేణువునై ఎలా తరించాలి !

సీరియల్

మృత్యువు

ఇచ్ఛాపురపు రామచంద్రం



(గ త సం చి క త రు వా యి)

పతంజలి దక్షిణ దేశానికి చేరుకున్నాడు.

మనుషులతో నిండిన నగరాలు... పల్లెలు.... అతనికి హిమాలయాల ఏకాంతం కంటె - మనుషులతో క్రిక్కిరిసిన యీ నిండుతనమే బాగుందనిపించింది. ప్రకృతి చికిత్సాలయాలను సందర్శించాడు. కాయకల్ప చికిత్స జరిపే కేంద్రానికి వెళ్ళి తనను వైద్యంలో అభిరుచి గలవాడిగా పరిచయం చేసుకుని - ఆ విధానాన్ని దగ్గరుండి గమనించాడు. కాయకల్ప చికిత్సను మళ్ళీ యౌవనమిచ్చే ప్రక్రియగా పేర్కొంటారు కొందరు వృద్ధులలోని వయస్సుని యీ కాయకల్ప చికిత్స కొంతవరకు వెనక్కినెట్టి బలాన్ని ఉత్సాహాన్ని ప్రసాదించగల మాట నిజమే కాని యీ చికిత్సా విధానం కొంత క్లిష్టమైనదీ, ఖరీదైనదీ కూడా. ఈ చికిత్స ప్రకృతి సూత్రాల ననుసరించి జరుగుతుంది. ఆహారం మీద నియమాలూ నిషేధాలూ ఉంటాయి. కాంతికూడ చూడకుండా చీకట్లో ఉంచుతారు మనిషిని. చివరకు శబ్దాలకు కూడా దూరం చేస్తారు. ఏ విధంగానూ జీర్ణపద్ధతి మీద భారం పడకుండా....జీర్ణాశయం మీద వొత్తిడి కలగకుండా ప్రత్యేకంగా ద్రవాహారాలు మాత్రమే యిస్తూంటారు రోగికి. ఈ విధంగా శరీరంలోని కణాలు...అవయవాలు -- ఇంద్రియాలు... అన్నీ పునర్జీవనం పొందడమే ఔతుం[ది]. దానితో ఆ మనిషి కొంత యౌవనాన్ని తిరిగి పొందగలుగుతాడ[ు]. చచ్చిపోయిన కణాల స్థానే కొత్తకణాలు పుట్టడంతో సహజంగా అతనిలో బలమూ ఉత్సాహమూ కలుగుతాయి. కొంత కాలంవరకు యివి ఉంటాయి కూడా.

ఐతే —

ఈ చికిత్స సామాన్యుల కందుబాటు కాదు. దీనికి వారా[ల] తరబడి ఆ మనిషి చికిత్సా కుటీరంలో బందీలాగ ఉండాలి. చాల పనులు మానుకుని. ఇది ఒక కారణం. రెండవది... ఈ కాయకల్ప చికిత్సకు తక్కువ డబ్బు ఖర్చుకాదు. ఆవిరి స్నానాలూ రకరకా[ల] తైలాలతో అభ్యంగనాలూ - ద్రవాహారాలూ... చీకట్లో శయనిం[చ]డమూ... నిశ్శబ్దంలో కాలం గడపడమూ - యివన్నీ మనిషి సహనానికి పరీక్షలే ఔతూంటాయి.

ఇంత డబ్బూ, సమయమూ, సహనమూ - వ్యయపరచ[ు]కున్నా - తీరా యిలా సంపాదించుకున్న అపురూపమయిన నూత్[న]

యౌవనోత్సాహాలు ఎక్కువకాలం ఉండవు. మళ్ళీ రెండేళ్ళకో మూడేళ్ళకో ఆ మనిషి ప్రకృతి చికిత్సాలయానికి వెళ్ళి మళ్ళీ యిన్నిబాధలూ పడవలసిందే.

అందుచేతనే ఏమో కాయకల్ప చికిత్స అట్టే ప్రాచుర్యం పొందలేదు. ధనంఉన్నా ఎక్కువ మంది శ్రీమంతులు దీన్ని ఆశ్రయించనూ లేదు, ఆదరించనూ లేదు. ఐనా యిది తనకు పెద్దగా ఉపకరించదు. యౌవనాన్ని, జారిపోయిన యౌవనాన్ని మళ్ళీ కొంచెం కాలంపాటు తిరిగి పొందాలంటే వాజీకరణౌషధాలుండనే ఉన్నాయి ఆయుర్వేదంలో. అవి ఖచ్చితంగా పనిచేస్తాయి కూడా. నాన్నగారు బ్రతికున్న రోజుల్లో జమీందారుగారు వసంత కుసుమాకరమూ, సిద్ధమకర ధ్వజమూ.... మదన కామేశ్వరీ లేహ్యమూ ప్రత్యేకంగా తయారు చేయించుకుని వాడేవారు. వాజీకరణౌషధాలు (యౌవనాన్ని పునరుజ్జీవింపజేసేవి) ఆయుఃప్రమాణాన్ని పెంచడంలో ఎక్కువ ఏమీ సహకరించవు. పైగా వీటిలో సువర్ణం ఎక్కువ కలుస్తుంది. కనుక సామాన్యుడి కందుబాటు కాని ఖరీదులో ఉంటాయి.

వృద్ధాప్యమనేది ఒక వ్యాధనుకుంటే - దానిని నివారించగలిగే దివ్యౌషధం రసాయనమే. కరక్కాయ.... నేపాళం... గుగ్గిలం... శిలాజిత్తు... వీటి రసాయనాలతో వృద్ధాప్యాన్ని పారద్రోలేందుకు అద్భుతమూ అమోఘమూ ఐన మార్గాలని చరకుడు సూచించనే సూచించాడు.

తను కోరేది_ మృత్యువుని జయించే మార్గం. మృత్యువు!. మృత్యువంటే ఏమిటి? వెలుగుకి చీకటిలా జీవితానికి వ్యతిరేకపదమేనా?

శవాసనంలో అంతరార్థం - కొంతవరకూ - మనిషి సజీవంగా ఉండగానే చిన్నచిన్న మోతాదుల్లో మృత్యువుని అలవాటు చెయ్యడమే. ఖచ్చితమయిన శవాసనం - శరీరాన్నే కాదు, మనస్సుని కూడా విశ్రాంతి స్థాయికి సంపూర్ణంగా తీసుకువెళ్తుంది. చైతన్య రాహిత్యం... కావొచ్చు.... మృత్యువంటే - శాశ్వత చైతన్య రాహిత్యమే కావొచ్చు.

ఊరవతల ఏరు. ఏటి కవతల చిన్న అడవి. అడవికవతల గుట్ట. ఆ గుట్టమీద దేముడు వెలిశాడంటా రావూరివారు. ఏడాదికోసారి మాత్రమే ఆ గుడి తలుపులు తెరచుకుంటాయి. మామూలు రోజుల్లో ఆ గుడీ... గుట్టా... అడవీ కూడా నిర్జనంగా, ప్రశాంతంగా ఉంటాయి. ఊరివారెవరూ అటుపోరు. ఏకాంతం కోరుకునేవారి కది చక్కనిచోటు.

ఆ అడవిలో - అతను ఒంటరిగా తిరుగుతున్నాడు. అక్కడ పులులూ సింహాలూ ఉండవు కానీ పాములూ నక్కలూ ఎక్కువగానే ఉంటాయి. దట్టంగా పెరిగిన ఆ మొక్కలని చూస్తే ఆ విషయం ఎవరికయినా సులభంగానే అర్థమౌతుంది. అతను దేనికోసమో అన్వేషిస్తున్నట్లు సూదుల్లాటి కళ్ళతో నేలమీద పెరిగిన తుప్పలవేపు చూస్తున్నాడు. ఆ దృష్టిలో తనకతి సమీపంగా ఉన్నచెట్టు మీదనుంచి రెండు గజాల పొడవున్న పాము క్రిందకి దిగుతూండడం అతను గమనించనేలేదు. అతని కన్నులు గంభీరంగా ఉన్నాయి. పిచ్చిగా పెరిగిన తుప్పలలోకి అవి అతినిశితంగా చూపులను ప్రసరిస్తున్నాయి. హటాత్తుగా... అతను ఆ తుప్పమీదకు వొంగాడు ఏదో సందేహం వొచ్చినట్లు... అళగా. అదే క్షణంలో... అతని రెండుకాళ్ళనీ ఏవో చుట్టుకున్నట్లయి - త్రుళ్ళిపడి. మనిషి నిటారయ్యాడు.

"స్వామీ!" మరింత పట్టుబిగించాడతను.

పతంజలి కాళ్ళను బంధించినవి రెండు చేతులు. అతని కాళ్ళ మీద పడినది - ఓ మనిషి.

"నన్ను మీరే రక్షించాలి స్వామీ. తీవ్రమయిన అశాంతితో అలమటించి పోతున్నాను ఇంత శాంతి ప్రసాదించక పోయారో నా మనసు పగిలి పోతుంది. నాకిక ఆత్మహత్యే శరణ్యం" కన్నీరు కార్చాడతను.

విసుగ్గా చూశాడు పతంజలి అతనివేపు.

మీరు దయతలచకపోతే - యిక్కడే... మీ పాదాల మీదే తల బద్దలు కొట్టుకుని చచ్చిపోతాను. సర్వసమర్థులయిన మీరే నన్ను కాదంటే నాకీలోకంలో దిక్కెవరు? అణిమ...గరిమ... మహిమాది అష్ట సిద్ధులూ కలయోగులు మీరు తలచుకుంటే అసాధ్యమనేదఉండదు. ఈ అమాయక అల్పప్రాణిని మీరు దరిజేర్చుకుని - కరుణించి - కాపాడకపోతే - నిష్కారణంగా ఆత్మహత్య చేసుకుని అంతమై పోతాడు. ఆ పాపం మీకు చుట్టుకుంటుంది. కనుక.... నా మొరాలకించండి."

ఏమిటన్నట్లు చూశాడు పతంజలి.

"తమరిలా శిలాఫలకముపై సుఖాసీనులు కండు. నేను వివరముగా విన్నవించెదను." అంటూ పతంజ ఆ రాయిమీద కూర్చునే వరకూ ప్రాణం తీసేశాడు. "నా పేరు యోగి. యోగి అంటే యోగే కాదనుకొండి.... యోగేంద్రనాథ్. కాని నన్ను సుమతి మాత్రం యోగీ అనే అనేది. అందుకని... అప్పటినుంచి... నన్ను నేనూ యోగీఅనే అనుకోడం మొదలు పెట్టాను. అన్నట్లు .. సుమతంటే మీకు తెలేదు కదూ? ఆమెను వర్ణించడానికి ప్రపంచంలో భాషలన్నీ కలిపినా చాలవనుకొండి. ఇప్పుడు కాదుకానీ అప్పుడామె అప్సరసలని తలదన్నే అందగత్తే అనుకొండి. ఆమెను మొదటిసారిగా చూసినప్పుడే ఆమెను ప్రేమించకుండా ఉండలేక పోయానంటే నమ్మండి. ఆమెనతికాలంలోనే అతిగాఢంగా ప్రేమించేశాను. ఔనుమరి. సుమతి మహా చక్కనిది..

ఆమె కంఠంలో కోయిలలుంటాయి, వీణలుంటాయి. ఆమె పలికిందో- సంగీతమే. అందానికి ప్రతిరూపం ఆమె...''

పతంజలికి చిరాకేసిందతని ధోరణికి. అతనికేకాదు, ఎవరికయినా అంతే. తన ప్రేమ చరిత్రలు ఎదుటి వారికి చెప్పడం ఎంత ఆనందంగా... గర్వంగా - గొప్పగా ఉంటుందో, ఎదుటివాడి ప్రేమ సొదలు వినడం అంత తల నొప్పిగానూ విసుగ్గానూ ఉంటుంది. ఆ అత్యంత సౌందర్యవతి, కోకిలగాత్రి ఐన సుమతి యితన్ని నిశ్చయంగా నిర్లక్ష్యం చేసి ఉంటుంది. ఇతని ప్రేమకి ఛీకొట్టేసి ఉంటుంది. అందుకే... ప్రేమ భగ్నమైందని... యితను ఆత్మహత్యకు తలపడ్డాడేమో. తననిచూసి ఏ బాబాయో అనుకుని - వశీకరణ మంత్రం వంటిది చెబుతాడని ఆశపడు తున్నాడేమో? అమాయకుడు.

''మరచి పోయాను. సుమతి కూడా నన్ను ప్రేమించింది. ప్రేమించడమంటే అలాగా యిలాగా కాదు. గాఢంగా... ఘాటుగా... ప్రాణాధికంగా... ఇద్దరమూ రోజూ కలుసుకునేవాళ్ళం. ఎన్నెన్నో కబుర్లు చెప్పుకునేవాళ్ళం. ఆకబుర్లెంత తీయిగా ఉండేవని. మేము యిద్దరమూ కబుర్లలో పడితే కాలమే తెలిసేదికాదు. మిగిలిన ప్రపంచం సంగతే పట్టేది కాదు...''

పతంజలి నిట్టూర్చాడు బాధగా. తనధోరణితప్ప యింకేదీ పట్టించుకునే స్థితిలో లేడు యోగి. అతను తన ప్రేమకథ చెబుతున్నాడు మరి.

''ఒకరిని విడచి ఒకరు బ్రతుకలేమనే స్థితికి వచ్చేశాం నేనూ, సుమతీ. ఇద్దరికీ-ఒకరి సాన్నిధ్యం ఒకరికి స్వర్గంకంటే సుఖప్రదం. కాని.. మా పవిత్ర ప్రగాఢ ప్రేమని చూసి సంఘం కళ్ళల్లో నిప్పులు పోసుకోడం ప్రారంభించింది. మా జంటనిచూసి అసూయతో మండిపడడం మొదలుపెట్టింది. ఎలాగయినా మమ్మల్ని విడదీసి వికటాట్టహాసం చేయాలని తొందరపడసాగింది..''

యుగయుగాలకథే. మారనికథ. విసుగుకొల్పే కథ.. ఈ అర్ష భూమిమీద ఎందుకనో ప్రేమకి శాపముంది. అది తరతరాలుగా ప్రేమికులని పీడిస్తుంది.

''మేము ఏమయినా ఎదిరించాలని గట్టి నిశ్చయం చేసుకున్నాం సంఘాన్ని.. పెద్దలని.. ఎవరినయినాసరే. ఎన్ని ఆటంకాలయినా ఎదుర్కొందుకే సంసిద్ధమయ్యాం. మా ప్రేమకి పెళ్లి చేసేందుకే కృతనిశ్చయులమయ్యాం. సుమతి వెనుకంజ వేయలేదు. చాలా సహకరించింది. మాది శాఖాంతరమని వివాహాని కభ్యంతరం తెలిపారు మా పెద్దలూ ఆమె పెద్దలూ. నేను కోటి గుమాస్తానికావటం వాళ్ళనాన్నకి నచ్చలేదు. ఇటువంటి ఎదురుగాలులలో.. తుఫానులలో.. మా ప్రేమ నావని సురక్షితంగా తీరం చేర్చాం యిద్దరమూ కష్టపడి. ఓ కోవెలలో దైవసన్నిధిలో ప్రేమికులమల్లా దంపతులమైపోయాం. భార్యాభర్తలమైపోయాం. ఇంక మమ్మల్నెవరూ విడదియ్యలేరు. సుమతి జీవితాంతమూ నాదే. ఆమె ప్రేమ నాదే. అని గర్వపడ్డాను. ఆమె మెడలో నేను కట్టిన మంగళసూత్రంచూస్తూ. మా ప్రేమకి- అలాగ పెళ్ళయింది- రెండేళ్ళ క్రిందట.''

ఇకనేం? ఉబలాటం తీరిందిగా? ప్రేమకిపెళ్ళయి పోయిందిగా? ఇక కథ మలుపుతిరగటానికేముందీ ? ఆశ్చర్యపడు తునట్లు చూశాడు పతంజలి. అదేక్షణంలో యోగీ అతనివేపు దీనంగానూ కన్నీళ్ళతోనూ చూశాడు. పెరిగిన గెడ్డాలు.. మీసాలు.. వర్చస్సులీనుతున్న వదన మండలం.. కాంతినిండిన కన్నులు.. ఉంగరాలు తిరిగి జడలు కట్టిన జుత్తు.. కాషాయవస్త్రాలు.. యోగికి ఆశకొల్పాయి. ధైర్యం చెప్పాయి మార్గం సూచించాయి.

ఈ సారతని కంఠంలో దైన్యంతోపాటు పశ్చాత్తాపంకూడా చోటుచేసుకో సాగింది. నిషాలో తాగుబోతులా అతను జీవిత సత్యాలు ప్రవచించ నారంభించాడు.

''మూర్ఖత్వం కొద్దీ తొందరపడ్డాను. వొట్టి అజ్ఞానం. తాగనంత సేపే అమృతపు తీయదనం. తాగేశాక యింకేముంటుంది. ఐపోయిందే అన్నబాధ తప్ప ? ప్రేమ- చెట్టునున్న పూవు. పెళ్ళి- కోసేసిన పూవు. కోసిన పూవు తొందరగా వాడి పోయి అందమూ గంధమూ కోల్పోతుంది ప్రేమకి పెళ్ళవటమంటే చెట్టునున్న పూవు త్రెంచబడటం అన్నమాటే.

ప్రేమ పాలకుండ, పెళ్ళి ఉప్పుగల్లు అని తెలుసుకోలేకపోయాను ముందుగా. మూర్ఖుణ్ణి. అంతా అయిపోయాక అర్థమయింది. చేతులు కాలాక పెళ్ళయిపోయాక ఏంపట్టుకొని ఏంలాభం? కోవెలలో పెళ్ళిచేసుకుని సరాసరి కాపురం పెట్టేశాం ఓ చిన్న అద్దెయింట్లో. సుమతి ప్రేయసికాస్తా పెళ్ళాం కావడంతో ఆమెలో విపరీత మయిన మార్పు వొచ్చి పడిపోయింది హఠాత్తుగా. చెబితే నమ్మడం కష్టంగా ఉంటుంది. కానీ- నేను అబద్ధమాడడంలేదు. స్వయంగా అనుభవించినదే చెబుతున్నాను. నమ్మండి. ప్రియురాలిగా ఆమె కన్నులలోనాపట్ల ఆరాధనా అనురాగమూ- భార్యకాగానే నామీద అధికారం- ధీమా-. ఆమె రూపమే మారిపోయింది. మునుపు సౌమ్యం నిండిన మూర్తికాస్తా కరడు కట్టిన కాఠిన్యం కాసాగింది. ఆమె మాటలలో కూడా ఊహించలేనంత మార్పు. ప్రియురాలిగా ఆమె ఆకాశంలో చందమామ-పున్నమి వెన్నెల- సముద్ర కెరటాలు- దిగంతాలు- కోయిలలు- రామచిలుకలు

అంద మయిన తీయని పదాలెన్ని పలికేదో చక్కగా తన మాటలలో! అవన్నీ-పెళ్ళితో ఒక్కసారి ఏమై పోయాయో ఎక్కడ మాయ మయ్యాయో! నోరు తెరిస్తే చాలు- "చీరెలు తీసుకురండి బొత్తిగా మంచి చీరెలు నాలుగేనాలేవు". అనో, "మెడ మరీబోసిగా లేదూ! ఓ గొలుసేనా చేయించరేం? ఆడీచెప్పాలా నోరువిడచి? ఏంమొగాళ్లో అన్నీ చెప్పించుకుంటారు. కొంచెమయినా స్వతంత్రంగా ఆలోచించడమూ-అర్థంచేసుకోవడమూ చేతకాని మగాడితో కాపరం చేయడం ఆడదానికి నరకమే." అనో- దెప్పడం మొదలు పెట్టేది. నాకు మతిపోయేది. ప్రేమించిన మనిషి నోటినుంచి అటువంటి పరుషవాక్కులు వొస్తాయా దేవతలు కలలోఅయినా బూతుమాటలు మాట్లాడతారా? నమ్మగలమా?

సుమతికి చీరెల దాహం పట్టుకుంది. పెళ్ళికావడంతోనే ప్రేమ దాహం ఎండిపోయి, దానికితోడు - నగలతాపం. నోరు విప్పితేచాలు-రెండే మాటలు... చీరెలూ, నగలూ. నాకు సందేహం కలిగేదామె ప్రవర్తనకీ మాటలకీ - 'స్త్రీ అంటే ప్రేమకాదేమో... చీ రె లూ నగలూ ఏమో...'

తీరేకొద్దీ ఊరుతాయి కోరికలంటారు కానీ, తీరకపోయినా ఊరుతూనే ఉంటాయేమో అని.

నేనొట్టి గుమాస్తాగాణ్ణి. నా నెలజీతం- మాయిద్దరమూ సామాన్యంగా బ్రతడానికి బొటాబొటిగా సరిపోతుంది. గుమాస్తా జీతంలో విలాసాలకు తావుంటుందా? ఐనా- ఆమె కోరికలను కొంతవరకూ అయినా తీర్చడానికి చేసే ప్రయత్నాలలో - నేను చాలా దిగజార్సాను. ప్రేమయితే కానీ ఖర్చులేనిది కనుక ఎంతయినా యివ్వగలను. కాని చీరెలూ నగలూ అంటే డబ్బుతో పని. గుమాస్తాగాడికి నిత్యమూ డబ్బు ఎక్కణ్ణుంచి వొస్తుంది? రోజుకో కొత్తచీరా... నెలకో బంగారునగా తీసుకు రావడం నానంటి బీదగుమాస్తాగాడికి కలలో అయినా సాధ్య మౌతుందా? అంతకీ - ప్రయత్నించడం మనిషి విధికదా అని అడ్డ దార్లుపట్టాను. గడ్డికరవడం మొదలుపెట్టాను. వెధవపనులు చేయ సాగాను. నైతికంగా పతనం కాసాగాను. ఎందుకంటే - సుమతంటే నాకింకా వెర్రిప్రేమ. ఆమెను చేరాలంటే కొత్తచీరే మార్గం ఎదో ఒక కొత్త వస్తువుపట్టుకు రానిదే ఆమె నన్ను దరికి రానిచ్చేది కాదు. ఆమెకు దూరంగా ఉండలేని బలహీనత నాది "

పతంజలికి అతని బాధ అర్థమైపోయినట్లనిపించింది. ధనమూల మిదం జగత్ కాస్తా - యితని విషయంలో ధనమూలం భార్య ప్రేమ అయింది దురదృష్టవశాత్తూ. హృదయం ఆకాశమంత విశాలమేకాని ఆస్తిపాస్తులు మాత్రం అవగింజ ప్రమాణమే. పత్నిప్రేమ అనే శిఖరా న్నందుకు సువర్ణసోపానాలు నిర్మించదలుచుకున్నట్లున్నాడితను. అతని ఆవేదనా ఆరాటమూ స్పష్టంగా అర్థమౌతూనే ఉన్నాయి. ఇతను తనని చేరడంలో, అంతరార్థమూ అద్దంలో ప్రతిబింబంలా అతిస్పష్టంగా గోచర మౌతూనే ఉంది. గెడ్డాలూ మీసాలూ పెరిగిన తననిచూసి ఏ యోగో స్వామో అనుకుని సువర్ణయోగ విద్య నర్థించడానికి చేరినట్లున్నాడు! ఎంత అమాయకుడు!

"సముద్రంలోని నీరయినా తోడిపారబొయ్య వచ్చునేమో కాని స్త్రీ హృదయంలో ఊరే నిరంతర కోర్కెలవాహినిని తీర్చడం ఎవరి తరమూకాదని ఆలస్యంగా తప్ప గ్రహించలేకపోయాను. ఉద్యోగరీత్యా చేసిన వెధవపనులు మాటిమాటికి మనసులో మెదులుతూ - చిత్ర హింస చేయడం మొదలుపెట్టాయి నైతిక పతనం-నిలువనిచ్చేదికాదు. సుమతి - నాకు దాంపత్యంలో ప్రత్యక్ష నరకమే చూపుతోంది. ఆఫీసులో - నేననుమానించ బడుతున్నాను. గడ్డిదొరకని పనిలోకి బదిలీ చేయబడ్డాను. వొట్టిచేతులతో వచ్చే నన్ను సుమతి యీ చెలలాడి మాటలని- నా మనసుని కుళ్ళబొడిచి వొదిలేది. దుఃఖం- విచారం-పశ్చాత్తాపం. ప్రేమకీ పెళ్ళికీ మధ్య యింత దారుణమయిన దూరమా! ప్రియురాలికీ భార్యకీ నడుమ యింత హేయమైన అంతరమా! వివాహంతో - దేవత రాక్షసౌతుందా? భర్తంటే- వొట్టి ధన సంపాదన యంత్రం మాత్రమేనా? భార్యాభర్తల అనుబంధం -ఆర్థికమైనదే తప్ప హార్దికమైనది కానేకాదా? ఇలాగ సందేహాలు కలిగేవి. సుమతి ముఖం చూడాలంటేనే భయంవేసేది. ఏమడిగినాఅసహాయతనీ, అప్రయోజకత్వాన్ని, అసమర్థతనీ ఎత్తిపొడిచి హేళన చేస్తుందో అని.

ఆఫీసులో - నా నేరాలు రుజువయ్యాయి. ఔను. పాపం పండకేమౌతుంది? చేసిన నేరాలు తీవ్రమయినవి కనుక మరీ వేగంగా పండాయి. నిజానికి నాకు పడ్డ శిక్ష - నేను చేసిన వెధవ పనులతో పోలిస్తే అతి తక్కువనే చెప్పాలి. నన్ను ఉద్యోగం లోంచి తీసివేసి ఊరుకున్నారు. న్యాయంగా ఐతే నాకు కనీసం యావజ్జీవ కారాగార వాస శిక్ష కూడా విధించాలి. బహుశా - నేను చేసిన నేరాలు - నా కోసం కాదు కదా అని - భగవంతుడు కొంతలో కొంత కరుణాకటాక్ష వీక్షణాలు జరిపాడేమో నా మీద! వొట్టి చేతులతో . . వెర్రిమొహం వేసుకుని వొచ్చానింటికి. సుమతి ముఖం చూడడానికే భయంగాఉంది. పడిన శిక్ష కంటె పడబోయే శిక్షకే నేనెక్కువ భయపడు తున్నాను. నా వైఖరి గమనించినట్లే అడిగింది సుమతి. .

"ఏమైంది ?" ఉద్యోగం ఊడిందా ? తలవంచుకున్నాను "ఊఁ" అన్నాను నేరస్తుడిలా. "నాకు తెలుసు. మీరింతకంటె నిర్వా(హ)కం చేస్తారని నేనెప్పుడయినా అనుకుంటేగా !" హేళనగా అంది నేను మౌనంగా నిలబడిపోయాను.

"బుద్ధి గడ్డితిని . . ముందుచూపులేకుండా . . మిమ్మల్ని పెళ్లి చేసుకున్నాను. అందుకు - అనుభవించానీ రెండేళ్ళు చాలు. మిమ్మల్ని నమ్మినందుకు నాకు మంచి ప్రాయశ్చిత్తమే జరిగింది. జరిగింది చాలు. ఇక నన్ను నా మానాన బ్రతకనీండి నా బ్రతుకు. నాకిక ముఖం చూపకండి. మీతో ఉంటే నాకు కడుపునిండా తిండయినా పెట్టకుండా ఆకలితో మాడ్చి చంపేస్తారు. ఈ క్షణం నుంచీ మీ దారి మీదే. నా దారి నాదే."

పెట్టె సర్దుకుని - నా కళ్లముందే వెళ్ళిపోయిందామె. ఏమనడానికీ నోరు పెగలలేదు నాకు అవమానంతో. ఇలా జరుగుతుందని భర్తగా నేనెన్నడూ ఊహించక పోవడంతో సుమతి నిష్క్రమణం- నాకు విద్యుద్ఘాతంలా తగిలింది. జరిగినవి చాలవన్నట్లు - నా నెత్తి మీదకి దొకపిడుగా ?

ఇంక నేను నలుగురికీ ఎలా ముఖం చూపేది ? ప్రేమించి పెళ్లి చేసుకున్న సుమతి - నన్ను వదిలేసిందని తెలిస్తే నలుగురూ నా ముఖాన నవ్వరూ ? ఐనా - నా కేముందని యిక్కడుండాలి ? జీవించాలి ?

ప్రేమ - భగ్నమయింది.

ఉద్యోగం - ఊడింది.

సంసారం - వీధినపడింది.

ఇన్ని అవమానాలనూ మోస్తూ ఎందుకీ బ్రతుకు బ్రతకాలి ? ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకున్నాను. బయలు దేరాను.." ఆగాడు యోగి.

ఈసారి పతంజలి అతనిమీద జాలిపడకుండా ఉండలేక పోయాడు. మృదువయిన కన్నులతో అతనివేపు ఓదార్చుతున్నట్లు చూశాడు.

యోగి కన్నుల నిండా నీళ్ళు. ముఖం నిండా దైన్యం. మెల్లగా అన్నాడతను." ఎందుకో తెలియదు. నా నిర్ణయాన్ని అమలు పరచలేకపోయాను. చావంటే భయంవల్లకాదు. బ్రతుకులో ఏం తీపి మిగిలిందని నేను చావుకి భయపడాలి ? ఎందుకనో నా తెలియదు. నా ప్రయత్నాన్ని కార్యరూపంలో పెట్టలేకపోయా గమ్యం లేకుండా . . ధ్యేయం లేకుండా . . తిరుగుతున్నా నేను దేనికోసం అన్వేషిస్తున్నానో నాకే తెలియదు. ఒకటి మా నిజం. నాకిక స్త్రీ అంటే వ్యామోహం లేదు సరికదా. జీవితం స్త్రీ ముఖం చూడదలచుకోలేదు. నాకు వైరాగ్యం వొచ్చేసిం స్త్రీ మీదా, యీ ప్రపంచంమీదా, నా అంతర్యం అశాంతితో అ ఉడికి పోతూంది. నా కింత శాంతి ప్రసాదించండి. నేను మిమ్మ వొదలను. నన్ను మీ భక్తుడిగా - సేవకుడిగా . . స్వీకరించండి లేదా నాకు మరణమే శరణ్యం . ." పాదాలమీదపడి యిక వదల్లే

పతంజలి అతని వేపు సాలోచనగా చూశాడు. అతని హృదయ ఆర్ద్రమయింది. కాళ్లమీద పడిన యోగి నతను చేతులతో లేవ చిరునవ్వు నవ్వాడు అభయమిస్తున్నట్లు. ఒక్క నిమిషం మౌన ఉండి అతన్ని తన వెంట రమ్మన్నట్లు సైగ చేశాడు.

8

కళలకూ కామానికీ కూడా కాణాచి ఐన విజయనగర మకాం పెట్టి రెండవ సంవత్సరం దాటుతోంది. ఈ రెండు సంవత్ల్లోనూ యోగి చాలా విద్యలే నేర్చుకున్నాడు. గురువుగారివద్ద పెట్టడం.. ఆసవాలు- కషికలూ- తయారుచేయడం- లేహ్యాలు సి కెక్కించడం- మాత్రలు పొట్లాలు కట్టడం- యివి అతను ఎక్కు పతంజలిని వేధించకుండా స్వంతంగా చేయగలుగుతున్నాడు. రో వొస్తే- పతంజలి నాడీ నినాదం చేసి- అవసరమయితే భావప్రకా వస్తుగుణదీపికతో తిరగేసి ఔషధం నిర్ణయిస్తాడు. అది సిద్ధంగా ఉ సరే. లేక పోతే ఏ యే వస్తువులు ఎంతెంత వెయ్యాలో- వాటి చెయ్యాలో యోగికి చెబుతాడు. తూకాలవంటివి పతంజలి చూసి మధ్య మధ్య పర్యవేక్షణ గావించినా ఔషధ తయారీలో అధిక భ యోగిదే. బజారు నుంచి మూలికలూ అవీ అతనే తెస్తాడు. లోనూ స్త్రీ లోలత్వంలోనూ అతని తెలివితేటలు నివురు కప్పినా- జంగా అతను చురుకయినవాడే. తెలివయినవాడే.

(ఇంకా వుంది)

ముక్తి !

శ్శబ్దం నోరు తెరచిన
రాత్రిరి నిండు కొలువులో
వ్వటిల్లిన అనుభూతి
వదించే చక్కిలిగిలి
చ్చికొండగాలితో
రంగా నేస్తం కడుతోంది

ఈ ఆత్మ
తాదాత్మ్యంలో తడిసి
దేహాన్ని దాటుకొని
ప్రకృతిలో సంగమించే వేళ
పరవశం మౌనంగా ఎంతో ముద్దుగా
నిద్దురపోయే వటుపత్రశాయి.

క్కడి శ్వాసో
హూరి పోదు
నాటి ఊసో
రి తప్పదు
ల్లని ఆకాశంలో
లమిల లాడే నక్షత్రాలు
పకాలు
వు వాటికి ఆనవాళ్ళు !

దట్టంగా
మంచు అలుముకున్న
పిచ్చిమగత
మబ్బుపట్టి ఉంది
అగాధకూపాల
అంధకార రూపాల
చిమ్మ చీకట్లు
చీల్చుకొని వెలుతురు
సమ్మెట పోట్లు
దాటుకొని నిబ్బరం
బ్రతుకు పంట పండించుకోవాలని
బాటసారిని నడుపుతుంది
బారసాల సారెల
భవిష్యత్తును చూపెడుతుంది

టి చూపు కానని
డె ఊపుకు తోచని
బ్దం చేసే శబ్దంలో
దాగి ఉన్న స్తబ్దం !
కాదది ప్రారబ్ధం !
శతాబ్దాల వెనుక ఉన్న ఆ శబ్దంలో
శ్మశానాల సైతం రవళించే చైతన్యం
శరచ్చంద్రికల అలరించే ఉత్తేజం
దివ్య తేజం !
అదృశ్య భాస్కర తీక్షణం !

హోమమనే గాలిలో
హరోంహరుని శంఖారావం
ప్రతిధ్వనించే కొండగుండెల్లో
హృషీకేశుని ఓంకారం
కాసేపు రుద్రతాండవం
మరికాసేపు కాళియ మర్దనం
పార్వతీప రమేశ్వరం
నరనారీ సంగమసారం
అర్థం చెప్పని నిశ్శబ్దం !
అర్థాలకోసం వెదికే శబ్దం !

సిలువ ఎక్కేముందు
ఏసుక్రీస్తు మౌనం ఈ అర్థరాత్రివైనం
గడపదాటేముందు
గౌతముని సంఘర్షణ ఈ చలిగాలిగాయం
సూర్యోదయం కోసం ఎదురు చూస్తున్న
ఆదిశంకరుని కళ్ళ కదలాడే రాజసం ఈ రాత్రి సౌందర్యం
తరతరాల మానవ కథా సరిత్సాగరం !
అభయహస్తంకోసం అహర్నిశలు శ్రమించిన
భగీరథుని కఠోరదీక్షాదక్షత అందించిన ప్రవాహం
యుగయుగాల అంతరరసగంగ వైభవం !

కల్పించుకొన్న జాతిని విడచి
పేరుపెట్టుకొన్న మతాన్ని మరచి
పుట్టుకతో వచ్చిన కులాన్ని కాదని
వంశీకం ఇచ్చిన గోత్రాన్ని వద్దని
ఆచార వ్యవహారాలకు అతీతంగా
పూజా పునస్కారాలకు అందనంతగా
అవధూతలా
పరమహంసలా
ప్రకృతిలో మిళితమైతే
ప్రకృతీ మానవప్రకృతీ ఒకటే

ముక్తి

ఏదితాడో
ఏదిపామో
ఏది కుబుసమో
ఏది వాస్తవమో
తెలుసుకొనే విజ్ఞతలో
సంస్కరించబడే ఆ మధుర క్షణంలో
ఎంత నిశ్శబ్దం !
ఆత్మ చేసే విచిత్ర శబ్దం !
శబ్దం చేసుకొంటూ
మనిషి పుట్టేటప్పుడు
ఆత్మ నిశ్శబ్దంగానే ఉంటుంది !
పోయిన మనిషి కోసం
ఎంత శబ్దం చేసినా
ఆత్మ నిశ్శబ్దంగానే ఉంటుంది !
విశ్వమంతా
ఆత్మ !
పరమాత్మ ! !

దేహమంతా
ప్రకృతి !
భగవంతుని వింతకృతి ! !
ఆ ప్రకృతిలో
ఈ దేహాకృతిలో
ఆత్మశృతిలో
పరమాత్మ ధృతిలో
ఏది ఏది శాశ్వతం ?
ఏది ఏది యథార్థం ?
తెలియదు
తెలిసిరాదు
తెలిసికోను వీలుకాదన్నదే శాశ్వతం !
ఆ మాటొక్కటే అక్షరాలా యథార్థం !
అదే మోక్షం !
అదే అదే అపరోక్షస్థితి !
కైవల్యప్రాప్తి !
పరమపదప్రసక్తి !

విచిత్రమీ జీవితం

నిద్దుర పట్టని నిశిరాతిరి
మబ్బుపట్టిన గుడ్డి వెన్నెల రాతిరి
ఏటి గట్టుపై నీలి నీడల చూస్తూ
వేణుగోపాలుని గుడి ముంగిటి చిరుగంటులశబ్దం వింటూ
అందమైన పడవను చేసి
దూరతీరాల వేంచేసిన నా చెలికో సందేశం రాసి
నే పెంచిన గులాబీ మొక్క ఏపుగ పెరిగి
నాకిచ్చిన ఎర్రని మమతల పువ్వునందు ఉంచి
గతం మిగిల్చిన జ్ఞాపకాలలో నేను దాచిన
అనురాగాలు నిండుకొన్న అతితీయనివలపునుఅందు ఉంచి
ఆవలి తీరానికి పంపినాను
ఆశగా తీరంవైపుకు చూచినాను !
పడవ వెళుతోంది
కనుమరుగౌతోంది
క్షణాలు వెనువెంట వెళ్ళుతున్నాయి !
కంటి చూపులు వెలుగును తడుముకొంటున్నాయి

ఇంతలో సూర్యుడొచ్చినాడు
చీకటినో పోటు పొడిచినాడు
ఎంతకాంతి !
ఏదో విభ్రాంతి !

పడలేదని దిక్కులు చూచినాను
చెరిగిన రాతల కాయితం రెపరెపలాడేను !
గులాబీ సోయగ మొక్కటిసీ వెదికేను
గుడిపూజారి చేతిలో గాయత్రీ మంత్రాన మునిగిఉండేను!

ఏదో తెలియని తృప్తి తొణికిసలాడినా
అర్థంకాని ఆర్తి మనసును పట్టి వేధించినా
చెలిజడ ముడవాలనుకొన్న పువ్వు
దేవుని ఎద చేరె నేలనో !
వాడిపోయి రాలిపడి
మరల మంటి నేల చేరుకొనునో !

డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు

యశోధర (దృశ్యకావ్యము)

కన్నడమూలము :

డా॥ మాస్తి వేంకటేశ అయ్యంగార్

తెనిగింపు :

శంకరగంటి రంగాచార్యులు

పాత్రలు

యశోధర	సిద్ధార్థుని భార్య
రాహులుడు	సిద్ధార్థుని కుమారుడు
రాజు	సిద్ధార్థుని తండ్రి
అంబిక	యశోధర పరిచారిక
బుద్ధుడు	సిద్ధార్థుడు
ఆనందుడు, మానందుడు, సారిపుత్రుడు	బుద్ధుని శిష్యులు
అంబాపాలి	బుద్ధుని శిష్యురాలు
మల్లరాజు	లిచ్ఛవి రాజు
ధర్మమల్లుడు, దానమల్లుడు	మల్లరాజు కుమారులు
కౌండిన్యుడు, కౌశికుడు, భరద్వాజుడు, వాసిష్ఠుడు, గౌతముడు, జాబాలి, ధనపాలుడు	కపిలవస్తువు బ్రాహ్మణులు

యువతి, ముసలిది, ఒక శిశువు, పిల్లవాండ్రు,

సేవకులు, పురజనులు మొదలగువారు.

సూత్రధారుని ప్రస్థాన

ఆదిలో జగదాది దేవుని మ్రొక్కి,
నుడికి, నాడుకు శుభము నిమ్మంచువేడి,
పూర్వమున జనులకై వేదముల మెక్కి
ధన్యులైనట్టి పెద్దల పేర్లు పాడి,
లలిత కళల ఉపాసకులకు తలవంచి,
ఇటనున్న ఆర్యమిత్రులకు నతిసలిపి
చూపనుంటిమి ఒక్క ప్రాత రచియించి
నట్టి దృశ్యమును మా ఆశ హృదినిలిపి
గుణమున్న కొనుడు దోషముల సైరించి
బంధులారా! నేడు మమ్ము కరుణించి.
ప్రాలేయగిరితటపు కపిలవాస్తువున
రెండు వేలేండ్ల క్రిందట అవతరించి,
శాక్యకుల మౌళిమణి యొకడు ఈ భువన
మున సత్యమునుచాటి, నరునుద్ధరించి,
బుద్ధుడను అన్వర్థనామమును క్షితిని
రక్షగా నుంచి, పై జగములకు నడచి
నట్టి గురువరు చరిత నొక్క సంగతిని
మీముందు నటియించెదము శంకవిడిచి
మీరార్య సంస్కృతిని ప్రేమింతుగాన
బుద్ధుని గుణించినదె గుణము దృశ్యాన.
ఇట్లుండ, ఇదెకనుడు, నాడు గౌతములు
తత్త్వంపు తెలికకై సతిసుతుల వదలి
తపముకై చనినాక పదివత్సరములు
పదియుగములుగ చాల బాధతో కదలి
అతని కాంతామణి యశోధరాదేవి,
ఒకరాత్రి భీకరపు కలనొకటి కాంచి,
ముందేమి కాగలదొ అని తలచి జీవి
తము వణక, కడు గొప్ప మున్నె సేవించి,
సుఖరసము వట్టిపోయిన బ్రదుకు నదిని
ఉత్త ఇసుకను చూచి వెతకుందు విధిని.

స్థానము–1

(కపిల వాస్తువులో రాచనగరిలో యశోధరాదేవి అంతఃపురము. యశోధర ఒకరెయే చింతామగ్నురాలై కూర్చున్నది. ఎదుట ఒక పీఠముమీద ఒక పటమున్నది).

యశో : అంబికా, శారికా,

అంబిక : అమ్మ, ఇదెవచ్చితిని.

యశో : రాహులుని స్నానమింకను పూర్తికాలేదా? ఎందు కింకను వాడు రాలేదు?

అంబిక : అప్పుడే ఇటకు వచ్చిరి తల్లి. వచ్చునప్పుడు పూలుతేను. శారిక నందనమునకు బయల్దేర తల్లికై తాము పూలు తెత్తుమని ఆమెతో ఉద్యానమునకు వెళ్ళిరి.

యశో : మంచిదే లెమ్మ ఇటకురా. అ పటము నిచ్చటికి తెమ్ము.

(అంబిక పటమును యశోధర పీఠము వద్దకు తెచ్చిపెట్టును. యశోధర దానినే చూచుచు కన్నీరు నించును).

అంబిక : అమ్మా!

(యశోధర మాట్లాడదు)

అమ్మా.

(అని కన్నీటిని తుడుచును)

ఏమిటిది? ఎందులకు?

యశో : ఎందులకా ఎఱుగవా? అంబికా, అడిగెదవ? పదివత్సరములుగా క్రాగి మరగెడి వ్యథను క్రొత్తగా చెప్పనేమే?

అంబి : అమ్మా. నేను ఆమాటేల? మన బ్రదుకులో బ్రదుకు మనల నందరవీడి వెడలి పలునాళ్ళయ్యె. ప్రాతదగు వేదనను ఇట్లు తలచుచు నేడు క్రొత్తదిగ చేసెదరదేల? మీరిటునొవ్వ నేను చూడగలేను.

యశో : అంబికా, అంబికా, ఈ ఒక్క పాత బాధనె తట్టుకొన నాకు త్రాణయేలేదు. నేనోడిపోతినె. అమ్మ నేనెట్లు బ్రదికియున్నానో అదె ఎరుగనే. తనువునిచ్చిన దేవుకుసురు నీడ్చుచునుండ ఉసురు పీల్చుచునుంటి, భోజనస్నానములు మొదలు నడచిన యట్లె నడువగా నే వాని అలవాటు కలిమితో ఒప్పి నడచుచునుంటి. ఒడలు మోయుచునుంటి, ఎందుకని ఎరుగకయె. ఒక్కొకట బ్రదుకుటీడుపు ఈచ్చు పద్ధతిని నిల్చి, అట్టులెచూచి, ఇది స్వప్నమేమొ అని తోచి అదరెదనమ్మ. ఏదియో బ్రదుకిద్ది, ఎవరో బ్రదుకుచునుండి, నేను చూచుచునుంటి నంచు తోచును నాకు అంబికా. ప్రాతదగు ఈ వాదు నొప్పి దినదినము కొంగ్రొత్తయై ఉపవనపుటశ్వత్థమవని హృదిని పగిల్చి వేరూని పెరిగినట్లు, నా ప్రాణమును చీల్చి పెరుగుచున్నదితల్లి. తాళజాలను, నేను తాళజాలను.

అంబి : అమ్మా, నాయాన, ఊరకుండుడు, రాహులుని ఆన, తాళగాజాలరన తాళజాలరుదేవి, మన బాధలనుచూచి నొచ్చువారల కొఱకు మనసు రాయిగ చేతునన అదియె తట్టుకొను. ఆ బాలకునిచూచి ఊరకొనుడు.

యశో : అంబికా, బాలకుని కని తృప్తిపడక యెవద తపింతు, నా ప్రేయసుని రూపు, నా ప్రేయసుని చూపు, నా మనోహరుని నడ– అన్ని ఇచ్చట కలవు. వీని పట్టినయపుడు అతడు లేనిది తలచి కుందెదను. అతడున్న కాలమున బాగుగా కనకపోతినే అంచు వెతపడుదు బాలకుని కనినచో తృప్తిపడ తెరువద్ది లేదయ్యెనాకు, అంబిక.

అంబి : అమ్మ, నొచ్చితిరి. నేనెరుగనా

యశో : వినుము అంబికా, నీ వెరుగ వెటులెరుగ గలరు వేరొకరు నా యీ నొప్పి? పతి నన్ను విడి వెడలిపోయినది. తెలిసిన క్షణములో నా మనసులోన పుట్టిన నొప్పివాడి వేడులు గీమును ముందు నింపినవి; నింపినవి నగరమును; ఉపవనోద్యానమును, నింపినవి సాగరపు కూపమును; ఆకసపు అంత తెలియని అంతరాళమును నింపినవి; సూర్యబింబము నుండి వెలిచిమ్మి పరతెంచు పసిడి కాంతుల నడుమ ఉక్కవుచు చేరినవి; జగమునకె సుప్రశాంతిని తెచ్చు శశికాంతి నా యెడద వెలుగనటు నా హృదయ మధ్యమున చీకట్ల కోటనే కట్టినది ఇన్నాళ్ళు ఇట్లు నను చుట్టుముట్టిన బాధ నిన్న నిశి మరల చెలరేగి నా ఆత్మనే ముంచినది.

అంబి : నా తల్లి నాయాన. ఏమిదేమిది మాట! ఎట్టి వేదన నేనియున మ్రింగికొనియుండు మీచేత ఇన్ని మాటలను పల్కించునెది? ఏమయ్యె? చెప్పండి. ఎదకు ధైర్యముతెండి.

యశో : (సమాధానపడి)
గతరాత్రి నేనొక్క కల కంటినే తల్లి; అందుచే ఇంత కళవళమునకు గుఱియైతి. చెప్పటకె నోరురాదు.

అంబి : ఏమమ్మ అయ్యది?

యశో : అది నా మనస్సునకమంగళము సూచించే. అందుచే తలచుటకు కూడ ఒప్పదు ప్రాణ మేమి కలయో! ఇంక ఏమేషవచ్చునో! మామగారిని నాడె అడిగితిని: నా పతిని వెం

డింతును; అతండెటనున్న అటనుందు. నాకాజ్ఞ ఇందనుచు అనాడె వేడితిని. వద్దనిరి. మ్రొక్కి వద్దంచు వేడుకొనిరి; బాలకుని కోసమై ఊరుకో, నీరాజు ఇచటికే రావచ్చు తాళమ్మ, అన్నారు; నావయస్సునుచూడు, నీనొప్పిలో నాకుభాగముండుట చూడు, ఓర్వవమ్మా, అనిరి; మనసు ధ్వని వేరొక్క మాట పలుకుచునుండె; పొమ్మతండుండుచోటికి; ఇచట నిల్వకుము; అతడుండు కాన నగరోపవన నందనము, అతడు లేనట్టి నగరము నీకు కాననము; జానకిని మరచితివ? సావిత్రి, దమయంతి, చంద్రమతి- వీరి మాటలు వినవ? నిల్వకుము; నిలువకుము ఇచ్చోట; నిలువకుము ఇచ్చోట. అనుచు చెప్పిన మనసు ధ్వనిని వినకయె నేను పెద్దలానతి మేరకే కాన నిలిచితిని; కానలో నిలిచి ఈ బాలకుని సాకితిని; వాడు పెరిగినది చూచితిని, వెనుకటి నొప్పి రవ మరచినట్లు తోచినది; ఇట్లుండగా మరతువెందుకటంచు మనసిట్లు చెలరేగి కలనుకాంచెను, అంబికా, కలను కాంచెను..

ఏమమ్మ ఆ కల?

అలించవలెనేమె? ఆలించి నావలెనే నీవును వణకవలెనా చెప్పెదను విను. నిన్నరాతిరి సుషుప్తిలో నేనొక్క తోటలో నడచుచున్నట్లుండ ఒక గొప్ప మట్టిసీడను, సొబగుతావులో, నిలబడితి నొక్క అరనిముసమ్ము, నాప్రక్క తరువొకటి ఊడవిడి ధవ్వరిగినదె, తల్లి. ఊడకను తమకాన తరువు కదలినదెరుగకే నిక్కడే మనసు నిల్పి కౌతుకముతో క్రౌంజిగుర్లు చూచి, మెయినిమిరి, ఆహా ఎంత బాగున్నదనుచు నుండగ, ఏమిటో అయ్యో; ఏమంచునేకాన; భయపడుచు ఆ ప్రక్క ఈ ప్రక్క చూచితిని; దూరమరిగిన చెట్టు ఒక చేయిచాచి, బుడుతనికి సైగనుచేసి, రమ్మంచు పిల్చుచుండెను. ఇటకు తిరిగితిని. లేమొక్క నను వీడి దానికడ కరిగెను హాయంచు అరచి నిద్దుర వీడి లేచితిని. బాలకుండు పరున్న పాన్పుదగ్గరకేగి వాడచట ఉండెనోలేదొ అని చూచితిని. మున్నొక్కపరి ఇట్టి స్వప్నమును నేకంటి. నిదురవీడి లేచితిని, ప్రాణపతి లేకుండె. నేడు. చూచినవేళ బాలుడుండుటే తెలిసి రేపు వచ్చునది రానీ నేడితని కంటినిదె సుకృతమంచు మెయినిమిరి అతడుండుకథ చెట్టు ఊడల కల తెరంగు కథకాదంచు మది నిశ్చయించి ఇచ్చోటనే కూర్చుంటి; వేగుజామున నుండి వాడు కనుమరుగగుటె మదికి భీతిని కలుగచేయు, ఏమయ్యెడినొ ? ఏమిచేయునొ ? కాన, నంబికా

: నా తల్లి, భీతి వదలండి; మన బాలకుడదెచ్చటికి పోడమ్మ.

: అహ, అంబిక, నాడు ప్రాణపతి నను వీడి ఎటకైన వెడలగా వచ్చునని నాడు నేనెరిగితినె? ఏ ఒక్కపనితోను నను వీడి వారు నడువనె లేదు. సత్యమిది. భోజనము, కేళి, విహరణమ్ము, శయనాసనము అన్ని సుఖములను, అన్నియు భోగభాగ్యముల నా సుఖము మొదటకని పిదప వారు సుఖింత్రు; నాఇష్టమడిగి దానికి సరిగ నడచెదరు. తుట్టతుదకెంత పెరిగినది ఆ స్నేహమ్ము! నా నుండి దీరికోరికలేవి తీరవో, ఏమొ అంచును నేను నాకు అది ఇది వలయునన్న మాటనెవీడి వారి ఇష్టమదేమొ ఊహించు స్థితికి విచ్చేసితిని. ఇట్లుండ మేఘములు లేని నింగిని పుట్టు పిడుగట్లు వచ్చె నా సుఖపుతుది; ఎండె ప్రేమపు చెలమ. శంకయే లేని బ్రదుకును విడి అదృశులై రీబ్రదుకు శూన్యమొనరించి రన్నిసుఖాల జతకు పిల్చినవారు ముక్తిసుఖమున కొకరె నడచిరమ్మా, నన్ను విడిచిమరుగైరి.

అంబి : మీ తోడ సంసారమును చేయుచును, బాలు చూచుచును, రాజ్యమును పాలించుచిచటనే ముక్తిసుఖమును పొంది సుఖియింప వారికి పుణ్యమ్ము లేదయ్యో.

యశో : ఉన్నదా నాకు? పుణ్యమా ఇది పిచ్చిదాన? వారిది పుణ్యమది వారుచూడనీ, నా పుణ్యమేమయ్యె ?

రాహు : (లోపలి నుండి) అమ్మా.

అంబి : మన బాబుగారమ్మ.

(రాహులుడను, శారికయు వత్తురు. యశోధర తొందర తొందరగా కనులు తుడిచికొనును.)

రాహు : అమ్మా. ఇచటకనవమ్మ ఇది ఎంత చక్కని పూవు! నీ కొఱకు నేనె ఏరుక తెచ్చినానమ్మ.

యశో : నా బాబు. ఔనుకద! ఎంత చక్కని పూవు! ఎంత సొగసుగ నున్న దీపూవు!

రాహు : దాని కను. ఆకు మరుగున దాగికొని వినంబడనట్లు నను పట్టుకో చూతమని చెప్పుచుండినది. నక్కిచూచుచు పట్టుకొందురో అనుకొంచు ఆటాడుచుండినది! అప్పుడు పట్టితిదాని.

యశో : భయపడుచు నున్న పూవును పట్టరాదన్న.

రాహు : నిజమైన భయముకాదమ్మ! భయపడినట్లు కనిపించు చాటకై దాగురింతలనాడు దొంగపువు. మనదు శారిక చెట్టుమరుగులో దాగికొని, 'హాహూ' అని పిలుచునటు పిలుచునిది. పట్టకుండిన కోపగించు కొనునోయమ్మ. ఏమమ్మ నీవుఏడ్చితివి? కన్నీరేల?

యశో : కన్నీర? అంబికా, కన్నదేమైనదో

అంబి : ఏమైనదో తల్లి. ధూళి పడియున్నదో?

రాహు : నీదు కన్నును ఎర్రగైనయది. ఇద్దరును ఏడ్చితిరి. అమ్మ, నీవేమి చింతింపకుము. మూన్నాళ్ళ కితము తాతయ్యనే అడిగి

తిని. వారు కాని అంచు చెప్పినారమ్మ. నాన్నగారిని పిలువ నేనె పోయెదనమ్మా.

యశో : (అదరిపడి) అంబికా విన్నావ? రెండవది పుణ్యమ్మ? నాడు ఫలియించె మొదటిది, నేడిదిప్పుడే ఫలియించు చున్నదింకొకటి. (సుతుని కౌగిలించుకొని) నాయన, వద్దు. మీ నాన్నగారిని పిల్చుట కేను పోయెదను. నీ వికట తాతకడ పాఠములు నేర్చుచును ఆటలాడుచు నాల్గు నాళ్ళుండ నేవత్తు. నా బాబు, నీ వరిగి పిలిచి వచ్చెదననకు.

రాహు : ఏలమ్మా భయపడెదు. నాన్న మనలనువీడి వెళ్ళిపోయిన యట్లు నేవెళ్ళిపోయెదను, తిరిగిరానని నీవుభయపడెదవేలమ్మ? నేనట్లు చేయనమ్మా! నీవు భయపడకు.

యశో : అంబికా, వెళ్ళిరేనికి విన్నపముసేయు. ఒక్కక్షణమిటకు దయసేయుదని చెప్పుము.

(అంబిక పోవును)

హా నాదు దుర్విధీ! కల నిక్కమైనది.

నిక్కమే కలయయ్యె, బ్రదుకయ్యెమృగతృష్ణ.

(అని పటము అడుగున తలపెట్టి దుఃఖించును రాహులుడు పూలను తీసుకొని పీఠము మీదచల్లును. తల్లిజడలో ఒకపూవు పెట్టి సొగసుచూచును. అప్పటికి రాజును, అంబికయువత్తురు.)

రాజు : ఇదిగో వచ్చితి నమ్మ.

యశో : (లేచి వచ్చి నమస్కరించి) పీఠమున కూర్చొనుడు. నేను పలుదినములుగ మిమ్ము వేడుచునుంటి. సోదరికిసుతనంచు చిన్ననాటనె నన్ను కొనివచ్చితిరి, సాకి కాపాడితిరి, ఇంటికోడలిగచేసి కొంటిరి, ఉద్ధరించితిరి. కలలోన కాంచనేరని సౌఖ్యములనేను మీ యంతిపురియందు పొంది సుఖియించితిని.

రాజు : మా యంతి పురియందు?

యశో : మన అంతిపురియందు. మీదు ఐశ్వర్యమున తృణమాత్రమును నాకు లేదనక నన్ను పరిపాలించి యున్నారు. పతి నిచ్చితిరి, జీవితపు దేవుడుగనుండ, పతిని మరియొక్కపరి ఇచ్చి రక్షించండి.

రాజు : ఏమి చేయగవలయు నందు?

యశో : మన చినబాబు నాయనను కొనితేర పోయెదను అని అడుగ మీరు ఒప్పితిరంట, నేను మిమ్ముల మునుపె వేడికొని యుంటి. నే వారికడకేగెదను వీని నిచ్చోటనే ఉంచుకొనుడు.

రాజు : అమ్మా, బాలకుడు నాయనను కొనితెత్తునని చెప్ప కేవల వినోదమున 'కావచ్చు' నన్నాను. మాకుమారుని పిలిచికొని రావలయునన్న వెళ్ళ చారులు లేర? బాలకుని పంపెదర?

రాహు : ఏమి తాతా! మునుపు 'కావచ్చు' నన్నవారిపుడు 'కిదా' అంచ చెప్పెదరు. పెద్దలు నాకొక్కమాట చెప్పుచు, తల్లి అడుగగా వేరొక్కమాట చెప్పెదర? నే వెళ్ళెదను. అమ్మ నేడేడ్చుచుండెను, నాన్నరాకున్న ఏడ్చుచునెఉండును. నేపోయి కొనివత్తు.

యశో : వింటిరా పిల్లవాడాడెడుమాట? నాకేమొ నిన్న కాంచిన ఒక్క కల మనస్సును కలచి ఉసురు పీల్చుచె కష్టమౌచు, జీవమ్మంత బెంతుగా మారినది. ఎండి వరుగైనది.

రాజు : అంబికచెప్పె కలమాట నాకపుడె. నిజముగా ఏర్పడినబాధ ఉండెనె ఉండ కలయొకటి వేరు నిను హింసించుచున్నయది.

యశో : నేడు రాతిరిపడును, ఇంకేమిచేయుదును, నిదురలో మును గంగ ఎట్టి స్వప్నపుమొసలి పట్టుకొనునో? ఇంక ఎంతవెతపడవలెనొ? అంచు ప్రాణములెల్ల భయముతో కలగెడిని నన్నుద్ధరించవలె (మోకరిల్లి నమస్కరించును)

రాజు : లెమ్మమ్మ! నాతల్లి, నీ దుఃఖమును నేనెరుంగనా? లేవమ్మ. (యశోధర లేచి కూర్చుండును) నీ వెరుగుదువుకదా నీ భర్త సన్న్యాసమును స్వీకరించెనని? నీవేగి ఆతనిని చూచుటది సరియైనదా?

యశో : పోయి అడిగెదను.

రాజు : సన్న్యాసి యగువాడు సతిని చూచెడిమాట సంప్రదాయవిరోధి.

యశో : పూర్వకాలపు గార్గి సన్న్యాసమున తనదుభర్తతో అడవులకు పోయినదటంచు విన్నాను నేనట్టులే సన్న్యాసమును స్వీకరించి పతికడకేగ...

రాజు : ఇపుడు నీవున్న విధమది కాదొ సన్న్యాసము?

యశో : ఆత్మనాథుడు సన్యసించినాడని తలచు సాధనా వేషమిది? నేడు నిజముగ నేను సన్న్యాసమును స్వీకరించి పతికడకేగ-

రాజు : పతి కడకేగెదరె సన్న్యాసమను కొనగదాని సన్న్యాసమను టెట్లగును నాతల్లి?

యశో : నాకు కలిగిన తెలివిలేమి తలచిన నాకె నవ్వువచ్చును, అట్లె ఏడ్పువచ్చును. ఇంక ఏమిచేయగవలెనొ తెలియ దెటునడువవలె? మీరానతీయండి. అటులనే నడచెదను.

రాజు : కొమరునికి చెప్పి పంపెద. మతని ఇష్టమును తెలిసి అట్టులె నడచెదము.

యశో : అట్లైకానిండు. నేడె చారుని పంపుడు.

రాజు : అంపెదను, ఎవరచట?

రాహు : తాత, నాన్నను చూడ ఎవరినో పంపెదర? నేపోయి వత్తు, నను పంపండి.

యశో : నాతండ్రి మొదట చారులుపోయి, వారి ఇష్టమునెరిగి, మరల రానిమ్ము. పిమ్మట నీవు పోవచ్చు.

రాహు : పిమ్మట నేపోవవలెనంట,పిమ్మట నేపోను. నేనిపుడేపోవలెను. మీకేమి? నాన్నగారిని చూచినారు, చూచెడి ఆశ అంతబలముగ లేదు. నే వారిని చూడలేదింకెన్ని దినములకు చూచుట? అమ్మా నీకు భయమింత వద్దమ్మ, తిరిగి వచ్చెదనమ్మ నిజముగా వచ్చెదను, అచటె నిలువను తల్లి, నను పంపుమమ్మ, నే వారి కొనివచ్చెదను. తాత, నను పంపండి నే మరలివచ్చెదను నాన్నగారిని చూడవలెనంచు, వారితోనుండి, మాటాడవలెనంచు నాకెన్నాళ్ళనుండియో మిక్కిలి ఆశ ఉన్నది తాత.

రాజు : కానిమ్ము ఊరకొనుమన్న.

యశో : కల నిజమయ్యె. కలలోన కన్నపులి నిజముగా ఎదురుపడి, ఇమ్ము నీ ప్రాణమ్ము నని అడుగుచున్న యది.

రాహు : అమ్మ, నే తిరిగి వత్తునొ లేదొ అని నీకు భయమున్న యెడల నా తోడ మన అంబికను పంపించవమ్మ. మేమిద్ద రము పోయెదము. నాయనను తప్పకయె పిలుచుకొని వచ్చె దము, ఒప్పుకొనవమ్మ.

రాజు : అంబిక.

అంబిక : స్వామి

రాజు : బాలకుడు పలికినది విన్నావ ? ఏమందు ?

అంబిక : విన్నాను. దేవి భయపడుచుండి, రీరెరుంగునని దేమి ?

రాజు : తల్లి, నీ వేమందు ? అంబిక జతలోన రాహులుని పంపించ ధైర్యమ్ము చేయవలె. ఏమి చెప్పుదు ?

యశో : నాకు ఏదియును తోచదు. వారి కనుపుణ్యమ్ము నాదు ఈ కన్నులకు ఉన్నదో లేదో నేనెరుగ. ఈ బాలకుడు తన తండ్రి చూడవలెనంచు ఆశించగా వద్దనుట తగినదా ? అని అంతరాత్మ కడు సందేహమున నున్న దంపుట తగినదంచు మీకు తోచిన యెడల పంపుడే వద్దనను.

రాహు : అమ్మ ఎంతటి మంచిదానవమ్మా, నీవు అంబికా, పదపోయి నాన్నగారిని వేగ ఇచ్చటికి పిలిచికొని వచ్చెదము. తాతయ్య. నే పోయి వత్తునా ? అమ్మ, మేమిద్దరము పోయి రావచ్చు నేమమ్మ.

యశో : 'ఆహా ! ఏమి ఉత్సాహమిది' పోయి రావయ్య, నా తండ్రి అన్నయ్య, నను మరువకన్న మీ నాన్న మనల మరచిరి, నాదు బ్రదుకంత వృథయయ్యె. వారు వీడినట్లీవు నా చేయి విడ వద్దు. పోయిరా, పోయిరా; అంబికా, తోడుండు; నన్ను మరువకు.

అంబి : తల్లి, నాయన, మరతునా ?

యశో : మరచినను తప్పు లేదది నాదు విధియందు.

రాజు : నాదు విధి చెడ్డదని ఎంచకుము నాతల్లి. నీరాజు నేడు లోకారాధ్యుడై నాడు. రాజ్యపాలన మన్న చిరుపెద్దరికము విడి జగతి జీవుల నుద్ధరించు పెదపెద్దరిక మందుకొని. రాజాధిరాజ బృందములచే సత్కారములు కొనుచు, చక్రాధిపతివోలె ఉన్నాడు. ఏల చింతింతువు నీ బాలకుడు నీదు ఈ పదిఏండ్ల తపమె రూపమ్మెత్తి నీ హృదీశుని పిలువ వెళ్లినటు చనినాడు. విధులెరిగి నడుపు సవనమున ఉద్గాతృతతి స్వరములో సొగసుగా పాడు మంత్రపుశక్తి దేవతల తెచ్చునటు మనదు ఈ బాలకుడు మానదు సిద్ధార్థుని విడువక తెచ్చియే తెచ్చు. రార, నా అన్నయ్య, తల్లి కభివందించు కడు దొడ్డ ప్రాణమయ్యా నీదు తల్లిది. కడు దొడ్డతపము, పుణ్యము. వీడొక్కనెడిముందు అట దీవెనలు కొనుము ఇటరమ్ము, మ్రొక్కుము. నీలో ఫలించనీ నీ పితల పుణ్యమ్ము, సిద్ధార్థు పిలుచుకొని వచ్చు పనికో నీవు సిద్ధార్థు డగునట్లు మరలు దీవించనీ.

(రాహులుడు వీరికి నమించును. తెరపడును).

స్థానము - 2

(శ్రావస్తిముందు జేతవనమునకు కొంతదూరమున రాహులుడు అంబిక, బుద్ధుని శిష్యుడు మానందుడు, ఒక సేవకుడు)

మానందుడు : అదియె శ్రావస్తి. అదె అదట నగరపు పెంపు విస్తారమై చిత్తరువులోని చిలుకవలె కనుపించు ఆ పచ్చపరసియే జేతవన. మచటనే మాగురువు, ముల్లోకముల గురువు బుద్ధగురువన్న పేరున సురల జ్ఞానమును భువిలోని మానవుల జ్ఞానముగ చేసిరె; స్వర్గమున పారి హరినందనము నభివృద్ధిచేసి, సురలను ముదితులను చేయు సురగంగ నిలకు పూర్వము భగీరథుడు

కొని వచ్చినటు మనుజులకు దుస్సాధ్యమైన జ్ఞానపుపేటి అమృతరసమును జనులముందు ప్రవహించుచున్నారు. గంగా మైదానముల వరిచేలు వీరి వాకుల పెరిగినట్టి ఎదదలచేల వోలె పచ్చనికావు: వడకుంది-గంగలో మునుకవేసినవారు వీరి మాటలు విన్న సంసారులట్లు సుఖపడరిచట ఎదలోని మలినములు తొలగినటులట తనువు శుచికాదు.

అంబి : బుద్ధగురువిపు డెచట నున్నారు?

మానందుడు : ఒకవార మిచట నుండిరి, ఇంక నొక్కవారము ఉండవచ్చును.

అంబి : వారి ఉపదేశమది వినెడి వారికి హితకరమ్మె?

మానందుడు : అమృతరసమటు హితము.

అంబి : బహుజనములిట్టులే దాని శంసించెదరు.

మానందుడు : ప్రణపొగడి చెప్పుమాటలు ఎడద మెప్పులకు అర్థమును చెప్పనేరవు; గురువు ఉపదేశ వాణిలోని అనంతగుణముల నొకంశమ్ము చూపనేరవు. లోకముల సర్వజ్ఞానములు ఒక్కచే జీవరత్నమున ఐక్యము చెందులీల కవిపించు అతని ప్రాణరస మూర్తి.

అంబి : ఇపుడు వెళ్లిన దొరకునే వారి దర్శనము?

మానందుడు : దొరకు. నిపుడిప్పుడే విశ్రాంతి కొని. లేచి గురుదేవు లేతెంచి, వనమధ్యమున నున్నవట తరువు క్రింద చేరిన జనుల దీవించి, వేదిమీదికిని వేంచేసి చెప్పెడి వారి నొప్పినంతయును విని ఓదార్చి, వినువారి సందేహములు తీర్చి, శాంతి నిడుచున్నారు.

అంబి : పుణ్యవంతులు జనులు మీరలా గురువరుల ముఖ్యశిష్యుల లోన ఒక్కరై ఉండవలె.

మానందుడు : శిష్యులను నేనొక్కడన వచ్చు. వారిలో ముఖ్యుడను మాత్రమ్ము కాను. మా గురుదేవు సన్నిధిని నిలుచు శిష్యుల లోన నా కన్న అల్పుడెవడును లేడు.

అంబి : వారి శిష్యులు ఇపుడు పలుచోట్ల నున్నారు కాదె ?

మానందుడు : కాశిని నాడు ధర్మచక్రము త్రిప్ప మొదలిడిన నాట గోలె ఐదేళ్ళలో మగధరాజ గృహమున నుండి పాటలీ గ్రామమ్ము, వైశాలి, బెలువమ్ము, గాంధారము, కుశినారము, గ్రామవామమ్ము, శ్రావస్తి, భోగగ్రామమ్ము, సాకేతమ్ము, కోశాంబి, చంపకము, కోటిగ్రామమ్ము, కోసల, మను ప్రియము, చాలకము, ఇత్యాది ఆర్యఋషి భూమిపై ఆ సేతుశీతగిరి వీరి వాణిని వినని వాడు లేనేలేడు.

అంబి : ఆ పుణ్యఫలము లేనిది మూడు నాడుకే ఏది ఆనాడు ?

అంబిక : ఉత్తరకోసలపునాడు.

మానందుడు : మీరచటినుండి వచ్చితిర ?

రాహులుడు : (అంబికకు మాత్రము) కను, మంబికా, మునమెవ్వ రన్నయది నేనె చెప్పెద, నీవు ఎవరికిని చెప్పవలదని వేడితిని కాదె ?

అంబి : చెప్పెదనె నా బాబు. (మానందునికి) మాది కోసలనాడు. గురుదేవులెపుడు మా నాడునకు రాలేదు. అందుచే అట్లుంది ఇప్పుడు మేమావనికి చననెంచెదము.

మానందుడు : నేను నచటికే చనవలెను. మీరు నాతోపాటు వచ్చుటకు మనసున్న సంతోషమున తీసికొనుపోదు, రారండు,

అంబి : అందుకై వందనము. ఏమిటందురు బాబు ?

రాహులు : పోవుదము. అంబికా, నేను వేడినది నీ మదిలోన పదల కయె మెదలవలె, ఏమి ?

(అందరును పోదురు)

స్థానము - 3

(జేతవనమున బుద్ధుడు కూర్చుండి ఉపదేశము చేయుచున్నాడు. దగ్గర అనందుడు సారిపుత్రుడు. ముందర ప్రక్క ఊరి జనులు కూర్చున్నారు.)

బుద్ధుడు : లోన వెలిగెడి వెలుగు సరిజేసికొనవలెను. పేదవానికి ఇంటి నిధి యొకటి దాచి ఇది ఎటనున్నదంచు చెప్పినరీతి, మనుజునికి అతనిలో నెలకొన్న బుద్ధి. కావున వాడు లోనున్న ఎఱుక సత్త్వప కొలది తెలిసికొని పెద్దదగు నటు చేయవలెను. తెలివిడి చెలమ అనుదినపు సుఖదుఃఖముల కలగి చెడుమండ సావధానముగ మానసము నిలబెట్టుచును కలతదిగినుమనట్లు, తలపు తెలియగునట్లు, శాంత చిత్తమును సాధించవలె. ఇదె తపము, ఇది ధర్మ, మిది యాత్ర, ఇదె ముక్తి, ఇది శుభము. ఈ స్థితిని సాధింప ఎల్లరును తొడగవలె.

మానందుడు : ఉపదేశమదెనదచు. ఒకచోట కూర్చొనుడు. ఇదియైన పిమ్మట ప్రసాదమును పంచెదరు; అపుడు ఆశీస్సు వేడగవచ్చు.

(అందరును కూర్చుందురు)

బుద్ధుడు: ఎల్లరును, ఎల్లరును ఈ స్థితిని పొంద యత్నించవలె. నేనెఱుగ, నల్పుడను, చిన్నవాడను, నాకు ఇది సాధ్యమా? అంచు సందేహ పడవద్దు; మంచి చేసెదనంచు యత్నించు నాతనికి విశ్వమే సాయముగ నిలబడును. సృష్టిలో శుభము సాధించెడి పరాశక్తి ఏదియో అది అట్టి మానవుని హృదయమున ఇల్లుకట్టి అతడు తలపని మహాకార్యముల నతనిచే నడపించు; అతని ఉద్ధారమ్ము చేసెడివి; లోకకళ్యాణమ్ము నతనితో సాధించు. నిలుచున్న స్థాయికిని తపపు శాంతిస్థాయికిని నడిమి దవ్వుకని భయపడకు: బాలకుడు అక్షరములను నేర్చునపుడు వేదాంతమది ఎంత దూరమొ, అంచు యోచించి ఫలమేమి? తపపు ఫలమక్షులకె కనబడదు, వ్యర్థోక్తియంచు విచికిత్సలో ఎదనడ్డగింపకుము, తీరమున నిలిచి కడలిని చూచు కన్నులకు ఒక కొంత దవ్వెజలముల వ్యాప్తికనిపించు. నావలోకూర్చుండి ముందు చనినట్లెల్ల అంతంత దవ్వె మరిమరి ఎదురు పడవచ్చు. సాధకుడు పూర్వంపుటజ్ఞానమును తలచి ఇంక సాధన లేదటంచు తలచుట వలదు. హిమగిరిని ఎక్కునతడక్షులను వెనుకగల బయలుపై పఱపి, ఆహా ఎంత ఎక్కితిని ఇంక ఎక్కెడి పనియెలేదు, అని ఫలమేమి? అతని చేతకు కాచుకొన్నపని హిమగిరిగ అతని వెన్నంటియే రాశిగా నిలిచినది. సాధించితే ననెడి అభిమానమును వద్దు, వద్దు నేనల్పుడను హీనభావము కూడ; వద్దు సాధన పథపుటునికిలో విచికిత్స; అతడతడు తనదు సద్వంస్థితిస్థాయిలో తన్నుతానే దిద్దుకొనగ యత్నించవలె. అల్పుడేనను వాడు తానె అగుపెద్దగా; తన పథమ్మును తానె కనుగొనును; కన్నయెడ సాధించుచునుచనును ముందు; చనిచని ముందు తాను ముక్తుండగును: అట్టులే ఆతాను లోకముల కల్యాణములకు ఆవాసమగు.

(అంబాపాలి సేవకులతో పండ్లుంచిన పళ్ళెములను మోయించుకొని వచ్చును).

అంబా : జయ బుద్ధగురుదేవ, జయశుద్ధ చారిత్ర, జయత్రిలోకాచార్య, జయజగన్మిత్ర, జయ పతితపావనా, జయము దీనావనా జయ దేశికేంద్ర, జయఉద్ధారకర్త జయత్రైభువనపూజ్య, జయధవళకీర్తి జయమునాగురునాథ, కారుణ్యమూర్తి.

(అని నమస్కరించును, ఫలపుష్పములు సమర్పించును)

బుద్ధుడు: రమ్మ, అంబాపాలి, రావమ్మ నాతల్లి, కూర్చునుము. నేను అల్పుడనన్న మానవుడు లోకముల కల్యాణములకు ఆవాసమగు. అవుడతడు తన్ను అల్పుడటంచు తిట్టుటకు తాను తనసొమ్ము కాదను నిజము తెలిసికొను. తానన్న దున్నయది, విశ్వంపు సొమ్ముగా, తనసొమ్ముగా కాదు. తానన్నసర్వమును విశ్వజీవనపు వటవృక్షపుటనంతతను ఏదోఒక కణముగా- వేరులో, తాటలో, కొమ్మలో, రెమ్మలో బోదెలో, ఆకులో. ఎచటనో ఒకట కలసియెఉండు, తాను తన నెఱిగియుండును, అట్లె మరచియుండును. నేను, నేను నేను నేను నాది ఇది నాది అది, అనెడి అతిమమతతడగు భ్రాంతిలోపడి జీవి ఈవృక్షశాఖ నగుపించు ప్రమోదటులగును. తనకడకు వచ్చిన రసమ్ము లభ్యోత పీల్చి తన చుట్టు రక్షగా, ఒక్కరేఖను గీచి, తల్లివృక్షపు బ్రదుకునుండి వేరయిపోయి, చెడిపోవు. తనకడకు పారివచ్చిన యట్టి జీవరసమున సుఖమునంది, అదిముందుచన నిచ్చుచో, తానుసుఖియై మాతృ తరుజీవితము వృద్ధియగునట్లు సాయమొనరించెడివి. లోక కళ్యాణమును సాధించు మానవుడు తానన్న దొకపట్టి మాయ అంచరాదు, తనుకాక మిగత అంతయు మాయ అనరాదు. సతముపెరుగుచున్న పెద్దదొక బ్రదుకులో తానిపుడు జనియించె ముందరేమవుదునో దాని ఆసతము పెరిగెడి బ్రదుకు ఎఱిగినది. ఈ క్షణములో ఇచట నాచేత శుభమగుత నానుండి నాల్గుమందికి సుఖమ్మగు గాత, నేనన్నట్లు సార్థకము కానిమ్మంచు సతతమును పరహితము సాధించుచుండవలె. స్వస్త్యస్తు, శుభమస్తు, శాంతిరస్తు.

(అనిచెప్పి రెండుక్షణములు ధ్యానమగ్నుడై ఉండును. అతను కన్నులు తెరచిన తరువాత)

అంబా : గురుదేవ, రేపు నాగేహమున కేతెంచి, మీ చరణధూళి దానిని పవిత్ర మొనర్చి దాసిదగు చిఱుత ఆతిథ్యమును తీసికొనినన్ను మన్నించవలెనని వేడ వచ్చితిని. దయచేసి ఇది చేయవలెను.

బుద్ధుడు: కానీ, తల్లి.

అంబా : నేను ధన్యను. ఇచట ఉన్నవారందరును రేపు గురువులతోడ ఏతెంచి మాయింట ఆతిథ్యమును కొనగవలెనంచు వేడెదను.

అందరు : అట్లె కానీ, తల్లి. అందరును వత్తుము.

(శిష్యుడొకడు కొన్నిపూలుతెచ్చి బుద్ధుని వద్దనిడును)

ఆనం : అందరును రండు, ప్రసాదము గైకొనుడు.

(ఒక్కొక్కరును వచ్చి ప్రసాదమును తీసికొందురు).

అంబి : మాదు సంగతినిపుడు మనవి చేయుటకగునె?

మానందుడు : రండు, మనవి ఒనర్తు. (బుద్ధునికి నమస్కరించి) గురుదేవు సన్నిధిని విన్నపము. ఉత్తరపు కోసలపు భువినుండి ఏగుదెంచిన వీరు గురుదేవుసన్నిధిని ఎదో మనవిచేయగ నపేక్షింత్రు.

బుద్ధుడు: సంతసము, ఉత్తరపు కోసలము మాదు పుట్టిననాడు శాక్యుల పరాక్రమపు సాముగరడి. అటనుండి వచ్చినారా ? కపిలవస్తువును కన్నారర? (రాహులుడువచ్చి 'నాన్నా' అని కౌగిలించికొని యేడ్చును) ఆహా! ఏమయ్య ఇది ? బాబు, ఏమైనది ? భయపడకు ఏమయ్యె? తల్లితండ్రులు లేర? (అంబిక వచ్చి నమస్కరించును). ఎవరు వీరు? అంబికా! నీవిటకు వచ్చితివ? ఈబాలకుం డెవరు ? సుతుడేమి? సంతసము. రానాన్న కూర్చుండు మంబికా, కూర్చొనుము ఆనంద, చూడు, నీయల్లు డరుదెంచినాడు.

ఆనం : రాహులా, రా బాబు. నను కౌగలించుకో. నీ వగుచు వచ్చి నాయెడద ఆశల నెల్ల నింపితివ?

అంబా : గురుదేవుల కొమరులా? నాతోడు ఇందు కేమనుమానము. మాదు దేవర రూపె ప్రతిగాగ కనిపించు. గురుదేవ నేనితని ముట్టవచ్చున?

బుద్ధుడు: ముట్టవలయు నంబాపాలి. శుద్ధ మానసులెల్లరితని తనుమన ములనుముట్టి ఇతనిని శుద్ధజీవనుని చేయండి.

(అందరును వచ్చి రాహులుని ముద్దుచేయుదురు. కొందరతని కాళ్లుముట్టి నమస్కరింతురు)

రాహు : నాకేల మ్రొక్కెదరు? బాలునికి, పెద్దలు? చాలు విడువుడు విడుడు. (అనివిడిపించుకొని) నాన్నగురుదేవుతో నే నొక్క మాట వేడగవచ్చితి.

ఆనం : ఏమది?

రాహు : తాతయ్యవేచినా, అమ్మఏడ్చుచునుండె. అందుచే మీరలూరికి వచ్చి, తాతయ్య నమ్మగారిని తృప్తిపరచవలె. ఇదిమీకు చెప్ప వలెనంచె మేమిచ్చటికి వచ్చియుంటిమి.

బుద్ధుడు: సరియైనమాట నాడితిబాబు, నిజమిద్ది. మీయూరి కింతలోప లనె రావలెనంచు యోచించుచుంటి, మిపుడద్దియే నీకోర్కె వచ్చెదము బాబు.

రాహు : బాపురె, అంబికా వినుము, నాన్న ఊరికి వచ్చుటకు ఒప్పిరి. నాన్నా రేపే పోవుదము నాన్నా.

బుద్ధుడు: రేపు? రేపు అంబాపాలి విందుకు పిలిచినారు. వత్తుమని చెప్పినామేము.

అంబా : గురుచరణాల నేను విన్నపము చేయవచ్చునన చేతు.

బుద్ధుడు: చెప్పు తల్లీ!

అంబా : మిమ్ము వీక్షించు నాశతో మీదుపితృదేవులును, రాణిగారును అచట కాచుకొని ఉన్న సమయాన నావిందుకై గురుదేవులిట ఉండవలె నంచు నే కోరుదున ? రేపే కపిలవస్తు దిశగాగ తిరుగునది. మీకు మనసెటులైన నాకు అది ఒప్పిదమె.

బుద్ధుడు: తల్లి, అంబాపాలి, మీదుయోచనబాగు, ఎఱుగుదును. కాని మాకంత తొందర నడత సరికాదు. రేపీవు భిక్షపెట్టుచున్నమేము కొనవలెను. పిమ్మట ముందుపయనమ్ము.

అంబా ; గురుదేవులిష్టమే మా ఇష్టము. మరి రేపు నాదు ఆతిథ్యమ్ము కైకొన్న సంతసము.

బుద్ధుడు: సరి. మేము ఎల్లుండి మా జన్మభూమివైపు వెళ్ళెదము.

అంబా : గురుదేవ, నేను మీతోకూడ వచ్చుటకనుజ్ఞ నీవలె,

బుద్ధుడు: దానికేమడ్డు ?

అంబా : గురువరులు బాల్యమును గడపినంతఃపురము, ఊరు, కన నాకాశ.

బుద్ధుడు: మిగుల సొగసగు ఊరు. సొగసైన అంతిపురి. సొగసైన ఉపవనము. గోమతీ సుస్వచ్ఛజలపుటంచన మెఱయు రంగు రంగుల సుందరా రామముల మధ్య నింగి ముద్దిడురీతి పెరిగిన సుసౌధముల బృందమా కపిలవస్తు.

అంబా : మీరు బాల్యమున బహు సుఖముగాగ పెరిగితిరేమొ ?

బుద్ధుడు· అవును. బహుసుఖముగాగ పెరిగితి. నేను ముదిమిలోజన్మించినట్టి ఏకైక పుత్రుండంచు తలిదండ్రు లధికవాత్సల్యమున పెంచిరి. సతము గొడుగునుపట్టి నిలుచు సేవకులెంద; రాటలో తోడుగా నుండు బాలకు రెందరు; పాఠములు స్నేహమున నేర్పు గురువరులెందరు; మాదు జాబాలిగారిని ఇపుడు తలచెదము-ఉపవనములో మేము నడచు దారుల్ప్రక్క కెందామరల సరసి, ఇచట, తెలిదామరల సరసి మరియొకచోట; ఇచ్చోట మల్లి, అట జాజి, చేమంతి, సంపెంగ. ఒకవైపులో చెట్ల వరుసల నడుమ తూరుపును కనుచున్న సూర్యుడుదయించి వచ్చెడు దివ్యతర దృశ్య; మింకొక్కప్రక్క అట్టులె వృక్షతతి మధ్య అతడు మునిగెడు ఉత్సవము. రాత్రి తిరిగిరా చందురుని ఒక్కొక్క క్షణము కురులధరించి చెల్లెండ్రు ముడువగా ఇచ్చునో అనునట్లు వరుసగా నిలుచున్న తరురాజి అంద మద్దిపొంగి ప్రవహించినది నా చుట్టు బాల్యమున. గీతమ్ము, సుఖభుక్తి, మధురోక్తి, సౌరభము; తనువు నొప్పిన కాననట్లు చూపిన ప్రేమ; జనులిట్టె సత్యవంతులు, పరాక్రమనిధులు, ధీరులు, ఉదారులును, గుణపక్షపాతులును. సౌందర్యసీమ పెరిగితి, నేను బాల్యమున; సౌందర్యవార్ధి తరగల తొట్టి నూగితిని.

అంబా : అట్టి సౌందర్యాబ్ధి ఈగు మంచమువీడి నావంటి దీనపతితులను కాపాడుటకు ఈ కష్టంపు బ్రదుకుకై మనసు వంచితిరా? గురుదేవ, కరుణాళు!

బుద్ధుడు: ఇపుడు నేనున్నచోటా సొగసుటంబుధిని లోగొన్న అర్ణవము. అచట ఒక్కెడపట్టి చేర్చినందమ్మునే ఇచట ఎల్లెడలందు పరచుకొన చూచితిని అచట ఎయ్యది కృతకమై కండ్ల వెలిగించెనది సహజభావమున కనుల మెప్పించునిట. అటనున్న సౌభాగ్యమంత ఇచ్చట కలదు. అచట మంటప; మిచట పృథులన్యగ్రోధపని, అచట సౌధము; అచట ఈ వియత్ప్రాసాదమచట ఉపవన; మిచట కాననము. ఏదియును అటనున్నదిట లేకలేదు; కనగలదె మది సృష్టిలో ఎల్లెడల ప్రాణులను ఏదియో ఒకటె సౌందర్య పర్యంకముంచుచునుండె.

(లిచ్ఛవి ధర్మమల్ల, దానమల్లులు ప్రవేశింతురు.)

ధర్మ : గురుదేవ, ప్రణతులివె

దాన : వందనము.

బుద్ధుడు: శుభమస్తు రండు; లిచ్ఛవినుండి ఎపుడు వచ్చితిరి?

ధర్మ : ఇపుడె. మాదు పితృదేవులేతెంచిరి.

బుద్ధుడు: సంతసము. సౌఖ్యముగ నున్నారా, మీ రెల్ల సౌఖ్యమా?

ధర్మ : గురుల ఆశీస్సుచే అందరును సౌఖ్యమే. రేపు ఇటనొక్క ఉత్సవము జరిపించెదము. గురువు లేతెంచి దానికి, మాదు ఆతిథ్యమును కొనవలెనటంచు వేడెదము.

బుద్ధుడు: రేపు మేము అంబాపాలి విందుకై ఒప్పితిమి. వేరెవటికిని రాను కాదు.

ధర్మ : మీరా వేంచేయవలెనంచు రాజునకు కడు ఆశ. మేము పిలుచుక వత్తుమను ధైర్యమున నిటకు వచ్చితిమి. ఇప్పు డంబాపాలి విందుకై మమ్ము చేవిడువరాదంచు ప్రార్థించెదము.

ఆనం : ధర్మమల్లప్రభూ! మీకు తెలియదె ఇద్ది. ఇపుడు మీ విందునకు వచ్చుచో మీ కొరకుతల్లి అంబాపాలిని దొరంగి నట్లగును. మీరలిది కోరువారలు కారు. గురుదేవులు ఏ ఉత్తరము చెప్పి పంపుదురు ప్రభువులకు.

బుద్ధుడు : రేపు అంబాపాలి విందునకు ప్రభువులును దయచేయవలెనంచు చెప్పుడు

అంబాపాలి : అంబాపాలి ఏనే వచ్చి విందునకు పిలిచెదను. నాగర స్త్రీ వచ్చి ప్రభువులను పిలిచుటయ? అని శంక చెందకుడు. ప్రభువుల ఐశ్వర్యమటు నాకు కలదైశ్వర్య, మది పావనము చెందె గురుదేవు కరుణచే,

(మల్లరాజు ప్రవేశించును)

మ.రా : గురువులకు వందనము.

బుద్ధుడు: శుభమస్తు దయసేయుడు

మ.రా : అబ్బాయి సరిగా నివేదించునో లేదో అంచు నేనే వచ్చితిని.

(కుమారుడు తండ్రి కంతయు తెలుపును)

బుద్ధుడు: చాల సంతసము.

మ.రా: రేపు అంబాపాలి విందుకే మేతెంతు. మెల్లుండి మా గృహమ్మును ఉద్ధరించవలె.

బుద్ధుడు: ఎల్లుండి మేము ఉత్తర రాష్ట్రదిశగాగ పయన మొనరించెదము. రేపు మీ రెల్లరును మా శిష్యురాలి ఇంటికి వచ్చు టాలించి ఆనందమైనయది. కృపతోడ రావలెను..

మ.రా: మీ సన్నిధానమున దొరకు అన్నమె అమృత, మెచట అది దొరకునో అద్దియే దేవళము. మీ పాదములు ముట్టి గురువన్న జీవునికి నాగర స్త్రీ హీన కాదు. రాష్ట్రాధిపతి గొప్పకాదు. ఏను పెద్దను అను అహంకార మతని ఆత్మను పొటమరించదు.

బుద్ధుడు: తమరివలె ఎగిరి నట్టిడులు మా సంఘపు శిఖామణులు. తమ సభతత్ మిగత ప్రజనదత దిద్దనిమ్ము ఇక బయలుదేరుదము.

అందరు : వందనము, వందనము.

(నమస్కరింతురు బుద్ధుడు ఆశీర్వదించును. తెరపడును)

స్థానము - 4

(కపిలవస్తు నగరపు ముందరి భాగమున ఒకతోపుదగ్గర దారిలో ఇద్దరు బ్రాహ్మణయువకులు వత్తురు).

కౌండి : ఈ మతము నేమంచు బిలువవలె?

కౌశి : ఏమంచు పిలువవలెనని నీదు అభిలాష ?

కౌండి : నాకిద్ది నాస్తిక్యమంచు తోచును. మనుజు కరణములు కనెడు తత్త్వములున్న వింక మిగతవి లేవు అనుమతము నాస్తిక్యమన్న సంశయమేమి?

కౌశి : అంతకా కింకేమి ఉన్నవని నీవందు?

కౌండి : నేనందు? నేను ఏమందు, నీవేమందు? నీవు సైతము నాస్తికునివోలె పలికెదవు.

కౌశి : ఆ మాట నా పిదపచర్చింతము. కరణములు కనరాని తత్త్వములు కలవంటి, వవి ఏమి?

కౌండి : దైవమ్ము? పరలోకము? నవమతపు గురువరులు దైవమ్ము లేదందు చెప్పిరే? కలదంచు ఎఱుకగలవారు చెప్పుదు, మిగత ప్రజకట్టి మాటవద్దనిరి. మీయోగ్యతకు చిక్కనటు వంటి తత్త్వపు చర్చకాలమును పుచ్చకుడు, వీలైనయంతతెలియుడు తెలియు తత్త్వమును ఆచరింపుడంద్రు. అందు తప్పేమి? పరలోకమా? మంచిది. అది ఉండగావచ్చు. కన్నవారలుదాని వర్ణించ నిండు, ప్రజఉన్న ఈలోకమున చక్కగా నడువనీ. అట ఏమొ ఏమొకలదు. ఏమేమోచేసెదము అన్న వ్యర్థభ్రాంతి ఇచట ఎదుటకల వస్తువుల మరచి, కర్తవ్యముల ప్రక్కకిడి మూర్ఖులుగ కాకండి అని అంద్రు. అది తప్పె?

కౌండి : అందులో ఏమిటో చెప్పెనే? నేనంచుభావించు మేము మీరెల్ల భావపుధార కాలమన్నది అనుభవపు కణములను కూర్చినట్టి హారము. నూరు కణములొకటొకటితో ఉండ అది పోగుగా కానిపించెడు రీతి ముత్తెములు సరముగా కూర్ప మౌక్తిక నాళము కొరవి త్రిప్పుచున్న ఒక అగ్నిచక్రమ్ము కనిపించు నట్లు, విడివిడి అనుభవపుకణము లెక్కవగ ఒకటొకటి కూడి ఏసీవగును, నేనన్నదేదియును లేదు. కాలము నిజము కాదంచు చెప్పిరట.

కౌశి : నాస్తిక్యమా ఇద్ది?

కౌండి : నాకిద్ది నాస్తిక్యము.

కౌశి : కన్నదున్నది అనును, కాననిది లేదనను. వీని నాస్తికుడంచు నీవు నిందింతు. కన్నట్టి దానిని పూర్తినమ్మకు, విమర్శింప నిజము తెలియునన్న కన్నట్టిదాని లేదనిచెప్పు హెచ్చరిక, ఈ ప్రాణి నాస్తికుండందు. బ్రహ్మయె అరుగుదెంచినను నీవు మెచ్చవు.

కౌండి : జాబాలిగా రీతనికి బాల్యమున పాఠములు చెప్పిరట ? అవునేమి ?

కౌశి : అట్టులని వింటి. వీరలద్దైన ఉపదేశమున వారిద్దైన వాద చ్ఛాయ కనిపించు.

కౌండి : ఇంకేమి ? అందుచే యితనిదగు వాదమ్ము నాస్తిక్యవాద మని తెలియదా ?

కౌశి : సోదరా! నీవంటి పండితులు వాలమ్ముకని ఎలుక ఇలులుండు ననుదాని గ్రహింత్రు. నేనట్టి మార్జాలమును కాను. రా, పోదము పెద్దలను తెగడుటకు మరికొంత కాలమ్ము చననిమ్ము.

కౌండి : సరిపొమ్ము, నీదుమాటలక్షేమి? (అనుచు ముందుకు పోదురు)

(ఒక ముసలిది, ఒకయువతి, ఆమె చిట్టికొడుకును వత్తురు)

ముసలిది: ఏమి ముఖమే అమ్మా, ఏమిటాశాంతి ! ఎంత గంభీర భావము ! ఆడిన మాట్ల పాలలో తేనియలు కలిపినటు మిగ రుచి! మా యప్ప యెంతతపమునుచేసి ఈ ఎఱుక సాంధించెన రాచకొమరుడై యున్నతడు సర్వముత్యజించి, కానల తన కారింప జ్ఞానము లభించుటే మాశ్చర్యము.

యువతి: ఆకళ్ళ ఏమి కనికరమమ్మ! ఎదుట కూర్చునట్టి ఒకవే మందిలో ఎవ్వరిని విడనట్లు ఒక చూపులోనె చేర్చుకొని మీ దరును నావారు, నేను మీవాడ ననియెడు రీతి అందరిని కొ నార్లు. నాకు వీరిని చూచి లేవయసులో చూచి మరచిన సహ దరుడొక్కండు తోచెను చాల సత్యవంతులుగావీరు.

పిల్ల : అమ్మ అచటికి వారు అరుదెంచికద అపుడు, నీవున భుజముమీదకి ఎత్తుకున్నపుడు వారునను కనుగొంచునవ్విరమ

యువతి: ఆహా! నిజముగా?

పిల్ల : నిజముగా! వారటకు వచ్చిరే అప్పుడు మనమున్నదిశ క గొనిరి. నేను అందరితోకూడ నమస్కారమంటి అందుకునవ్వి ఎంతటి మంచివారమ్మవారు.

(ముందుకు పోదురు. భారద్వాజుడు, వశిష్ఠుడు, గౌతముడు వత్తురు).

భార : మన ఎదుటపుట్టి మన ఎదుటపెరిగిన వారలెల్ల చౌకగ మన మూఢులను దినమరుగుదెంచె. ఆదియెలేని ఆ సనాతన ధర మును తప్పులను వెదకి చూపించు విషమడియ వచ్చినది పరమాత్మ అవతారమనిపించు రామునికి జన్మనిచ్చినభూమి ఈ కోసలమున కార్యుల ధర్మమును తిట్టి, అతడు మానవుడన నీచవాక్కను పల్కి నవ్వగతిపట్టి, బాలకబాలికలు గురు పీఠముల నెక్కిరి. ఆతని సింహపీఠి విడి ధర్మదేవతపోర పాతాళదిశకు.

గౌత : భారద్వాజ ఎందుకలిగెదవిట్లు ? అచ్చటను నీవిట్లుకోపము పలికి వాదపుస్థాయి మరచితివి, సత్యసంస్థాపనకు కోపమొ ఆయుధము? తట్టుకో మృదులోక్తి నన్నియునుసరియగును.

భార : తట్టుకొనగ కొలంది జనులకగు, నాక్షేమొ మన ధర్మనిందకు చీల్చవలె కనిపించు.

వాసి : ధర్మమును తిట్టినదదేద? సిద్ధార్థునికి మనదు జాబాలిగా వచస్సుగొప్పదై దానినాతండు కొనసాగించె. అంతలోఏమయ్యె కొన్నాళ్ళకెరుగు.

భార : మరిఅంతలో ఇప్పుడే ప్రాత్యమనిపించు కోసలభూమి కులమ చెడి భ్రష్టమై బురదలో కూలిపడు. అడవి జనుశ్రే వీరి శిష్యతతి

వెలయాంధ్రుడు వీరలకు విందులిచ్చెదరు, అంత్యజులెల్ల ఈతనికి ఉత్తములు ఉత్తముల సరిసములు, లేకున్న ఉత్తములకన్న ఇంచుక మెఱుగు. ఎట్టులోర్తును నేను ఈ ధర్మనాశమును? ఈ అధర్మోద్ధార కార్యమును? వాశిష్ఠ! నీవిట్టు లూరకుండిన ధర్మమెటునిలుచు ?

వాశి : నీదు ధర్మోత్సాహ మద్ది నాలోపుట్టకున్న నేనెటు పోరుదును? నాకు అనిపించు నీవు ధర్మమున కపచారమును తలతువని.

భార : నేను ధర్మమున కపచారమును తలచితినా? అదిఎట్లు?

వాశి : చూడు ధర్మమును నేనును నీవు బ్రదికించెదమటన్న ధర్మ మన్నది ఎంత అల్పమయ్యెను? మనదు సిద్ధార్థుడంత్యజుల నిక రము చూపింప ధర్మనాశనమైన ఆ ధర్మ మెట్టిధర్మము? నాదు మాటవినుము. జాగ్రత్తగావిచారించు, ధర్మముపెంచు, దేవునవ తారముగ ఆ రామచంద్రముని పతితపావను డంచు మనమెపొగ డెదముకదా? పతితులను ముట్టి పావనమొనరు చాత్మబాల మీనాకు, నీకులేదనుము. బలమున్నతఁడు వారినుచ్ఛారము చేయ యత్నించుటను ధర్మపు విరోధమననేలా?

భార : గౌతమా ! నీవేమిటందు ?

గౌత : భారద్వాజ ఎఱిగిన వారు ఏది చెప్పెదరో అద్దాని వినెదను నేను. మనవారి ధర్మమిది. ధర్మమ్ము, ధర్మమని ఎద్దాని అందుమో అది జగతి ధరియించె. ఒక్కరిద్దరి నుడుల నడల ఆ ధర్మమ్ము చెడిపోవునే ? సర్వము ధరించి పట్టుకొను ధర్మ మెయ్యదటంచు ఎరుగవలె. నన్నచో తాల్మితో ఎల్లరాంతర్య మున మెదలాడు ధర్మంపు టడుగు చప్పుడును విననేవలెను. మనదు హృదయములలో మెదలునో అది అంచు ఒంటరిగ నాలించి, ఇద్దానిలో దాని అద్దానిలో దీని సమరసముగా చేసి, ధర్మ పదగతి ననుసరించి ఊహించవలె. తత్త్వపు విచారణపు మొదటనే అలుగుచో ఉద్వేగజన్య అల్లోల కల్లోలముల ధర్మ దేవత మృదుల చరణ రణితపు సన్న ఎఱుక పడదెడదకును. ధర్మమ్ము పలునోళ్ల మాటాడు, కడుదవ్వుపయనించు, పలు వేళలందు కన్నులను మరపించు, సైకతముపై గాలి అడుగుల గుర్తు కనుపించునట్లుగా ధర్మంపు బెరుక సూక్ష్మము. తాల్మి ఉండవలె. ధర్మ రక్షకులైన వారలకు, మనకెల్ల.

(అనుచు ముందుకు పోదురు. ఇద్దరు పిల్లవాండ్రు వత్తురు)

ఒకడు : నాకు చూడెంత చక్కెర,

ఇంకొకడు: చూడు నా కెంత.

ఒకడు : నా కెక్కువ

ఇంకొకడు : నాకెక్కువ

ఒకడు : నాకే ఎక్కువ

ఇంకొకడు : నాకెక్కువనుచున్న ఎదురు మాటాడెదవ ? రా, నీకు ఇచ్చెదను.

ఒకడు : ధైర్యమ్ముండిన ఇమ్ము. చూచెదను. ఇచ్చినంత వెనక్కు కైకొందు.

(ఇద్దరును కొట్లాడుదురు. జాబాలి, ధనపాలుడు వత్తురు)

జాబాలి : ఒరె ఒరే ఎందుకి కొట్లాట ?

ఇంకొ : చూడు వీడు.

ధన : వాడేమి ? నినుకూడా చూచితిని. ఏమి ఇది ?

ఇంకొ : నాదు చక్కెర ఎక్కువంటి, నాయది ఎక్కువంచు వాడనె, ఎవ్వరిది ఎక్కువో చూతమంచు కొట్లాడితిమి

జాబాలి : మంచిదయ్యెను బాబు దీనికింతల్లరియా ?

ఒకడు : ఇద్ది అల్లరి ఏమి ? అచట పెద్దలు మీరు చేసితిరె అల్లరి ? దాని నడిగెడు వారు లేరా ?

ధన : ఒరె ఒరె దుష్ట , ఎంత మాటలుర !

ఇంకొ : (వీరిని బాగుగా చూచి) తాతయ్య జాబాలిరా, అయ్యో తప్పయ్యె, మన్నించండి. పదరయిక, (అని బాలురు వెళ్ళి పోదురు జాబాలి, ధనపాలుడు బాటప్రక్క రాతిమంచ మొక దాని మీద కూర్చుందురు)

జాబాలి: చురుకైన బాలకులు

ధన : అసాధ్యులు.

జాబాలి: బాలకుడు సత్యమునె వచియించె. మనము పెద్దలమచట చర్చ చేసిన దిట్లె అయ్యె. ధర్మము నాదె. నాదె ధర్మ మటంచు ఎదదాని దాచి ఇది గొప్పదేదంచు యుద్ధము చేసినాము కదా! ఏమున్నదో చూప మేమున్నదో చూచి తెలియమూరక రగడ చేయగా దొడగెదము. మానవుని మాటే ఇట్లెనీయది. ధర్మ మును ఎదుట నిడి దాని పేరిటను కొట్లాడెదము. ధర్మమ్ము గొప్పదని చూపింతునని చెప్పి నేను గొప్ప అటంచు చూపించు కోసమై వదరు బోతులు కదనరంగమున దూకెదము. దేవునికి అర్పణము, బోనమన్నది మనకు అనునట్లు ఈ యెల్ల జగ దమును ఒక నెపమె ధర్మమ్మును గుఱించి, నిక్కముగా కన్నచో మన గర్వతృప్తికై రూపమ్ము దాల్చినది. ఇందు

వలననె మనదు వేదోద్భవమైన జ్ఞానాపగా సర్వస్వతి స్వల్ప కాలమున శాస్త్రముల మరు భూమిలో దారి తెలియకయె వాదమున నింకి కన్నులనుండి మరుగయ్యె.

ధన : గురువర్యా వీరు మీనుండి నేర్చిన దానికన్న హెచ్చేమి నేర్చిరి ? ఏమి చెప్పెదరు ?

జాబాలి: నేర్చినది, చెప్పనది హెచ్చున్నదా? అనకు. హెచ్చుగలదు. నిజమ్ము. ఐన ఇది వీరిదౌ గొప్పలో ముఖ్యమ్ము కాదు. ఈతనిలోని గొప్పఏమన? బ్రదుకుదారి. నాకడనేర్చె, నిజము; నేర్చినది విడ, దది బ్రదుకులో తెచ్చె; ఇల్లువాకిలి వీడి దేశమున చరియించె. గురువులగు ఆలామకాలాములను చేరి ఉపదేశమును పొంది బ్రదుకులోనికి దించె. రామగురు శిష్యుడగు ఉద్దాకులను చేరి వారు చెప్పినది విని బ్రదుకులో వీక్షించె. తరువాత పెక్కేండ్లు వనరాజి జీవించి, ధ్యానమున నిలుచుండె; సత్యమును తిలకించె. కనుగొన్న సత్యమును కార్యగత మొనరించె : జగతికిని చెప్పె. వీణియ తంతి సుస్వరము నిచ్చుటకు దాని నతిగా బిగించగరాదు, కడువదులుగా చేయగారాదు. అందుమే అమధ్య పథమితని ఉపదేశమున ముఖ్య, మిదె ఇతని నిజయపథ; మిదె ఇతని గొప్ప, బాల్యమును తలచినను గురువనును ఈతండు; ఇతడు నా గురువంచు నాకు ఎదలో తెలియు.

ధన : వీరి ఉపదేశమున మీదు ఉపదేశమునకన్న ముందడుగేమి ?

జాబాలి: అది ఎఱుగుటతికష్టము. ఆదిగా దేవుడను తత్త్వమ్మును గుఱించి; రెండవదిగాగ బ్రత్యక్షమున కర్మమ్ము ఏమనుట గూర్చి; మూడవదిగా ఏమన్న లోకముల కళ్యాణ సూత్రమున నెలకొన్న నొప్పి చావుల నల్లమణులను సమర్థించు రీతిని గుఱించి; - ఈ మూడు విషయములలో ఇతని ఉపదేశమ్ము మనవారి ఉపదేశముకన్న ముందుచనె. రామాయణపు కాలమందు మన పెద్దలు రచించిన మహత్తత్త్వ సౌధమున కిట్టు శుభ హేమకలశమ్ము నిడె.

(నలుగురు జనులు వత్తురు)

జనులు : జయ బుద్ధగురుదేవ, జయశుద్ధ చారిత్ర

(అని పాడుచు పోదురు. వీరును వారితో ముందుకు పోదురు)

[స శే షం]

నేనే నా మినీకవిత !?

శ్రీ కోట సుందరరామశర్మ

1\. నాని పోయింది జీవితం,
కాని రాదాయె సాయితం;
మాడిపోలేదు కాయితం
కావక్షరాలు ధూళితం.


2\. లోకం ! ఆప్లావితం
ఔదువా విదారితం ?
దివి నక్షత్రాంకితం,
భువి అక్షాత్త్రాంకితం—
ఎవ్వరికిక అంకితం ?

3\. నేనే ఒక వచనకవిత
లేదా నేతప్ప పతిత ?
చూశావా, ఓ సవిత ?

4\. పరమశివుని ఢణం ఢమిత
ఏ రణరవ విషమ మిళిత ?
ఏ విద్యుత్కిరణ కవిత—
జంత్రగాత్ర ధిక్ కబళిత ?
నా ద్వారా నిరర్గళిత
ఔతే అదే నాకు పవిత.

5\. ప్రశ్నార్థక ముపనిషత్తు :
ఎక్కడున్నదో సత్తు ?
పూర్వులదా నా సొత్తు ?
ఎందరి కది పెన్‌మత్తు ?
తెలిసేనా కిమ్మత్తు ?
ఏగారడి గమ్మత్తు ?

6\. మినీకవిత అత్యల్పం;
సాగదీసినా స్వల్పం,
పరిమ్లాన సుమకల్పం.



అసురసంధ్య

లల్లాదేవి

"కుమారీ! గడచివచ్చిన దారి రవంత అయినా లేదు. అప్పుడే యింతగా అలసినావేమి? కుసుమపేశలమయిన నీ మృదుల పాదాలు అపుడే వసివాడుతున్నాయి. నిన్నింతగా నొప్పించిన వృద్ధుడు క్షంతవ్యుడు" అన్నాడతడు. ఆమె తలదించి తన పాదాలవంక చూచుకుంది. అవి కింసుక పుష్పాలవలె అయినాయి. నిన్న మొన్నటి దాకా పసిదనమే రూపెత్తినట్లున్న ఆమె నిప్పుడు యౌవనపు పసదనాలు ఆక్రమించినాయి.

ఆమె సువిశాల సుందర నయనాంచలాలు వజ్రాలలో తాపిన ఇంద్ర నీలాలను తలపింపచేస్తున్నాయి. పెదవులు పద్మరాగ వర్ణంలో తరళాయిత మవుతున్నాయి. పలువరుస మంచిముత్యాల వేరులా బారులు తీరింది.

చెంపలు యౌవనపు నిగారింపుతో బద్దారినాయి. మందార పూరేకులు చిదిమి చిత్రీకరించినట్లున్న చెంపలు! వికసిత సహస్రదళ పద్మంలా ఉన్న మోము.

తలమీదినించి జారిన ముంగురులు వికసితరాజీవాన్ని ఆశించి, ఆశ్రయించి సభ తీర్చిన తుమ్మెదల బారులా అనిపిస్తోంది. అందాలన్నీ ఆ ముద్దుగుమ్మనే ఆశ్రయించినట్లున్నాయి.

మార్గాయాసం కావటంనించి ముఖం రవంత నల్లనవుతోంది. కనురెప్పలు అలసటతో వ్రాలుతున్నాయి.

తండ్రి మార్గాయాసం గురించి ప్రస్తావించగానే ఉన్నచోటున నిలిచిపోయిందామె. ఆయాసంనించి వక్షస్సు ఎగసి ఎగసి పడుతోంది.

"తండ్రీ నేనింక ముందుకు సాగిరాలేను. మీరు రవంతసేపు ఈ వృక్షఛ్ఛాయ నాశ్రయించి అలసట తీర్చుకొనండి. ఎక్కడయినా జలధారలను అన్వేషించి దాహశాంతి కావించుకొనండి. నే నిలా అంటున్నది నా కోసమని భావించకండి. నా ఆలోచన మీగురించి మాత్రమే.

మీరు వృద్ధులయినారు. శరీరంలో జవసత్వా లుడుగుతున్నా యని నాకుతెలియదా? కాలం నిర్ణయించే ధర్మాలను అనుసరించి మీ శరీర శక్తులువెనుక తట్టుపట్టినాయి.

ఎందుకు వచ్చిన ప్రయాణమిది? ఈవయసున ఇంతప్రయాసకు ఓర్చి ఈపయనం చేయకున్న ఏమికాగలదు?" అని ప్రశ్నించింది. కుమార్తె.

ఆమాటలు తండ్రికి నవ్వుతెప్పించినాయి.

"అమ్మా! కైకసీ! నేను కొన్నిదశాబ్దాలుగా నాగభూములలో (దండకారణ్యం దక్షిణంగా దూరప్రాంతాలు) తలదాచుకున్నది నీకు తెలియదా?

ఇప్పుడాచోటు వదలి ఎగువ భారతభూములకు ఎక్కివచ్చే కారణమే నీకు తెలియదుతల్లీ! ఇది నాచివరిప్రయాణం!

ఈ పయనంలో నా ఆశయసాధన సంపూర్తి అయితే నాకు మనశ్శాంతి చేకూరకలదు. మండేకొలిమిలా రగులుతున్న మనోవ్యథను బహుకాలం భరించినాను తల్లీ!

ఇపుడు సమయం ఆసన్నమయింది. నా బ్రతుకు అర్థాలు నేను మనోగతంగా పదిలపరుచుకున్న ఆశయాలు నీనించి నెరవేరనున్నాయి తల్లీ! అందుకే అధిక ప్రయాస అయినా ఈపయనం అనివార్యం అని సమాధానం చెప్పాడుఅతడు. కైకసి ఆలోచనలో పడింద.

ఆమె సువిశాల సుందరనయనాలు అర్ధనిమీలితాలై రెప్పల మాటుకి ఒదుగుతున్నాయి. కుమార్తెలో ఆలోచనలు అంకురించినాయని గమనించినాడు తండ్రి.

అతడి పేరు సుమాలి.

జరాభారంతో కృంగి వొంగిపోతున్న శరీరమాతనిది. బహు వర్షాల అనుభవాలతో పండిపలితమయిన కేశపాశాలను కలబందనారతో కట్టడి చేసుకున్నాడు.

చూపులు సూక్ష్మీకరింపబడి ఉన్నాయి. నుదుటిమీద అమరిక అయిన మూడుముడుతలమధ్యఅనుభవాలు అగాధాలవలెకన్పిస్తున్నాయి. రెప్పలు జ్ఞాపకాల బరువుతో అవనతం అవుతున్నాయి. కాలమనే అమోఘమైనశక్తి శరీరాన్ని శక్తిహీనంగామార్చి నా మనసు మాత్రం మామూలుగా ఉన్నదని పిస్తోంది.

"తండ్రీ! ఉజ్వలమై స్ఫూర్తినిండిన మీ మాటలు ఒకఅపురూపమయిన ఆశయానికి అంకితమయినారన్న అంశాన్ని నిరూపిస్తున్నాయి. అదేమిటో తెలుసుకునేందుకు మీ తనయనైన నేను తగుదాననుకానా?" అని అడిగిందామె. ఆ కంఠస్వరం ఎంతో ఆసక్తితోను శ్రద్ధాపూర్వకంగానూ ధ్వనిస్తోంది. తండ్రి అయిన సుమాలి రవంత కన్ను మొగిచాడు. ఏ అంశాన్ని తన జీవితాశయంగా మలచుకుని దానికి అంకితమై ఇంతకాలం బురదనేలల్లో బ్రతుకువెళ్ళదీశాడో ఆ అంశాన్ని కుమారికి నివేదించవలసిన సుముహూర్తం ఇప్పుడాసన్నమయింది. అది అయనకి అనిర్వచనీయమైన ఆనందం కలిగిస్తోంది.

ఈ కుమారివల్లనే తన ఆశయం నెరవేరాలి. తనకు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాలి. తనజాతికి జరిగిన అన్యాయానికి తగిన సమాధానం చెప్పితీరాలి. అందుకు తానురూపొందించిన క్షేత్రమే ఈ కైకసి!

ఇంక యిప్పుడామెకు అన్ని సంగతులూచెప్పి మానసికంగా ఆమెను ఈ చారిత్రక సమరానికి సమాయత్తురాలిని చేయాలి.

అతడు ఒక వృక్షచ్ఛాయకు కుమారి సుకుమారి అయిన కైకసిని నడిపించాడు.

అతని కనులముందు గతం కదులాడుతోంది. అతనిముఖంమీద నీలినీడలు తారాడుతున్నాయి. చెప్పవలసినది ప్రారంభించాడు.

కైకసి శ్రద్ధాళువు అయి తండ్రి మాటలు వినసాగింది. ఆమెకు తండ్రి ఒక్కడే గురువు.

"అమ్మా! నా మనసుని గాయపరచిన ఈ అనుభవం నాకు ఎదురు అయి బహుకాలమయింది. నా మనసులో మండిన మంటల్ని కాలం చల్లార్చలేదు.

ఒకప్పుడు మనజాతి ఈ ఎగువప్రాంతాలలో నిశ్చింతగా కాలం వెళ్ళమార్చేది. వ్యవసాయం, వేట, వృత్తులుగా, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మా ఊపిరులుగా జీవించేవాళ్ళం

అప్పట్లోమాకు దండకారణ్యం ఆవల ఉన్నయావత్తూ జంబూ ద్వీపంలోనూ ఎవరూ విరోధులులేరు. కాని హిమావర్తం ప్రాంతాలలోని భూమిపతులు దండకారణ్యందాకా విస్తరించారు.

అదికారణంగా వారితోమాకు వైరం ప్రాప్తమయింది. నేను మనజాతికి నాయకత్వం వహించినానుతల్లీ! వారందరినీ పారద్రోలినాను

ఆర్యావర్తపు రాజులకు అది అవమానమయింది. వారంతా హిమావర్తమనే మంచుమల ప్రాంతాలలో ఉన్నరాజులను అండదండల కోసం ఆశ్రయించారు.

వారిలో పరాజయమన్నది ఎరుగని సర్వశక్తి సంపన్నుడయిన విష్ణువు వారికి అభయమిచ్చినాడు. ఆతడు నామీదికి దండెత్తి వచ్చాడు.

నేను దండకారణ్యానికి దిగువున దూరప్రాంతాలలో ఉన్ననా భూమికి తరిమివేయబడినాను. అది మొదలుగా నాలో ప్రతీకార జ్వాలలు రగిలినాయి. ఇప్పుడు సమయం ఆసన్నమయింది.

అందుకే నిన్ను తోడ్కొని వచ్చాను" అంటూ తనలో రగులుతున్న ప్రతీకార వాంఛకు కారణం వివరించినాడు సుమాలి. అధికంగా కలిగిన ఆయాసం నించి రవంత స్వస్థుడయేందుకు మాట్లాడడం ఆపివేశాడు.

"తండ్రీ! నాకు మీరు యుద్ధకళ నేర్పించలేదు. వీర విద్యలలో నైపుణ్యం నాకు లేదు. మీకు కలిగిన తలవొంపుకూ, మన జాతి కలిగిన నష్టానికి ప్రతీకారం నే నెలా తీర్చగలను" అని అడిగింది కైకసి.

సుమాలి ఆమెకు కర్తవ్యం బోధించాడు.

"అమ్మా! ఆర్యావర్తపు రాజులంతా యుద్ధ విద్యా విశారదులు వారికి విజ్ఞానముంది. వేదాలున్నాయి. అవి మనకు లేవు. అందునించి మన సంతతి వారి చేతిలో పరాభూతమవుతోంది.

దీనికి నేనొక ప్రతి క్రియను ఆలోచించాను. వేద విదులైన మౌనులు ఈ నిర్జనమయిన దండకారణ్య ప్రాంతాలలో తిరిగాడు తుంటారు. వారినించి వేద ప్రభావితమైన బీజాలను మన క్షేత్రాల లోకి తీసుకురావాలి.

అప్పుడు మనలో ఆర్యావర్తపు రాజులను జయించ గలిగిన ఉద్ధతుడు జన్మిస్తాడు. మనకు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చు కునేందుకు యింతకుమించిన మంచి దారిలేదు" అని చెప్పాడు సుమాలి.

సుకుమారి అయిన కైకసి తండ్రి ఆశయ సాధనకు క్షేత్ర వతి అయిన తాను వేదిక అయేందుకు మనసా వాచా కర్మణా సంసిద్ధరాలు అయింది.

"అలాగే నాన్నగారూ !" అంది తల దింపుకుని.

* * *

అది పులస్త్యుని కుమారుడయిన విశ్రవసు పర్ణశాల ! అది సుందర నందనవనమే! అందాల బృందావనమే! ప్రశాంతత ఆ చోటనే పుట్టింది.

అతడు సుందరుడు, శాంతుడు; విజ్ఞానపు వెలుగుతో తరశించే నేత్రాలు ఆ మూర్తివి. పద్మాసనంవేసి భృకుటిలో చూపు లగ్నంచేసి నాడంటే దివ్య లోకాలను దర్శించగల పవిత్ర మూర్తి అతడు. తేజోబిందువులు, జ్ఞాన బిందువులు ఆతని మనసు వాకిళ్ళముంగిటనే తారాడుతుంటాయి.

ఆ పవిత్రమూర్తి ఆశ్రమ ప్రాంగణంలోకి ప్రవేశించినారు కుమారి కైకసి, తండ్రి సుమాలి.

రుచిరమైన చిరునవ్వులు చిలకరిస్తూ అమృతం పంచియిచ్చేం దుకు అమరులను మోహిని ఆహ్వానించినట్లుగా ఆహ్వానించాడు విశ్రవసు.

అతిథి మర్యాదలు కావించాడు.

"మా వల్ల మీ కేదైనా మేలు జరిగితే అది మోక్షప్రాప్తిగా భావించగలను" అన్నా డాయన. సంస్కార పూర్ణమయిన వారి అతి థేయ మర్యాదలకు అచ్చెరువు పడినాడు సుమాలి. మౌని మాటలు అమృత వాహిను లనిపించినాయి.

"జటధారీ! నీ గురించి నే నెరుగుదును. నీవు పౌలస్త్యుడవు. వయసున నాకన్న పిన్నవాడవు. అయినా ఉజ్వలమైన మాటలు, సంస్కార పూర్ణమైన నీ ఆతిథేయ మర్యాదలు నీవు బుద్ధిలో పెద్ద వాడవని తేటతెల్లం చేస్తున్నాయి.

కార్యార్థినై నేను మీ దగ్గరకు వచ్చాను. నిరాశతో త్రిప్పి వంపివేయరని కొండంత ఆశ. అయితే మీకు మునుముందుగా చెప్పు కోవలసిన సంగతులు కొన్ని ఉన్నాయి" అంటూ ప్రారంభించాడు సుమాలి.

పులస్త్య బ్రహ్మతనూ భవుడైన విశ్రవసు అతని మాటలకు మధ్యలోనే అడ్డు వచ్చాడు.

"ఓయీ! నీవు అసుర గణాలకు అధ్యక్షుడవనినాకు తెలుసు. ఒకప్పుడు మా సురగణపతి అయిన విష్ణువు హిమావర్తం నించి వచ్చి నిన్ను నాగలోకమని పిలువబడుతున్న దిగువ భారతభూములకు పారద్రోలిన సంగతి కూడా నే నెరుగుదును.

విష్ణువు హిమా వర్తానికి ఏలిక ఒక్కడే కాదు, అతడు ఆర్యా వర్తంలోని రాజులందరికీ ఆరాధ్య దైవము. అతడు సర్వవ్యాపి. ఘటనా ఘటన సమర్థుడు. ఇచ్చేందుకైనా పుచ్చుకునేందుకైనా చాలిన వాడు. అట్టివాడు అతడొక్కడే కాని మరొకడు లేడు.

అందునించి అతని సంకల్పాలే సురగణాలకు ఆర్యావర్తపు యావన్మంది రాజులకూ శిరోధార్యాలు, అసురగణాలకు అధిపతివైన నీకు అతనివల్ల సంప్రాప్తమైనది పరాజయమేనని నాకు తెలుసు.

అతనికి ఎదురొడ్డి నిలువగలిగిన వారు చతుర్దశ భువనాలలో ఎవరూ లేరు. అతని సంకల్పమే జనులందరి భవితవ్యాలను నిర్ణ యిస్తుంది.

అందునించి అతని చేతిలో అసురగణాలకు అధ్యక్షుడవయిన నీ ఓటమి అనివార్యమయింది.

కాగా నీ విప్పుడు నీ కుమారితో యిక్కడ మునివాటికకు వచ్చిన కారణమేమిటో చెప్పగలవా ? సాయమేదైనా నాకు చేయగలిగి నది చేయదగినది అయితే తప్పక చేస్తాను." అని సంభాషించి నాడు విశ్రవసు.

అతడు చేసిన విష్ణుస్తుతి అసురగణాల అధ్యక్షుడయిన సుమా లికి కర్ణహితవు కలిగించలేదు. అయినప్పటికీ తాను కార్యార్థి ! ఈ విషయాన్ని స్మరించి మనసును దిటవు పరుచుకున్నాడు సుమాలి.

ప్రస్తుతానికి వచ్చాడు.

"తేజోమూర్తీ ! నీవు గతమంతా తెలిసికొన్న వాడవు. ప్రస్తు తాన్ని పరిశీలించగల వాడవు. భవితవ్యాన్ని శాంతదృష్టితో వీక్షించ గలవాడవు.

అందునించి త్రికాలవేత్తవు.

కనుక నా కోరిక తప్పించి మరొక మాట చెప్పాలన్న ఆశ నాకు లేదు. ఈ సుకుమారి నా కుమారి.

పేరు కైకసి. యౌవనాంకురమై మాతృమూర్తి కాదగు అర్హత లన్నింటినీ సంతరించుకున్నదీమె. అట్టి స్థితికి వచ్చిన ఆడదాయికి ఆలంబన కల్పించటం కన్న తండ్రి నయిన నాకు కర్తవ్యం కదా!

ఆ పని ఈడేర్చుకుందుకే తేజోమూర్తి వయిన నిన్ను ఆశ్రయించినాను మౌనీ! అసురగణాలను అనుగ్రహించు క్షేత్రవతి అయిన ఈ కైకసికి సురగణశక్తి సమన్వితమయిన బీజాన్ని ప్రసాదించు.

మాతృత్వమనే మహనీయమయిన అర్థం ఆమె బ్రతుకులో నీ వల్లనే లభించాలి.

అసురుల శక్తిసంపన్నతకూ, సురగణాల మేధాసంపన్నతకూ ఉమ్మడివారసుడయిన ఒక ఉద్ధతుడు ఆమె గర్భవాసాన జన్మించాలి.

నా మనుమడు మహత్తరశక్తి సంపన్నుడు కావాలి. ఈ ఆశయ సాధనకోసమే బహుదూరం ప్రయాసపడి వచ్చినాను. నా కుమారిని అనుగ్రహించు" అంటూ చేతులు ముకుళించాడు సుమాలి.

కైకసితండ్రి మనోగతాలకు అనుకూలవతిగా విశ్రవసు పాదాలను ఆశ్రయించింది. అతడు అర్థనిమీలిత లోచనుడయినాడు. అంతర్యపు పుటలలో ముద్రితాలయిన విప్లవవిలాసాలను ఒక్కసారి స్మరించినాడు.

తృటిలో స్థిరసంకల్పుడై ఒక నిశ్చయమునకు వచ్చినాడు. కాంతిపుంజాలవంటి కనులు తిరిగి విచ్చుకున్నాయి.

"ఓయీ! అసురగణ అధ్యక్షా! నీ కోరిక అనుచితమైనది కాదు. స్వజాతీయుల ఆత్మ గౌరవ పరిరక్షణకై ఒక ఉద్ధతుడు జన్మించాలన్న ఆకాంక్ష మహనీయమైనది.

అందుకు యుద్ధవిద్యావిశారదులు, వేదవిదులు అయిన మా వంటి వారిని ఆశ్రయించటమే మేధాసంపన్నతకు గీటురాయి.

నీ ఆశయం నెరవేరుతుంది.

సుకుమారి అయిన నీ కుమారిని, ఈ కైకసిని పుత్రవతిని చేస్తాను. ఈ క్షేత్రవతి నావల్లనే మాతృమూర్తి కాగలదు, ఇదే నేను నిరూపించదలచిన ఆతిథేయ సంస్కారం" అని ప్రవచించినాడు విశ్రవసు.

సుమాలి అంతర్యం ఆనంద రసార్ద్రవమైపోయింది. అతనికి సుదూరంగా ఆశాజ్యోతులు తరళాయిత మవుతూకన్పించినాయి. రవంత అయినా సంశయించక కైకసిని అతని పరంగా అర్పించి తన ఆవాసాలకు తిరుగు ప్రయాణమైనాడతడు.

కైకసి సిగ్గుల మొగ్గ అయింది.

ఋతువులు గతించినాయి. కైకసి తన వాడయిన మహా షుడు విశ్రవసును అంతర్యమంతా అర్పించి ఆరాధించసాగింది.

"కైకసీ! ఓ రాక్షసీ! నా ప్రేయసీ! ఉద్ధతుడ పుత్రుడు ఉదయించాలన్న మహదాకాంక్షతో నన్ను నీ పురుష ఎన్నుకొన్నావు.

క్షేత్రవతులు పుత్రవతులు అయేందుకు పురుషుని ఆశ్రయిం టమే కదా ప్రకృతి నిర్దేశం, కాని మన కలయిక విశిష్టమయినది.

మన శరీరాలు ఏకమై మనసులు ముద్దాడుకొని, ఆత్మలు ఆ సంధానమయిన మంచి ఘడియలే రానున్నాయి. అవే సురులకూ అ రులకూ అతీతమయిన సంకీర్ణజాతి పురుషుని ప్రాదుర్భావానికి సుమ హూర్తం కాగలదు.

నీ తండ్రి కోరిక మేరకు నా నిగ్రహాన్ని సడలించుకున్నాను. ఆ సూర్యనారాయణుడూ, గాలీ, నీరూ, నింగీ, నే మనకు సాక్షులు. జలనిధులే వస్త్రాలుగా, గిరిశిఖరాలే మణిమకు లుగా ధరించిన భూమాత మనకు శృంగార శయ్య కాగలదు.

సిగ్గుపడతావెందుకు సుకుమారీ!

స్త్రీపురుషుల యోగోద్భవమయినదే కదా ఈ సృష్టి యావత్తు సంశయించక ఈ చేయి అందుకో!" అంటూ బాహువులను ముందు చాచినాడు విశ్రవసు.

అతని దండచేయి ఆమె తలదిండు అయింది. ముగ్ధకుసుమంల ఉన్న ఆమె అంతర్లోకం వికసితమయింది.

అతని నీడ ఆమె ఆశలజాడ అయింది. కాలం కమనీయమై కరగిపోయింది. ఋతువులు గతినిలిచిపోయినట్లుగా అన్పించసాగింది

అతడు మహనీయుడు. అతని ప్రేయసి చెంపలపై రచయించ కున్న మకరికా పత్రాలే ప్రేమపత్రాలయినాయి.

"ఓయీ! మహాపురుషుడా! అసురకాంతనయిన నన్ను నీ స్పర్శతో తన్మయురాలిని చేసివేసావు. ఆడబ్రతుకులోని అర్థాలన్నీ ఏ మహనీయమయిన కాంక్ష వెనుక దాగుంటాయో, నా తండ్రిఅయిన సుమాలి ఏ ఆశతో నన్ను పెంచి నీకు అర్పించినాడో ఆ అర్థాలన్నీ ఇప్పుడు నెరవేరినాయి. ఈ ఆడపుట్టుక చరితార్థమయింది.

ఋతుమతిని అయిన నన్ను ఋతమతివి అయిన నీవుస్పృశించినావు. క్షేత్రవతిని అయిన నన్ను సంతానవతిగా అనుగ్రహించినావు. నా పుత్రుడు చతుర్దశ భువనాలకు అదత్మప్రాయుడై జన్మించాలని ఆశీర్వదించవయ్యా! అతడు అమేయ శక్తిశాలి కావాలి.

సురగణాలకు అతని పేరు సింహస్వప్నం కావాలి. నా తండ్రి కన్న స్వప్నాలు ఫలించాలి అన్నదామె.

తన ఊరువులపై తల ఆన్చుకుని సమస్త భూఖండమూ తనదే అయినంతగా తృప్తి మూర్తీభవించినట్లున్న ఆమెను అలవోకగా చూచినాడు మౌని.

"ఇదికదా దైవనిర్ణయము." అని సంభావించినాడు.

"ఓ రాక్షసీ! నా ప్రేయసీ! సురగణాల ఆధిక్యతను అవహితం చేసేందుకు సంకల్పించిన అసురగణాల ఆశయం నెరవేరుతుంది. సురాసురగణాల సంకీర్ణబీజం నీలో ప్రాణంపోసుకున్నది కదా! దైవఘటనలు ఇలానే ఉంటాయి.

సంకీర్ణజాతుడయిన మహాపురుషుడు ఉదయించే యజ్ఞంలో నీవూ నేనూ నిమిత్తమాత్రులమే! ఈ యజ్ఞంలో ఒక సమిధగా నా తపశ్శక్తిని యావత్తూ ధారపోశాను. నీవు ఉద్ధతుడయిన మహాపురుషునికి తల్లివికానున్నావు. నీ జన్మ ఈ ఘటనతో చరితార్థమయింది."అని చెప్పాడు విశ్రవసు. కైకసి తీరని అనురాగంతో, తృప్తి లభించని తమకంతో అతని చుట్టూ చేతులు పెనవేసింది.

ముక్తికాంత పొందుకోరి మౌనిగా మారిన విశ్రవసు అసుర కాంత బాహువల్లరిలో బంధితుడు అయినాడు.

కాలం ఒక ఉద్విగ్నతలో,ఒకస్ఫూర్తిలో, కరిగి జారిపోయింది. దివారాత్రాలు దోబూచులాడినాయి. అమృతమయుడయిన సుధాకరుని వృద్ధిక్షయాలు వరుసగా నడచినాయి.

మలయ సమీరాల ఆశ్వాసనతో ఆయాసం రవంత ఉపశమించగా పూర్ణగర్భిణి అయింది అసురగణకాంత కైకసి. ప్రకృతి ఆమెకు విముక్తి కలిగించే మధురక్షణాలు ఆసన్నమయినాయి. కలల కడలిలో ఓలలాడిందామె.

ఇదివిన్న సురులతాలూకు జనగణమనః కేదారాలలో - అగ్నిహోత్రం భగ్గున ఎగసింది. వర్ణాలు సంకీర్ణమయినాయి, విశ్రవసు మందహాసం చేశాడు.

"ఇది దైవసంకల్పమేకదా! ఆర్యావర్తపు రాజులయినా, హిమావర్తపు సురగణాలయినా దైవఘటనను ప్రతిఘటించలేవుకదా!" అని సంభావించాడు మౌని. వారి కిన్నెరకు కించిత్తు అయినా చలించలేదు.

దిగువ భారతభూముల్లో ఆవాసముంటున్న యక్షరాక్షసగణాలు అతనిని ఆరాధించినాయి.

పండిన పండుకు తల్లిచెట్టు నుండి తొడిమవూడిపోవటం ప్రకృతి నిర్ణయమేకదా! కైకసికి నొప్పులు ప్రారంభమైనాయి.

అసుర జనగణ మనః కేదారాలు ఆనంద తరంగిణులయినాయి. అత్యంతాసక్తితో ఫలితాంశమయిన పసివానికోసం ఎదురు చూడసాగినారు వారు,

పురుటి నొప్పులతో కైకసి కలతపడింది. ఆమె భౌతికశరీరలోని రక్త, అస్థి, మజ్జా, ఓజస్సులు బాధాపరితప్తాలయినాయి.

అసురకాంత తప్తకాంచన మయింది.

పగలంతా గడచిపోయింది. యామిని కురులార్చుకునేందుకు సంసిద్ధురాలు అవుతుంది. అది సంధ్యాసమయం. కైకసి మాతృత్వం కోసం బిడ్డను బయటపెట్టేందుకు స్వశరీరంతో పోరాడుతోంది.నొప్పులు మరింత అధికమయినాయి. రక్తం గడ్డకట్టినట్లుగా అయింది.

కడసారిగా కెవ్వుమని కూపెట్టింది కైకసి. దిగంతాలు తృళ్ళింతలయినాయి.

అసురగణాలు అచ్చెరువువడి చూడసాగినాయి. ఆసక్తితో ఆశతో తలమునకలవుతున్నాయి.

విశ్రవసు మందస్మితం కావించి అర్థ నిమీలిత నేత్రుడయినాడు

ఇందరు మహామహులకు ఆసక్తినీ, ఆశలను భయాలనూ రేకెత్తించిన మహోద్దండుడయిన ఆ బాలకుడు తల్లికడుపును కసిగా చీల్చుకుని విముక్తికోసం తలబయటకు పెట్టాడు.

ఉద్ధతుడయిన ఆ బాలకుడు అత్యంతశక్తితో మాతృకోశాన్ని చివ్వున చీల్చుకుని బయటపడ్డాడు.

అది దివారాత్రాల సంధ్యాసమయం. సాయంత్రసంధ్య. పుడమి తల్లి ఒడిలో పడగానే కెవ్వున అరిచాడు బాలకుడు. ఆ రోదన ధ్వనికి ఆడవి జంతువులుసైతం భ్రమించినాయి.

ఆరోదన ధ్వనిలో అసురవేదం విప్లవించింది. ఆరోదన ధ్వనిలో వేదవిధులయిన సురలకుగుండెలు అవిసినాయి. నక్కలు ఊళవేశాయి. ఉలికిపడిన నెమళ్ళు క్రీంకరించినాయి.

అడవి గుర్రాలు హయహేషలు చేసినాయి.

ఉచ్చమయిన ఆరోదనధ్వనికి ఉలికిపడి ధ్యానం ముగించినాడు. విశ్రవసు.

"ఈతనికి దశకంఠములున్నవా ఏమి? లేకున్న ఆ ఎలుగెక్కడిది? అని చకితు డయినాడు.

అవును ఈతడు దశకంఠుడే! అన్నాడు.

ఉద్ధతుడయిన ఆ బాలకుడే దశకంఠుడయినాడు. సురాసుర సంకీర్ణ పురుషుడై దిగంతాలను సైతం గడగడ లాడించాడు.

ఆ తరువాత కైలాసగిరిని పెకలించి ఈశ్వరాను గ్రహంతో రావణుడయినాడు.

అసురజనగణ మనోభిరాముడయిన దశకంఠుని చూచి మురిసిపోయింది మాతృమూర్తి కైకసి.

ఆ సంధ్య అసురసంధ్య అయింది.

అది మొదలు సాయంత్ర సంధ్య "అసురసంధ్య!"

శ్రీ గోపీకృష్ణ

తరిగొండ వేంకమాంబ కాలనిర్ణయము

క్రీ.శ. 18-19 శతాబ్దులలో జీవించిన తరిగొండ వేంకమాంబ కాలనిర్ణయము యింకా అస్పష్టంగానే వుంది. ఆమె జీవనకాలమును గురించి తెలిసినదల్లా సి. పి. బ్రౌనుగారు తన తెలుగు నిఘంటువులో క్రీ.శ. 1840 ప్రాంతాల ఆమె జీవించి వున్నట్టు పేర్కొనడం. బ్రౌను దొరగారు తమ తొలినాటి నిఘంటువులో అలా పేర్కొన్నారేమోగానీ, ప్రస్తుతము అచ్చువేయబడి బజారులలో విక్రయించబడుతున్న, బ్రౌను నిఘంటువులో, ఆ విషయం కనబడటం లేదు. ఏది ఏమయినా తరిగొండ వేంకమాంబ కాలనిర్ణయమునకు బ్రౌను దొరగారే లేదా ఆయన నిఘంటువే శరణ్యమయినది. ఆంధ్రదేశములోని కవి పండితులు, సాహితీవేత్తలు అందరూ ఆ తారీఖునే పాటించారు. తెలుగు విజ్ఞాన సర్వస్వము కూడ ఆ తారీఖునే ఆశ్రయించినది. కానీ ఆ నిర్ణయము నిజమా ?

తి. తి. దే. శాసనము లన్నిటిని క్రోడీకరించి, అనువదించి, దేవస్థానం ఎపిగ్రాఫికల్ రిపోర్టును 1930 లోనే పూర్తిచేసి అచ్చువేయించిన అప్పటి దేవస్థాన ఎపిగ్రాఫిస్టు శ్రీసాధు సుబ్రహ్మణ్యశాస్త్రి గారు తన తొంభైయవ పడిలో "తిరుపతి శ్రీ వేంకటేశ్వర" అనే ఆంగ్లచారిత్రక గ్రంథాన్ని రచించారు. దానిని దేవస్థానంవారే 1981లో ప్రచురించారు. ఆ గ్రంథం ప్రచురణకు యీ వ్యాసకర్త సంపాదకత్వం వహించాడు. అందులో 347 పుటనుంచి 35 పుటవరకు తరిగొండ వేంకమాంబ గారి చరిత్రము, రచనలు, దానశాసనములను గురించిన చర్చవుంది.

దానశాసనములనుబట్టి, బ్రౌను వుదాహరణమును బట్టి శ్రీశాస్త్రిగారు తరిగొండ వేంకమాంబ జీవన కాలమును - జననం క్రీ. శ. 1750 - 55 మధ్య అని, మరణం క్రీ. శ. 1850 ప్రాంతంలో అని తేల్చినారు. దానిని యీ వ్యాసరచయిత కూడ అంగీకరిస్తూ 1940 ప్రాంతంలో అచ్చువేయబడిన ఒక కరపత్రంలో వేంకమాంబ మరణం శా. శ. 1738 ఈశ్వరనామ సంవత్సరం శ్రావణ శుద్ధ నవమి అని వుండగా దాని ప్రకారం 7-8-1817లో ఆమె చనిపోయివుండా అయినా బ్రౌను దొరగారు క్రీ. శ. 1840 లో ఆమె జీవించివున్నట్టు వ్రాశారు గాన ఆమె 7-8-1877 లో చనిపోయి వుండవచ్చు, అప్పటికామె దాదాపు 120 సంవత్సరాలు, శ్రీరామానుజాచార్యులవలె జీవించిందేమోనని, అధోజ్ఞాపిక ఒకటి వ్రాశాడు.

అలా అంగీకరించి వ్రాసింది నేనే అయినా, అది కూడ తప్పు అని ఆ తరువాత తేల్చుకొన్నాను. నేను పెడదారి పట్టడానికి కారణం బ్రౌను దొరగారిదిగా భావించబడుతున్న క్రీ. శ. 1840 సంవత్సరమే.

1941 లో తరిగొండ వేంకమాంబ కుటుంబానికి చెందిన శ్రీ గుండేపల్లి కుప్పయ్యశర్మ - తరిగొండ వేంకమాంబ మఠానికి, శ్రీ నృసింహ జయంతి ప్రతి సంవత్సరము వైశాఖశుద్ధ 14 మొదలు 10 దినములు జరుపడానికి, రాత్రింబవళ్ళు అన్నదానం చేయడానికి, ధార్మికుల దగ్గర నుంచి ధర్మం యాచిస్తూ వేసిన కరపత్రంలో యిలా పేర్కొన్నాడు.

"శాలివాహన శకము 1738 ఈశ్వర ... శుద్ధ ... యందు జీవన్ముక్తురాలయ్యెనని, భక్తవిజయ ... హరణ ... ముల వలన తెలియుచున్నది." దానికి స ... రీఖు క్రీ. శ. 7-8-1817.

క్రీ. శ. 1817 లో చనిపోయిన వేంకమాంబ క్రీ ... లో జీవించియున్నట్టు బ్రౌనుగారికి ఎవరో తప్పుడుసమాచారం అ... అందించినా ఆయన అంత సులభంగా నమ్ముతాడా అందులో ... గ్లేయులు ప్రతివిషయం పరిశీలించిగాని విశ్వసించరు గదా అనే ధీమ తో భక్తవిజయాద్యనేక గ్రంథోదాహరణములే తప్పుగా నుండనోపునని నేను, ఆమె మరణ కాలమును, 7-8-1877 గానే స్థిరపరచి స్థిమితపడినాను. అప్పటికీ కొంత అసంతృప్తి కలిగితే బ్రౌను దొరగారి 1840 సం॥ భక్తవిజయాద్యనేక గ్రంథాల ఈశ్వర సంవత్సర శ్రావణ శుద్ధ నవమి, రెండిటినీ ఒకటిగా కలిపితిమి గదా అని తిరిగి తృప్తి పడితిని.

ఇలా ఉండగా ఒకనాడు తిరుమల శ్రీవైఖానస ఆశ్రమములో క్రీ.శ. 1877–78 సం॥ చెందిన పంచాంగ మొకటి నాకంట బడింది. ముదురు గోధుమ రంగు కాగితం. మీద పరిశుభ్రంగా అచ్చువేయబడిన పుస్తకమది. ఆ ఈశ్వర సంవత్సరపంచాంగములో శ్రావణ శుద్ధనవమిని పరిశీలించిచూడగా అది శుక్రవారం, వరలక్ష్మీవ్రతం, సత్యావారతీర్థ పుణ్యం, ఆంగ్ల తారీఖు 17–8–1877 అని తేలింది, ఆ పంచాంగమును శుద్ధపరచిన క్రీ. శే. పార్థసారథి భట్టాచార్యుల మీద ఎనలేని గౌరవ మేర్పడింది.

అప్పటికే అచ్చుపుస్తకాలు అంతవ్యాప్తిలోనుండగా, తరిగొండ వెంకమాంబ ఇంటిలో ఆమెకు సంబంధించిన ఒక చిత్తుకాగితంకూడా దొరకలేదు. దొరికినవన్నీ తాళపత్రాలే. అవి గూడ ఆమెవ్రాసినవికావు. ఆమె మనుమడుగా చెప్పుకొన్న గంగాధరప్ప వ్రాలుతోనున్నవి.

ఈ గంగాధరప్ప తాళ్ళపతులమీద ఘంటంతో వ్రాయడమేకాదు ఎందుకు రాయవలసి వచ్చిందోకూడ ఒకచోట పేర్కొన్నాడు. అవ్వాగా రయిన తరిగొండ వేంకమాంబ తాళ్ళపతులు పీరూవారూ తీసికొనిపోయి తిరిగి ఇవ్వకపోగా తాను దొరికిన ప్రతులు పుచ్చుకొని వాటికి నకిలీలు తయారు చేశాడట. అయితే యితనికి సంబంధించిన ఒకవంశావళి కాపీ, కాగితంమీదనే వ్రాయబడి వుంది. "మహారాజశ్రీ బ్రైలర్ దొరగారి యినామతీ దరియాప్తిలో కడప్పజిల్లా రాయచోటి తాలూకా గర్నిమిట్ట గ్రామం నెం. 79రు ప్రస్తుతం చిత్తూరుజిల్లా వాయల్పాడు తాలూకా గర్నిమిట్ట (గ్రామం) ఖండాయినాం అనుభవించే గర్నిమిట్ట గంగన్న కుమారుడు గంగాధరప్ప వ్రాయించి దాఖల్ చేస్న్ స్టేట్‌మెంట్ 1270 వ్యలా" దీనినిబట్టి గంగాధరప్ప క్రీ.శ. 1861లో జీవించి వున్నాడు.

తరిగొండ వేంకమాంబ స్వంతతాళ్ళపతులు. ఆమె మనుమడు ఆమెకు సంతానం లేదు. కాబట్టిస్వంతంకాదు. బంధువులవల్ల మఠానికి వచ్చినవాడు) గంగాధరప్పకే దొరకనినాడు, యిక నాకు దొరికే అవకాశం లేదు. దొరికినవల్లా గంగాధరప్ప వ్రాసిన కొన్ని తలాతోకా లేని తాళ్ళపతులు, కొన్ని దానపత్రములు. ఈ దానపత్రము లన్నీ ముఖ్యమయినవిగాన చక్కగా శుద్ధపరచ బడినవి. ఈ పత్రాలన్నీ మొత్తం 31. తరిగొండ వేంకమాంబ ప్రతి సంవత్సరము నృసింహ జయంతిని చక్కగా జరిపి అందరికీ అన్నదానం చేయడానికిగాను యిచ్చిన భూదానములు, ధనకనక వస్తుదానములు. ఇందులో మొదట దానము క్రీ. శ. 1785 నాటిది. చివరి దానము క్రీ.శ. 1809 నాటిది. కాబట్టి మొత్తం 31 దానములు, 25సంవత్సరముల కాలములో చేయబడినవి. దీనిని బట్టి 1809 సంవత్సరము నాటికి చేతితో తయారు చేయబడే తళసరి కాగితాలుకూడ వాడటానికి రాలేదని చెప్పవచ్చు. ఆ తరువాతనే అవి వాడకానికి వచ్చాయి.

తరిగొండ వేంకమాంబ 1840 సం॥ జీవించివున్న ఆమెకు సంబంధించిన కొన్ని కాగితాలయినా దొరికి వుండేవి. చేతితో తయారు చేయబడిన దళసరి కాగితాలు 1820 సంవత్సరము నాటికే వాడకానికి వచ్చాయి. తూర్పిండియా కంపెనీవారు తమరికార్డులన్నిటినీ అప్పటికే కాగితాలమీద వ్రాయసాగారు. అలాంటప్పుడు వేంకమాంబగారికి ఒక కాగితమయినా దొరకకపోదు. కావున ఆమె క్రీ. శ. 1840 నాటికి జీవించి వుండటానికి వీలులేదు అది వ్రాత పరికరాల సంధియుగము. గంగాధరప్ప మాత్రం కొన్ని తాళ్ళపతులు, మరికొన్ని కాగితాలు వాడినాడు.

1211 ఫసలీ (క్రీ.శ. 1801)కి చెందిన తి. తి. దేవస్థానం వారి కైంకర్య పట్టిలో తరిగొండ వేంకమాంబ కైంకర్యం చేయువారి జాబితాలో చేర్చబడలేదు. కాని 1230ఫసలీకి చెందిన (క్రీ.శ.1820) కైంకర్య పట్టిలో మాత్రం 31వ విషయంలో యిలా వ్రాయబడి ఉంది.

"31. తరిగొండ వెంగమ్మ యిలాకా అయింబడ్ పంగమ్మ తిరుమలమీద రాత్రి మంచపుసేవకాలంలో వెండి గుండ్లతో నిత్యం వక అవతారంతో హారితికియిచ్చేది".

1801లో తరిగొండ వేంకమాంబ గొప్పదనం గుర్తింపబడలేదు. 1820లో గుర్తింప బడింది. అంటే ఆమె 1817లో చనిపోయి నందున గుర్తింపబడిందా? అని చాల కాలం ఆలోచిస్తూ గడపుతూవుండగా ఒక నాడు కుంపిణీ పరిపాలన రికార్డులలో ఒక విషయం బయటపడింది.

ఆ రికార్డుమీద తారీఖులేదు. దాని వెనుకటి రికార్డుమీద మాత్రం 1803 ఎ.డి. (క్రీ.శ.) రుధిరోద్గారి అని వుంది. ఇప్పుడు జరుగుతున్న సంవత్సరము ఇదే. సరిగ్గా 180 సంవత్సరాలకు ముసుపటి రుధిరోద్గారి సంవత్సరమునే అంటే వెనుకటి రికార్డు తారీఖునే ముందుటి రికార్డు తారీఖుగా పరిగణిస్తే సరిపోతుందేమో ?

ఆ రికార్డులో తిరుమల శ్రీవారి నైవేద్యం, నిత్యకట్ల వివరాలున్నాయి. అందులో పానుపు సేవ మంగళహారతికి, ముత్యాలహారతి తయారుచేసినందుకు తరిగొండ వెంగమాంబకు ఇవ్వవలసిన దిన వెచ్చాలు, ప్రసాదాలు జాబితా వుంది. అంటే ఆమె అప్పటికి జీవించి వుంది.

క్రీ.శ. 1801 లో ఆమెకు గుర్తింపులేదు. క్రీ.శ. 1803 లో జీవించి ఉండగానే తిరుమల శ్రీవారి కైంకర్యసేవకు నోచుకున్నది.

క్రీ.శ. 1820 నాటికి ఆమె పేరు తొలగింపబడి ఆమె స్థానంలో ఆమె యిలాకాకు చెందిన అయింబడ్ వంగమ్మ పేరు వ్రాయబడివుంది. అంటే ఆమె జీవించి ఉండలేదు. కాబట్టి జాబితాలో ఆమె స్థానంలో మరొకరి పేరు పేర్కొనబడింది. ఇంతకంటే సాక్ష్యం ఏమి కావాలి.

ఇంతకూ యీ విషయాలన్నీ గుండేపల్లి కుప్పయ్యశర్మగారు వేసిన కరపత్రం ఆధారంగా అంటే శాలివాహన శకం 1738 ఈశ్వర సంవత్సర శ్రావణ శుద్ధ నవమి ఆధారంగా నిర్ధారింపబడినది. అయితే గుండేపల్లి కుప్పయ్యశర్మగారు పేర్కొన్నది నిజమా? నిజమేనని నమ్మవలసి వస్తుంది. ఎందుకంటే ఆనాటినుంచి యీనాటి వరకు తిరుమల లోని తరిగొండ వేంకమాంబ సమాధివద్ద నియమం తప్పకుండా ప్రతి సంవత్సరం శ్రావణశుద్ధ నవమినాడు పూజలు జరుగుతూనే వున్నాయి. తిరుమల శ్రీవారు ప్రతి నృసింహ జయంతినాడు క్రమం తప్పకుండా తరిగొండ వేంకమాంబ యింటికి విజయం చేస్తూనే వున్నారు. కాబట్టి పరంపరగా వస్తున్న యీ సంప్రదాయాలను సంశయింప బనిలేదు.

ఉపసంహారం

చిత్తూరుజిల్లా వాయల్పాడు తాలూకాలో, తాలూకా కేంద్రమయిన వాయల్పాడుకు 4 మైళ్ల దూరంలో తరిగొండ గ్రామముంది. 1911 మునుపు ఇది కడప మండలములో వుండేది. అచ్చట శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయముంది. ఆ గ్రామంలో తరిగొండ వేంకమాంబ, కానాల కృష్ణయ్య మంగిమాంబ దంపతులకు క్రీ. శ. 1750-55మధ్య కాలంలో జన్మించింది. వారు నందవరీక బ్రాహ్మణులు వాశిష్ఠ గోత్రులు. చిన్నప్పటినుంచి ఆమె శ్రీనృసింహస్వామి భక్తురాలు. ఆ ఆలయ ప్రాంగణంలో తరిగొండ వేంకమాంబకు ఒక చిన్నగుడి కూడ కట్టించి ఆమెను ప్రతిష్ఠించి వున్నారు.

చిన్నతనంలోనే ఆమె అభీష్టమునకు వ్యతిరేకంగా, ఇంజేటి వెంకటాచలపతిలో వివాహమయింది.త్వరలోనే వైధవ్యంకూడ ప్రాప్తించింది. అయినా ఆమె విధవ వేషాలువేయనని మొరాయించి, సంఘములోని కట్టుబాట్లను ఎదిరించి, భగవద్భక్తితో జీవించుచుండగా, ఆమె పట్ల గ్రామస్తులందరు వ్యతిరేకులైరి. అప్పటి కంచి కామకోటి పీఠాధిపతి కూడ ఆమెను నిరసించి బలవంతంగా తలముండనం చేయించగా, తరిగొండ నృసింహుని కోనేటిలో మునిగి లేచిన వేంకమాంబకు తిరిజుత్తు ప్రత్యక్షమయిందట.

ఇక, ఆమె తరిగొండ వదలి తిరుమల చేరింది. అప్పటి కామె వయస్సు 20 సంవత్సరాలుండవచ్చు. పాండవ తీర్థమని పేరుగాంచిన గోగర్భం తీర్థంలో చాలాకాలం తపస్సు చేసింది. భక్తుల త్రొక్కిడి ఎక్కువకాగా, యిక లాభంలేదనుకొని దుర్గమారణ్యం దారి బట్టి తిరుమలకు పదిమైళ్ళదూరంలోని తుంబురుతీర్థం చేరింది. అక్కడొక గవి (గుహ)లో దీర్ఘకాలం తపస్సు చేసింది. అప్పటికి పేరులేని ఆ గవి. తదుపరి తరిగొండ వెంకమాంబ గవిగా ప్రసిద్ధిగాంచింది. ఆతరిగొండ వేంకమాంబ గవి పవిత్రతను పరిశీలించి తదనంతర కాలంలో అనగా 1930 ప్రాంతాలలో శ్రీమహంతు హత్తేరాంజీ మఠమునకు అధికారి అయిన రామలక్కన్‌దాస్‌గారు ఆరుమాసాలపాటు అక్కడ తపస్సు చేసారు.

శిష్యులు భక్తులు తన వునికిని కనుగొని తుంబురు తీర్థానికి తామరతంపరగా రాకపోకలు సాగించేసరికి, గత్యంతరములేక ఆమె తిరిగి తిరుమల చేరింది. అయితే, అప్పటికి ఆమె భగవత్సాక్షాత్కారము పొంది గొప్పయోగినిగా రూపొందింది. తరిగొండ వేంకమాంబగవి నుంచి సరాసరి తిరుమల ఆలయానికి వున్న బిలమార్గంలో సూక్ష్మశరీరంతో వచ్చి రోజూ రాత్రులలో తిరుమల శ్రీవారిని పూజించి, నైవేద్యం పెట్టి పోయేదని పదిమంది విశ్వాసం. రాత్రులందు పూజచేసే రహస్యపూజారి విషయం అసలు పూజార్లకు తెలిసిపోయి, ఏంచేద్దామా అని ఆలోచిస్తూ వుండగా ధైర్యవంతుడయిన మహంతు శ్రీజానకీ దాసు ఆలయంలో దాక్కొని ఆ విషయాన్ని కనిపెట్టుతానంటాడు. అర్థరాత్రి ఆదమరచి నిద్రపోతాడు. మెలకువ వచ్చేసరికి పూజచేసిన వేంకమాంబ వెళ్ళిపోతూంటే ఆమె చీరచెరగు జానికీదాస్ చేతికి దొరకుతుంది. చీర చిరిగిపోయినా వెళ్ళిపోతుంది. గానీ ఆ విషయం అందరికీ తెలిసిపోతుంది. గొప్ప యోగినిగా ప్రపంచం ఆమెను, అప్పుడు తొలిసారిగా గుర్తించింది.

అలాంటి బిలమార్గమే మరొకటి ఆమె పూదోటలోని ప్రస్తుత సమాధివరకు వుంది. దానిని బండరాతితో మూసివేశారు. ఆ కాలంలో ఆ చదును బండమీద కూర్చుని తిరుమల శ్రీవారికి ఆమె పూలుకట్టేదట

ఆమె పూజించిన ఆంజనేయస్వామి చిట్టివిగ్రహం ఆమె సమాధిప్రక్కనే నేరేడుచెట్టుక్రింద ప్రతిష్ఠించ బడినది. చెట్టుఎండిపోయి అదృశ్యమైనను విగ్రహం మాత్రము వుంది.

తదనంతర కాలములో ఆమె తిరుమల ఉత్తర మాడవవీథిలో తాళ్ళపాకం వారింట ప్రక్కన ఒకఇల్లు సంపాయించింది. మూడు పూదోటలు సంపాదించింది. స్వామిపుష్కరిణికి ఈశాన్యంగా వుండే పూదోట అంగళ్లుగా మారిపోయింది. ఉత్తరదిక్కున వుండే పూదోటలో అమె సమాధి కట్టారు, అది ఇప్పుడు కాన్వెంటు పాఠశాలగా మారింది. పాపవినాశం కాలిదారిలోని పూదోట దేవస్థానం పూదోటలో విలీనమయింది. అక్కడ అద్భుతంగావున్న అమ్మవారుబావిని ఆమెనిర్మించింది. అడిగేవారులేక ఆ బండలు అందరూ లాక్కుపోయారు.


చరమ జీవితంలో పూలుకోసి మాలలుకట్టి తిరుమల శ్రీవారికి సమర్పించేది. వంటచేసి, రుచులు రుచులుగా నైవేద్యంపెట్టి స్వామి వారికి ఆరగింపు చేసేది. తరిగొండ వేంకమాంబ వంటలంటే శ్రీవారికి నోట్లో నీళ్లుకారేవట. వృద్ధాప్యంవల్ల లేక కారణాంతరాలవల్ల అమె పెట్ట లేకపోతే, స్వామివారే తరిగొండ వేంకమాంబను వెదుక్కుంటూ పోయేవారట. ఇలాంటి జనశ్రుతులు అనేకం అనూచానంగా వస్తున్నాయి. పూజాపునస్కారాల తరువాత, తక్కిన కాలమంతా ఆమె గ్రంథ రచనకు వినియోగించేది.

శ్రీరమా పరిణయము, రాజయోగసారము, శ్రీ వేంకటాచల మాహాత్మ్యం, ద్విపదభారతం, చెంచునాటకం, యోశవాసిష్ఠం, విష్ణు పారిజాతం, శివనాటకం, ముక్తికాంతా విలాసము మున్నగునవి ఆమె రచనలు. తిరుమల శ్రీవేంకటేశ్వరునిలో ఆమె తరిగొండ నృసింహుని చూసింది. రచనల నన్నిటినీ ఆ విధంగా అంకితం చేసింది. వారిద్దరిలోనూ శ్రీకృష్ణభగవానుని దర్శించింది ఆమె.

క్రీ. శ. 1795 నుంచి క్రీ. శ. 1806 వరకు అనేక దానాలు పొందింది. ప్రతి ఏటా నృసింహ జయంతిని గొప్పగా జరిపి అన్నదానాలు సంతర్పణలు చేసేది. 1801 లో ఆలయ నిర్వహణ చేపట్టిన ఆంగ్లేయులు 1803 లోనే ఆమెకు ఏకాంతసేవ మిరాశిని దత్తం చేశారు.

పెద్ద పళ్ళెరం తీసికొని ముత్యాల్లాంటి వెండిగుండ్లతో రోజుకొక ఆవతారం తయారుచేసి, ఆ పళ్లెరంలో, తిరుమల శ్రీవారి పవళింపు సేవలో చివరిహారతి యివ్వడం ఆమెకు వంశపారంపర్యముగా సంక్రమించిన మహద్భాగ్యం. ఆ హారతిని మంగళహారతి లేదా ముత్యాలహారతి అంటారు. ఆ హారతి తరువాత ఏ హారతులూ వుండవు. తదుపరి శ్రీవారు (భోగశ్రీనివాసమూర్తి) పట్టుపానుపు మంచంమీద పవళిస్తారు.

ఆమె క్రీ. శ. 7-8-1817 లో తనువు చాలించింది. అప్పటికామె వయసు 60-65 సం॥ మధ్య వుంటుంది. ఆమె చనిపోయినా, చేసిన సేవలకు గుర్తుగా మంగళహారతి యింకా శ్రీవారికి జరుగుతూనే వుంది. ఆ ఏకాంతసేవ మిరాశిని (వంశపారంపర్యపు హక్కు) ఆమె వంశీకులు అనుభవిస్తూనే వున్నారు. తరిగొండ వేంకమాంబ కడు పుణ్యాత్మురాలు, పరిశీలించిన గ్రంథాలు అక్కడక్కడనే వ్యాసంలో పొందుపరచడంవల్ల అధోజ్ఞాపికలు ప్రత్యేకంగా ఇవ్వలేదు.



అటు ఆకలి... ఇటు చీకటి

సోమసుందర్

ఇల్లు విడిచి వెళ్ళిపోవడమే మార్గమనిపించింది రంగనాథానికి. అవును మరి అంతకన్న ఏంచేస్తాడా పరిస్థితిలో ? ఊరు విడిచి ఎరిగిన వాళ్ళందరినీ విడిచిపెట్టి పొట్టచేత్తో పట్టుకొని వెళ్ళిపోవడం తప్ప వేరే శరణ్యం కనిపించలేదు వాడికి.

ఐతే ఎక్కడికని వెడతాడు? ఇంత విశాలలోకంలో వాడికి ఆశ్రయమిచ్చి ఆదరించే నా అన్నవాళ్ళెవరున్నారు?

ఎవరున్నారుమరి? సీతక్కయ్యా రామ్మూర్తిబావా ఒక్కరే దూరంగా చిరుదీపంలా మెరుస్తున్నారు. విశాఖపట్నంలో సింధియా కంపెనీలో ఏదో ఉద్యోగం చేస్తున్నాడు రామ్మూర్తిబావ! గౌరవంగానే బ్రతుకుతున్నాడు. అతనికి తనపట్ల ప్రేమాభిమానాలు ఉన్నాయి, ఆమధ్య వచ్చినప్పుడు తనపరిస్థితికి ఎంతోజాలి పడ్డాడు.

"కష్టపడి చదివి బియ్యే ప్యాసయిపో ముందు ! మా కంపెనీలో ఏదైనా ఉద్యోగం ప్రయత్నిద్దాం!" అని అన్నాడు.

ఆపత్సమయంలో అక్కాబావా జ్ఞాపకం రాకదారేముంది? అదేం కర్మమో? ఆ బి. ఏ. రెండక్షరాలూ తనపేరు వెనక తగిలించుకొనే యోగమే దూరమై పోతోంది! అదేలభిస్తేనా? తనకి గౌరవమున్నా లేక పోయినా వాటికేనా గౌరవం లభించకపోయేదా? కాని యిప్పుడు మంచున్న పళాన తనకో ఉద్యోగం సంపాదించి పెట్టగలడా బావ?! ఈ రోజుల్లో ఉద్యోగం అంటే మాటలా?

అంత అదృష్టమే తనమొగాన రాసివుంటే ఇంత అకస్మాత్తుగా ఇల్లు విడిచి బయల్దేరవలసిన అవసరమేముంది? నాన్నమాత్రం ఇంత ఛీత్కారం చేయవలసిన అవసరమేముంటుంది? ఇంతకీ అయన్ననుకొని

ఏంలాభం? దిక్కుమాలిన జిల్లాపరిషత్ స్కూలు మేష్టరీఉద్యోగంలో ఎంతకని తనమీద మదుపు పెట్టగలుగుతాడు?

అప్పటికి బి.ఏ. పరీక్షఫీజులకనీ, పరీక్షల ఖర్చులకనీ మూడు దఫాలనుంచీ యిస్తూనే ఉన్నాడాయె! ఎన్నివందలు ఖర్చయ్యేయోపాపం నాన్నకి! మొదటి ఛాన్సులోనే లాంగ్వేజెస్ ప్యాసయినట్లుగా ఈ గ్రూపుకూడా ప్యాసయిపోకూడదూ? దేవుడు దయచూపని నిర్భాగ్యుడికి ఆ అదృష్టం ఎలా కలుగుతుంది ?

పాపం మాట్లెందుకుగాని ఎంత సవతి తల్లైనా చిన్నమ్మకూడా తననీఅక్కయ్యనీ ఎంతో ప్రేమగాపెంచింది. సాధ్యమైనంత ఆప్యాయంగానే చూసేది. కాని తీరాతనకడుపున ఆ ఒక్కనలుసూ కలిగేసరికి ఆమె మనసు మారిపోయినట్లుంది! ఇంతకీ చిన్నమ్మననీలాభంలేదు.

ఏమనుకుంటే ఏం జరుగుతుందికనక! తనకీ ఇందికి యీవేళతో ఋణం తీరిపోయింది. అంత చిన్నచిలిపి విషయంమీద చిన్నమ్మ మహమ్మారిలా విరుచుకుపడుతూంటే అశుభమో శుభమో తెలుసుకోకుండా నాన్న గుమ్మంలోకడుగు పెడుతూనే చేతిలోని గుబ్బగొడుగుతో వీపు మీదబాదాలా? పశువును బాదినట్లు బాదడానికితనేంచిన్నాడా? చితకాడా పైగా "ఛీ వెధవా చెడతింటున్నావింటపడి తల్లి అనే గౌరవం లేకుండా ఏమిటా గావు కేకలు?" అంటూ రంకెలు వేస్తాడా?

తనా కేకలు వేస్తూంట తనా చెడ తింటూంట...

ఏమైతేనేం కాని సమయం కాని సమయంలో ఇల్లువిడచి బయల్దేరవలసి వచ్చింది. బ్రతుకు వెదుక్కుంటూ పోవలసి వచ్చింది రంగనాథానికి...

జేబులు తడిమిచూసుకున్నాడు. ఏముంది? ఒక్కపదిపైసల బిళ్ళతగిలింది. నలిగిపోయిన సిగరెట్టూ ఒకటుంది. అవునూ చిన్నమ్మ కూరలు తెమ్మని యిచ్చిన డబ్బులేవీ? జ్ఞాపకం వచ్చింది. చొక్కా చేతి మడతల్లో దాచాడుకదూ! ఇంకేముంది తన దగ్గర! గుండెనిండా అవమానం వుంది. మెదడునిండా ఉక్రోషం వుంది.

అందుకే కారవలసిన కన్నీళ్ళుకారుతూనే వున్నాయి. దారి పొడుగునా కళ్ళాపుజల్లుతున్నాయి.

తిన్నగా సూరీడు మాష్టారింటికెళ్లాడు రంగనాథం."మాష్టారూ! మాష్టారూ!" వేసివున్న వీథి గుమ్మనుంచే పిలిచాడు.

రావోయి రా! మీ మేస్టారు లోపల మొగం కడుక్కుంటున్నారు అన్నారు సుందరమ్మక్కయ్యగారు తలుపుతీస్తూ.... మేష్టారు రానే వచ్చారు. మొగం తుడుచుకుంటూ! "ఏంబాబూ యిలా వచ్చావు!" అంటూ సహజ మృదుత్వంతో అడిగారు.

వచ్చేముందు మనసులో ఎన్నో అనుకున్నాడు. తీరా ఎదురు పడేసరికి మాట పెగలడంలేదు. తటపటాస్తూ నీళ్ళనమలటంతప్ప ఏమీ అనలేక పోయాడు...

మామూలుగానే అడగాలి. గుండెల్లో గుబులుకుంటున్న ఆక్రోశం బయటపడకూడదు. కన్నీళ్ళు కనిపించకూడదు. ఇంట్లో ఇంత గొడవ జరిగినట్లు మాష్టారు ఏమాత్రం పసికట్టకూడదు. కొంత కష్టమే అయినా మనసులోలేని గాంభీర్యాన్ని తెచ్చిపెట్టుకున్నాడు రంగనాథం!

"అబ్బే ఏంలేదు మాష్టారు! నాన్న రెండురూపాయలుంటే యిమ్మన్నాడు!" అన్నాడు. అబద్ధం ఆడుతున్నట్టు కనిపించకుండా మొగం క్రిందికి దించుకున్నాడు.

"దానికేమిటోయ్! ఎందుకంత మొహమాటం మనలోమనకి?" అంటూ రెండ్రూపాయలనోటు చేతిలోపెట్టారు. పెడుతూనే అన్నారు "చాలాబాబూ" అని.

"చాలండి!" అనేశాడు రంగనాథం అనాలోచితంగానే! "థ్యాంక్యూ మాష్టారూ! వస్తా" అంటూ బయల్దేరాడు.

గుండెగుబగుబలాడుతోంది. చేసిన తప్పుదయ్యంలా వెంటాడుతోంది. దైన్యం వెన్నాడుతోంది.అడుగులు తొందరగా పడుతున్నాయి. ఇంటికికాదు రైలుస్టేషనుకి! ఇంకోగంటలో విశాఖవెళ్ళే ఎక్స్‌ప్రెస్ వుంది. స్టేషన్ మూడు మైళ్ళుంది. నడుస్తున్నాడు రంగనాథం! మనసు నిండాభయం మంచిమేష్టారితో అబద్ధమాడినందుకు పశ్చాత్తాపం! ఏం జరుగుతుందో తెలియని ఆందోళన...

"చాలాబాబూ ?" అని అంత ఆప్యాయంగా సూరీడుమాష్టారు అడిగినపుడు మరో రెండు రూపాయలు తీసుకుంటే ఏంపోను? తన్ను తనే తిట్టుకున్నాడు రంగనాథం. ఆమాత్రం సాహసానికే గంగవెర్రులెత్తిపోయాయే? మరింత పెద్దఅబద్ధం ఎలాఆడగలడు ? ఆలోచనల వేగంలోదారి తరుగుతోంది. ఆలోచనలు! ఎన్ని పుట్టుకొచ్చినా ఒక్కటీ తన బాధ కడతేర్చేదిగాలేదు.

చెప్పా చెయ్యకుండా ఇల్లు విడిచి బయల్దేరాడేగాని తరువాత కర్తవ్యం ఏమిటో తోచిచావడం లేదు. తీరా అక్కయ్య దగ్గరకు వెడితే 'మీ నాన్నకి చెప్పకుండా ఎందుకు వచ్చావని బావ చీవాట్లు పెడితే !...తాను అనవసర అపవాదు మోయాలని భయపడితే !... "వెళ్ళి చెప్పిరా !...పో" అంటే !

వెళ్ళగానే ఉద్యోగం దొరక్కపోతే ? ఎన్నాళ్ళని అక్కా బావా తేరగా తన్ను పోషిస్తారు ? అందులోకీ విశాఖపట్నంలో బ్రతుకు గడపడం ఎంతకష్టం ! పోనీ తన కంతకన్న గత్యంతరం మాత్రం ఏముంది ? బొమ్మని నాన్న కసిరి కొట్టినపుడు - సిగ్గు లేకుండా ఎలాపడి వుంటాడు ?

ఆలోచిస్తూ...ఆలోచిస్తూ స్టేషనుకు చేరుకున్నాడు రంగనాథం. యధాలాపంగా బుకింగ్ ఆఫీసు దగ్గరకు వెళ్ళాడు. గంట ఆరు చూపుతోంది. అస్తమించిన సూర్యబింబం కనిపించకపోయినా, ఆకాశం జేవురించి వుంది. ఇంకో పన్నెండు నిమిషాలలో విశాఖవెళ్ళే ప్యాసింజరు రావాలి. ఎక్స్‌ప్రెస్ గంటన్నర లేటు !- బ్లాక్‌బోర్డు సమాచార మందించింది. అటూ ఇటూ పరికించాడు రంగనాథం. ఎరిగిన మొగ మొక్కటి లేదు. టిక్కెట్టు తీసుకొన్నాడు. పదిపైసలూ టికెట్టూ చేతిలో పెడుతూ బుకింగ్‌క్లర్కు ఎందుకో తేరపారి చూశాడు. ఆ చూపు లెందుకో అతడిని భయపెట్టాయి. గబుక్కున చూపులు దింపుకున్నాడు.

ప్లాట్‌ఫాంమీద విశాఖ వైపుగా నడుస్తున్నాడు రంగనాథం. ఒళ్ళంతా పూవుల సువాసనలు పూసుకొని ఠీవిగా నించుంది పున్నాగ చెట్టు. గుడ్డల్లేని కుర్రాళ్ళెవరో పున్నాగపూవు లేరుకుంటున్నారు. ఒక డిప్పకాయ వెధవ పూవుకాడ నోట్లో పెట్టుకుని బూరా ఊదుతున్నాడు. ఓ మేక పూవు లేరుకుంటోంది. ఒడేసి నములుతోంది. కళ్ళు పారవశ్యంగా తిప్పుతూ, తన్నే చూస్తోంది.

అలా చూస్తుంటే గాలికి కదిలిన చెట్టు పూలవాసన లందించింది.

వాసన తగిలేసరికి జేబులో నలుగుతున్న సిగరెట్టు జ్ఞాపకం వచ్చింది. తీశాడు. వంకిర్లుతిరిగింది. బెంచీబల్లమీద సాపుచేసుకున్నాడు. "ఎంత సుఖంగా ఉందామేక?!" అనిపించింది రంగనాథానికి. వెంటనే మేకనైనా కాకపోతిని" అని బిగ్గరగా పాడాలనిపించింది.

అరటిపళ్ళ వ్యాపారస్తుడి దగ్గరకుపోయి సిగరెట్టుకు నిప్పంటించుకున్నాడు. పొగ దట్టంగా లాగుతూ, అటూ ఇటూ తిరుగుతున్నాడు.

పడమటి ఆకాశంలో రంగులు మారుతున్నాయి. పున్నాగచెట్టు నీలిరంగు మేలిముసుగు వేసుకుని హుందాగా నిలచింది.

ప్రళయ భీకరంగా శబ్దాలు చేసుకుంటూ ప్యాసెంజరు వచ్చింది. ఆగింది. దాదాపు ఎదురుగా ఉన్న మూడో తరగతి బోగీలో ఎక్కాడు. అదృష్టవశాత్తూ తను కూర్చుందుకో సీటు లభించింది, గుమ్మంప్రక్కనే ఉన్న సీటు. లెవేటరీ వాసన కొంచెం దుర్భరంగానే వుంది. అయినా కూర్చోడం తప్పలేదు. వేళ్ళు కాలుస్తూంటే సిగరెట్టు విసిరేశాడు. బండి ఈల వేసింది. ఒక్క కుదుపు కుదిపింది. హుషారుగా కదల నారంభించింది.

బోగీలో ఎంతమంది ఉన్నా తాను ఒంటరిగానే ఉన్నాడు. ఒంటరితనం అవమానం కన్న భరింపరాని శాపంలాగుంది. సరే, ఏంచేస్తాడు. తీవ్రంగా ఆలోచించుకుంటున్నాడు. భవిష్యత్తు కనుచూపు మేరలో ఎక్కడా కనిపించడంలేదు. ఏంచేయాలి ? .. ఎలా ? ఎలా ? ..

బియ్యే అనిపించుకుంటే ఎంతబాగుండేది ? అదే అన్ని ఆలోచనలకీ ముగింపు. అదే వుంటే తన కీపాట్లు ఎందుకు వస్తాయి. అదే చివరి తెరజార్చే విరక్తి ! !

స్టేషన్లు ఒకటొక్కటే విడిచిపెడుతోంది రైలు. కడుపులోఆకలి దహించుకు పోతోంది రంగనాథానికి. ఎప్పుడో పదకొండుగంటలకు తిన్న పిండాకూడు. ఏమైపోయిందో తెలియదు. లోకమంతటా చీకటి ఆవరించుకొంటోంది. చెట్లు చీకటి ముద్దల్లా పేరుకుంటున్నాయి. చెట్లమీద కునుకుతున్న పిట్టలు రైలు వేగానికి కలవరపడి లేస్తున్నాయి.

ఏదో స్టేషను వచ్చింది. చాలా సేపాగింది రైలు. తీరా కదలబోతుండగా ఒకస్థూలకాయుడు ప్రవేశించాడు. ఊతకోల సహాయంతో లోపలికి జరిగాడు. నల్లగా శిలావిగ్రహంలాగున్నాడు. ముఖంనిండా మశూచి గుంటలు....కనుపాపలు తెల్లగా నున్నాయి. బలంగా ఎత్తుగా వస్తాదులాగున్నాడు.

రైలు కదిలింది. ఉన్నంతలో వేగం పుంజుకుంటోంది. ఆగంతకుడు గొంతుసవరించుకున్నాడు. "బాబూ ! ఏలినవారు ! కళ్ళు రెండూ లేని కబోదిని...మీరే తల్లీ తండ్రీ....చుట్టముక్క కాల్చి పారేసినంత బాబూ నా బ్రతుకు !...." అంటూ కర్రచప్పుడు చేసుకుంటూ కదలనారంభించాడు.

ముష్టివాణ్ణి ఆపాదమస్తకం పరికించాడు రంగనాథం. వాడి ఆకారం నిజంగా భయం కలిగిస్తోంది.

"ఛీ దొంగవెధవలు.. అంతా మోసం" అనుకున్నాడు రంగనాథం. ఇంతకీ వీడు గుడ్డివాడేనా ? పరీక్షించాలన్న తుంటరి బుద్ధి పుట్టింది. ముష్టివాడు తన ముందునుంచి వెడుతున్నాడు. కాలు అడ్డం పెట్టాడు రంగనాథం. వాడి కాళ్ళు మెలికిపడి ముందుకు తూలాడు. పడిపోబోయాడు ముష్టివాడు. ఆపుకొని నిలదొక్కుకున్నాడు.

"బాబూ ! గుడ్డివాణ్ణి నాయనా, కాళ్లు తీసుకోండి బాబులారా" అంటూ దీనంగా ప్రార్థించాడు. చప్పున కాళ్లు ముణగదీసుకున్నాడు రంగనాథం.

"ఆకలి బాబూ ! అన్నదాతలారా !... అన్నపూర్ణ తల్లీ ధర్మం ముష్టివాడు సాగుతున్నాడు. సీటు పొడుగునా ధర్మాత్ములు నయాపైసలు పడేస్తున్నారు. చిట్టచివరి వరకూ వెళ్లి దారి మూసుకుపోవడంతో వెనక్కి మళ్లాడు గుడ్డివాడు. "ఆకలి బాబూ !" అంటూనే ఉన్నాడు.

ఆకలి.... అవును, తానెప్పుడో తిన్న మెతుకులు అరాయించుకు పోయాయి. మధ్యాహ్నం కాఫీ కూడా లేకపోయింది. ఆకలి ంచేస్తోంది. శ్రీకాకుళపట్నం వెళ్లేసరికి పదిదాటు తుందేమో ! తన గ్గర అమాంబాపతూ అరవై పైసలే ఉన్నాయి. సిగరెట్టు ముక్క కూడా లేదు. తీరా చేసి సింధియా క్వార్టర్సు వరకూ నడచిపోతే అక్కయ్య తన కోసం వండి వార్చి పెడుతుందా ? దారిలోనే కాస్త ఎంగిలి పడి పోతే !...ఎలా మరి ?

గుడ్డివాడు సమీపించాడు. నిజమే వాడుపూర్తిగాగుడ్డివాడే. తిండిపుష్టి ఉన్నట్టు బలంగానే ఉన్నాడు. తానాకళ్లున్నవాడే తనకా విషయం పూర్తిగా తెలుసు. గుడ్డివాడి కడుపులో ఆకలి ఉందోలేదో తనకు తెలియదు. తన కడుపుమాత్రం ఆకలితో కాలిపోతోంది! కాని ముష్టి వాడికి కళ్ళనిండా గాఢమైన చీకటి ! బ్రతుకంతా చీకటి !

తోటి ప్రయాణీకులు తన్ను గమనించకుండా జాగ్రత్తపడ్డాడు రంగనాథం! "ఆగరా–అబ్బి!" పుండాగా, తన పదిపైసల బిళ్ళ గుడ్డి వాడి చేతిలో పడేశాడు. వాడిచేతిలోని ఏభై పయిసలబిళ్ళ తీసుకున్నాడు. గుడ్డివాడి చేతిలో గుప్పెడు డబ్బులున్నాయి!

బోగీలో కునుకుతున్న దీపాలవెలుతురులో చేతిలో బిళ్ళతెల్లగా మెరుస్తోంది. ఎవరూ చూడకుండా జేబులో భద్రంచేసుకున్నాడు రంగనాథం!

గుడ్డివాడు సాగిపోయాడు!

గుడ్డివాణ్ణి ఆకలి బిచ్చగాణ్ణి చేసింది! మరితన్ని ?

అవునా! ఆకలిమాత్రం అనంతగా ప్రయాణం సాగిస్తోంది ! మనుషుల నైజాలు మార్చేస్తోంది !!!.

చిత్తకార్తెలో చినుకులు

శ్రీ పులికంటి కృష్ణారెడ్డి

నీకైనా నాకైనా
లోకంలో ఇంకెవరికైనా
ఉండేది పిడికెడంత గుండె
ఆ పిడికెడంత గుండెలో ఋమిడుండేది
ఆకాశమంత అనుభూతి ! సముద్రమంత సానుభూతి !!
పంచ పంచకు పంచగలిగినంత ఆత్మీయత
మానవత్వాన్ని ప్రేమతత్త్వాన్ని పెంచగలిగినంత అనురాగం !
ఆ మాటకొస్తే మహాత్ముడిది పిడికెడంత గుండెకదా ?
ఆంధ్రకేసరికి, అల్లూరి సీతారామరాజుకు, నేతాజీకి
అంతకంటె పెద్దగుండెలా ?
పరిమాణంలో ఒక్కటైన గుండెల్ని
ఫలసిద్ధిలో ఒక్క త్రాసులో తూచడం సాధ్యమా ?
అందుకే నా ఒక్కదిక్కూ కూడా శాంతిలేకుండా చేసింది ఆమె గుండె
మానవత్వాన్ని, ప్రేమ తత్త్వాన్ని, అనుభూతుల పొత్తాల్ని,
గుండె పొరల్లోంచి గుట్టుగా పెకలించి
"నా గుండె నాగసాకి !" అని సాగతీసింది
ఆ సాధింపులో, వేధింపులో, బాధింపులో బందీకృతుడై
గుప్పెడు సానుభూతి కోసం గుట్టుగా ఏడుస్తున్నాను
ఎన్నో నాళ్లుగా....ఎన్నో యేళ్లుగా !
ఇన్నాళ్లుగా యిన్నేళ్ళుగా కార్చిన కన్నీళ్లను
దోసిళ్ళతో పట్టి ఒక్కచెట్టుకు పోసివుంటే
నేను చూస్తూ చూస్తూ ఉండగానే
ఆ మొక్క మోసులు వేస్తూ, పూస్తూ, కాస్తూ. అంతై యింతై

నా కళ్లలో కాంతిని నలుగురికి ప్రశాంతిని
ప్రసాదించే మహావృక్షమయ్యేది !
ఆ మహావృక్షం
ఒక చల్లని గాలివీచి, ఒక నల్లని మేఘాన్ని ఆపి
నా కన్నీటి బొట్లులా నాలుగు నీటిబొట్లనురాల్చి
నెర్రెలు నెర్రెలైన పుడమి తల్లి గుండెల్లో
తడారి పొడారి పరితపించే గొంతుల్లో
చిటికెడంతహాయిని చిగురింపచేసేది !
నా కన్నీటిని తాగితాగిన వ్యాకృతులందుకొన్న ఆ మహావృక్షం
పూసిన పువ్వును, వేసిన పిందెను, పండిన పండును
రాల్చిన ఆకును, కొమ్మకొమ్మనూ, రెమ్మరెమ్మనూ
అణువణువును అర్పించి
ఒక్క అంగుష్ఠాన్ని మాత్రమే అర్పించిన ఏకలవ్యుణ్ణి
తొడమాంసాన్ని మాత్రమే కోసి తక్కెడలో పెట్టిన శిబిని
నిలదీసి అడిగేది
ఎవరు త్యాగమూర్తులో చెప్పండని
"సఖ్యం సాప్తపదీనమ్ !" అన్నారు కదా ?
ఏడడుగులేనా నేను కలిసి నడిచింది ?
కాదు ఎన్నో వేల అడుగులు ! కొలతకందని పరుగులు ! !
అయితే మిగిలిందేమి ? ఈ ప్రశ్నే !
ఆ నడకను ఉద్యమాల వెంట కొనసాగించి వుంటే ?
ఒక విప్లవ కారుడితో విజృంభించివుంటే ?
ఒక కుంటికో గుడ్డికో మార్గాయానంలో ఆధార ఆశారేణువయ్యుంటే
అవమానపడిన యే అక్కనో, దగాపడిన యే చెల్లెలినో
ఈ ఆత్మీయతానురాగాలలో తల మునకలు చేసివుంటే ?
ఉడతాభక్తి కది ఊపిరి ! మనిషి కది మగసిరి !
ఇప్పుడీ ఆలాపన వృథాప్రేలాపన
స్వాతి కార్తెలో ముత్తెపుచిప్పలో పడిన చినుకులే ముత్యాలు
చిత్తకార్తెలో చినుకులు నా కన్నీళ్ళలా వ్యర్థాలు !

నా౽నృషిః కురుతే కావ్యమ్

శ్రీ దిలావర్

నిన్న........
అల్లరిగా యీలవేసి
ఆశల పిల్లతెమ్మెరల రొద
అడుగడుగునా భోగభాగ్యాలు
పూలతెప్పలుగా పరచిన రథ్య
చిగురు కెరటాల చేతుల
కౌగలింతల మధ్య
దొరికిన సుఖాలన్నీ దోచుకుంటూ
కలల నదిలో
లాహిరిగా కదిలింది బతుకునావ !
నేడు........
అతలాకుతలం చేస్తున్న
ఆపదల తుఫాను రొద
అడుగడుగునా నోరు తెరుచుకున్న
నిరాశల సుడిగుండాల రథ్య
జ్వాలల నాల్కలు చాచిన
సమస్యల బడబానలం మధ్య
కష్టాలతోనే కడుపు నింపుకుంటూ
కన్నీటి కడలిలో
భారంగా సాగింది బతుకునావ !

నిన్న నేడుల యీ సమాంతర తీరాలదూరాలు
ఎన్నడయినా చేరువయ్యేనా.... ?
ఎన్నరాని దుర్భర బ్రతుకుభారాలు
ఎప్పుడయినా దూరమయ్యేనా.... ?

"ఈ అనుభవాల జలావర్తంలో
ఎన్నెన్ని కలల బుద్బుదాలో.... !
ఎన్నెన్ని కన్నీటి తరంగాలో....!"అనుకొని
లోలోపలి "క్రాంతదర్శి" నవ్వుకున్నాడు అలౌకికంగా !
"ఏకోరసః కరుణ...." అన్న భవభూతిలా !
ఈ జీవిత సత్య శోధనాన్ని
దర్శించలేనివాడు ఋషికాలేడు !
కలలూ కన్నీళ్ళూ కలబోసిన జీవత్కావ్యాన్ని
ఋషి కాలేనివాడు సృజించలేదు !

నల్లమబ్బుకో వెండిఅంచు

ఘండికోట
బ్రహ్మాజీరావు

(గ త సం చి క త రు వా యి)

సత్యనారాయణను చూడగనే సరస్వతి గతుక్కుమంది. ఇటువంటిపరిస్థితి ఆసన్నమవుతున్నదని ఆమె ఊహించింది. కాని ఏవిధంగా దానిని ఎదుర్కొనాలో ఆమె నిశ్చయించలేదు. అన్నింటికి ముఖ్యమయినవి మాట చాకచక్యం, ధైర్యము.

"సరస్వతీ!"... సత్యనారాయణ చాల మెల్లగా పిలిచాడు.

సరస్వతి తలెత్తిచూచింది. నల్లరంగువేసిన జుత్తుకి బ్రిలియంటెయిను పూయించుకున్నాడల్లే ఉంది. గ్రీసువంటి ఆముద్దతో వెంట్రుకలన్నీ బల్లపరుపుగా పడుక్కున్నాయి. జునపాలు చెంపలమీదకి ఈరోజు మీసం పూర్తిగాలేదు. కళ్లకు సుర్మాచాల సన్నంగా పెట్టుకున్నాడు. అతని వేళ్ళలో సిగరెట్టు వెలుగుతున్నది. రెండవచేతిలో గోల్డు ఫ్లేకు సిగరెట్టుపెట్టిఅగ్గిపెట్టి ఉన్నవి. రంగుచారల లుంగీకట్టుకున్నాడు. కట్ బనియను వేసుకున్నాడు.

సరస్వతి అతనిని చూస్తూ ఏమీ జవాబుచెప్పలేదు.

"సరస్వతీ!" సత్యనారాయణ రెండోసారి మరీముద్దుగా పిలిచాడు

"ఆ!" అంతమాత్రమే బదులు చెప్పింది ఆమె.

"అక్కయ్య ఎక్కడికెళ్ళింది." అన్నీ తెలిసి అతను ప్రశ్న వేశాడు.

"ఆఫీసుకెళ్ళింది, పిన్ని!"

"వెళ్ళినప్పుడు ఏమేనా చెప్పిందా?"

"చెప్పింది మూడుగంటలకు మీకు కాఫీచేసి యిమ్మంది".

"ఇప్పుడెంత టయిమయింది?"

"రెండు గంటలు"

"అయితే మనమిద్దరం సరదాగా ఒకగంటవరకు మాట్లాడుకో వచ్చు నన్నమాట".

సత్యనారాయణ అడుగులు ముందుకువేసి సరస్వతి మంచంమీద కూర్చున్నాడు. సరస్వతిలేచి, టేబులుదగ్గిరనున్న కుర్చీమీదకూర్చుంది.

"నిన్నుచూచిన దగ్గరనుంచీ రహస్యంగా నీతోమాట్లాడాలని అనుకుంటున్నాను".

"ఇంతకీనాతో రహస్యంగా ఆడవలసిన మాటలేమున్నాయి?"

"వయసులోనున్న చిన్నవాడు,చిన్నది ఏమిమాట్లాడుకుంటారు? నీకు మాత్రం తెలియదా.... నీగురించి మా అక్క చాలాచెప్పింది. నేను స్వయంగా నిన్నుచూచి చాలాసంతోషించాను."

"మంచిదే"

"నాగురించి నీకు అట్టే తెలియదు. నేను విజయనగరం సిటీ అంతటికీ మాంచి నోటెడ్ మనిషిని.

"ఆలాగా!"

"నాఉద్యోగం ఎక్కడోతెలుసా కోపరేటివ్ స్టోర్సులో బట్టలు అమ్మేస్టోరు కాదది. బంగారంవంటి పంచదార అమ్మేస్టోరు. పెద్ద పెద్ద వాళ్ళరేషన్ కార్డులన్నీ మాస్టోరులోనే ఉన్నాయి. అందరూ పెద్దింటి వాళ్ళుకదా! వాళ్ళకు పంచదారంటే మహాప్రీతి. అదిలేకపోతే క్షణం వెళ్లదుకదా? కాఫీ, టీలులేకపోతే లోకమే ఆగిపోతుంది. అన్నిటికి ప్రాణం పంచదార! అదినా కంట్రోలులో ఉంటుంది".

"ఓహో"



"కానీ ఈపెద్దవాళ్లతో ఒక్కటే చిక్కు. వారుస్నేహం చేశారా అంటే ఎంతగా గౌరవిస్తారో తెలుసా? వాళ్లుగాని, వాళ్లబంట్రోతులు గాని వచ్చి, సత్యనారాయణగారూ అంటూ ప్రాణాలు తినేస్తుంటారు".

సత్యనారాయణ తమాయించుకున్నాడు.

"పెద్దవాళ్ళు బరువులు మోయరుకదా! బంట్రోతులు లేనిదే ఏపని జరుగుతుంది. పెద్దవాళ్లందరూ నన్ను బతిమాలుతుంటారు. రోడ్డు

మొయ్యాలనిపిస్తారు. వాళ్ళు ఎన్నివిధాల బ్రతిమాలినా నేను మాత్రం ఒకకిలోనో, రెండుకిలోలో ఇప్పిస్తాను."

"చాలా బాగుంది"

"ఇది ఎలా సాధ్యమవుతుందని అడిగావేమో! కొన్ని పోస్టు రేషన్ కార్డులుంటాయి. అవి నాస్వాధీనంలో ఉన్నాయి. వాళ్లకి నాలుగు కిలోలిచ్చేచోట రెండేయిస్తాను. వాళ్ళేమైనాఅంటే దొంగకార్డులని రిపోర్టుచేస్తానని బెదిరిస్తాను. మరొక విధంగా ఏమిచేస్తామంటే, తూచేటప్పుడు కిలోకి నూర్గ్రాములు తగ్గించి తూస్తాము. బస్తాకు పదికిలోలు మిగులుతాయి. సాయంకాలం స్టోరుమూసేసరికి మాలో ఒక్కొక్కడికి పదిహేను ఇరవై రూపాయలు కిడతాయి".

సరస్వతి చిన్ననవ్వు నవ్వింది. ఒకేచిన్న ప్రశ్న మళ్ళావేసింది.

"అయితే మీది స్టోరులో పంచదార తూచేఉద్యోగమన్నమాట!"

సత్యనారాయణ నాలుక కరుచుకున్నాడు. తానుమంచిప్రయోజకుడని ఆర్జనపరుడని, తనను పెండ్లాడినామె జీవితంలో ఏలోటూ వుండదని చెప్పదలచాడు. కాని సులువుగా దొరికి పోయాడు.

"లేదు, లేదు నేను అక్కడ తూకాలుతూచే గుమాస్తాని" కొందరు అబద్ధం చెప్పేటప్పుడు కొందరియెదుట తడబడతారు.

"అవునవును. కొంచెంసేపు ఓపికపట్టండి. మీకు మూడయేసరికి కాఫీయిమ్మని పిన్నిచెప్పింది. ఇప్పుడుకుంపటి ముట్టిస్తే అప్పటికి కాఫీ తయారవుతుంది. అంతవరకు హాలులో మీకోసం వేసిన వాలు కుర్చీలో కూర్చుని సిగరెట్లు తాగండి.

సరస్వతి మరేమీ మెచ్చుపలకకుండా వరండాలోకినడిచి,మెట్లు దిగి వంటింట్లోకి వెళ్లింది.

సత్యనారాయణకు చాలాకోపమొచ్చింది, సరస్వతిమీదకాదు, తనమీదే. ఇంతవరకూ తనే మాటకారిననుకున్నాడు. చాలచిన్నవిషయాలలో ఈ అమ్మాయి తనని పల్టీకొట్టించింది. ఈ పొగరుమోతు పిల్లను స్వాధీనం చేసుకోడానికి రెండేమార్గాలు. పెళ్లిచేసుకుంటానని అందుకు అక్కయ్య,బావ ఇద్దరూ సుముఖులేనని చెప్పడం, అందుకు అంగీకరించకపోతే బలవంతంచేయడం. దేనికైనా అక్కసంతోషిస్తుంది.

సరస్వతి కాఫీ తెచ్చేసరికి, హాలులో వాలుకుర్చీమీద కూర్చున్నాడు సత్యనారాయణ. చిన్నస్టూలుముందుకులాగి, కాఫీగ్లాసు దానిమీద పెట్టింది ఆమె.

"సరస్వతీ! నామీద కోపమా?"

"మీమీద కోపందేనికి"

"నేనెవడనో పరాయివాణ్నికాను సాక్షాత్తు మీపిన్నితమ్ముడినే"

"నేను కాదనడంలేదు కదా!"

"అయితే నన్ను మామా అని పిలువు"

"మామా అనా?..." సరస్వతి కొంచెంకోపంగా అంది.

"అవును మామా అని పిలువలేకపోతే బావాఅని పిలువలేవా?

"బావా అనా?" ఆమెకు కోపం పెరిగింది.

"అవును ఇవాళనుండి మాఘమాసంమొదలవుతున్నది. మంచిరోజున మనిద్దరికి పెళ్లయితే, నన్నుమర్యాదగా మామాఅని పిలుస్తావో లేక ముద్దుముద్దుగా బావాఅని పిలుస్తావో! నువ్వే ఆలోచించుకో"

"ఏమిటేమిటి?.... ఏమంటున్నావ్?... మనిద్దరికి పెళ్లా?"

సరస్వతికి ఒళ్ళుమండిపోతున్నది.

"నీకింకా తెలీదా! నేనెందుకొచ్చాననుకున్నావ్!... పెళ్ళిచూపులకేనే ఓ అమ్మాయి."

సరస్వతికి కోపంహెచ్చవుతున్నది. కొంచెం దానిని అదుపులోకి తెచ్చుకుంది. పిన్ని వేసినప్లాను బోధపడుతున్నది. అపుడు సరస్వతి ఒకనిశ్చయానికి వచ్చింది.

"నీవంటి తల్లిలేని పిల్లకు నాకన్నమంచి వాడెవడు దొరుకుతాడు? అక్కయ్య, బావాఇద్దరూ మనపెళ్లికి ఆమోదించి తథాస్తు అన్నారు."

"మీబావకూడానా?"

"అవునవును సాక్షాత్తు మీనాన్నే అన్నాడు. మా అక్కయ్యతోనేకాదు, స్వయంగా నాతోనే అన్నాడు".

"మంచిదే."

"అయితే నీకుకూడా నచ్చినట్లే"

అవునవును అదే ఆలోచిస్తున్నాను."

సరస్వతిముఖం కోపంతో ఎరుపెక్కింది.

సత్యనారాయణకి ఈసరికిఅర్థమైంది. సరస్వతి తనని చులకనగా చూస్తున్నదని. అతనికి కూడా కోపమొచ్చింది.

సరస్వతీ! ఈ డొంకతిరుగుడు కబుర్లుకట్టిపెట్టు. నీకునచ్చినా వచ్చకపోయినా ఈపెళ్ళి తప్పనప్పుడు నిన్నుమంచిగా అడగడంలో ఏమీ అర్థంలేదు".

"చూడు! నీపేరేమిటన్నావ్?" సరస్వతి బొమలు ముడిచింది.

"నీకుతెలియదా, నాపేరు సత్యనారాయణని?"

"అయితే సత్యనారాయణా! విను.... నాశరీరంలో ప్రాణమున్నంతకాలం నిన్ను పెళ్ళిచేసుకోను"

"నేనూ చూస్తాను".

సత్యనారాయణలేచాడు. కట్టుకున్నలుంగీ జారిపోతున్నది. అట్ట కట్టినజుత్తురేగిపోయింది. కళ్ళకుపెట్టిన సుర్మాకొంచెంచెదిరి అసహ్యం వేస్తున్నది.

సరస్వతిని వెంబడించాడు సత్యనారాయణ. ఆమె డాబామీదకి పరుగెత్తింది. అతను వెంటపడ్డాడు. ఆమె వరండాలోకి రాబోయింది. ఆమెకన్నాముందు మెట్లదగ్గర అడ్డుగా నిలబడ్డాడు.

సరస్వతి అతనిని తోసుకొని కిందకు పోదలచింది. సత్యనారాయణ ఒకమెట్టుదిగి,పిట్టగోడపట్టుకొని, సొట్టకాలుఅడ్డుపెట్టి నిలపడ్డాడు.

పిరికిపందలా కిందికి పారిపోవడానికి ఆమెకు మనస్కరించలేదు. సరస్వతి మెట్లవేపు వెళ్ళకుండా వరండాలోనే నిలబడిపోయింది. కోపంతో ఆమెశరీరం కంపిస్తున్నది.

"సత్యనారాయణా! ఆమె ఉరిమింది.

సత్యనారాయణ కదలలేదు.

"నువ్వు దారికి అడ్డు తొలగకపోతే నేను భయపడను. ఎవరినీ సహాయం కోసం కూడా పిలువను. నీకు ఒక్క అయిదు నిమిషాలే టైమిస్తున్నాను. ఆలోచించుకో. కాలేజీ కబాడీ పోటీలలో చాలాసార్లు గెలిచాను. మర్యాదాగా అడ్డు తొలిగిపోయి, డాబామీద కుర్చీలో కూర్చున్నావో మంచిదే లేకపోతే కాలుతో ఒక్క తాపు తంతే మెట్లమీద నుంచి దొర్లి మిగిలిన అవయవాలు విరుచుకుంటావు. హాస్పిటలులో చేరుతావో, లేకపోతే బుద్ధిగా రేపు విజయనగరం వెళ్లిపోతావో ఆలోచించుకో !"

అంతటి పెంకి సత్యనారాయణ భయపడిపోయాడు,ఉగ్రరూపం దాల్చిన సరస్వతిని చూచి మెల్లగా డాబామీద నున్న కుర్చీలో కూర్చున్నాడు.

"పిన్ని వచ్చేవరకు ఇక్కడనుండి కదలడానికి వీలులేదు. తరువాత నీ యిష్టం."

సత్యనారాయణ తల గోక్కున్నాడు. చేతిలో నున్న సిగిరెట్టు పెట్టె విసిరి వేశాడు.

'ఈ వెధవ సిగిరెట్లు పనిచేయడం లేదు. నా జేబులో బీడీకట్ట ఉంది, తెచ్చి పెడుదూ !"

"నువ్వే తెచ్చుకో ! నువ్వు పురుగువి. నీ వస్తువులను నేను ముట్టుకోను."

మెల్లిగా అడుగులో అడుగులు వేసుకుంటూ సత్యనారాయణ హాలులోకి వెళ్లి బీడీకట్ట తెచ్చుకొని, కుర్చీలో కూర్చున్నే వరకు సరస్వతి వరండాలో నిలబడింది. తరువాత రాత్రి వంటకని మెట్లుదిగి కిందకు వెళ్ళింది.

7

శకుంతల ఏకాంతంగా తమ్ముడితో మాట్లాడడానికి వీలు చిక్కలేదు. తమ్ముడి సుఖానికి అంతరాయం కలుగకుండా ఆమె ఏడుగంటల తరువాత వచ్చింది. ఆమె వెనుకనే ఆనందరావు వచ్చాడు. ఏ విధమైన అవకాశం కలుగలేదు. సరస్వతి ముఖంలో ఆనందంకాని, విచారంకాని వ్యక్తం కాలేదు. ఇంట్లో ఎటువంటి మార్పు కనిపించలేదు. తాను వచ్చేసరికి తమ్ముడు డాబామీద బీడీలు కాల్చుకుంటూ కూర్చున్నాడు. వాడిలో పెళ్ళికొడుకు లక్షణాలేవీ ఆమెకు కనిపించలేదు.

"ఏమిరా కాయా ! పండా ?" అడిగింది ఆమె.

కాని వెనుకనేఆనందరావు మాటలుమెట్లమీదనుండివినిపించాయి.

"శకుంతలా ! శకుంతలా ! నీ ఆర్డర్లు నేను తీసుకొని వచ్చాను. రా ఇలా !"

మరి తమ్ముడితో ప్రసంగించడానికి వీలు చిక్కలేదు. రాత్రి భోజనాల వేళ బావగారితో తమ్ముడు మాట్లాడాడు.

"నేను ప్రొద్దున్న బస్సుకి రేపువెళుతున్నానండి బావగారూ."

"అప్పుడే నువ్వు వచ్చి మూడు రోజులేనా కాలేదు కదా మీ అక్కయ్య నీకేమీ చేసిపెట్టలేదు. రెండు మూడు సినిమాలేనా నీతో చూడలేదు."

''ఆఁ! వాటికేం సెలవు మూడురోజులే పెట్టాను. అనవసరంగా పొడిగించడం ఇష్టంలేదు, మళ్లా మళ్లా నేను రావలసిన వాడినే కదా !''

''మీరు వాడికి ఈ ఊళ్లోమంచి ఉద్యోగం వేయిస్తే, మీకు సహాయంగా ఉంటాడు. మీకు బావ, పిల్లకుమామ, నాకు తమ్ముడు. వాడికి లోటుండదు. మీరంటే వాడికి చాల గౌరవం'' అంది శకుంతల.

తండ్రికి నేయి వడ్డిస్తున్న సరస్వతి ఏమీ విననట్టే పని చేసుకొని పోయింది.

ఆ రాత్రి చాలా విషయాలు భార్యాభర్తలు మాట్లాడుకున్నారు. అందులో సరస్వతి వివాహ విషయం ప్రాముఖ్యత వహించింది. తమ్ముడి యోగ్యతలు, విజయనగరంలో వాడికున్న పరువు, ప్రతిష్ట, సంసారానికి వాడు చేస్తున్న సహాయం మొదలైన విషయాలన్నీ ఆనందరావు తలలోకి ఆమె బలవంతంగా ఎక్కించింది. ఎప్పుడో అర్ధరాత్రి ఆమె ముహూర్తం గురించి అడిగేసరికి ఆనందరావు గురకపెట్టి నిద్రపోతున్నాడు.

పొద్దున్నే సత్యనారాయణ కాలకృత్యాలు తీర్చుకొని ఎర్రరంగు పెట్టిలో బట్టలు సర్దుకున్నాడు. గడ్డం మాసిపోయినా, తలపైని వెంట్రుకలు నిలబడినా మరి బాధ పడలేదు. ఉన్న బీడీలన్నీ గడచిన సాయంకాలం డాబామీదే ఊదేయడంచేత, ఒక్క బీడీకూడా లేక కాలుకాలిన పిల్లిలా అయిపోతున్నాడు.

అప్పటికే ఆనందరావు లేచి, కాఫీ తాగి, కుర్చీలో కూచొని ఆఫీసు కాగితాలు చూచుకుంటున్నాడు.

''బావగారూ ! వెళ్తున్నానండీ !''

''మంచిదోయ్ సత్యనారాయణ! బట్టలేమీ నీకుకొనలేకపోయాను. బస్సుఖర్చులకు ఈ ఇరవై రూపాయలు తీసుకో ! అవకాశం దొరకగానే నీకు ఇక్కడ మంచి ఉద్యోగమే వేయిస్తాలే. నీ స్కూలు సర్టిఫికెటు కాపీలు తీయించి పంపించు.'' అన్నాడు. ఆనందరావు, జేబులోని ఇరవై రూపాయల నోటు బావమరదికిస్తూ. శకుంతల ముందుగానే ఈ ఏర్పాటు చేసింది. లేకపోతే ఆనందరావు జేబులో అయిదు రూపాయలకన్న హెచ్చు ఉంచదామె.

సత్యనారాయణ మెట్లు దిగి కిందకు వచ్చాడు. శకుంతల వంటింట్లో ఉంది. సరస్వతి స్నానానికి వెళ్లినట్లుంది. దగ్గిరలో కనిపించలేదు.

''ఏం రా సత్యం !.... కాయన్నావు రాత్రి. మరి మాట్లాడ డానికే వీలు చిక్కలేదు. ఇప్పుడు నాకు చెప్పు వివరాలు.'' అంది శకుంతల. కాఫీ కలుపుతూ.

''అవును కాయే !... చదువుకున్న తొత్తుకూతురు పొగరెక్కిన పిల్ల...నన్ను ఎంత అవమానించిందో తెలుసా ! నీ ముఖం చూచి, బావగారి ముఖంచూచి ఎటువంటి అఘాయిత్యానికి ఒడిగట్టలేదు. నీకేగాని నీ తమ్ముడిమీద అభిమానమున్నట్లయితే ఆ సరస్వతిని నాకే యిచ్చి పెళ్లిచేయి. అప్పుడు దాని రోగం కుదురుస్తాను.''

''తమ్ముడూ ! నువ్వంటే దానికి ఇష్టంలేకపోతే ఎలా పెళ్ళి చేయడం ?''

''అందులోనే వుంది గొప్పదనం. బావ చెవిలో ఇల్లుకట్టుకొని పోరాలి. పైస ఖర్చులేకుండా పెళ్ళి చేస్తానను కూతురు, అల్లుడు ఇల్లరికముంటారను. అతను ఎగిరిగంతులేసి ఒప్పుకుంటాడు.''

''కాని నిన్ను సరస్వతి నచ్చిందా అంటే ఏమిచెప్పడం ?''

''అది చిన్నపిల్ల, ఇంగితజ్ఞానం లేనిది. పిల్ల నడిగే పెళ్ళి చేస్తారా ! ఇంతకీ దానికి సత్యనారాయణమామంటే అభిమాన మని చెప్పు.''

ఇది నిజం కాదుగదా ! ఒకవేళ దేవుడు మేలుచేసి మీ ఇద్దరికి పెళ్ళి అయిందనుకో నీతో కాపురం చేస్తుందని నాకు నమ్మకం లేదు. రంగనాయకమ్మగారి పనిమనిషి మొన్ననే నాతో అంది. మీ సరస్వతమ్మ ఎవడినో లేవదీసుకొనిపోతుందట జాగ్రత్తగా చూడండమ్మోయ్ అంది. నువ్వు ఈ జగజ్జాణను ఏలుకోగలవురా ?''

''అక్కా ! నేనొక్క సంగతి చెప్తా విను. పెళ్ళంటూ ముందుగా జరిపించు. నేను ఏవిధంగా దీనిని లొంగదీసుకుంటానో చూడు. పేపబెత్తంతో వొళ్ళు చీరెస్తే అది, దానమ్మవచ్చి పక్కలో పడుకుంటారు.''

''ఇదేదీ సాధ్యమయినట్లు లేదురా !''

"చూడక్కా ! ఈ కూతురి పెళ్లి చేయడానికి బావగారి దగ్గర ఒక రూపాయికూడా లేదు. ఇతను ఎవరిదగ్గరనైనా అప్పు తెచ్చే ధైర్యం కూడాలేదు. ఖర్చులకి, కట్నానికి, సర్వం నువ్వే బాంకులోంచి తీసి ఖర్చుపెట్టాలి. ఈ సంబంధం ఒప్పుకుంటేనే డబ్బు ఇస్తానను. మరే సంబంధం కుదిర్చినా ఒక్కపైసా కూడా ఇవ్వకు తెలిసిందా ! అప్పుడు అయ్యగారికి, కూతురుగారికి అన్ని రోగాలు కుదురుతాయి."

ఇంతలో సరస్వతి స్నానం ముగించి, బట్టలు కట్టుకొనివచ్చింది. వేగంగా రెండు గుక్కల్లో కాఫీ తాగ, అక్కతో వెళ్తున్నానని కూడా చెప్పకుండా పెట్టె పట్టుకొని వెళ్లిపోయాడు సత్యనారాయణ బస్సుకు.

అర్ధరాత్రి పిన్నీ, నాన్న చాలసేపు మాట్లాడుకున్నారు. సరస్వతికి ఏవో వాదనలు వినిపించాయి. కాని ఒక సంగతి మాత్రం సరస్వతి తెలుసుకుంది. నాన్నకు ఏ విధమైన స్వాతంత్ర్యంలేదని. పిన్ని చెప్పినవి తూ. చా. తప్పకుండ అతను ఆచరిస్తాడు. ఇందులో సందేహం లేదు.

తమ్ముడు వెళ్లిన మరునాడు శకుంతల కూడా ఊరికి వెళ్లిపోయింది. పనిచేస్తున్న ఊర్లో ఛార్జీ అప్పగించి, వారంరోజులలో వచ్చి ఈ ఊళ్లో జాయనవుతుంది. వెళ్లేటప్పుడు సరస్వతితో కూడ చెప్పి వెళ్లింది. ఇల్లు జాగ్రత్తగా చూచుకోమంది. తండ్రికి బాగా వండి పెట్టమంది.

శకుంతల శనివారంనాడు వెళ్ళిపోయింది. మరునాడు ఆదివారం ఆనందరావు ఎక్కడికీ క్యాంపుమీద వెళ్ళలేదు. పొద్దున్న బజారుకి వెళ్ళి వచ్చాడు. పదకొండు గంటలకి భోజనం చేసి ఆఫీసు కాగితాలు చూచుకొని నిద్రపోయాడు. మధ్యాహ్నం మూడుగంటలకు సరస్వతి తెచ్చిన కాఫీ సావకాశంగా త్రాగినాడు.

"సరస్వతీ ! కూర్చో అమ్మా ఆ బల్లమీద. రెండు విషయాలు నీతో మాట్లాడాలి."

సరస్వతి పక్కనేవున్న చిన్నబల్లను దగ్గిరికి లాక్కొని తండ్రికి సమీపంలో కూర్చుంది.

"ఈ యింట్లో మీ అమ్మ పోయినతరువాత చాల మార్పులు వచ్చాయి. ఒకటి నీ చదువు ఆగిపోవడం, రెండవది నేను పెళ్ళి చేసుకోవడం. ఇంతవరకు నేనెప్పుడూ ఇంటివిషయాలు కాని, నీచదు గురించిగాని పట్టించుకోలేదు. అన్నీ మీ అమ్మే చూచుకునేది. ఏ అదృష్టంవల్ల మీ అమ్మకుమల్లే మీ పిన్ని కూడా మంచిదే దొరికిం ఇప్పుడుకూడా నేను ఆ పరిస్థితిలోనే వున్నాను. మీ పిన్ని అ విషయాలు తనే చూచుకుంటున్నది. లోకంలో ఎవరి అభిప్రాయా వారివి. మీ అమ్మ నిన్ను డాక్టరును చేయాలని అనుకుంది, మీపి నిన్నొక అయ్యచేతిలో పెట్టాలని అనుకుంటున్నది."

సరస్వతి శ్రద్ధగా వింటున్నది.

"మీపిన్ని చాలతెలివైనది. తాను ఎంతమంచిదైనా లో మరోవిధంగా అనుకుంటుంది. ఈ విషయంలో నేనుకూడా మీపిన్ని ఏకీభవిస్తున్నాను"

సరస్వతి తండ్రిముఖంలోకి చూచింది. పిన్నిమత్తులో నా పూర్తిగా మునిగిపోయాడు.

"మీ అమ్మ తనఒంటిమీదనున్న వస్తువులమ్మి నాపేర ఇర వేలరూపాయలు బాంకులోవేసింది. అన్నవరంలో పెళ్ళికి అందు డబ్బేమి ముట్టుకోలేదు. కాని, పెళ్లయినతరువాత ఆడబ్బును మీపి బాంకు అకౌంటులోకి మార్చవలసివచ్చింది. మీపిన్ని చాలజాగ్రత్తగ మనిషి. అందుచేతనాకు విచారంలేదు.

సరస్వతి ఏమీప్రశ్నలడిగే స్థితిలోకూడాలేదు. అడిగినందువ ప్రయోజనం లేదనితెలుసు.

"మా బావమరది సత్యనారాయణను నువ్వుచూచావుకదా! అ నికి ఇరవై రెండేళ్ళు. మీపిన్నికి అతనికి మూడేళ్ళుతేడా. పదోక్లా పాసయాడు. కోపరేటివ్ స్టోర్సులో పనిచేస్తున్నాడు. పలుకుబడి ఉ వాడు. మంచితెలివితేటలు, దూరాలోచనకలవాడు నేను అనుభవంపీ చెప్తున్నాను, లోకంలోబాగా పెద్దచదువులు చదివినవాళ్లు అంతప్ర జకులుకారు బ్రతకనేర్చినవాళ్ళే సంసారాలు చేయగలరు."

"అవునవును" అంది సరస్వతి. తండ్రి దృష్టిలో బాగాచదు కున్నవాళ్లంతా దద్దమ్మలే.

"సత్యనారాయణ మంచి ప్రయోజకుడని వేరేచెప్పనక్కరలే తరువాత మరోముఖ్యమయిన సంగతి మీ పిన్నికి తమ్ముడంటే తెగని అభిమానం. తమ్ముడి పెళ్లాన్ని ఆమె నెత్తిమీద పెట్టుకుంటుం

తరువాత నీపెళ్ళయినా అందరంకలసి ఒకదగ్గిరే ఉండవచ్చు. అతనికి ఈఊళ్ళో ఏదోఒకచోట ఉద్యోగం వేయించవచ్చు. పెద్దవాళ్ళదగ్గర ఉంటే మీకు ఏ ఇబ్బంది ఉండదు".

సరస్వతి వింటూ ఓచిన్నప్రశ్న వేసింది.

"నాన్నా! పిన్ని ఇంకాఏమిటి చెప్పింది?"

"మాఘమాసం నిన్ననే వచ్చిందికదా! వెంటనేముహూర్తం పెట్టించుకొని వస్తానంది."

"ఇంత తతంగం జరిగేముందు నాఅభిప్రాయం అడిగిఉంటే బాగుండేది."

"ముందు పెళ్ళిచూపులకని సత్యనారాయణకు ఉత్తరం వ్రాసి తెప్పించాను. ఇంట్లో ఉంటున్నవాళ్ళకి వేరే ఏర్పాటులు అవి ఈ పెళ్ళి చూపులకు అక్కర్లేదుకదా! మూడురోజులై అతను నిన్నుచూచి, నువ్వు అతనిని చూచి నచ్చుకున్న తరువాత..."

ఆ సంభాషణ సరస్వతి మరి సాగనీయలేదు.

"నాన్నా! మరింక ఏమీచెప్పకు నువ్వు నాపెళ్ళికోసం ఆలోచిస్తుంటే మంచిదే. కాని ఈ కుంటిసత్యనారాయణ సంబంధంకన్న మంచిదేదేనా నీ దృష్టిలో ఉందా?"

ఆనందరావుచిన్న షాక్ తిన్నవాడిలా అయిపోయాడు. తాను ఇంతగా మెచ్చుకుంటున్న సత్యనారాయణను, లోకమంటేఏమో తెల్లియని సరస్వతి అంతసులువుగా కొట్టిపారేసింది. తాను ఇంతవరకు ఆగ్రహంతో చెప్పినదంతా నిష్ప్రయోజన మయిపోయింది.

"నాదృష్టిలో ఏమున్నాయి? నే నెప్పుడైన ఇంటివిషయాలు పట్టించుకుంటేకదా! మా అక్కకొడుకుగురించి అప్పుడనుకున్నాను. కాని...."

"అంటే సత్యమూర్తా?"

"అవును వాడేను"

"కాని.... అంటున్నావు. వాళ్లను నా గురించి అడిగావా ఏమిటి ?"

"నేను అడగమన్నది జరగకుండానే నిన్ననే వాళ్లకొకసంబంధం నిశ్చయమయిపోయింది."

"ఎవరి సంబంధం?"

"డిప్యూటీ కలెక్టరు నాగభూషణంగారు లేరూ, వాళ్ల రెండో అమ్మాయిని నిన్ననే మనవాళ్లు చూచుకొని వచ్చారు. పిల్లనునచ్చుకున్నారు. ఆ అమ్మాయి బియ్యేపాసయింది. చాలచక్కనిది, బాగావీణ వాయిస్తుంది, సత్యమూర్తికి వీణ అంటేఎంతోఇష్టం, కట్నాలు, కానుకలు,వేడుకలు వినోదాలు, అన్నిటిగురించికూడా మాటలయిపోయాయి. జాతకాలు సరిపడ్డాయి, డిప్యూటీకలెక్టరుగారే నిన్నరాత్రి వారింటికొచ్చి చెప్పారు. పాతికవేలరూపాయలు కట్నం, పట్టుబట్టలు, వెండిచెంబులు, తరువాత అమలాపురంలో నున్నయిల్లు, ధవళేశ్వరం దగ్గిరనున్న మామిడితోట, పిల్లఆభరణాల నిమిత్తము వ్రాసియిస్తారు. పెళ్ళిచాల ఘనంగాచేస్తారు పెళ్ళిచూపులకి డ్రింకులక్రింద, స్వీట్లక్రింద, టాక్సీలక్రింద అతను మూడు వందలరూపాయలు ఖర్చుపెట్టాడు. మా అక్కయ్యఎంతో సంతోషిస్తున్నది. మాబావగారి మాటసరేసరి. పిల్లలు కూడా కాబోయే వదినగారితో ఇంగ్లీషులో మాట్లాడి చనువుగా వ్యవహరించారు. ఈ పున్నమిముందే ముహూర్తంపెట్టిస్తామన్నారు. పెళ్ళి పనులకు కూడా తొందర పడుతున్నాడు.

"నాన్న ! ఒక్క సంగతి చెప్పు ! సత్యమూర్తి నచ్చుకున్నాడా ? మాట యిచ్చాడా ?"

"ఇవ్వకేం చేస్తాడు. వాడు అమ్మమాటకుగాని, నాన్నమాటకు గాని ఎదురు చెప్పి ఎరగడు. వాళ్ళేమి చేసినా వాడికి అంగీకారమే"

"కాదు నాన్నా ! సత్యమూర్తి, తనకు పిల్లనచ్చిందని చెప్పాడా ?"

"నీ కెందుకా సందేహం ?"

"అతడు తొందరపడి ఏ పని చేయడు. బాగా ఆలోచించనిదే తన అంగీకారం చెప్పవలసిన వాడు కాడు. ఒకే పని రెండుసార్లు చేయడు. అందుకే అడుగుతున్నాను, ఈ సంబంధానికి ఒప్పుకున్నాడా అని"

"వారం రోజులలో సత్యమూర్తి ఆలోచించి చెప్తానన్నాడు. కాని, నూటికి తొంభైవంతులు నిశ్చయమైనట్లే భావించి, పెళ్లిపనులు మొదలు పెట్టవచ్చునని చూపులు అయిన వెంటనే బావగారు,అక్కయ్య ఏకగ్రీవంగా ఆడపెళ్లివారికి మాట యిచ్చారు"

(ఇంకా ఉంది)

కలగూరగంప

అనంతపురం జిల్లా గ్రామనామాలు

1984 మార్చినెల భారతి కలగూరగంప శీర్షిక 'అనంతపురం జిల్లా గ్రామ, వ్యక్తినామాలు కన్నడ నిర్మాణ ప్రభావం' వ్యాసంలో రచయిత "'మల' అన్న గ్రామనామానుబంధం చేరే వూర్ల పేర్లు రాయలసీమలోనే వున్నాయి (పు 64)... ఒక్క కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో మాత్రమే ఈ కల్లుతో కూడిన ఊర్లపేర్లున్నాయి. మిగిలిన రాష్ట్రిమంతటా లేవు (పు 65)... 'దుర్గం' నామానుబంధంగా వున్నవి ఈ జిల్లాలో తప్ప యితర ఆంధ్రదేశంలో ఎక్కడా కనిపించవు" అని నిర్ద్వంద్వంగా వ్రాసారు.

ఈ క్రింది ఉదాహరణలు పై అభిప్రాయాలను పూర్వపక్షం చేయగలవని భావిస్తాను.

ఊరి పేరు	తాలూకా	జిలా
గండిగనమల	వినుకొండ	గుంటూరు
ముక్కామల	అమలాపురం	తూర్పుగోదావరి
ఇదమకల్లు	గిద్దలూరు	ప్రకాశం
మంచికల్లు	పల్నాడు	గుంటూరు
పొన్నికల్లు	గుంటూరు	,,
నెమలికల్లు	సత్తెనపల్లి	,,
ఒరవకల్లు	,,	,,
చెవిటికల్లు	నందిగామ	కృష్ణా
కొడవటికల్లు	,,	,,
చిల్లకల్లు	జగ్గయ్యపేట	,,
కప్పకల్లు	కురుపాం	విజయనగరం (పూర్వం శ్రీకాకుళం)
జలదుర్గం	ద్రోణాచలం	కర్నూలు

పై పట్టికలో గ్రామనామములు 1971 సం॥ భారత ప్రభుత్వ 'సెన్సెస్' నుంచి సేకరించబడినవి. తరువాత జరిగిన తాలూకాల పునర్వ్యవస్థీకరణలో ఆయా గ్రామములు నిర్దేశించబడిన తాలూకాలోనికి మారుటకు అవకాశము గలదు.

'తిప్ప' అంటే గ్రామనామ సందర్భంలో 'ఎ వ్యాన్ ఆఫ్ ది డంగ్ హిల్' అనే అర్థంకన్నా 'శబ్దార్థచంద్రిక'లో ఇవ్వబడిన చిన్న కొండ-కొండ-దిబ్బ అనే అర్థమే సబబనుకుంటాను. 'తిప్ప'లు ఆంధ్రా జిల్లాలలోనూ వున్నది. "కొన్ని తిప్పలు గ్రామనామాలుగా వున్నాయి. వాకతిప్ప, మొక్కలతిప్ప 'మొక్కలతిప్ప వైష్ణవులు' అంటూ వొక పద్యం ఉంది" అని చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు (కథలు - గాథలు, తృతీయ భాగం, పు 502) వారు పేర్కొనిన వాకతిప్ప తూర్పు గోదావరిజిల్లా, పిఠాపురం తాలూకాలో ఉంది. మరికొన్ని ఉదాహరణలు నాగాయతిప్ప (దివి తా॥ కృష్ణాజిల్లా); అల్లికానితిప్ప, కుదిరితిప్ప ఇంద్రిక (సూళ్ళూరుపేట తా॥ నెల్లూరుజిల్లా)

శ్రీ ఎ. విజయ దత్తాత్రేయ శర్మ

అనంతపురంజిల్లాగ్రామ,వ్యక్తినామాలు కన్నడ నిర్మాణ ప్రభావం-ఉన్నదా?

భారతి (మార్చి'84)లో శ్రీ అదవాని హనుమంతప్పగారి వ్యాసం చదివినాను.

కొన్నివిషయాలు బాగానే చెప్పినారు. కానీ, చాలావిషయాలు అసమగ్రంగాను లోపభూయిష్ఠంగాను ఉంటున్నాయి. ఇప్పుడొక్కటొక్కటే చర్చిస్తాను.

గ్రా మ నా మ ము లు

అనంతపురం : "అనంతా" అని తెలుగులో ఉండవలెనని "రూలు" లేదు "అనంత" అని హ్రస్వంగా కన్నడంలో వుండవలెననీ "రూలు" లేదు "బిజాపూర్" కర్ణాటకలో వుంది 'జా" దీర్ఘం "సిద్ధరామపురం" అనంతపురంలోనే ఉంది. "మ" హ్రస్వం.

న: కన్నడంలో రామన, చోమన మొ॥ రూపాలున్నాయన్నారు. ఇచ్చట "న" సంబంధ సూచక ప్రత్యయమని శ్రీ హనుమంతప్పగారి సిద్ధాంతం. అంటే తెలుగులో ఈ రూపాలు రాముని, చోముని అవుతాయి దీనినాధారంగా, సింగనమల, బసవనపల్లి మొ॥ గ్రామాలపేర్లు కన్నడ "న" ప్రత్యయంలో ఏర్పడ్డవి అని తీర్మానించిరి కానీ పైపేర్కొన్న గ్రామనామాల్లోని "న" కన్నడ ప్రత్యయంకాదు. తెలుగు వ్యక్తి నామాంత్యంకాని వేరుకాదు. సింగన, బసవన అనే వ్యక్తుల లేదా దేవతల పేర వెలసిన గ్రామాలివి. అనంతపుర పట్టణ

నడిబొడ్డుననే "బసవనకట్టు" ఉందికదా! "మైలమ భీమన ఖడ్గ సృష్టికిన్"లో "న" వంటిదిది. మన హనుమంతప్పగారిని హనుమన్న→ హనుమన అందాము. అప్పుడు వారి వ్యాసం హనుమనవ్యాసం అవుతుంది. పోతన పద్యంలో 'న' ఇట్టిదే.

ఇక "కొడెగినహళ్ళి" కన్నడి పేరే కనుక మనం వాదించ నక్కరలేదు "హళ్లి" పైన వారంత చర్చించ నవసరంలేదు హ-ప అక్షర వ్యత్యయాలతో కన్నడ-తెలుగులో నూర్లకొద్ది పదాలున్నాయి.

సింగనమల : తమిళంలో మలై, కన్నడంలో మలె, తెలుగులో మల అవుతాయన్నారు. ఈ పదం ఏకమూల (కోగ్నెట్) పదం అయినప్పుడు, ఇక తెలుగుపై కన్నడ ప్రభావం క్రింద జమకట్టడం దేనికి?

బసవమత ప్రభావం : మత ప్రభావం వల్ల వచ్చిన పేర్లు భాషా ప్రభావమని భ్రమపడకూడదు. తెలుగువారు మెహర్‌బాబా పేర్లు పెట్టుకుంటారు. అట్లని పార్సీభాషా ప్రభావముంది అనరాదు అప్లే, పీరన్న ఫకీరప్ప మొ॥ పేర్లు హిందూవులకుంటాయి.

శైవమత ప్రభావం : భైరపురం విరుపాపురం ఇత్యాది శైవ ప్రభావ భారతదేశమంతా వుండగా, అది కన్నడిగుల స్వత్వమనిపించేటట్లు వ్రాయడం సరికాదు. మల్లీశ్వరి పేరు సినిమా ప్రభావంకాని కన్నడ ప్రభావంకాదు "మల్ల" కన్నడ ప్రభావంకాదు. ఒరిస్సా సరిహద్దులో బొబ్బిలికివుంచే రాణి పేరు మల్లమ్మ శ్రీశైలదేవత పేరు ఇది. శ్రీశైలం ఆంధ్రక్షేత్రం కాని "మల్ల" అనేది కన్నడంపై తెలుగు ప్రభావం క్రిందికి వస్తుంది.

అనంతపురంలో ఒకానొక వృత్తివారు "గౌడు" అని పేరు చివర పెట్టుకుంటారు. నిజానికి వీరు కన్నడిగులేకాని తెలుగువారుకాదు వీరిలో వెనుకటి తరంవాళ్లు కన్నడమే మాట్లాడుతారు. కన్నడంవి అనిపించే పేర్లు తాయ్యమ్మ, తాయప్ప, తాయన్న సాయన్న (వేదభాష్యకారునిపేరిదే) సాయమ్మ ఈ ప్రాంతంలో ప్రచారంలో ఉన్నాయి. అటువంటిదే ఉ (హు) చ్చేరప్ప అనేపేరు. ఎల్లమ్మ (-రేణుక), హుళిగమ్మ వంటి కన్నడదేశ దేవతలపేర్లు అనంతపురమండలంలో వాడుకలో వున్నాయి ఎల్లప్ప, హుళిగప్ప అనే పుల్లింగ నామాలవారూ వున్నారు. "రాధామాధవకవి" గా పేరెక్కిన ఎల్లనార్యుడున్నాడు. అనంతపుర ప్రాంతంలో ప్రత్యేకంగా వినపడే పేర్లు బయ్యప్ప, బయ్యన్న, బయపురెడ్డి అనంతపురం జైన మత కేంద్రంగా ఉండేదికాబట్టి, దాని ప్రభావంవల్ల ఒకరకం పేర్లు వచ్చినాయి. నేమినాథ, సిద్ధప్ప, గవిసిద్ధప్ప, ఆదినాథయ్య కన్నడ అదికవి పేరు పంప. విజయనగర సామ్రాజ్యరాజధాని "హంపి" ఈ హంప తెలుగుభాషలో పంప అయింది. ప్రథమ కన్నడకవి పంపడు ఆంధ్రుడే. (ప్రథమాంధ్రకవి నన్నయ కన్నడిగుడు అనేవాదం ఇటీవల బయలుదేరింది.)

ఈ "హంప" శబ్దం రాయలసీమవాసుల పేర్లలో వినపడుతుంది. పంపన్న, అంపయ్య, హంపయ్య, పంపాపతి, హంపమ్మ మొ॥

బౌద్ధమత ప్రభావం వల్ల వచ్చిన విచిత్రపుపేర్లు : బుడ్డప్ప, బొడ్డన్న, బొజ్జన్న, గుప్ప, తిప్ప తెలుగులో "కుప్ప" కుప్పగల్లు.

బెళ + కుప్ప—బెళగుప్ప
అడు + కుప్ప—అడుగుప్ప

"తిప్ప" అంటే "దిబ్బ" అనే అర్థం సరేకాని, ఈ "తిప్ప" అనేపేరుకు ఆంధ్ర కర్ణాటకాలలో అంతేమోజు ఎందుకుందబ్బా? యనిపించకమానదు, నాకనిపించే దేమంటే ఇది సామాన్య "తిప్ప" కాదనీ సాక్షాత్తు తిరుపతిస్వామియే అని "తిప్ప" శబ్దం "తిరుప(తి)" శబ్దభవం తిరుప—తిర్ప—తిప్ప.

ఇది వైష్ణవనామం కదా "తిప్పేరుద్రయ్య" అనే పేరెట్లు వచ్చిందని అడుగుతారా? చెప్పుతాను.

"వెంకట శివయ్య" అనే పేరెందుకు పెట్టుకొంటారో "తిప్పేరుద్రయ్య" పేరూ అందుకే పెట్టుకుంటారు.

"తిప్ప"ను "త్రిపురాంతక" నుండి రాబట్టుట భాషాశాస్త్రరీత్యాసాధ్యం కావడంలేదు

"తిప్ప" వంటిదే "తిమ్మ" ఆంధ్రకర్ణాటకుల ప్రియమైనపేరు "తిమ్మ" కూడా వేంకటేశ్వరుడే

తిరుమల—తిర్మల—తిమ్మల—తిమ్మ

హాళ్/పాడు; "హాళ్" కాదు "హాళు"

కన్నడం కూడా తెలుగువలెనే అజంతం

"హాళు" తెలుగు "పాడు" ఒక్కటే "హాళ్" అని కొందరు ఉచ్చరిస్తే ఉచ్చరించినారు. "బూరుగుంపాడు"
అనే మాటను హైదరాబాదులో "బూరుగుంపాడ్" అని కూడా అంటున్నారు.

కల్లు : కల్లు అనేది తెలుగులో గ్రాంథికం మాత్రమే వ్యవహారంలో లేదంటారు శ్రీ హనుమంతప్పగారు నా దృష్టిలో ఈ పరిస్థితి విరుద్ధంగా కనపడుతుంది కల్లుతో కూడుకున్న పేర్లన్నీ కన్నడ ప్రభావమని చెప్పటానికి ఆస్కారం ఏర్పడింది. పైగా ఒక్క

కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో మాత్రమే ఈ కట్టతో కూడిన ఊర్ల పేర్లున్నాయి. మిగిలిన రాష్ట్రమంతటా లేవు. కనుక ఇది కన్నడ ప్రభావమని శ్రీ హనుమంతప్పగారు శంకిస్తూవున్నారు. కల్లు పదంతో పేర్లు కర్నూలు జిల్లాలోనూ, తెలంగాణాలోనూ వున్నాయి కాకతీయ సామ్రాజ్య రాజధానియైన "ఓరుగల్లు" మాటేమిటి? జూలకల్లు, కుప్పగల్లు, కొడప్‌గల్, భీడగల్ మొదలగు ఊర్లూవున్నాయి. శ్రీ హనుమంతప్పగారు పేర్కొన్న అనంతపురకల్లులలో కణేకల్లు అనే వూరున్నది. దీనిలో కల్లులో కన్నడత్వం లేదుకాని 'కణే"లో కన్నడత్వం ఉంది. ఆ వూరిలో బూడిదలాంటి మన్ను ఎక్కువగా వుంటుంది. రాళ్లే ఉండి వుండ లేదట. అందుకు ఆ వూరిపేరు "కాణెకల్లు" ("రాయికనపడదు") అని పెట్టినారని స్థలపురాణం.

ఇకి/ఉగి : తెలుగులో మూడు రూపాలు కన్పిస్తాయి, కుర్కి, కుర్తి, కుట్టు. పాలకురికి సోమన గ్రామంపేరు పాలకురికి కాన తెలుగు వాడనీ హాల్ కురికి కాన కన్నడం వాడన్నీ రెండు వాదాలున్నాయి. ఇట్టి రూపాలే తుర్తి, తుట్టు, పర్తి, పట్టు.

"ఇగి"తో అంతమయ్యే వూరిపేరు అనంతపురం జిల్లాలోనే ఉంది. అది "పరిగి". ఈ పరిగి తెలంగాణాలోనూ ఉంది. కర్నూలు జిల్లాలో "కోసగి" ఉంది.

రాజులపేర్లు : అనంతపురానికి "హండే అనంతపురం" అని పేరు. 19వ శతాబ్దంలో పాళెగాళ్లయిన హండే నాయకుల నుండి అనంతపురాన్ని అప్పటి కలెక్టరైన సర్ థామస్ మన్రో గుంజుకున్నాడు. 'హండే" అంటే ఏమిటో తెలియదుకాని ఇది కన్నడపదం అనిపిస్తుంది శ్రీ గురుజాడ వేంకటఅప్పారావుగారు ఇంగ్లీషులో "హండే అనంతపుర చరిత్ర" అని గ్రంథం వ్రాసినట్టు వింటున్నాము.

సేడు : "సేడు అన్నది ఈ ప్రాంతంలో ప్రత్యేకంగా వుంది. మిగతా ఆంధ్రదేశంలోలేదు" అంటూ ఉదాహరణాలుగా గరడసేడు, రంగసేడు అనే గ్రామాల పేర్లిచ్చినారు. సర్కారు జిల్లాలలో నురుసేడు, కారంచేడు, దురుచేడు అనే పేర్లున్న వూర్లుగలవు. కర్నూలుజిల్లా ఆలూరు తాలూకాలో కొక్కరచేడు, కమ్మరచేడు వున్నాయి. తెలుగులో గ స డ వ ఆదేశసంధి వున్నదేకదా! వచ్చి-సచ్చి, చదువు-సదువు, చేసి-సేసి. అటులనే "చేడు" అనంతపుర జిల్లాలో "సేడు" అయివుండవచ్చు. లేదా ఎవరైనా అరవ ఎన్యూమరేటరు "చేడు"ను "సేడు" అని రికార్డులో నమోదుచేసి యుండవచ్చు. అరవ భాషలో ఏ పదమూ "చ"తో ప్రారంభింపవని తెలిసినదే. ఇటువంటి రూపభేదమే "గుండుమడ్డి" అనే వూరు "కుంటిమడ్డి"గా మారుట గమనించండి.

అప్ప : ఈ పదంను రాయలసీమలో తండ్రికినీ, పెద్ద మనుషులకు పయోగిస్తారు. సర్కారుజిల్లాలో అక్కకు వృద్ధస్త్రీలకూ వాడుతారు. ప్రాచీనకాలంనుండి అప్ప, అపలను వాడుచున్నారు. కాకతీయ సేనానిపేరు జాయప. సర్కారుజిల్లాలో నారపరెడ్డి అనేపేర్ల వారున్నారు. తిక్కన్న "అప్ప" పదం వాడినది చదివినట్లు గుర్తు రక్తసంబంధం తెలిపే అన్ని పేర్లవలెనే "అప్ప" పదం తెలుగు, కన్నడాలకేకాక ప్రపంచభాషలలో అన్నింటా ఏదో ఒకరూపంలో ప్రత్యక్షమవుతుంది. సంస్కృతంలో "అపత్య" అంటే సంతానం. సంతానం అనే అర్థం ఇచ్చే అపత్య నుండి అప, అప్ప వచ్చి యుండ వచ్చునని శ్రీ అరవిందులవారు "ఆన్ ది వేద" అనే పుస్తకంలో వ్రాసిరి "బిడ్డ' నుంచి "తండ్రి" ఎట్లావస్తాడప్పా అని ఆశ్చర్యపడ నక్కరలేదు "బిడ్డ మనిషికి తండ్రి" అని వర్డ్స్ వర్తుకవి చెప్పినాడు బిడ్డ తండ్రిని "నాయనా" అనిపిలుచుట రాయలసీమలోనూ "నాన్న" అని పిలుచుట సర్కారు జిల్లాలోనూ వింటున్నాము. సెమెటిక్ (హీబ్రూ, అరామిక్, అరాబిక్ మొ॥) భాషలలో "అబ్బా" అంటే తండ్రి అని అర్థం బైబిలులో "అబ్బ" అనేపదం భగవంతునికి వాడబడింది. భద్రాచల రామదాసు శ్రీరాముని "ఎవడబ్బ సొమ్ము" అని ఎద్దేవాచేస్తాడు. తెలుగు భాషవలెనే వినపడు ఫిన్నిష్‌భాష (ఇటాలియన్ భాష కాదు) లో ప్రసిద్ధ రచయితపేరు "సిల్లనపా". (1939లో సాహిత్యంలో నోబెల్ బహుమాన గ్రహీత.) గ్రీకుభాషలో "గ్యాంథిప్ప (స్)" అనేవ్యక్తి పేరుంది. రోమక (లాటిన్) భాషలో "అగ్రిప్ప" అనే పేరుంది. "లూసిప్ప" అనేపేరూవుంది. "అప్ప" మాదిరే 'అయ్య' 'అక్క' పేర్లూను. బైబిలు ప్రాత ప్రకరణంలో "అయ్య" నామాంత్యం కల ప్రవక్తలున్నారు. ఉదా : జెరమయ్య, నెహెమయ్య. రోమనుల నెదిరించిన ఇంగ్లీషు రాణి పేరు 'బొడిక్క' (అక్క)

అణ్ణ : "అణ్ణ అనే నామాంత్యం గురించి శ్రీ హనుమంతప్ప గారు చెప్పినంత సింపుల్ కాదు. అణ్ణ అని కన్నడ భాషీయులే పెట్టుకుంటారు. ఇచట ఒకే వీధిలో ఒక "లింగన్న", ఒక "లింగణ్ణ" ఉంటారు. కన్నడ మాతృ భాషవారు (లింగాయతులు, ఒక తెగ బ్రాహ్మణులు కొన్ని వృత్తుల బ్రాహ్మణేతరులు) 'ణ్ణ' అని పెట్టుకుంటారు "ణ్ణ" అని పలుకుతారు. తమ భాషకాని వానిని "లింగన్న" అనే పిలుస్తారు, తమ భాషవానిని "లింగణ్ణ" అని పిలుస్తారు. కన్నడ భాషావాసన లేనివారు "ణ్ణ" ఉచ్చరించరు, వ్రాయరు. వారు "న్న" నే వాడుతారు- వ్రాతలోనూ, మాటలోనూ తేలిందేమంటే "ణ్ణ" అనేది కన్నడ భాషీయులపై ప్రభావంకల్గి ఉందేకాని కేవలం తెలుగు భాషే వచ్చు వారిపై కాదూ అని.

వాళ్ళు : ఇచట శ్రీ హనుమంతప్పగారి చర్చ గజిబిజి అయి పోయింది.

వ్యక్తుల పేర్ల చివర గౌరవ వాచకమైన "గారు" చేర్చడం దేశమంతా వుంటే ఇక్కడ, "వాళ్ళు" అనే పదాన్ని చేరుస్తారు అని శ్రీ హనుమంతప్ప గారన్నారు. దేశమంతా అంటే సర్కారు జిల్లాలే కదా అట్లు ఎందుకనరు? "వాళ్ళు" "వారలు" నుండి సిద్ధించింది. 'వారు', "వాళ్లు" ఒకటైతే "గారు" వేఱు- వారు, వాళ్లు ప్రథమ పురుష సర్వనామాలు. "వాళ్ళు" అనే పదం గౌరవ సూచక నామాంత్యంగా ఇక్కడా, ఎక్కడా లేదు.

బాపన + వాళ్లు → బాపనవాళ్లు → బాపనోళ్ళు

బాపన + వారు → బాపనవారు → బాపనోరు

"ఊసుప్పిరలోళ్, బాన కడుపు లోళ్" అని ఉన్నవవారి గీతం. "బాపనగారు' అనే రూపంలేదు.

"వారు" పదం "గారు" పదం కంటె ఎక్కువ గౌరవప్రద మైన వాచకంగా వాడుకలో వుంది. ఈ ప్రాంతంలోనే మా వూరి పల్లెవారు స్వాముల వారేమంటారు అని వాడుతారు. అటులనే

విశ్వనాథవారు

విశ్వనాథగారు

అనే రెండు ప్రయోగాలలో "వారు" ఎక్కువ స్థాయిని సూచిస్తుంది. ప్రభువుగారు, ప్రభువులవారులలో అయనకు ప్రీతికర మైనదేది? చెప్పవచ్చిందేమంటే "వాళ్ళు" పదం వ్యక్తుల పేర్ల చివర గౌరవ సూచకంగా చేర్చడం ఈ ప్రాంతంలో లేదని "బసిరెడ్డోళ్లు" అనే ప్రయోగం 'బసిరెడ్డి అనే వ్యక్తికి వాడరు కానీ, బసిరెడ్డి కుటుంబానికి, బసిరెడ్డి గుంపుకు వాడుతారు బసిరెడ్డోళ్ళ అవు, బసిరెడ్డోళ్ల మనిషి.

మహారాష్ట్రలో చాలా కాలం వెనుక స్థిరపడిపోయిన తెలుగు కుటుంబాల వారి పేర్ల చివర "వార్" (వారు) అని ఈనాటికి పెట్టు కుంటున్నారు. దాదాపు 20 ఏండ్ల క్రితం మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండిన "కన్నంవార్" ఆంధ్రుడు. రాష్ట్రీయ స్వయం సేవక సంఘ సంస్థాపకుడు హెడ్గెవార్ ఆంధ్రుడే. ఇట్టిపేర్లవారు నాగపూరు (విదర్భ) ప్రాంతంలో ఇప్పటికీ ఉన్నారు. ఇక "గారు" అనే గౌరవవాచకం తమిళ శ్రీవైష్ణవుల పేర్ల చివర "అయ్యంగార్" (అయ్యగారు) అనే రూపంలో వుంటుంది. అయ్యంగారులు చాలామంది ఆంధ్రులే.

సరిహద్దులలో భాషాప్రభావాలను పరిశీలించేటప్పుడు ఒక ముఖ్య విషయం మనసులో పెట్టుకోవలె. మన ప్రాంతవారికి సరిహద్దు అయినట్లు, వారి ప్రాంతమూమనకు సరిహద్దే. "గంగ కద్దరిమే లిద్దరి కీడునుం గలదె" యన్నట్లు, వారి నుండి మనమే రాక, మన నుండీ వారు నేర్చుకోవడం కొంత వరకుండ వచ్చును. అనంతపుర గ్రామ, వ్యక్తుల నామాల విశేషాలు చెప్పేటప్పుడు శ్రీ హనుమంతప్పగారు గట్టి నేలపై యున్నట్లనిపిస్తుంది కానీ ప్రతీ దాంట్లోను కన్నడ ప్రభావముంది అని బలవంతంగా సాధించ బూనినప్పుడు జారుడు మెట్లపై నున్నట్లు స్పష్టం అవుతుంది. ఈ వాక్యాలు కేవలం సుహృద్భావంలోనూ, వారికివలెనే నాకూ అనంతపురంపైని అభిమానంవల్లనూ వ్రాస్తున్నాను. వారును ఇట్లే గ్రహిస్తారని ఆశిస్తూన్నాను.

"త్రి"

గీతా తత్త్వము

శ్రీ మద్భగవద్గీత విశ్వజనీనమైన ధర్మగ్రంథము దానినర్థము చేసుకొన లేనివారు తేరని చెప్పవచ్చును. కాని పూర్తిగ జీర్ణించుకున్న వారు కూడ అరుదే గీతా శాస్త్రం సర్వశాస్త్ర సమానత్వం—

గీతా సుగీతా కర్తవ్యా, కిమన్యైః శాస్త్ర విస్తరైః !
యా స్వయం పద్మనాభస్య, ముఖపద్మా ద్వినిస్సృతా॥

గీతను గూర్చి ఆధునిక సమాజంలో రెండు అనుమానాలు తలెత్తు తున్నాయి—అందు మొదటిగా "గీతలో గల పదునెనిమిది అధ్యాయాలు యుద్ధ సమయంలో శ్రీ కృష్ణుడు అర్జునునికు పదేశించగల సావకాశమున్నదా" అని.

సగటు మానవుడు తన దృష్టితో విశ్వాన్ని చూస్తాడు. కాని విజ్ఞుడు సమ్యక్ దృష్టితో ధర్మబద్ధంగ పరిశీలిస్తాడు భగవద్గీతలో సంభాషణ శ్రీ కృష్ణార్జునులు మధ్య జరుగుతుంది వీరుభయులు పరమాత్మ', 'ఆత్మ' తత్త్వాలకు ప్రతీక. నారాయణతత్త్వమే వాసు 'దేవుడు. అతడే గీతా సందేశము వినిపిస్తాడు. అర్జునుడు 'జిజ్ఞాసువు లందరికి ప్రతినిధి. అతడు 'విజ్ఞానమయ కోశము'నకు ప్రతీక, 'దైవీసంపత్తి' కలవాడు. గీతా మృతాన్ని గ్రోలి ఆనంద ప్రాప్తినందు తాడు. 'జగద్గురువు'కు మేటియైన శిష్యుడు, దివ్యమానవుడు, మానవ శ్రేష్ఠుడు, మనోజ్ఞాన భావమయ లోకముల సమన్వితి స్వరూపుడు. కావున గీతాతత్త్వోపదేశానికి అధిక సమయం పట్టదు.

న్యూటన్ ప్రతిపాదించిన గురుత్వాకర్షణ సిద్ధాంతము, ఐన్ స్టయిన్ అనుసంధానించిన సాపేక్ష సిద్ధాంతము, ఈనాటి ఉపగ్రహ ప్రయోగాలకు మూల మన వచ్చును, కాని సామాన్య మానవుని కడి అంతు పట్టని విషయం. 'గీత లో 'దివ్యాత్మ' 'మానవాత్మ'కు తత్త్వోపదేశం చేస్తుంది. కేవలం ప్రాణమయ లేక మనోమయ కోశ బద్ధులకిది బోధపడక పోవచ్చును.

ఇక రెండవ ప్రశ్న–"గీతాప్రబోధము, కురుక్షేత్ర మహా సంగ్రామ సందర్భమున కాక, వ్యాసమహర్షి తర్వాత రచించి మహా భారత ప్రామాణికతను కట్టబెట్టుటకు దాని యందు చొప్పించి యుండ వచ్చును."

సమాధానం —— గీతాకారుడు మొదటగా ధార్తరాష్ట్రునిచేత పలికిస్తాడు——

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః
మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ॥

అంతేకాక గీతాకారుడు గీతోద్భవమ్మునకు మూలమగు యుద్ధ సందర్భమును పదేపదే జాగరూకతతో జ్ఞప్తికి తెస్తుంటాడు. గీతాంత మున కూడ యుద్ధప్రసక్తి వస్తుంది. యుద్ధ రంగంలో 'స్వజనాన్ని' గాంచి యోధుడైన అర్జునుడు కర్మవిముఖుడై అంటాడు ——

స్వజనం హి కథం హత్వా
సుఖినః స్యామ మాధవ॥

కులక్షయ కృతం దోషం
మిత్ర ద్రోహేచ పాతకం॥

యద్రాజ్య సుఖ లోభేన
హంతుం స్వజన ముద్యతాః॥

ఒకవేళ గీతా బోధన యుద్ధ సమయంతో జరిగి యుండక పోతే, మరెప్పుడు జరిగినట్లు?

ఇక గీతా తత్త్వాన్ని అంజలి ఘటించి గ్రోలుదాం. భౌతిక జగత్తులోని 'జీవి'లో పృథి వ్యాపస్తేజో వాయురాకాశ తత్త్వములు ఎల్లపుడు పరిభ్రమిస్తుంటాయి. ఈ జీవి 'విశ్వాత్మ'లో ఒక 'బిందువు' 'మనో జగత్తు'లో పంచ భూతములకు, పంచేంద్రియములకు సారూప్య మేర్పడుతుంది. 'భౌతికం' వ్యక్తమైతే, 'మనోమయం' అవ్యక్తం, ఒకటి 'జడ' మనుకుంటే రెండవది 'చైతన్యం'.

చైతన్య వంతుడైన మానవుడు, ఘర్షణకు లోనవుతాడు. సత్వ, రజో, తమో గుణాలు అతన్ని ఆవహించు కుంటాయి. 'దైవీ సంపత్తి' కలవాడు సత్వ గుణం వైపు, 'ఆసురీ ప్రవృత్తి' కలవాడు రజో గుణం వైపు, 'రాక్షస ప్రవృత్తి' కలవాడు తమో గుణం వైపు మొగ్గుతారు. అర్జునుడు సత్వ గుణానికి, దుర్యోధనుడు రజో గుణానికి, దుశ్శాసనుడు తమో గుణానికి ప్రతీకలు.

తమో గుణము విషయ ప్రధానమైనది. ఇది ప్రబలినపుడు మానవునికి స్వతహాగ ఆలోచించే శక్తి నశిస్తుంది. పరిస్థితులకు బానిస అౌతాడు. త్రాగుడు, జూదము, వ్యభిచారము మొదలైన వ్యసనాలతన్ని ఆవహిస్తాయి. విచక్షణా జ్ఞానం పూర్తిగా నశిస్తుంది. చివరకు జీవితం పరాభూత మౌతుంది. రజో గుణం కర్మేంద్రియ ప్రధానమైనది. దీని ప్రాబల్యం వలన మానవుడు స్వార్థ పరుడౌతాడు. పరులను వధించి, స్వప్రయోజనార్థం జగత్తును మల్చుకొన చూస్తాడు. సంగ్రామ మతనికి హర్షదాయక మౌతుంది. భోగేచ్ఛ మనసులో రగులు కుంటుంది. ఫలితముగ అతడు వ్యసన పరుడౌతాడు. సత్వ గుణం జ్ఞానేంద్రియ ప్రధానమైనది. దీని ప్రాబల్యం వలన మానవుడు ధర్మము, న్యాయము సమానత్వము, సామరస్యము, శాంతి- సంతోషములకై అన్వేషిస్తాడు. బాహ్యంగ సన్యసించి అంతర జగత్తులో కార్యోన్ముఖుడై కర్తవ్యాన్ని నిర్వహిస్తాడు. సాత్విక మానవుడు రాజస ప్రవృత్తిని కొంత స్వీకరించి నపుడు ధార్మికంగ, భౌతికంగ విజయుడై శాంతి, సామరస్యముల స్థాపనకు తోడ్పడుతాడు.

అర్జునుడు త్రిగుణాత్మక తత్త్వాన్ని భేదించి, 'నిర్గుణమ్ము', 'గుణాతీతము' వైపు పయనిస్తాడు. క్షాత్ర ధర్మ పర్యవసానమగు కురుక్షేత్ర సంక్షోభము నుండి అతడు విముఖుడౌతాడు. క్రియాశీల, తత్త్వము కోల్పోయిన కౌంతేయుడు అకర్మణ్యావస్థలో చిక్కుకొని జీవన ప్రసక్తిని సైతము నిరాకరించటానికి ఉద్యుక్తుడౌతాడు. అప్పుడు సత్వ గుణము చేత 'ప్రేయో మార్గమును' త్యజించి 'శ్రేయో మార్గా' న్నాశ్రయిస్తాడు. దాని బాహ్య సన్యాసమును త్యజించి, అంతః సన్యాసమును అవలంబించ మంటాడు 'జగద్గురువు'. 'బాహూ రాజన్యః కృతః' ననుసరించి 'స్వధర్మ' కర్తవ్యం నిర్వర్తించ మంటాడు. 'కర్మణ్యే వాధికారస్తే, మా ఫలేషు కదాచన' అని ఉద్బోధిస్తాడు. అక్షరమునుండి బ్రహ్మ; బ్రహ్మనుండి కర్మ; కర్మనుండి యజ్ఞము; యజ్ఞమునుండి మేఘము; మేఘమునుండి అన్నం; అన్నంనుండి ప్రాణులు పుట్టాయి. ప్రాణులు తిరిగి బ్రహ్మైక్యం చెందుటే మోక్షం. ఇదే 'యజ్ఞచక్రం'... 'సృష్టి కార్యం'... 'దైవ ధర్మం'... బోధనందు కున్న అర్జునుడు విజ్ఞాన మయ కోశం నుండి ఆనంద మయ కోశం [బ్రహ్మైక్యం] వైపు పయనిస్తాడు.

ఇందు ప్రథమ సోపానము కర్మ యోగము, నిస్వార్థ కర్మ యజ్ఞము. ద్వితీయ సోపానం జ్ఞాన యోగం– ఆత్మ సాక్షాత్కారము, కర్మ, జ్ఞానముల సమన్వయంతో మానవుడు చరమ సోపానమైన భక్తి యోగాన్నధిరోహిస్తాడు. తదుపరి కర్మ, జ్ఞాన, భక్తి యోగముల సమన్వయంతో భగవత్సాయుజ్యం పొందుతాడు.

మానవ శరీరమొక కురుక్షేత్రం, అజ్ఞానాంధకారాలు కౌరవులు అర్జునుడు బుద్ధిబలం, బాహుబలం కల యోధుడు. భక్తితో అతడు 'పరంబ్రహ్మ'ను శరణు జొచ్చుతాడు.

సర్వ ధర్మాన్ పరిత్యజ్య, మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వ పాపేభ్యో, మోక్ష యిష్యామి మాశుచః

ఇదే శాశ్వత ధర్మం — దైవ ధర్మం. శరీర ధర్మంలో గల 'జీవుడ్ని' దైవ ధర్మం వైపు నడిపించటమే గీతా బోధన. ఏ క్షణానైనా ధర్మం గాడి తప్పినపుడు అవ్యక్తమైన నారాయణ తత్త్వం, వ్యక్తమైన అవతార రూపం దాల్చుతుంది. పరమ పురుషుడు ధర్మ సంస్థాపన చేస్తాడు—

యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్॥

పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం
ధర్మ సంస్థాప నార్థాయ సంభవామి యుగే యుగే॥

శ్రీ మద్భగవద్గీత పదునెనిమిది అధ్యాయాలు. మొదటగా స్వధర్మ, జ్ఞాన, వైరాగ్య, భక్తి అంశల చేత గోచరమగు నారాయణ తత్త్వం చెప్పబడింది—

'స్వధర్మ జ్ఞాన వైరాగ్య సాధ్య భక్త్యైక గోచరః।
నారాయణ పరంబ్రహ్మ గీతా శాస్త్రే సమీరితః॥

ప్రతి ఆరు అధ్యాయములు ఒక షట్కముగ విభజించటం జరిగింది. ప్రథమ షట్కములో జ్ఞాన, కర్మ యోగముల సమన్వయం [ఆత్మికం] చెప్పబడింది—

జ్ఞాన కర్మాత్మికే నిష్ఠే యోగ లక్ష్యే సుసంస్కృతే।
ఆత్మానుభూతి సిద్ధ్యర్థే పూర్వ షట్కేన చోదితే॥

ద్వితీయ షట్కములో భక్తి యోగ ప్రాశస్త్యము చెప్పబడింది. జ్ఞాన. కర్మలు దీనికి ఆత్మికముగ ఉంటయి—

మధ్యమే భగవత్తత్త్వ యథాత్మ్య వ్యావాప్తి సిద్ధయే।
జ్ఞాన కర్మాభి నిర్వర్తియో భక్తి యోగ ప్రకీర్తితః॥

తృతీయ షట్కములో జీవుడు ప్రధాన, అప్రధాన తత్త్వాలతో సంధాన మేర్పరచు కుంటాడు. 'పురుషుడు' ప్రధాన తత్త్వం; త్రిమూర్తు లాదిగా గల దేవతలు అప్రధాన తత్త్వం. ఏ తత్త్వాన్నాశ్రయించి నప్పటికీ ఆనంద ప్రాప్తి కలుగుతుంది—

ప్రధాన పురుష వ్యక్త సర్వేశ్వర వివేచనం
కర్మ ధీర్భక్తి రిత్యాదిః పూర్వ శేషోం తిమోదితః॥

పద్మనాభుని ముఖ పద్మమునుండి వెడలిన 'గీత' వ్యాస మహర్షి ద్వారా లోకానికి వ్యక్తమైంది. యుగ యుగాలుగా ఎందరో మహర్షులు, యోగులు, భక్తులు, జ్ఞానులు, తార్కికులు, ఆచార్యులు, కవులు గీతా తత్త్వాన్ని వివిధ రూపాలతో ఆస్వాదిస్తూ వచ్చారు. శంకరాచార్యులు జ్ఞాన మార్గాన్నాశ్రయించారు. రామానుజాచార్యులు కర్మయోగానికి, మధ్వాచార్యులు భక్తిభావానికి ప్రాధాన్యమిచ్చారు. ఆధునిక కాలంలో లోకమాన్య బాలగంగాధరతిలక్ మానవశక్తిలోనే దైవశక్తి నిహితమై ఉందన్నారు. అరవిందుడు మానవాత్మ, దివ్యాత్మగా మారాలన్నాడు. మన జాతిపిత గాంధీ నిష్కామ కర్మద్వారా భగవత్సాన్నిధ్యాన్ని పొందవచ్చునన్నాడు.

'సర్వధర్మ సమన్వయం' గీతా సారాంశం. జ్ఞాన, కర్మ, భక్తి యోగ సమన్వితం గీతా రూపం. 'స్వ' తత్త్వాన్ని త్యజించి విశ్వాత్మలో లీనమైన వాడు నిజమైన ఉపాసకుడు. అతని భక్తి 'పరాభక్తి'; అతని జీవితం ధన్యమై ఆనందమయ మౌతుంది. అతడు 'పరామోక్షాని' కర్హుడౌతాడు. అలాంటి వాడే పూర్ణయోగి.

కెప్టెన్ షేక్ మౌలాలి

లేఖలు

శ్రద్ధాంజలి

వ్రాయనువచ్చు కావ్యములు, వ్రాసిన వానిని ముద్రితమ్ముగా
జేయను వచ్చునున్; రసవశీకృతముల్ విశదన్మరంద ధా
రాయిత భావమాధురులు రమ్యతరాక్షర శబ్ద కల్పనా
శ్రీయుతమైన కైత లోకరిద్దరు నోచిన నోము పంటయే. 1

తతిరుల్ పూవులు తేనె సోనలును క్రొందావుల్ పికీగానముల్
వలిగాడ్పుల్ మృదుకౌముదుల్ మధురసస్వాదిష్ట పూరమ్ములై
యలరున్, ఆంధ్ర ధరిత్రి సంతత వసంతారామ సౌందర్య దో
హల విన్యాస విలాస లాస్యములు రాయప్రోలు సాహిత్యముల్. 2

పలికిన దెల్ల తీపి, తన వ్రాసిన పద్యము లెల్లనున్ సుధా
కలిత రసోదయ ప్రచుర కావ్యవిధా మధుమోహనమ్ములై
తెలుగున కింత తీపి కలదే యనిపించిన సాహితీకళా
లలితు డతండు, రమ్యమృదులమ్ములు వాని పదప్రయోగముల్. 3

వేద వేదాంత విద్యా వివేక సార
భారతీయ విజ్ఞాన తత్త్వము పఠించి,
భావకవితా నవోద్యాన పరిమళ ప్ర
సన్న రసపుష్పామోద ర్షములు కురిసి,

ఖండకావ్య శిల్పమునం దఖండ మధుర
రూపరేఖా మనోహర రుచులు చూపి,

తెలుగు దేశీయ ఛందఃప్రదీప్త లలరు
తేటగీతుల యందమ్ము తేటపఱచి,

దేశ దేశాల భరత జాతీయ గర్వ
గౌరవము నిల్పు విక్రమక్రమము నుడివి,

ఆంధ్రరాష్ట్ర ప్రబోధ గీతానురక్త
నవ్య జీవన విలసన్నోన్నతుల దెలిపి,

ప్రాక్తన మహాంధ్ర విభవ కీర్తనములందు
అలసి పడియున్న తెల్గు గుండెలు కదిల్చి,

దేశవాసుల నూతనోద్దీప్త జీవ
వికసనోద్యమ మార్గదర్శకములైన

నీదు వాగ్వల్లకీ మృదు నిస్వనములు
కడల మార్మ్రోగి రసవదాకర్షణముగ

మఱపురాని సాహిత్య సంపదల పొదలి
నిలచి యున్నవి మా తెల్గునేలయందు,
తెలుగు కవితా నవోద్యమ దివ్యసృష్టి
కబ్జభవుడవు, సుబ్బరాయార్య నీవు. 4

ఆకల్పస్థిర సంస్థితిన్ తెలుగు వాక్య మ్మెన్నినాళ్ళీ భువిన్
ప్రాకామ్యమ్ముగ నిల్చు, నంతదనుకన్ ప్రాదుర్భవత్ సాహితీ
శ్రీకళ్యాణపరంపరల్, తెలుగు ధాత్రీ సింహపీఠమ్మునన్,
నీ కైతల్ విలసత్కిరీట ముఖ మాణిక్యమ్ములై వెల్గెడిన్. 5

వివిధ విలాస కావ్య పదవీ రసరాజ్య మనోజ్ఞ రీతులన్
కవితకు అందచందములు కాన్కలు వెట్టిన ఆంధ్ర సాహితీ
నవయుగకర్త. మా తెలుగు నాటను నేటికి విశ్వవాఙ్మయ
ప్రవిమల కాంతి వీధి నడపన్ గడిదేరిన ధీరు డాతడున్. 6

ప్రథమాన ప్రణుతోజ్జ్వలమ్మయి కవీంద్రా నీ కలాలేఖినిన్
మథియింపంబడి సాహితీ జలధి సంభావ్యైక దీక్షాధృతిన్
పృథవై పొంగిన వాంధ్రవాఙ్మయ మహస్సుల్ కాంతిస్రోతస్సులీ
ప్రథితోద్యత్కవితాబ్ధి వీచికల నాంధ్రప్రాంత మోలాడగన్. 7

సేవాధర్మ నవప్రసూన నిచయోత్సేకమ్ము విప్పారి, పూ
జా విన్యాసము మోసులెత్తి కుసుమించన్ తెల్గు వాగీశ్వరిన్
గావుం డోలల బెట్టి యూచిన మహాపుణ్యాత్మ ! కైకోగదే
హ విశ్వాస పురస్కృతుల్ విమల సమ్మానైక సత్కృత్యంజలుల్. 8

అమలోద్దీర్ణము లార్య పద్ధతులు రమ్యాలోక పారంపరీ
కమనీయమ్ములు సాహితీ సవన దీక్షాబద్ధ పుణ్యక్రియా
రమణీయమ్ములు నీ కవిత్వ కలనా రాజత్కళౌజ్జ్వల్యముల్
నమదాంధ్రమ్మిదె నీ కొసంగు సుకవీంద్రా నేడు శ్రద్ధాంజలిన్. 9

శ్రీ కొండేపూడి సుబ్బారావు
విశాఖపట్టణం

"కూరాకు" (వి) మాంసం

డిసెంబరు 1982 భారతిలో శ్రీ గంగప్పగారు తాళ్లపాక అన్నమాచార్యుల పదములోని "కూరాకు" అను పదమునకు ఆకు కూర అని యర్థము చెప్పిరి.

ఏప్రిల్ 1983 భారతిలో నన్నక వ్యాసములో "కూరాకు"కు రాయలసీమలో "మాంసము" అనే యర్థము కలదని వ్రాసితిని నేనును, గంగప్పయు నొకే ప్రాంతమువారము, పల్లీయులమైనను, ఆయన ఆ యర్థమిచ్చుట నాకాశ్చర్యము కలిగినది. ఇప్పుడు తెలంగాణా వారైన శ్రీ కపిలవాయి లింగమూర్తిగారు "కూరాకు" పదమునకు "అల్పం" అనే యర్థము నిచ్చి కొన్ని ప్రాచీనకవి ప్రయోగములను నుపపత్తులుగ జూపించిరి. (భారతి నవంబరు 1983).

"కూరాకు" పదమున కర్థము ఆకుకూరయా, మాంసమా అల్పమా అనుట చర్చనీయాంశము. కనుక విషయమును పునః పరిశీలింతము.

1. మొట్టమొదట శ్రీ గంగప్పగారిచ్చిన తాళ్లపాకవారి పదము:

"చెలగి కూరాకు గాఁజేసేవు నీ
తల మీఁద నుండే తరుణిబోనేను"

నీ తలనెక్కిన దానిని (అంటే శ్రేష్ఠురాలను), నన్ను కించపరుచు చుంటివా? యని యర్థము. కించపరుచుటకు "కూరాకుగాజేయు" అనే పలుకుబడి ఉపయోగించబడినది. "కూరాకుగా జేయు" నను దానికి కూర (శాకము) కు కొఱగాకుండా చేయు అని ఎందుకనుకొనవలెను? కూరలను న్యూనార్థకములో ప్రయోగింతురని శ్రీ లింగమూర్తిగారు భావించినట్లున్నది. తామసాహారమైన పొలసు (కన్నడ భాషలో ఈ పదము 'హొలసు' అంటే రోత అను నర్థముతో చెలామణిలో నున్నది) హీనముగా జూడబడుట సబబు. "నన్ను పొలసువలె హీనముగా జూడకు"మని నాయిక యనుచున్నది. పొలసు అల్పము కావచ్చు. "కూరాకు" పదార్థము "అల్పము" ఆ పదార్థ స్థాయీ సూచకము. కావున తాళ్ళపాకవారి ప్రయోగములో "కూరాకు" అంటే మాంసము అని యర్థము చేయుటయే సరియైన పద్ధతి.

2. శ్రీ లింగమూ_ర్తిగా రిచ్చిన చేమకూర వేంకట కవి ప్రయోగము :

"తే. పులుల చట్టలు చీరి దుప్పులను లేళ్ళ
నేకలమ్ములఁ గ్రుమ్మి కూరాకుఁ జేసి"

సారంగ. 1, 90

ఇచటి "కూరాకుఁ జేసి" యను ప్రయోగమునకు శ్రీ లింగ మూ_ర్తిగారు "ఈడిగింఁబడజేయు" అని అర్థమిచ్చుచున్నారు. కానీ వారిచ్చిన యర్థము పొసగదు. సారంగధరుని భటులేమనుచున్నారు? పులుల చర్మ మొలిచి, దుప్పులను లేళ్ళను పొడిచి కూరాకు చేసెదము అని యనుచున్నారు. జంతువు చర్మ మొలిచిన తర్వాత లేదా దానిని శూలాదులతో పొడిచి నుగ్గునూచను చేసిన తర్వాత మిగిలిన దేముండును? మాంసపు ముక్కలు! "అదే కూరాకు." ముక్కలు ముక్కలుగా తరిగిన మాంసమునకు ఇంగ్లీషులో "మిన్స్ మీట్" అందురు. పులుల చర్మ మొలిచి, దుప్పులను లేళ్ళను క్రుమ్మి మాంసపు ముద్దలుగా చేసెదమని భటుల బీరాలు. శ్రీ లింగమూ_ర్తి గారు ప్రతిపాదించినట్లు "ఈడిగిలబడజేయుదుము" అని కాదు, జంతువులను ఈడిగిలబడజేయుటకు చర్మ మొలువవలెనా. క్రుమ్మ వలెనా? వేగముగ పరుగెత్తు అటవీ మృగములను సైతము కొలికి కల పగ్గమును ('లాసో') చమత్కారముగ విసరి బోల్తాకొట్టించి యీడిగిలబడ వేయవచ్చును. అమెరికాలోని కౌబాయ్‌లు, వేటగాండ్లు; స్కౌటులు ఈ విద్యలో నిష్ణాతులు. పటిష్టముగా నుండు వన్య మృగములను చర్మము చీరి. క్రుమ్మి మాంస ఖండాలుగా పేర్చుటలో భటుల ప్రతాప మగుపడును. కేవల మీడిగిలబడవేసిన యేమి బాగు? కావున చేమకూర ప్రయోగములో కూడ "కూరాకు చేసి" అనిన మాంసపు ముద్దలుగా చేసి యనియే యర్థము.

3. బైచరాజు వేంకటకవి ప్రయోగము :

"ఈరీతి గడుపు నొప్పిన్
గూరాకై యుడికి గోడు గుడుచుచు"

ఇచట "మెత్తబడజేయు" అనే యర్థమున్నదని శ్రీలింగ మూ_ర్తి యనుచున్నారు. ఉడుకునది "కూరాకు" కుత కుతనుని యుడుకుటకు మాంసము ప్రసిద్ధికానీ ఆకుకూరకాదు, మాంసముడికి మెత్తబడినగాని గొంతులో దిగదు. దిగినను అరుగదు. కావున ఇచటకూడ "కూరాకై యుడికి" అనిన మాంసమువలె నుడికి యని యర్థము. పైగా నిచట నొప్పితో బాధపడునది మాంసలమైన కడుపు.

"కూరాకు" అను పదమొక్కటే యన్ని చోటుల వచ్చుచుండి నను, శ్రీలింగమూర్తిగారు ఒక్కొక్క ప్రయోగమున కొక్కొక్క యర్థము నిచ్చుచున్నారు. ఉదా; కూరకు కొరగాని; ఈడిగిలబడ వేయు; మెత్తబడజేయు, అల్పము నేను ప్రతిప్రయోగములోను "కూరాకు" అనిన మాంసము అని యర్థమనుచున్నాను, శ్రీలింగ మూర్తిగారిచ్చిన ప్రయోగాలలోనే నేను ప్రతిపాదించిన యర్థమున్న దని నావాదము. పండితులే నిర్ణయింతురు గాక.

భగవతి ఎవరు?

డిసెంబరు 1983 భారతిలో డా. కొండూరు వీరరాఘవా చార్యులు "భగవత్" శబ్ద విచారము చేసెరి. దాదాపు అందరు మతి కులు (విష్ణువు, శివుడు, బుద్ధుడు, వ్యాసుడు, శంకరాచార్యులు, వీర బ్రహ్మం) "భగవత్" శబ్ద వాచ్యులే అని తేలినది. నేడు పుట్టపర్తి సాయిబాబా. రజనీష్‌లుకూడ "భగవాన్" అని పిలువబడుచున్నారు. నాకనిపించునదే మన "భగవాన్" పదము ఇంగ్లీషు భాషలోని "సార్" వంటిదీ అని ఎవరిని చూచిన భయ భక్తులు కలిగి, ఎందు కైనను మంచిదని "సార్" అనెదమో అటులనే "భగవాన్" రావ ణునికి సందీశ్వరుడనిన బెదురు అందుకే హనుమంతుని చూడగనే "వీడు భగవాన్నంది కాదుకదాయని స్వగతములో కూడ నందికి భగవాన్ బిరుదు తగిలించును (చూ. సుందరకాండము).

"భగవాన్" ఉన్న తర్వాత "భగవతి" యుండును కదా! కేరళలో, దక్షిణ కన్నడ జిల్లాలో "భగవతి" ఆలయములు కలవు. ఇవి శక్తిగుళ్లు. దేవత పార్వతి. పోతన భాగవతావతారికలో "పుల్లా బ్జాక్షీ! సరస్వతీ! భగవతీ! పూర్ణేందు బింబాననా! అని యున్నది. సరస్వతికి భగవతి పేరున్నట్లు స్పష్టము. శ్రీ రామాను జుల "శరణాగతిగద్య"లో భగవతీం శ్రియం దేవీం" అని లక్ష్మీదేవి, భగవతి అని పిల్వబడినది. దీనినిబట్టి "ముగురమ్మలు" అయిన పార్వతి, సరస్వతి, లక్ష్మి దేవులకు "భగవతి" బిరుదున్నటు తేలి నది, మరి వేరు దేవతకు భగవతీ నామమున్నదో లేదో తెలియ గోరుదును.

"తి"
అనంతపురం

ముని - ఋషి

జనవరి 'భారతి'లో శ్రీ ఆర్. యస్. సుదర్శనంగారు ఉదంకుడు మునియా? ఋషియా? అని సందేహం వెలిబుచ్చి మునికీ, ఋషికీ తేడా తెలియని పామరులకి తెలియటానికి వివరించి చెప్పారు.

వాల్మీకి బాలకాండలో ఇరవై తొమ్మిదో సర్గ వర "ఏవముక్తో మహాతేజా విశ్వామిత్రో మహానృషిః" అన్నాడు. (విశ్వామిత్ర మహర్షి అని వ్యవహారం కూడా వుంది) ముప్ఫయ్యో సర్గచివర "అథయజ్ఞే సమాప్తే తు విశ్వామిత్రో మహామునిః" అన్నాడు ఆ వాల్మీకే. విశ్వామిత్రుడు ఆయజ్ఞం చెయ్యకముందు మహర్షి. యజ్ఞం చేసిన తరవాత మహాముని. రాముడు సుబాహుణ్ణీ, తక్కిన రాక్షసుల్నీ చంపినప్పుడు "శేషాన్ వాయవ్య మాదాయ నిజఘాన మహాయశాః, రాఘవః పరమోదారో మునీనాం ముదమావహన్" అని, దాని వెంటనే వున్న శ్లోకంలో 'స హత్వా రాక్షసాన్ సర్వాన్ యజ్ఞఘ్నాన్ రఘునందనః, ఋషిభిః పూజిత స్తత్ర యథేంద్రో విజయేపురా' అన్నాడు వాల్మీకి. మునికీ ఋషికీ తేడా వాల్మీకికి తెలిసినటు కనిపించటంలేదు.

శ్రీ సుదర్శనంగారు 'ముని' 'ఋషి' యూనివర్సిటీ డిగ్రీలతో పోల్చి వివరించారు. మాలాంటి వాళ్ళకి యిప్పటికీ మునికీ ఋషికీ తేడా తెలియటం లేదు. ఆదికవికి తెలియనిది మాకూ తెలియక పోయినా ఫరవాలేదని ఊరట మాకు.

ఏనాడో జంఘాలశాస్త్రి "ఈత పాఠము కంఠస్థమైనదిగాని ఈత కరస్థము కాలేదు" అన్నాడు. ఇటీవల ఈదే వాళ్ళకన్నా ఈత పాఠం కంఠస్థం చేసేవాళ్ళు యెక్కువై పోయారు. కుండలినీయోగాన్ని ప్రతి కావ్యంలోనూ దర్శించగలగటానికి కారణం. దీని ప్రభావమే.

స. చ. రామానుజాచార్యులు
హైదరాబాదు.

'తి' గారికి మనవి

అల్లసాని పెద్దన 'నవల' అన్న పదాన్ని 'జవ్వని' అన్న అర్థంతో ప్రయోగించాడని నాకు తెలుసు. కవితా పితామహుడు 'నవల' అన్న పదాన్ని ఇంగ్లీషు అర్థంలో ఉపయోగించారని నేనెప్పుడూ అనుకోలేదు. అనలేదు కూడాను. అయితే నావల్ అన్న ఇంగ్లీషు పదము తెలుగులో 'నవల'గా మారి అంతకు వేరే అర్థంతో నున్న 'నవల' అన్న తెలుగు పదముతో శబ్ద సామీప్యం చేత, లేక ఒకటే ఒకటైయుండడం వలన తెలుగుదనాన్ని సంతరించుకుంది.

కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు కందుకూరివారి 'రాజశేఖర చరిత్రం' అన్న రచనను 'నవల' అని నామకరణం చేశారని తెలియజేసినందుకు 'తి' వారికి నా కృతజ్ఞత తెలుపుకుంటున్నాను.

నేను నా వ్యాసంలో క్రింది విధంగా వ్రాశాను. "నావల్ అన్న ఇంగ్లీషు పదం తీసుకొని తెలుగువారు తెలుగుకు తగినట్లుగా మలిచారు. మను చరిత్రంలో 'నవలా నౌకా నౌక మరున్నారీ శిరోరత్నమున్' అని వుంది. అందుచేత నవల అన్న మాట తెలుగులో అతుక్కుంది."

'అతుక్కుంది' అన్నప్పుడు ఇంగ్లీషులోని మాట తెలుగులోని పూర్వపు మాట ఒకటి కావని స్పష్టమవుతుంది. ఈ విషయం విస్తరించనవసరంలేదని క్లుప్తీకరించాను అవసరంపడి రాస్తున్నాను గాని నేను 'తి' వారి స్నేహాన్నే కోరుతున్నాను.

రోణంకి అప్పలస్వామి
టెక్కలి

"తిరు! శ్రీ!"

తెలుగులో వ్యక్తుల పేర్లకుముందు 'శ్రీ' అనే అక్షరాన్ని గౌరవసూచకంగా ఎలా ఉపయోగిస్తారో అలాగే 'తిరు' అన్న పదాన్ని తమిళంలో గూడ వ్యక్తుల పేర్లకుముందు వుపయోగిస్తారు. 'తిరువేంగడాచలం' అని తమిళంలో అంటే తెలుగులో 'శ్రీ వేంకటాచలం;' అని అంటారు. దీనిబట్టి తెలుగులో "శ్రీ పతి" అనే పేరు తమిళంలో "తిరుప్పతి" అనే రాయాలి. తిరుప్పతే కాలాంతర మార్పు చెందుతూ "తిరుపతి"గా ఆంధ్రలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా మారిందేమోననిపిస్తుంది. అయితే తెలుగులో "తృప్తి" అనే పదాన్ని తమిళంలో రాయాలంటె "తిరుప్పతి" అనే రాయాలి కలియుగ వైకుంఠేశ్వరుడయిన శ్రీ వెంకటేశుని దర్శించినపుడు కలిగే తృప్తి మరియే యితర దేవుళ్ళను సందర్శించినపుడు కలుగదేమో. అందువల్ల ఈ "తృప్తి" అనే తెలుగుపదమే తమిళ రూపాంతరముతో గూడి "తిరుపతి"గా మారినదేమోనని మరొక సందేహము కలుగుతున్నది.

అయితే 'శ్రీ' అనే అక్షరం అసలు తమిళంలో లేదా? అంటే! వుంది. తెలుగులో "శ్రీరామజయం" అనే పదాన్ని తమిళంలో కతిరురామ"యం" అని అనకుండా ఎటువంటి మార్పులేకనే తెలుగులో మాదిరి తమిళంలో రాయవచ్చు. అలాగే 'శ్రీప్రియ' అనే పేరును 'తిరుప్రియ' అని రాయకుండా యథాతథంగా రాయవచ్చు. మరి యీ 'శ్రీ' అనే అక్షరాన్ని "తిరు"గా ఎందుకు వ్యవహరిస్తారో

అన్నదే సందేహాస్పదం. తమిళాంధ్రభాషా పండితులెవరైనా ఈ సమస్యకు పరిష్కారం సూచిస్తే బావుంటుంది.

కుంకాల సీతారామ్
గుంటకల్

ముని - ఋషి

మునికీ ఋషికీ వ్యత్యాసం ఉందా? తీస్తే నిఘంటువు (చిన్నది) చూస్తే పెద్ద తేడా కనిపించలేదు కాని అమరకోశంలో అర్థాలు ఇలాగే ఉన్నాయి,

వాచంయమోమునిః (వాచం నియచ్ఛతీతి వాచంయమః. యమ ఉపరమ్. వాక్కును నిలుపువాడు, 1. మన్యతే మునిః ఇ. పు. మన జ్ఞానే. జ్ఞానము గలవాడు. మౌనవ్రతము గలవాని పేళ్లు.)

ఋష యస్సత్య వచసః (జ్ఞానస్య పారగమాత్ ఋషిః ఇ పు. ఋగతౌ. జ్ఞానముయొక్క సారమును బొందినవాడు. 1. సత్యం వచో యేషాం తే సత్య వచ సః. స. పు. సత్యమైన వాక్కులు గలవాడు. 2. ఋషుల పేళ్ళు.)

రఘువంశంలో "ముని వృత్తీనాం-" కి మల్లినాథసూరి ఏమి రాశాడని చూస్తే "ఏతేన వానప్రస్థాశ్రమో వివక్షితః" అన్న మాటలు కనిపించాయి.

జైన మునులు ఉంటారు కాని జైన ఋషులు ఉన్నారా! శ్రీ సుదర్శనంగారి సందేహం చూడగా ఈ ఉత్తరం రాయ బుద్ధి వేసింది.


గంటి రామలింగం
మదరాసు

గాథాసప్తశతి

1983 డిసెంబరు 'భారతి' లో కీ. శే. రాళ్ళపల్లివారి 'కన్నడ జానపద సాహిత్యం' ను పునర్ముద్రిస్తూ శ్రీ ముదివేడు ప్రభాకరరావుగారు తొమ్మిదవ అథోజ్ఞాపికా వివరణలో 'గాథాసప్తశతి' అనువాదకులను పేర్కొన్నారు. గతంలో ('భారతి' జులై 1966) నిడుదవోలు వేంకటరావుగారు ఈ విషయమై ప్రస్తావిస్తూ కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, శ్రీ తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రిగారు కూడ కొన్ని గాథలను తెనిగించినట్లు వ్రాశారు.

గాథాసప్తశతికి మరొక సంపూర్ణానువాదము క్రీ. శ. 1968 లో మూలముతో సహా ప్రకటించబడినది. అనువాదకులు శ్రీ వాసిరెడ్డి వేంకట సుబ్బయ్యగారు, ఈ విషయమును "భారతి" పాఠకుల కందించ ప్రార్థన.

సూర్యదేవర రవికుమార్
కొల్లూరు



గ్రంథ విమర్శలు

కావ్యాదర్శః

[మహాకవి దండ్యాచార్య విరచితము. బాలానందిని అను ఆంధ్ర వ్యాఖ్యలో కూడినది. వ్యాఖ్యాత : డాక్టర్ పుల్లెల శ్రీరామ చంద్రుడుగారు. డెమ్మీ 58 + 8 + 312 + 12 పుటలు. వెల : రూ. 8–50. ప్రకాశకులు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కళా భవన్. సైఫాబాదు, హైదరాబాదు - 500 004.]

కావ్యరచన ఎప్పుడు ప్రారంభమయిందో, అప్పుడే దాన్ని గురించిన చర్చలూ, సిద్ధాంతాలూ ప్రారంభమయాయి. అవి గ్రంథస్థాలయి, సాహిత్య శాస్త్ర గ్రంథాలుగా రూపొందాయి. అలంకార శాస్త్ర గ్రంథాలుగా ప్రసిద్ధాలయిన వాటిలో భామహుని కావ్యాలంకారం, దండి రచించిన కావ్యాదర్శం అతి ప్రాచీనాలు
ఈ రెండూ శ్లోక రూపాలే !

దండి మహాకవి రచనలలో దశకుమార చరిత్రమనే గద్య గ్రంథం, ఈ కావ్యాదర్శం మిక్కిలి ప్రచారాన్ని పొందాయి. భామహుని కావ్యాలంకారం కావ్యాదర్శంకంటె ముందుదే అయినా, దీని కున్న ప్రచారం దానికి లేదు.

కావ్యాదర్శంలో మూడు పరిచ్ఛేదా లున్నవి. మొదటి పరిచ్ఛేదంలో కావ్యప్రయోజనం, కావ్యలక్షణం, కావ్యరచనకు కావలసిన ప్రవిభాదులు, కావ్యభేదాలు, నాయక విషయం, గుణాల లక్షణస్వరూపాలు మున్నగు విషయాలున్నవి. ద్వితీయోచ్ఛ్వాసంలో అర్థవైచిత్రికి ప్రధానాలయిన ఉపమాద్యలంకారాలు 35 వాటి భేదాలతో కూడా వివరింపబడినవి ఇందులో ఉపమాలంకార భేదనిరూపణ విపులంగా ఉన్నది. చివరి ఉచ్ఛ్వాసంలో శబ్ద వైచిత్రిని వివరించే శబ్దాలంకారాలు, వాటి వైచిత్ర్య భేదాలు వివరింపబడి ఉన్నవి.

సంస్కృతంలో ఉన్న ఈ గ్రంథంలోని విషయం తెలుగులో మాత్రం కృషిచేసిన వారికి అవగాహన కాదు. అందుకోసం దీనికి సుప్రసిద్ధ విద్వాంసులు, బహుభాషల్లో డాక్టరేట్ పట్టం పొందిన వారు, ప్రతిభావంతులు అయిన పుల్లెల రామచంద్రుడుగారు బాలానందిని అనే తెలుగు వ్యాఖ్యను విపులంగా రచించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు దీనిని ప్రకటించి, తెలుగువారికి మహోపకారం చేశారు.

పుల్లెల రామచంద్రుడుగారు సంస్కృతంలోని సాహిత్యశాస్త్ర గ్రంథాలను చాలావరకూ తమ విపుల వ్యాఖ్యలతో ప్రకటించారు. సురభారతీ సమితి కార్యదర్శి అయి, ఆ సమితి పక్షాన ఇతరులచే గ్రంథాలను రచింపజేసి ప్రకటిస్తూ, తాముకూడా కొన్నిటిని రచించి ప్రకటించారు. కొన్నిటిని స్వంతంగా ప్రకటించారు. కావ్యాలంకారం, కావ్యాలంకార సూత్రవృత్తి, కావ్యమీమాంస, వక్రోక్తి జీవితం వారి వ్యాఖ్యలతో వెలువడినవి.

ఈ కావ్యాదర్శానికి వారి విపుల పీఠిక ఉన్నది. దీనిలో సాహిత్య శాస్త్రవేత్తల చరిత్రతోపాటు, సాహిత్యాన్ని గురించిన పెక్కు విషయాలు వివరించబడినవి. గ్రంథం చివర శ్లోకానుక్రమణిక చేర్చబడింది. ప్రాచీనాధునాతనాలంకారికుల సిద్ధాంతాలనూ, కావ్య స్వరూపాదులనూ తెలిసికొనగోరే వారికి ఇది అత్యంతోపయుక్తమైన గ్రంథం.

సింహగిరి వచనములు

[కృష్ణమాచార్య ప్రణీతము. సంపాదకులు, పరిష్కర్త : డాక్టర్ ఎమ్. కులశేఖరరావుగారు, ఎం, ఏ,, పిహెచ్ డి. డెమ్మీసైజు 30 + 48 పుటలు, వెల : రు 2 50 లు. ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాదమి, కళాభవన్. సైఫాబాద్. హైదరాబాద్-500004.]

వచన వాఙ్మయంతో భగవత్ప్రార్థనా రూపంలో ఉన్న వచనాలు ఒక ప్రక్రియ. తాళ్ళపాకవారి వేంకటేశ్వర వచనాలు సుప్రసిద్ధాలు. వానికంటె ఎంతో ముందుగా రచింపబడినవే యీ సింహగిరి వచనములు. వచన వాఙ్మయంలో ఇవే తొలి రచన. ఆంతవరకూ అముద్రితంగా ఉన్న దీనిని 1968లో ఆంధ్ర రచయితల సంఘం వారు ప్రచురించారు. ఆ ప్రతులు ఇప్పుడు దొరకవు. ఉత్తమ గ్రంథ ప్రకటనకు పూనుకున్న ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాదమివారు దీనిని తిరిగి ముద్రించి ఆంధ్రులకందిస్తున్నారు. ఇది హర్షించదగిన విషయం. అకాదమివారు, వచన వాఙ్మయ పరిశోధనలో గొప్ప కృషిచేసి, పి. హెచ్. డి. పట్టం పొందిన కులశేఖరరావుగారి సంపాదకత్వంలో దీన్ని ప్రచురించడం కూడా దీని ప్రాశస్త్యానికి హేతువని చెప్పవచ్చును. వచన వాఙ్మయాన్ని గురించీ, ఈ వచనాలను గురించీ సంపాదకులు దీనికి వ్రాసిన 30 పేజీల విపుల

పీఠికలో పెక్కు విషయాలు చెప్పబడినవి. అది విద్వాంసులకూ, పరిశోధకులకు మిక్కిలి ఉపకరిస్తాయి.

అన్నమాచార్యులవలెనే ప్రాచీనులయిన కృష్ణమాచార్యులు విష్ణుభక్తాగ్రేసరులు. ఆయన నృసింహదేవుని సాక్షాత్కారాన్ని పొంది వట్లు కూడా ప్రసిద్ధి. అట్టి భక్తాగ్రణి రచన భక్తి రసపూరితమై ఉండుటలో ఆశ్చర్యం లేదు. ఆయన ఎన్ని వచనాలు వ్రాశారో తెలియలేదు. ఉపలబ్ధమైన వ్రాతప్రతి అసమగ్రంగానే ఉన్నది. అందులో 60 వచనాలు మాత్రమే ఉన్నవి. ఆ అరవై వచనాలే ఇందులో ఉన్నవి. ఆ వచన రచనా పద్ధతి కొక ఉదాహరణ-

"దేవా! మీ దివ్యజ్ఞాన మెఱుగువారు పరమజ్ఞానులు. పరమానంద స్వరూపులు. వైకుంఠపుర నివాసులు, వారే పరమ పావనులు. కోటి యజ్ఞకర్తలు, సర్వదర్శనంబులు, సర్వశాస్త్రములు చదివిన ఫలమదియే! అనాథపతీ! స్వామీ! సింహగిరి నరహరీ! మీ కైంకర్య పరులకు వందనము చేయుటయే పదివేలు. అనంతములైన ఫలములు కలుగును. ఆచార్య విహీనుడై ద్విజుఁడు, కులాచారము, విడిచి, యనామకురాలివలన సుఖమందినట్టిదే, యితర దేవతా ప్రపత్తి చేసినవారి (ఆచారము)-యతి రామానుజముని పదము దాతారు. సింహగిరి నరహరీ! నమో నమో దయా నిధీ! (15.)

కృష్ణరాయ విజయము

[కుమార ధూర్జటి ప్రణీతము, పరిష్కర్త: డాక్టర్ పి. వి. రామచంద్రరావుగారు, డెమ్మి 2 + 40 + 107 పుటలు, వెల: రూ. 4 లు, ప్రకాశకులు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, కళా భవన్, సైఫాబాద్, హైదరాబాదు - 4.]

విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన కృష్ణదేవరాయల చరిత్రను తెలియజేసే నాలుగాశ్వాసాల ప్రబంధం యిది, 16వ శతాబ్ది చివర ఉండిన విశ్వనాథనాయని స్థానాపతి రచించిన రాయవాచకమనే వచన గ్రంథానికి ఇది పద్య కావ్య రూపమైన రచన ఈ విషయాన్ని కుమార ధూర్జటి తన గ్రంథంలో చెప్పక పోయినా, ఈ రెండూ చూచిన వారికి ఈ విషయం బాగా తెలుస్తుంది. ఇది కావ్యం కావడం వల్ల కొన్ని వర్ణనలు ఇందులో చేర్చడం మాత్రం ఒక విశేషం. ఈకవి 18వ శతాబ్దివాడు.

ఈ కృష్ణరాయ విజయాన్ని వావిళ్లవారు ఏనాడో ప్రచురించారు. కాని, దాని ప్రతులు ఇప్పుడు ఎక్కడా లభ్యంకావు. ఉత్తమ సంస్కృతాంధ్ర గ్రంథాలనూ, అలభ్యంగా ఉన్న ప్రబంధాలను ఆంధ్ర సాహిత్యాభిమానుల ఉపయోగార్థం తిరిగి ముద్రించి అందచెయ్యడానికి పూనుకున్న ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు దీనిని పరిష్కరింపజేసి చక్కగా ముద్రింపించి ప్రకటించారు. పరిష్కర్తలు సుప్రసిద్ధ చరిత్రకారులూ, విద్వాంసులూ అయిన డాక్టర్ పి. వి. రామచంద్రరావుగారు ఈ చరిత్రకు సంబంధించిన పెక్కు గ్రంథాలను పరిశీలించి వ్రాసిన 40 పేజీల విపుల పీఠికతో ఇది ప్రకటించబడింది. రామచంద్రరావుగారు తమ పీఠికలో రాయవాచక-కృష్ణరాయ విజయాల పరస్పర సంబంధాన్ని గురించీ, కుమార ధూర్జటి కవి కాలాదులను గురించీ, రచనలను గురించీ పెక్కు విషయాలను సప్రమాణంగా వివరించారు. వావిళ్లవారి ప్రతికి ఇట్టి విపుల పీఠిక లేదు ఈ గ్రంథాన్ని బట్టి పరిష్కర్త చేసిన అపార కృషి వ్యక్తమవుతూ ఉన్నది. చరిత్ర పరిశోధకులకూ, సాహిత్యాభిమానులకూ ఇది ఎంతో ఉపయుక్తమైనది.

అమూల్యాలూ, అనుపలబ్ధాలూ అయిన గ్రంథాలను సమర్థులచే పరిష్కరింపజేసి, చక్కని పీఠికలతో ముద్రింపించి తక్కువ వెలలకే ఆంధ్రదేశానికి అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారూ ఏతద్గ్రంథ పరిష్కర్తలు డాక్టర్ పి. వి. రామచంద్రరావుగారూ అందరికీ అభినందనీయులు.

శ్రీ బులుసు వేంకట రమణయ్య

సద్దర్శనము

[భగవాన్ శ్రీ రమణ మహర్షి రచించిన "ఉళ్లదు నార్పదు" తమిళ గ్రంథమునకు కావ్య కంఠ శ్రీ వాసిష్ఠ గణపతి ముని కూర్చిన సంస్కృతానువాదము. డాక్టర్ చాగంటి సూర్యనారాయణమూర్తిగారి ఆంధ్ర వచనానువాద వ్యాఖ్యలతో కూడినది. డెమ్మీసైజు, 110 పుటలు వెల 10 రూపాయలు. ప్రకాశకులు శ్రీ ఎం. నరసింహం, శ్రీ రమణ భక్త మండలి, 2-2-130/8/1, న్యూ నల్లకుంట, హైదరాబాద్ - 500 044]

అధ్యాత్మిక తత్త్వాన్ని అతి సులభమైన పద్ధతిలో తత్త్వ జిజ్ఞాసువులకు అందించిన మహనీయులలో భగవాన్ రమణ మహర్షి ముఖ్యులు. వారి శిష్యకోటి ఆ సేతు హిమాచల పర్యంతమేకాక విదేశాలలో కూడ ఉన్నది. కావ్య కంఠ వాసిష్ఠ గణపతి ముని వంటి వారు ఆయన శిష్యులు. శ్రీ రమణ మహర్షికి నిత్య సన్నిహితులైన మురుగనార్ అనే భక్తుని కోరికపై "ఉళ్లదు-నార్పదు" (ఉన్నది నలువది) అని తమిళంలో షడ్దర్శనాల సారభూతమైన తత్త్వాన్ని సంగ్రహంగా రచించగా, దానిని శ్రీ వాసిష్ఠ గణపతి ముని "సద్దర్శనము"

అనే పేరుతో సంస్కృతీకరించారు. అది శ్లోక రూపంలో ఉన్నది. దానికి శ్రీ కపాలి శాస్త్రిగారు, టి. ఎమ్. పి. మహాదేవన్‌గారు మున్నగు వారు భాష్యములు వ్రాశారు. వాటిలో వేదాంతసారమంతా ఇమిడి ఉన్నది. శ్రీ రమణ మహర్షికి చికిత్స చేయుటకై వారి సన్నిధికి వెళ్లిన డాక్టర్ బాగంటి సూర్యనారాయణమూర్తిగారు మహర్షి దివ్య దర్శనం వల్ల ప్రభావితులై గణపతి మునుల 'సద్దర్శ'నానికి తెలుగు వచనంలో అనువాదం చేస్తూ శ్రీ కపాలిశాస్త్రిగారు మున్నగువారి భాష్యాలలోని విశేషాలను విపులంగా అందిస్తూ దీనిని రచించారు. శ్లోకానువాదం, వివరణ అందరికీ అర్థమయే రీతిని చాలా సులభ శైలిలో ఉన్నాయి.

ఆధ్యాత్మిక తత్త్వాన్ని తెలిపే గ్రంథాలు, ఉపనిషత్తులు చాలా ఉన్నవి. అవి అందరికీ బోధపడవు, వేదాంత సారాన్ని సులభంగా 42 శ్లోకాల్లో ఇమిడ్చి చెప్పిన యీ గ్రంథం జిజ్ఞాసువులకు మిక్కిలి ఉపాదేయమైనది. దీన్ని వివరణ సహితంగా ఆంధ్రీకరించిన డాక్టర్ సూర్యనారాయణమూర్తిగారూ, దీనిని ప్రకటించిన శ్రీ రమణ భక్త మండలి అధ్యక్షులు ఎం. నరసింహంగారూ చేసిన సేవ మిక్కిలి ప్రశంసనీయమైనది.

పాణినీయ అష్టాధ్యాయీ సూత్రపాఠః

[అనువృత్తి విషయ సూచీ సహితం. సంపాదకులు శ్రీ కె. సుదర్శనాచార్యులు. (డబుల్ ఎం. ఏ) క్రౌన్ 120 పేజీలు. వెల: 5 రూ. ప్రకాశకులు: విశ్వవేదాంత పరిషత్, సంతోష్‌నగర్, హైదరాబాదు. ప్రాప్తిస్థానం-ప్రకాశ్ పబ్లిషర్స్, ఎం. సి. హెచ్. మార్కెట్, షాప్ నెం. 3. అఫ్జల్‌గంజ్, హైదరాబాదు-500 012 లేక. ఆంధ్ర సారస్వత పరిషత్, తిలక్‌రోడ్, హైదరాబాదు-1. లేక గాంధీ జ్ఞానమందిరమ్, తిలక్‌పార్కు, కోఠి, హైదరాబాదు-1 లేక ఆర్యసమాజమందిర్, సుల్తాన్‌బజార్, హైదరాబాదు-1]

ఇది పాణినిముని ఎనిమిది అధ్యాయాలలో రచించిన వ్యాకరణ సూత్రాల పాఠ్యగ్రంథం. వేదాంగాలలో వ్యాకరణం ఒకటి. అపశబ్దాలేవో, సుశబ్దాలేవో వ్యాకరణంవల్లనే తెలుస్తుంది. సంస్కృతంలో ఎన్నో వ్యాకరణాలున్నా పాణినీయ వ్యాకరణమే ప్రఖ్యాతమైనది. ఇప్పుడు ప్రచారంలోనూ, పఠన, పఠనాలలోనూ నిలిచినది అది మాత్రమే! ఆ సూత్రాల సమన్వయ పద్ధతిలో సంజ్ఞా, పరిభాషాది ప్రకరణ విభాగ పద్ధతిలో భట్టోజి దీక్షితుల సిద్ధాంత కౌముది మున్నగు గ్రంథాలు వెలువడి మిక్కిలి ప్రచారాన్ని పొందాయి. అష్టాధ్యాయి మాత్రం అధ్యాయ, పాదపద్ధతిలో కూర్చబడింది. దీనిని ఎన్నో దశాబ్దాల క్రిందటనే బొంబాయిలోని నిర్ణయసాగర ముద్రాలయంవారు కంఠ పాఠానికి అనుకూలమగునట్లు చక్కగా దేవనాగరి లిపిలో ముద్రించి స్వల్పధరకే అందజేశారు, ఈ ముద్రణ ఆ పద్ధతిలోనే జరిగిందిగాని, దేవనాగరలిపి నెరుగని తెలుగువారి ఉపయోగార్థం తెలుగు లిపిలోనే అచ్చు వేయబడింది. నిర్ణయసాగర ప్రతి కంటె ఇందలి విశేషమేమిటంటే ఇందు అనువృత్తి సూచిక ఇయ్యబడింది. పాఠకుల సౌకర్యార్థం వీలగునంతకూ సూత్రాలలోని పదాల సంధులు విడదీసి ఈయబడినవి. ఏ అధ్యాయంలో ఏ పాదంలో ఏయే సూత్రాలు ఏ విషయాలను తెలుపుతున్నదీ సూత్ర సంఖ్యతోనూ, పుటల సంఖ్యతోనూ విషయ సూచికలో తెలుపబడింది. ఈ పద్ధతి వ్యాకరణ జిజ్ఞాసువులకు ఎంతో ఉపయుక్తమైనది.

ఈ పద్ధతిలో దీనిని సమకూర్చిన శ్రీ కె. సుదర్శనాచార్యుల గారు, ప్రకాశకులు విశ్వవేదాంగ పరిషత్తువారును అభినందనీయులు.

"ఆంగీరస"

మానవ పథంలో మహిళా పురోగతి

[రచన-ఎస్. ఎస్. లక్ష్మి; వెల-రు 8; ప్రతులకు-రావిపూడి వెంకటాద్రి, ఎడిటర్, హేతువాది, చీరాల 523 155]

"స్త్రీల సమస్యలను విశ్లేషించడం సులభం. వాస్తవ జీవితంలో ఆ సమస్యలు రాకుండా ప్రవర్తించడం అంత సులభం కాదు. సమస్యలేవో తాత్కాలిక చిక్కులేవో తెలుసుకొనగలగడం చాలా కష్టం. అవగాహన, సద్భావం, నిర్మాణాత్మక దృష్టి విజ్ఞానం చాలా అవసరం" అన్నారొక మనో సాంఘిక శాస్త్రవేత్త. 188 పుటల ఈ పుస్తకంలోని 26 వ్యాసాలలో అధికభాగం యీ విమర్శనా పరిధి కందవు. సాహిత్యంలో స్త్రీ అనే వ్యాసంతో 'స్త్రీ అనేది కేవలం పురుషుని అవసరార్థ వస్తువు కాదని ఆమెకూడా రక్త మాంసాలు గల ఒక మనిషేననే భావనను మొట్ట మొదటిసారిగా తన సాహిత్యంద్వారా ప్రజల దృష్టికి తెచ్చిన ఘనత మహాకవి గురజాడది అన్నారు ఈ రచయిత్రి. ఇది సమగ్రమైన అభిప్రాయమని అనగలమా? అయితే 9వ పుటలో యీ రచయిత్రి అన్నట్లు "స్త్రీ, పురుషుల... అసమానతను అరికట్ట గలిగింది చలం స్త్రీ" అనే మాట నిజమే అయినా అంతకు ముందు కూడా కొంతమంది స్త్రీలకు సాహిత్యంలో ఇవ్వవలసిన గౌరవం ఇచ్చారు. కాని చలం దృష్టి వేరు, చలం తాత్వికత వేరు.

నవలా (రచయితలో) నాయికల వేషభాషలలో ఆధునికత్వం గురించిన ఈ రచయిత్రి అభిప్రాయాలకు ఆయా రచయిత్రులే సమాధానం చెప్పగలరు. నవచైతన్యం స్త్రీలలో జాగృతం కావాలి అని

చెప్పడం సులభమే ఆ చైతన్యం అలవడడం ఎంత కష్టమో! "సాహిత్యంలో మానవతా విలువలు" అనే వ్యాసంలో యీ రచయిత్రి వెలిబుచ్చిన అభిప్రాయాలకు ఎవరికీ పేచీ వుండనవసరంలేదు. పేచీ అంతా "మానవతా విలువలు" అనే మాట నిర్వచనం గురించే. మానవ జాతిని ముందుకు నడిపించే తెలుగు సాహిత్యం లేనే లేదను కుందామా? ఏ దృష్టితో అలా కనిపించుతుంది లోకం. అయితే నేటి నవలలు మన పురాణ కథలకు ఏ మాత్రం తీసిపోవని 17వ పుటలో యీ రచయిత్రి వెలిబుచ్చిన అభిప్రాయం సరయినదేనేమో! 'జీవితపు చీకటి కోణాలను వెలిగించే సాహిత్యం' అనే వ్యాసంలో యీ రచయిత వెలిబుచ్చిన అభిప్రాయాలను మరింత విపులీకరించితే బాగుండేది. 28వ పుటలో యీ రచయిత్రి రచయిత్రులకు జీవితం పట్ల గల దృక్పథం, అనుభవం గురించి వెలిబుచ్చిన అభిప్రాయం యీ రచయిత్రికి కూడా వర్తించుతుందేమో ! ప్రతి అంశాన్ని "నేటి" దృక్పథంతో చర్చించడం ఆరోగ్యకరం కాదు. మహిళలలో శాస్త్రీయ దృక్పథం లోపం గురించి ప్రత్యేకంగా బాధపడ నవసరం లేదు. శాస్త్రీయ దృక్పథం అంటే యేమిటో నిర్వచించితే పురుషులలో ఎంతమందికి ఆ దృక్పథం ఉన్నదో, వారిలో ఎంతమంది సమకాలీన సమస్యలను గురించి సమగ్రంగా ఆలోచిస్తున్నారో విశదమవుతుంది గదా! సంప్రదాయాలను గురించి ఎంత తక్కువగా ఆవేశపడితే అంతగా వివేకశక్తి పెంపొందుతుంది. ఇలా వ్రాసుకుంటూ పోతే యీ వ్యాసాలలో ప్రతిఒక్క వ్యాసం విమర్శించ దగినదే ! "రాయ్ ప్రతిపాదించిన మానవ వర్గ లక్ష్యం", ఆధునిక మానవుడు-మానవతా దృక్పథం", "ఆధునిక జీవితంలో రసదృష్టి" అనే వ్యాసాలు ప్రత్యేకంగా ప్రశంసించ దగినవి. ఇంతకూ యీ వ్యాసాలన్నీ ఒకే సారి వ్రాసినవి కావుగదా! అందువల్ల పరస్పర విరుద్ధాంశాలుండడం సహజమేనేమో.

శ్రీ వి. ఎస్. అవధాని

వేమ వ్

[వెల : రు. 6-00 లు ప్రతులకు : వయోజన విద్యాపోరం; కేరాఫ్ ప్రాజెక్ట్ అధికారి; వయోజన విద్యా ప్రాజెక్ట్, బాన్సువాడ - 503 187 ; నిజామాబాద్ జిల్లా]

ఈ గ్రంథం వయోజన విద్యకు సంబంధించినది. ప్రణాళిక పరంగా ఈ కార్యక్రమాన్ని 'జాతీయ వయోజన విద్యాకార్యక్రమం. అంటారు. భారతదేశంలో అధిక జనాభా వ్యవసాయం మీద ఆధార పడిన వాళ్లు. కాగా గ్రామీణ జీవన విధానానికి అలవాటు పడినవాళ్ళు. వీరిలో నిరక్షరాస్యుల శాతం ఎక్కువ. అజ్ఞానం. దారిద్ర్యం, అపరిశుభ్రత, రోగగ్రస్తమైన శరీరం, మనస్సు కలిగిన వారు మరీఎక్కువ పని పాటల్లో జీవించే వారికి క్రమబద్ధమైన విద్యావిధానం ద్వారా విద్యను బోధించటం కష్టతరమైనపని అంచేత భారత ప్రభుత్వం అనిబద్ధమైన ఒక విద్యాప్రణాళికను వయోజనులకు నిర్దేశించింది. విద్య ద్వారా విజ్ఞానం తద్వార సాంఘికాభివృద్ధి సాధించటం ప్రభుత్వలక్ష్యం

ఈ విద్యావిధానం యొక్క ఆశయాలను అమలు జరిగే విధానాన్ని, దానిలోని లోటుపాట్లను, అధికారులు ఎదుర్కొనే సమస్యలను, వాటి పరిష్కార మార్గాలను, ఉపాధ్యాయుల, ఆధ్యాపకుల పర్యవేక్షణాధికారులు అను భూతులను, అనుభవాలను, ఈ విద్యా ప్రణాళిక యొక్క ఆవశ్యకతను ఈ గ్రంథంలో వివిధ రచయితలు వెలిబుచ్చారు.

బంభరాలు (శతదళ పుష్పం)

[కంచనపల్లి రాంప్రసాద్ వెల:- రు. 7-50 లు. ప్రతులకు: నవోదయ పబ్లిషర్స్: ఏలూరు రోడ్ విజయవాడ].

ఇది వంద గేయాల కవితా సంకలనం. కవి వృత్తిరీత్యా రసాయనశాస్త్రోపన్యాసకులు. ప్రవృత్తి రీత్యా కవితోపాసకులు. ఈ సంకలనానికి బెజవాడ గోపాలరెడ్డిగారు, ఎమ్వీయల్ "ముందు మాటలు" రాశారు "వయసు మీదున్నపుడే, యిలా-ఎందుకయి పోయాడా? అని వయసు మీదపడినవాళ్లు ఆలోచించాల్సిన పుస్తకం ఈ తేట గీతాలు" అని ఎమ్వీయల్‌గారు అన్నారు.

ఒక్కొక్క కవికి ఒక్కొక్క చింతన ఉండటం సహజమే. కాని ఇక్కడ వేదనలన్నీ అనిత్యాలని నిత్యమైన సత్యం బ్రహ్మపదార్థమని చెప్పే వేదాంతం దొంగ వేదాంతమే కాకుండా, జనాల్ని పెడత్రోవ పట్టించే వేదాంతమే అవుతుంది.

"సత్యాలు అనిత్యాలై
ఆదర్శాలు అపహేళనలై
ధర్మం అంతరించి పోతుంటే-"

అని వాపోయిన కవి వాటికి మూల కారణాలను అన్వేషించే ప్రయత్నం చెయ్యక

"ప్రభూ ! ఈ అజ్ఞానాంధకారపు ఎడారిలో
నీ ఉషస్సు ఉండాలి
నీ కరుణా వీక్షణంతో
నీ గాన మాధుర్యంతో
ఈ 'ఎడారిని సస్యశ్యామలం చెయ్యాలి'

అని కోరుకోవటం మానవశక్తి మీద అవిశ్వాసాన్నే తెలియజేస్తోంది. లోకంలో మంచి చెడు, సుఖం దుఃఖం, వెలుగునీడ ఎప్పుడూ

ఉంటాయి. చెడు నుంచి మంచికి, దుఃఖాన్నుంచి సుఖానికి, చీకటి నుంచి వెలుగుకి మానవజాతి పరివర్తనం చెందటానికి మానవుడే కారకుడవుతాడు కాని మరొకడు కాడు.

"పరిచయ కర్తవి నువ్వేనని
పర మార్థానివి నువ్వేనని
ప్రేమను సృజించినది నువ్వేనని
యధార్థాన్ని గ్రహించలేని వ్యర్థులు"

అని కవిగారంటే-ఈ లోకపు నిజాన్ని, న్యాయాన్ని, గమనాన్ని చూడలేని, చూడటానికి ఇష్టం లేని పలాయనవాదుల జీవిత పరమార్థ మింతేనని పాఠకులలో కూడా ఒక వర్గం సరిపెట్టుకోవచ్చునని ఈ సమీక్షకుని అభిప్రాయం.

విషయాన్ని వదిలేస్తే ఈయనలో కవిత్వం చెప్పి మెప్పించే నేర్పు ఉందని ఈ గేయాలు ఋజువు చేస్తున్నాయి. వారి భావాలను వారే మరోసారి లోకంపోకడతో సరిచూసుకొని ఇంకా మంచి కవిత్వం రాయాలని నా కోరిక.

వీణా వాణి (కవితా సంకలనం)

[సంపాదకులు: జి. వి. యామునాచార్య. వెల: రు. 7-00 లు. ప్రతులకు : కార్యదర్శి, సాహితీ సాంస్కృతీ సమాఖ్య, వీణవంక - 505 502]

సాహితీ సాంస్కృతిక సమాఖ్య వీణవంక వారు అచ్చువేసిన వివిధ కొత్త గొంతుల కవితా సంకలన మిది. కవిత్వం రాయాలనే తపన గల యువతరం ఈనాడు ఎక్కువ కనిపించటం ఆనందించ తగ్గ విషయం. ఈ తరానికి అందులోనూ ఇప్పు డిప్పుడే కవిత్వం లోకి అడుగు పెడుతున్న తరానికి ప్రోత్సాహ మివ్వటానికి అనేక సాహితీ సంస్థలు ముందుకు రావడం మరో ఆనందించతగ్గ విషయం. "ఉత్తమ సాహిత్యం సహన శీలతను, ఔదార్యాన్ని, దేశభక్తిని కలిగించి జాతికి జీవనం పోయగల్గాలి. ఇట్టి సాహిత్య ప్రాదుర్భావానికై సులభమైన, సరసమైన వాతావరణం కల్పించి యువ కవులకు ఉత్సాహ ప్రోత్సాహముల నందించడమే మా సంకల్పం" అని సాహితీ సాంస్కృతిక సమాఖ్యవారు సంపాదకీయంలో పేర్కొన్నారు.

ఇందులోని కవులంతా ఈ సంఘంలోని దురాచారాలను, దుర్మార్గాలను చూసి బాధ పడుతున్న వారే. తక్షణం ఈ సమాజం మారాలని, మానవత్వం వెల్లి విరియాలని ఆశిస్తున్నవారే. కవితారంభ దశలో ఉన్నారు కనుక ఉద్రేకానికి ఆకారాన్ని కల్పించటంలో శిల్పానికి కొంచెం దూరంగా ఉన్నారు. దృష్టి ముందై శిల్పం వెనకైతే కవిత్వం రాణించదు. 'ఇందలి రచనలు కొన్ని ప్రౌఢిని సంతరించుకొని లేకున్నను రచనా వ్యాసంగమునకు దోహదమీయ తలంపుతో చేపట్టబడినది కావున నవ కిసలయ సదృశులైన రచయితల హృదయకమలను స్పందింపజేసిన భావ పరంపరలకు బదులు సహృదయంతో స్వీకరింతురు గాక," అంటున్నారు సంపాదకులు, సహృదయులైన పాఠకులకున్నా సంపాదకీయ బాధ్యత స్వీకరించిన వారు మరీ వచనత్వపు తునకలను పరిహరించితే బాగుండేది. ఈ సంకలనంలో కొన్ని కవితలు -

"స్వచ్ఛంద స్వాంత రంగుడవై
ప్రజాద్రోహుల పరిసమాప్తి జేయుము
ప్రజాస్వామ్య పరిరక్షణ జేయుము"

"భూమిపైన ప్రాకే పాదులక్ష్యం
ఆకాశం వైపు ఎదిగే మొక్కల లక్ష్యం
కాయల కాపే....
ఇంట్లో పనిచేసే తల్లి వీధిలో పనిచేసే తండ్రి
ఇద్దరి లక్ష్యం పిల్లల బాగే"

"ఈ లోకం
నన్ను వెక్కిరించింది
చైతన్యం లేని సమాజంలో
ఇంకా బ్రతికే ఉన్నారు
లే......" అని.

రక్త సంధ్య

[అద్దేపల్లి రామమోహనరావు. వెల: రు. 6-00 లు, ప్రతులకు:- 1) ఎక్స్‌రే పబ్లిషర్స్; కొల్లూరి హౌస్; అమలాపురం - 533 202, 2) నవోదయా పబ్లిషర్స్; ఏలూరురోడ్; విజయవాడ, 3) దేశీబుక్‌హౌస్; నారాయణగూడ; హైదరాబాద్];

అద్దేపల్లి రామమోహనరావుగారు కవిగా, విమర్శకులుగా సాహిత్యలోకానికి చిరపరిచితులు. అంతర్జ్వాల వచనగేయ కవితా సంకలనం, మధుజ్వాల ఉమర్‌ఖయ్యాంకి అనువాదం ఆయన లోగడ రాసిన కవితా సంకలనాలు. శ్రీశ్రీ కవితా ప్రస్థానం, విమర్శవేదిక వారి విమర్శగ్రంథాలు. మంచి కవిత్వం రాస్తున్న అతి కొద్దిమంది తెలుగు కవులలో రామమోహనరావుగారు ఒకరు అనేది యదార్థం.

రక్తసంధ్య అనే ఈ కవితా సంకలనం 1967 లో రాసిన గేయంతోసహా 1983 వరకూ అప్పుడప్పుడు ప్రచురించిన ఖండిక

అతో కూడుకొని ఉన్నది. రామమోహనరావుగారి కవితా వస్తువు, పద్ధతి ఆధునికమైనవి. ఆయన దృష్టి అంతా వర్తమాన రాజకీయాలమీద, కులతత్వాలమీద ఆర్థిక అసమానతలపైనా, స్త్రీల అపహాస్యంపైనా కేంద్రీకృతమై ఉంది. ఆయా అంశాలపై ఉద్రేకించి కవిత్వం రాసేటప్పుడు ఒక్కొక్కసారి కవిత్వం ఉపన్యాసంగా మారి పోవటం కూడా కద్దు.

"తాను పదో అంతస్తు మీద నిలబడి
కింద నడుస్తున్న ఆకలి పేగుల్ని చూస్తూ
కన్నీటితో స్నానం చేయిస్తూ
'డబ్బులో సుఖమేమీ లే'దని
లక్షాధికార్లు తుహినా కరుణతో ఓదారుస్తున్న
ధనికుల్ని గౌరవించే ఈ దేశంలో
ఆకలి తిరుగుబాటు చెయ్యడం లేదు"

అంటున్నారు. ఇది 1971 లో రాసిన గేయమైనా ఆనాటికే దేశవ్యాపితంగా ఒక విప్లవోద్యమం రూపు దాల్చటం తెలియని సంగతి కాదు. తిరుగుబాట్లు, విప్లవాలు ప్రజల్లోంచే వస్తాయి. 'ప్రజలకు సాయుధం చేస్తున్న రివల్యూషనరీ నేటి కవి' అని ఎవరో అన్నారు. అది రామమోహనరావుగారికి తెలియని విషయమూ కాదు, 'విప్లవ పతాక-వియత్నామే' అనే గేయం 1972 లో రాశారు. ఆ గేయంలో అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం వియత్నాం పౌరుల పోరాటాలకు ఉత్తేజితులై ఈ గేయం రాశారు. ఈ గేయంలో నిజంగానే వీరత్వం వరించి ఆదేశించినట్లుగా కనబడుతుంది. అక్కడి పోరాటాన్ని ఇక్కడ కవి తన అక్షరాల్లో చూపిస్తున్నట్లుగా ప్రతి అక్షరం కనబడుతుంది.

"అక్కడ
పసిపిల్లలు తుపాకి గొట్టంతో
పలకమీద అ-ఆ-లు రాస్తున్నారు-
తల్లులు
ఎడమచేతి గన్నుతో, కుడిచేతి గరిటెతో
పిల్లలకు ఆహారం అందిస్తున్నారు
వీరులు
ప్రియురాలి పెదవిమీద
విప్లవ గీతాన్ని రచిస్తున్నారు".

ఇట్లాంటి గేయాలు ఉత్తుత్త కవి, సాధారణ కవి రాయలేడు. అయితే వియత్నాం గెలిచింది. కంపూచియా సంగతేమిటి? "నరజాతి చరిత్ర సమస్తం పరస్పరాహరణోద్యోగమేనా?" ఒక కాలానికి ఒకటి యథార్థం; మరో కాలానికి మరొకటే యథార్థం.

"అక్కడి మనిషి
ఒక చేతిని మృత్యువు భుజంమీద
ఒక చేతిని జీవితపు నిజంమీద
వేసి, నిప్పుమీద నడిచిపోతున్నాడు"

ఆనాడు అక్కడ ఏమోగాని ఈనాడు ఇక్కడ ప్రతిమనిషి బ్రతుకూ అలాగే ఉంది విదేశ ఉద్యమాల కున్నంత సానుభూతి మన దేశంలో స్వఉద్యమాలకు ఉన్నట్లు కనబడదు, దైవభక్తిని, ధర్మోపన్యాసాలను, మూఢ విశ్వాసాలను, కులభేదాల్ని, రాజకీయ నినాదాల్ని ఈనాడు ఎదుర్కోవటం చేతకాని వాళ్ళు తక్కువ. ఇక్కడ రావుగారి అంచనా పొరబాటు.

"నిశ్శబ్దంలో నక్షత్రాలు నవ్వుతున్న చప్పుడుకి
మొక్క నేలలోంచి రక్తం పీల్చుకునే
సమయంలోని స్పందనకీ,
పువ్వు పుట్టబోయేచోట
అప్పుడే తెరుచుకుంటున్న
రెప్పల సవ్వడికీ
వాళ్ళ చేతుల్లో తుపాకులు పట్టుతప్పి జారిపోతున్నై"

అనే పాదాల్లో ఉన్న ధ్వన్యాత్మక కవిత్వం పొయిటిక్ సెన్సిబిలిటీ ఉన్న పాఠకుల్లో కదలించక మానదు.

గదిలో మేధావులు గేయం రామమోహనరావుగారి మాస్టర్ పీస్ అని చెప్పతగ్గ గేయం. సమకాలీన సంక్షోభాన్ని ఏ మాత్రం పట్టించుకోకుండా, పట్టించుకున్నా ఒక ఫాషన్‌గా మాత్రమే భావించే మేధావులు ఏకాంతిక హర్మ్యాల్లో కవిత్వంలో సామాజిక స్పృహ అవసరమా? అనే చర్చ సాగిస్తారు. ఈ ఖండిక ఈ చర్చను అడ్డంగా పెట్టుకొని ప్రజోద్యమాలు ఒక ప్రక్క, మేధావులు ఒక ప్రక్క ఏ విధంగా వేరైపోతున్నదీ విశదీకరించింది.

"చల్ల గదుల్లో ధనస్వాములు క్రూరంగా
చెరుస్తున్న సంస్కృతీ శవాలు
ప్రజా నాయకుల కబేళాలకి గాంధీబొమ్మల
తోరణాలు
ధర్మకర్తల యినప్పెట్టెల్లో కుళ్ళిపోతున్న
ధర్మశాస్త్రాలు
దేవుడి రాతిబొమ్మల వెనక పూజారి నాస్తికుల
బూతు పురాణాలు
పెత్తందార్ల అడుగుల కింద పీడితుల
నెత్తురు మడుగులు

బంగారు గుమ్మాల నిండా ఆకలి పేగుల తోరణాలు
అసహాయుల అడుగడుగునా సంక్షోభ సముద్రాలు
గదిలో మేధావులు కూర్చుని
సంక్షోభం లోపలికి రాకుండా తలుపులు మూసుకొని
కవితా స్వరూపాన్ని చర్చిస్తున్నారు
సాహిత్యంలో సామాజిక స్పందన
అవసరమా? కాదా? అని''

ఈ కాలమొక రక్తసంధ్య; బ్రతుకు జీవన మరణాల మధ్య కొట్టుమిట్టాడుతున్న సమయమిది. ఈ రక్తసంధ్యా కాలంలో రాబోయే సామ్యవాద ఉదయంకోసం ఇట్లాంటి కావ్యాలు ఎన్నైనా రావాలి.

*

చేతన

[యుగకవి శ్రీశ్రీ సంస్మరణ సంచిక వెల:- అమూల్యం: సహృదయ విరాళం రు.20-00 లు ప్రతులకు:- క్వార్టర్స్ 2-ఎ. స్ట్రీట్-82/సెక్టర్-6. భిలాయ్-490 006]

మహాకవి శ్రీశ్రీ మరణించిన పిమ్మట భిలాయినగర్ ప్రవాసాంధ్రులు ఈ సంస్మరణ సంచికను అత్యంత శ్రద్ధా భక్తులతో తెచ్చారు. ఆంధ్రదేశానికి అతి దూరంలో ఉండి కూడా తెలుగు కవిత్వాన్ని, కళలను విస్మరించకుండా 'చేతన' సాంస్కృతిక సంఘం పేరుతో అనేక కార్యక్రమాలు చేపట్టుతూ సాహిత్యానికి ఇతోధిక సేవ చేస్తున్న ఈ యూనిట్‌ను హృదయం ఉన్న ఏ తెలుగువాడైనా అభినందిస్తాడు.

శ్రీశ్రీ ఈ శతాబ్దపు మహాకవి. వివాదగ్రస్తమైన అంశాలు ఏవైనా ఉన్నా అతని కవిత్వ ప్రభుతను ప్రశ్నించటానికి పనికిరావు. శ్రీశ్రీ కవిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని, వివరించే వ్యాసాలు అనేకం ఉన్నాయి ఈ సంచికలో. సర్వశ్రీ కె. వి. రమణారెడ్డి, చందు సుబ్బారావు, వరవరరావు, నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, డా॥ సి. నారాయణరెడ్డి, కొత్తపల్లి రవిబాబు, రావి రంగారావు, గూడ శ్రీరాములు, అద్దేపల్లి రామమోహనరావు, శ్రీమతి కాత్యాయనీ విద్మహే, శ్రీమతి కొలకలూరి స్వరూపరాణి ప్రభృతుల వ్యాసాలు, ఇంకా అనేక కవితలు ఈ సంస్మరణ సంచికలో ఉన్నాయి. 'ఎండ్ ఆఫ్ యాన్ ఇరా' అనే పేరుతో శ్రీ వల్లంపాటి వేంకట సుబ్బయ్యగారి ఆలోచనాత్మక ఆంగ్ల వ్యాసం ఈ సంచికలో ఉంది. ఆచార్య రోణంకి అప్పలస్వామి గారి వ్యాస శకలాలను శ్రీ మానేపల్లి క్రోడీకరించిన వ్యాసం ఈ సంచికకు ఒక అలంకారం.

ఈ శతాబ్ది కవిత్వ పరంగా శ్రీశ్రీది అంటే జుట్టు పీక్కునే వాళ్ళు, పిచ్చిగంగరెత్తే వాళ్ళు, వొంటికి నిప్పంటించుకునే వాళ్ళు, కళ్లు మూసుకునే వాళ్లు చాలామంది ఉంటారు. కాని ఇది సత్యం. సత్యానికి మరణం లేదు గదా!

శ్రీశ్రీ రాజకీయ తత్త్వం అనే వ్యాసంలో రమణారెడ్డిగారు శ్రీశ్రీ భావ పరిణామాన్ని వివరించారు. శ్రీశ్రీ కవిత్వం ఒక విప్లవ పంథా; ఒక ఆరని జ్వాల. ''అలాంటి ఆరని జ్వాలమీద కన్నీళ్ళ పేరిట చన్నీళ్ళను కుమ్మరిస్తున్న వాళ్లు శ్రీశ్రీకే గాక ఆ ప్రజా విప్లవ పంథాకే ద్రోహులు, చరిత్ర జోలెక్కవలసిన దోషులు'' అంటున్నారు రమణారెడ్డిగారు.

యుగకర్త విషయంలో చందు సుబ్బారావుగారి వ్యాసం పరిశీలనాత్మకమైనది. ఆయన సహేతుకంగా ఈ యుగం శ్రీశ్రీదని తేల్చేశారు. ఈ విషయమై ఇటీవల చెలరేగిన వాదోపవాదాలు ప్రత్యేకంగా ఇక్కడ పేర్కొనవలసిన అవసరం లేదు. నిస్సందేహంగా ఆధునిక కవిత్వానికి ఆద్యుడు గురజాడ అప్పారావుగారే. అయితే ఇరవయ్యో శతాబ్దపు తెలుగు కవిత్వానికి మొత్తంగా ఆయన కర్తృత్వం చెల్లనేరదని శ్రీశ్రీ కవిత్వం అక్షరాక్షరం ఋజువు చేస్తున్నది. గురజాడది జాతీయ సంస్కరణ వాదం; శ్రీశ్రీది అంతర్జాతీయ శ్రామిక వాదం. గురజాడ సాహిత్య పరిధి పరిమిత లక్ష్యం కలిగినది. శ్రీశ్రీ సాహిత్య పరిధి అపరిమితమైనది. గురజాడ సాహిత్య ప్రయోజనం కూడా పరిమిత హద్దుల్లో ఉండగా, శ్రీశ్రీ సాహిత్యం ఆ హద్దుల్ని మరింత విస్తృతం చేసి ప్రపంచ శ్రామిక గీతాల్ని ఆలపించింది. ఇట్లా రాయడం గురజాడను అవమానించడం అని కొంతమంది అపోహ పడవచ్చు. గురజాడవారు చేసిన సాహిత్య సేవను గురించి తక్కువగా అంచనా కట్టడం నా ధ్యేయం కాదు. గురజాడ సృష్టించిన ఆధునికతను శ్రీశ్రీ సంప్రదాయంగా ఘనీభవింప చేశాడు. నా భావం ఇది.

కవే విమర్శకుడైతే అతని విమర్శ అతని కవితా పరిణామ దశలను ఆధారంగా చేసుకొని ఉంటుంది. శ్రీశ్రీలో భావ, అభ్యుదయ. విప్లవ కవితా దశలలోతోపాటు ప్రయోగవాద దశకూడా ఒకటుంది. ఆయా దశల్లో అతని విమర్శలో వచ్చిన పరిణామాలను కరెవరపు వెంకట్రామయ్యగారు సోదాహరణంగా వివరించారు. ఏ కవి విమర్శకుడైనా అతని కవిత్వాన్నుండి వేరుచేసి చూడలేం. గూడ శ్రీరాములుగారి శ్రీశ్రీ – అధివాస్తవిక ఉద్యమం వ్యాసం విశ్లేషణాత్మకమైనది.

సమీక్షా పరిధిలో ప్రతి వ్యాసాన్ని, ప్రతి అభిప్రాయాన్ని సమీక్షించడం సాధ్యం కాదు. మొత్తంమీద ఈ సంస్మరణ సంచిక

శ్రీశ్రీ సాహితీ మూర్తిమత్వాన్ని కొంతలో కొంత వెల్లడించ గలిగింది. ఇది సంస్మరణ సంచిక కనుక ఇందులో కథల్ని సమీక్షా పరిధిలోకి తీసుకొనటం లేదు కనుక ఆయా రచయితలు క్షమిస్తారని ఆశిస్తాను.

చేతన ప్రవాసాంధ్ర సమితి చేసిన ఈ కృషిని మనసారా అభినందిస్తూ ముందు ముందు వీరు మంచి మంచి కార్యక్రమాలు చేపడుతూ పురోగమిస్తారని ఆశిస్తాను.

మైలురాయి (కవితా సంపుటి)

[ఎన్. గోపి. వెల : రు. 4-00 లు. ప్రతులకు : (1) విశాలాంధ్ర బుక్‌హౌస్ ; దేశీ బుక్‌హౌస్, నారాయణగూడ, హైదరాబాద్. (2) హౌస్ నెం. 1-9-34/1/2, రాంనగర్, హైదరాబాద్-48.]

ప్రజాకవి వేమన, వేమన వాదం అనే పరిశోధక గ్రంథాలు రాసిన గోపిగారు గతంలో తంగేడు పూలు కవితా సంకలనాన్ని ప్రచురించి ఇప్పుడు మైలురాయి సంకలనాన్ని అచ్చు వేశారు. గోపిగారి కవిత్వంలో వర్తమాన కాలిక మైన జీవుని వేదన విషాద రాగాల్ని ఆలపించటం వింటాం. కవిత్వం వాచ్యం కారాదనే సిద్ధాంతం ఒక కాలానికి పరిమితమైనది కాదు. సారళ్యాన్ని సాధించిన శైలిలో చెప్పవలసిన విషయాన్ని వ్యంగ్యం వైభవంతో చెప్పటం ఈ సంకలనంలో స్పష్టంగా కనబడుతుంది. సాధారణంగా పరిశోధనాత్మక ప్రతిభ కలిగినవారు సృజనాత్మక ప్రతిభను కలిగిఉండటం కష్టం. ఈ రెండూ సర్వాత్మనా ఏకమైన వారు ఆధునిక కాలంలో ఎక్కువమందే కనబడుతున్నారు. అట్టి వారిలో గోపీ ఒకరు.

మైలురాయిని కాలానికి సంకేతంగా తీసుకున్నారు. గత కాలమంతా నల్లటి మరకల గాట్లతో, రోడ్డు కడ్డంగా నెకురువేసే దున్నపోతులు చిత్రించిన పేడగుర్తు లున్నాయని చెబుతా రీయన, భవిష్యత్తు మీద అచంచలమైన విశ్వాసం ఉన్నది ఈ కవికి.

"దీని నొసట
ఎర్రరంగని
భవిష్య ద్ద్వారాల నవ్వు లున్నాయి
అందుకే ఈ రాయి
నా కిష్టం"

అని కాలం మీద తనకున్న విశ్వాసాన్ని ప్రకటించారు. ఇవాళటి కవిత అనే ఖండిక సమాజ పరివర్తనలో కవిత్వానికి గల అధికారాన్ని, ప్రభావాన్ని సూచిస్తుంది. కవిత్వంలో గతం కనబడటమే కాక వర్తమానం ప్రదర్శితమౌతూ భవిష్యద్దర్శన మవుతుంది. ఈరోజు కవిత్వంలో నిస్పృహ, నిర్వేరపాటు, నిర్వీర్యం కనిపించినా దాని శక్తి అజేయ మైనదని, సంఘాన్ని దీప్తిమంతం చేస్తుందనే నమ్మకం ఈ కవికి ఉంది.

"ఆలజడిలో
అసలు సత్యాలను వేటాడే
అతి భయంకర ప్రమాదానివి
అన్నీ అర్థ మయినట్టు నువ్వు తలూపితే
ఆ ఊపుకి ఎన్నో శిఖరాలు కూలిపోతాయి
ఆగిపోయిన నీ నడక
ఒక్క అడుగు సాగినా
దారంతా అంటుకుంటుంది"

అంటారు. వేమన, పల్లెల్లో మన పల్లెల్లో మొదలైన ఖండికలు ఆయన కవితా శక్తికి, దృక్పథానికి కూడా మంచి ఉదాహరణలు. గోపిగారి కవిత్వంలో సెటైర్ బల్లెంలా గుచ్చుకుంటుంది. గీటు కాలం ఖండిక ఇట్లాంటి సెటైర్‌కి మంచి ఉదాహరణ. 'కాల్పులు సృష్టించి శవాలను జెండాలుగా వాడుకోండి.' 'వాగ్దానాలు ఎరువులేసి / డబ్బు చెట్లకు, ఓట్లు పూయించండి మొదలైన పాదాల్లో ప్రజాస్వామ్యపు ఎన్నికల ప్రహసనం వ్యంగ్యంగా కళ్ళకు కట్టినట్లు కనపడుతుంది. డాక్ బంగ్లా గేయంలో —

"కాని అదే రాత్రి
చిరుగుతూ చీర వేసిన కేకలు విన్నాను
తెల్లారి
బుడ్ల పెంకులూ
గుడ్డ ముక్కలూ
నేనే ఊడ్చి పారేశాను"

అని అనటంలో ఉన్న విషాద వ్యంగ్యం, అర్థంకాని పాఠకు డుండడు. కవితాభిమానులు చదివి ఆలోచించ తగ్గ కావ్య మిది.

నిశీథి సంగీతం

[తెలుగు, ఇంగ్లీషు కవితా సంకలనం. రౌద్రి వెల : రు. 5/- లు. ప్రతులకు : (1) కె. రామలక్ష్మి, 1, శివప్రకాశముదలి వీధి, మద్రాసు - 600 017. (2) నవ భారత్ బుక్ హౌస్, ఏలూరు రోడ్, విజయవాడ - 2.]

"పంజరంలో పక్షి
ఎపుడూ పాడగా ఎరగను నేను

మోగ దనుకుంటూనే ఎదగాను
బాలికని
యువతి నయి స్త్రీ నయ్యాను
బ్రతకడం నేర్చుకుంటూ
ఒక రోజున పంజరంలో పక్షి
ఎందుకు పాడదో అర్థ మయింది
ప్రతి పలుకూ ఒక పాశం
ప్రతి పాటా ఒక పంజరం''

నిశీథి సంగీతం అనే ఆంధ్ర, ఆంగ్ల కవితా సంకలనాన్ని ...గారు ప్రచురించారు. ఆ కవితా సంకలనానికి ప్రీఫ్యూ శ్రీశ్రీగారు ...టం సంకలనానికే హైలైట్. 'దాంట్లో శ్రీశ్రీగారు రొద్ది ...త్వాన్ని గురించి ఇట్లా అన్నారు: ''పాశ్చాత్య గ్రంథ నిర్ణేతలు ...ని కవిత్వంగా అంగీకరించక పోవచ్చును. పత్రికా సంపాదకులు ...ని తిరగగొడితే నా ఆశ్చర్యం కలగదు. కవి సమ్మేళనాలలో కవితలను పఠిస్తే ప్రేక్షకుల నుండి కరతాళ ధ్వనులు రాక ...చ్చును. అయినా ఒక విశుద్ధ చిత్తవృత్తి నుండి వెలువడిన ...లుగా వీటిని నే నాహ్వానిస్తున్నాను. ఈ కవితా సంపుటానికి ...త్రి ఇంగ్లీషులో పెట్టిన పేరు 'డార్క్ రాప్సోడి.' తెలుగులో ...థి సంగీతం.' ఏమీ కనిపించని చీకటిలో చెవులకు మాత్రమే ...పంచే సంగీతం దీనిలో ఉంది.''

స్థిత ప్రజ్ఞ కోసం నిరంతర సాధనలో, ప్రపంచంలో శ్రుతి ...యని ఆవేదనలో కోర్కె మంద్ర పంచమంగా బాధలు అనుమ...ంగా, ఆశ ఆధార షడ్జంగా, సందేహం పక్క పారీణిగా సాలోచన ...ద నేత్రం అంతర్ముఖమైన దృక్కులలో, తటస్థత మతంగా. అనా...క్షత ప్రసంగంగా యిన్నేళ్ళూ అస్వనితమైన అంతర గాంధారాన్ని, ...న్నాళ్ళూ అనాహతమైన కవితా నాదాన్ని ఇప్పుడిప్పుడే గాత్రం ...వినిపిస్తున్నారీ కవయిత్రి. తన గీతి, తన రీతి వేరని తనవి ...పి కట్టె బాట అని ఎవరూ విని ఎరుగని పాట అని తన పరిచ...లో చెప్పుకొంటున్నారు రొద్ది. ఒకరి పువ్వులు వేరొకరి కలువ క...లుగా, ఒకరి నిశీధి మరొకరికి సూర్యోదయంగా. ఒకరి జైలు ...కొకరి మైదానంగా, ఒకరి స్వేచ్ఛ ఇంకొకరి ఇరకాటంగా. ఎవరికి ...కి ఒక అండగా బ్రతుకుతున్న వర్తమాన అంధకారంలో నిశీథి ...గీతాన్ని ఆలపిస్తూనే ఆగామి కాంతి సంగీతానికి స్వరాలు సిద్ధం ...స్వటం రొద్దిగారి స్థిత ప్రజ్ఞకు తార్కాణమే. జడ చైతన్యాల మధ్యా ...తి విస్మృతుల మధ్యా చావు బ్రతుకుల మధ్య ప్రేమ ద్వేషాలద్వం...లలో ఒక మేధాజీవి ఆలోచనా విధానం ఎలా ఉంటుందో రొద్ది ...థి సంగీతంలో తెలుస్తుంది.

సోహమ్ కోహమ్ గీతాలు రొద్దిగారి కవితా తాత్విక అవగాహనకు మార్గం చూపుతాయి. ఈ వేదన వైయక్తికమా? సామాజికమా? అనే ప్రశ్నలకు బదులు ఈ వేదనలో ఉన్న వస్తువును గురించి ఆలోచించటం మంచిది. సర్వ ప్రాణికోటికి సహజమైన జీవుని వేదన ఒకటున్నది. అదే ఈమె తపన. కొన్ని ఆంగ్ల గేయాల్లోనూ, కొన్ని తెలుగు గీతాల్లోనూ టాగూర్ గుర్తుకు రాక తప్పదు. టాగూర్‌ను ఈమె అనుకరించిందని కాదు నేననేది. ఈ ప్రభావం వ్యక్తంగానో అవ్యక్తంగానో ఈ గీతాల్లో అక్కడక్కడ కనబడుతుంది. చలం వేదనను అనుభవించినవాడే. అట్లాగే వజీర్ రహ్మాన్ కూడాను. ఆవేదనతో చిత్తశుద్ధి, నిజాయితీ, జీవితంపట్ల తపన, పరుల బాగోగుల కోసం వాళ్ళు పడ్డ బాధా కనపడతాము. అంతస్థాయిలో కాకపోయినా ఈ నిశీథి సంగీతంలో మధుర విషాద ధ్వని రూపం ఏ ఆఛ్ఛాదనలూ లేకుండా కనబడుతుంది. 'నువ్వు వెలుపలికి వచ్చి చూడబోయేది వెలుతురు అని చెప్పలేనప్పుడు, నువ్వు ఉన్నది చీకటి అని కూడా చెప్పవద్దు నాకీ బాధ్యత వద్దు తప్పుకుంటాను' అని నిజాయితీగా చెప్పగలిగిన కవుల సంఖ్య చాలా తక్కువ. ఓరంచో జోరంచో ఈ వ్యవస్థ మీద పెద్ద సెటైర్ 'తిరుగులేని విసువు చెందని యాత్ర - జ్ఞాపకాల చెట్లు వెనుకకి పరిగెత్తే - నమ్మకం రైలు పట్టాల మీద - వింత అనుభవాల రైలు బండిలో - నా సుదూర గమ్యాలకి - ఆశతో ఆశ నుంచి - ఆశగా - ఆశకు నా పయనం' అనే కవయిత్రి మాటల్లో మానవ మహాపథికుడు జేరుకోవాల్సిన మజిలీ ధ్వనిస్తోంది,

తెలుగు కవిత్వానికి మార్మిక వాదం కొత్తది కాదు. మార్మిక వాదుల కవిత్వం అంతా స్పష్టాస్పష్టంగా చదువరికి కనబడుతుంది. గీతాంజలి చదువుతున్నంత సేపూ ఏదో తెలుస్తున్నట్లే ఉంటుంది. ఇంకొకడికి చెప్పటానికి నోరు తెరిస్తే ఏమీ తెలియనట్లే ఉంటుంది. భావకవి కృష్ణశాస్త్రిగారు కూడా 'ఏదియో అపూర్వ మధుర స్మృతి ధ్వనియించు గాని అర్థమ్ముగాని భావ గీతమ్ము లవి' అన్నారు. శ్రీశ్రీ కూడా 'అందీఅందక పోయే నీ చేలాంచలములు' అన్నాడు కవిత్వాన్ని గురించి. రొద్ది కవితలో మార్మిక ఛాయలు బాగా కనబడతాయి. అక్కడ కవితా విశ్లేషణ కంటె పాఠకుని హృదయానుభూతే ప్రధానం. విశ్లేషకు పూనుకున్నప్పుడు ఆకారం వికారంగా మారొచ్చు.

ఆంధ్ర ఆంగ్ల కవితా ఖండికల్లో - రెంటిలోనూ ఈ మార్మిక ఛాయలు, జీవుని వేదన, ఒక సౌందర్య భావనను గురించిన తపన, అచ్చమైన కవిత్వ సాధన స్పష్టంగా కనబడతాయి. రొద్ది ఇప్పటికి నిశీథి సంగీతమే రాసింది. ఆగమ కాంతి సంగీతాన్ని కూడా భవిష్యత్తులో వినిపిస్తుందని నా నమ్మకం.

ఉయ్ వెంటాన్ డ్రీమింగ్
అండ్ వెన్ ట్రూత్ స్టుడ్ నేకెడ్ బిఫోర్
అవర్ ఆయ్స్
ఉయ్ సెడ్ దిస్ ఈస్ నాట్ ది ట్రూత్ ఉయ్ సీక్
దిస్ ఈస్ నాట్ ది లైట్ ఉయ్ వాంట్.

శ్రీ టి. ఎల్. కాంతారావు

వేదిక

[వ్యాస సంకలనం. వెల : లేదు ప్రతులకు : అమృతవాణి, సెబాస్టియన్ రోడ్, సికింద్రాబాద్ 500 003.]

తెలుగు నవల, కథను గురించి పలువురు పెద్దలు రాసిన వ్యాస సంకలనం ఈ సమీక్షా పుస్తకం. తెలుగు నవల పరిణామ వికాసాలు శ్రీ దాశరథి రంగాచార్య, నవల సంఘటన డాక్టర్ సి. ఆనందారామం, నవలా రచన పాత్ర పోషణ డాక్టర్ అక్కిరాజు రమాపతిరావు, తెలుగు నవలలో భాష శ్రీ తిరుమల రామచంద్ర, నవల శిల్పం శ్రీమతి మాదిరెడ్డి సులోచన కథ-ప్రగతి-పరిణామం డాక్టర్ పోరంకి దక్షిణామూర్తి, కథా-పాత్రలు వారే.కథ-సంఘటనలు శ్రీ పోతుకూచి సాంబశివరావు, కథా-రచనా శిల్పం శ్రీ దాశరథి రంగాచార్య రాశారు.

శ్రీ దాశరథి రంగాచార్య తొలి తెలుగు నవల దగ్గర నుంచి సంస్కరణ వాద నవలలు, సంప్రదాయ వాద నవలలు, వివిధోద్యమాల ప్రేరణ వల్ల వచ్చిన నవలలు వాటి పరిణామ వికాసాలు ఒక చారిత్రిక క్రమంలో వివరించారు, సి. ఆనందారామం నవలలో సంఘటనకున్న ప్రాముఖ్యాన్ని ఉన్నవ, విశ్వనాథ, చలం, గోపీచంద్ లాంటి ప్రముఖుల రచనల్లోని సంఘటనలను ఆధారంగా చేసుకొని విశదీకరించారు. అక్కిరాజుగారు పాత్ర పోషణ అని శీర్షిక పెట్టినప్పటికి వారి మామూలు ధోరణిలోనే నవలా సాహిత్య చరిత్రను తిరగతోడారు. భాషా విషయకంగా గ్రాంధికం, సరళ గ్రాంధికం, వ్యావహారికం, మాండలికం ఏ ఏ దశల్లో తెలుగు నవలలో ఎట్లా పరిణమించినదీ తిరుమల రామచంద్రగారు విశ్లేషించారు. నవలలో శిల్ప ప్రాముఖ్యాన్ని మాదిరెడ్డి సులోచనగారు ఉదాహరణలలో సహా పేర్కొన్నారు. శిల్పం అంటే ప్రత్యేక పదార్థం కాదు గదా! కథ, కథనం, భాష, పాత్ర చిత్రీకరణ, సన్నివేశాల కల్పన మొదలైన సమస్తాంశాల సమాహారమే శిల్పం. అదేల్లండాలో సులోచనగారు బాగా వ్యాఖ్యానించి వివరించారు. కథా సాహిత్యం దాని పరిణామాన్ని, దాని గొప్పతనాన్ని శ్రీ పోరంకి దక్షిణామూర్తి శాస్త్రీయమైన గాహనా పద్ధతిలో చెప్పటం జరిగింది.

ఈ పుస్తకం నిస్సందేహంగా మంచి పుస్తకం. అయితే గెటప్ చాలా బాగుండలేదు. ఇంత మంచి పుస్తకాన్ని న్యూస్ ప్రింట్ మీద అచ్చు వెయ్యటం కూడా ఈ సమీక్షకునికి నచ్చలేదు. కాలాల పాటు ఉండవలసిన పుస్తకం, భవిష్యత్పరిశోధకులకు డాక్యుమెంటుగా ఉపకరించే పుస్తకం ఇంత అశ్రద్ధగా అచ్చువ మంచిదికాదు

తెలుగు దివ్వెలు

[ఆంధ్ర ప్రదేశ్ ముస్లిం తెలుగు రచయితల సమ్మేళ ప్రత్యేక సంచిక. సంపాదకులు : డాక్టర్ కె. గోపాలకృష్ణారా డాక్టర్ ఇరవెంటి కృష్ణమూర్తి. సహ సంపాదకులు : జువాన్ హు వెల : లేదు.]

ఆంధ్రప్రదేశ్ ముస్లిం తెలుగురచయితల సమ్మేళనసందర్భం ప్రచురించిన ప్రత్యేక సంచిక ఇది. వసునందన్, నారాయణ గోపాలకృష్ణారావుగార్లను మినహాయిస్తే మిగిలిన వారంతా తెలు సాహిత్యాన్ని సృష్టిస్తున్న ముస్లిం సోదరులే ఇందులో ఉన్నా దేవీప్రియ, స్మైల్, ఇస్మాయిల్ ప్రభృతుల రచనలు దీంట్లో చ చేసుకొనక పోవటం ఒక లోపంగా కనబడుతోంది. ఇందులో ఉ వన్నీ కవితలూ, వ్యాసాలే.

"ఈ సంచికలో కొన్ని రచనలకు మాత్రమే అందించ గల తున్నాం. కొందరు రచయితలను మాత్రమే పరిచయం చెయ్యగల తున్నాం. స్వాతంత్ర్య సముపార్జనానంతరం తెలుగు దేశంలో ముస్లి రచయితలు గణనీయమైన సాహితీ సృష్టి చేస్తున్నారన్న యథార్థ ఈ సంచిక భంగ్యంతరంగా తెలుపగలుగుతున్నది. ఈ సంచిక కిటికి. ఈ కిటికీ ద్వారా తెలుగు దేశంలోని ముస్లిమ్ రచయి సాహితీ విహాయసాన్ని దర్శింప వచ్చును, మతం కళ్ళద్దాలలో భా చూసే పద్ధతిని ఈ సంచిక నిరోధించ గలిగితే సంతోషమే" అ న్నారు సంపాదకీయంలో. వీరి కృషి ముమ్మంయ ఇంకా ఫలప కావాలని ఆశిస్తాను.

"పుష్యమి"

Printed & Published for Nageswara Rao Estates (Private) Ltd., by S Radhakrishna at the Andhra Patr Press, Gandhinagar, Vijayawada-3 Editor: S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 61247


అమృతాంజన్‌కే
తెలుసు
తలనొప్పి
బాధ
మృదువైన మూలపదార్థము వల్ల
ఉపయోగించుట సులభము.
క్రొత్త కార్కు అమరిక వల్ల
మందు శక్తికి రక్షణ.
AMRUTANJAN
Pain Balm
AMRUTANJAN
PAIN BALM
1984 ఒలింపిక్స్ క్రీడలలో
పాల్గొన్న భారత క్రీడాకారులకు
అధికారపూర్వకంగా పెయిన్ బామ్
సరఫరా చేసినవారు.
అమృతాంజన్
ఏ ఇతర బాధలు కల్గించని
శీఘ్ర నివారిణిని నమ్మండి
OBM 8708 TG